మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.4.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



నమో బుద్ధ

# మిసిమి

చింతనాత్మక సారస్వతం

2569 వ బుద్ధజయంతి



మాసపత్రిక, మే, 2025 ₹ 50/-

ISSN 2454–4329



యుద్ధము



శాంతి

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 36** **సంచిక 5**

**మే - 2025**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

**Scan QR to Pay**
**Misimi A Unit of Kalajyothi**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**


**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**
www.misimimonthly.com

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## మే నెల సూచికలు...



పేరిణి గురువు


డైరి : అశ్వినీకుమార్ ... 3

జ్ఞాన సాధన : అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ... 5

జీవన మకరందం : ఎ.కె. ...10

బుద్ధ గుప్తనాథుడు : డా. ఎ.బి. సాయిప్రసాద్ ... 11

తైత్తిరీయోపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 15

లలిత సంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 21

భర్తృహరి : ఆచార్య పి. హరినాథ్ ... 24

ట్యునీసియా - 2 : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 26

ఆయన హృదయమే-ఓ గ్రంథాలయము : **మిసిమి** ... 34

పెద్ది సత్యనారాయణ గారితో : **మిసిమి** ... 41

చుక్కలతో చిత్రాలు : టి.వి. ప్రసాద్... 50

పురస్కారాల స్వీకారం-వ్యక్తిగత సంఘర్షణ : గొంటి బాబ్జి ... 55

శ్రీకృష్ణ భారతం : డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ... 59

మహిళా సాధికారికత : డా. వై. సుభాషిణి... 65

పేరిణి నృత్యరీతి : డా. రమేష్ కృష్ణ ... 70

బౌద్ధ ఆదర్శాల ఆధునిక దర్పణం : యశోబుద్ధ : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ... 73

"ప్రవాససాహిత్యం" బుక్ లాంచ్ : ఐ.వి. రామరాజు ... 77

చదవండి : **మిసిమి** ... 79




గౌతమ బుద్ధ

### అట్టమీది బొమ్మలు






యుద్ధము



శాంతి



నమో బుద్ధ

నమో బుద్ధ చిత్రకారుడు - ఎ.జి.

# ఆహ్వానం

**మిసిమి** ఆహ్వానంతో సమావేశాలు చాలాచాలా అరుదుగా జరుగుతాయి. అలాంటి సమావేశం 'ప్రవాస సాహిత్యం' ఆవిష్కరణకు రవీంద్ర భారతిలో జరిపాము. ప్రత్యేకంగా వర్జీనియా నుంచి వచ్చిన రచయిత డా. రావెళ్ల రమేష్ ప్రసాద్ గారు – డా. కె. శ్రీనివాస్ గారు – ప్రొ. పార్థసారధి – నగ్నముని – అందెశ్రీ ప్రభృతులు పాల్గొని సభను సుసంపన్నం చేశారు. అయితే వక్తలందరూ ఒక్కవిషయం గుర్తు చేస్తూ వచ్చారు – ఎడిటర్ ప్రోత్సాహం లేకపోతే – ఈ రచన సాగేది కాదని – సైంటిస్ట్‌నైన తాను తెలుగులో రాయడం వెనక ప్రోత్సాహం '**మిసిమి**' వారిదేనని రమేష్ గారు, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ వ్యాపకాలలో ప్రొఫెసర్‌నయిన తాను తెలుగులో విమర్శన రాయటానికి **మిసిమి** ఎడిటర్ కారణమని ప్రొఫెసర్‌గారు, బయోకెమిస్టునయిన తాను అశ్వినిగారు ప్రోత్సాహంతోనే ఈ సభలో ప్రవాస సాహిత్యం గురించి మాట్లాడడానికి వచ్చాను, అనీ శిష్ట్లా వారు – స్తబ్దతలో వుండిపోయిన తాను – అగ్రజుని ప్రోత్సాహంతోనే మళ్లీ పునరుజ్జీవనం పొందానని అందెశ్రీ – అందరూ ఒకే సూత్రం ప్రస్తావించారు.

ఆ రాత్రి నేను దీని గురించి చాలా ఆలోచించాను –

ఇప్పుడే నాకో విషయం గుర్తుకొస్తోంది – శ్రీమాన్ పప్పు వేణుగోపాల రావు గారితో నా అనుబంధం చాలా పవిత్రమైనది. ఆయన ఎప్పుడూ – అశ్వినీ – నీ ప్రోత్సాహం లేకపోతే – నీవు విషయసూచన చేయకపోతే – నేను తెలుగులో నృత్యభారతి – సౌందర్య లహరి – ఉపనిషత్తుల వ్యాఖ్యానం రాసేవాడిని కాదు సుమా – అంటూ 'కాదు సుమా కలకాదు సుమా' అని పాడి వినిపించేవారు. పదిహేను సంవత్సరాలు వెనకకు వెళ్లితే – '**మిసిమి**'కి రచయితలు నలుగురో, అయిదుగురో అందులో నేను ఒకడిని – ఇప్పుడు వందమంది పైగా నాకు అందుబాటులో వుంటారు – అంటే అతిశయోక్తి కాదు – దీనికీ ఒక సందర్భం వుంది.

మామూలు పనికి కామా పెట్టినపుడు – **మిసిమి** గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడుపుతాను. ఎందుకంటే – ఎన్నో కారణాలు – ఎన్నో పుస్తకాలు – ఎందరో రచయితలు – మరెన్నో రంగులు పిలుస్తుంటాయి. పుస్తకాలంటే రచయితలే కదా! రచయితలు ఎన్నో రాస్తుంటారు – కథలు – కవితలు – వ్యాసాలు – విమర్శనలు – నాటకం, చరిత్రలు– భాష – జానపదం – సంగీతం ఇలా అన్ని వుంటాయి. గ్రంథకర్తలు మీతో కబుర్లు చెప్తుంటారు. నేను ఏది చదివినా – అది రచయిత ఆత్మకథే అన్పిస్తుంది – అది కథ కానివ్వండి – కవిత కానివ్వండి – వ్యాసం కానివ్వండి – నాకు రచయిత తన కథ చెప్పటానికే తపన పడుతున్నాడని అన్పిస్తుంది. ఇదే విషయాన్ని మరో కోణంలో చూద్దాం. ప్రతి వ్యక్తిలో ఒక తపన వుంటుంది. ఆ తపనతోనే ఏదో చెప్పాలని రచన మొదలుపెడతాడు. అది ప్రక్రియ ఏదయినా కాని అందులో తనకథే చెప్పటానికి ప్రయత్నిస్తుంటాడు – ఆ పని రచయితే చెయ్యాలా? సాధారణ వ్యక్తికీ ఈ తపన వుండదా? అతను తన కథ చెప్పటానికి ప్రయత్నం చెయ్యవచ్చు కదా – అదిగో ఆ ఆలోచనే నన్ను కలిసిన వారిని ప్రోత్సహించటానికి మూలం – పుస్తకం చదువుతాం – ఆనందిస్తాం – కాని చిన్న వుత్తరం రాసి – పలానా రచన బాగుంది – రచయితకు – అభినందన తెలియజేయండి అని చెప్పలేం – దీనికి మోటివేషన్ కావాలి – నీ తపనకు – నీ రచనకీ మధ్యలో ఒక కాటలిస్టు అవసరం – బహుశా ఆ పనే నేను చేస్తున్నానేమో – ఎంత చేసినా వ్యక్తి – అనుభవం – ప్రతిభ. తన రచనలో ప్రతిబింబిస్తాయి. కాటలిస్టు – కనపడదు – అందుకే ఇలాంటి సమావేశాల్లో వారి అంతరంగాన్ని తెలియజేస్తారు వక్తలు – మిత్రులు – ఇది **మిసిమి**కి అభినందన కుసుమాలే –

మీరు తలుచుకున్నా మీ ఆలోచనను - ఆవేదనను అక్షరరూపంలో చెప్పగలరు. అదేమీ బ్రహ్మ విద్య కాదు. మీరు చూసిన విషయాలు - మీకు కనిపించిన అన్యాయాలు - ప్రకృతి అందాలు, నాగరికత వికృతికి మీ స్పందన - జీవితంలో నిస్పృహ ఇవన్నీ మిమ్మల్ని రచయితనూ చేస్తాయి.

కథలో చెప్పినా, కవిత్వంలో చెప్పినా ఆ గ్రామర్ కాస్త పాటిస్తే చాలు-మీశైలి మిమ్మల్ని ముందుకు తీసుకువెళ్తుంది.

మీ వ్యక్తిత్వమే మీ శైలి తప్పక ప్రయత్నించండి !

"ప్రోత్సహమే కళలకు ఇంధనం -
ప్రోత్సహించేవాళ్లు అరుదుగా వుంటారు -
అందుకోవడానికి మనం సిద్ధంగా వుండాలి" - బాబ్ డైలాన్



ప్రవాస సాహిత్యం ఆవిష్కరణ

**కొసమెరుపు : 1.** నిన్న శుక్రవారం ఆశ్రమం నుంచే రాపిడో పిలిచాను. కొత్త టయోటా వచ్చింది. నాకో పిచ్చి అలవాటుంది. 'కారు కొత్త వాసన వస్తోంది - బావుంది'! 'పోలీస్' అని పెట్టావు! అన్నాను. ' అవును సార్ - కారు అన్నయ్యది. ఆయన డిపార్ట్‌మెట్‌లో వున్నాడు' అంటే - 'మరి నువ్వు ఏం చేస్తున్నావు? గ్రూప్ 1 కి ప్రిపేర్ అవుతున్నాను'. వినగానే కొద్దిగా వులికి పడి - సమయం సరిపోతుందా? సోమవారం నుంచి - గురువారం వరకు రోజూ పదమూడు గంటలు ఆన్‌లైన్ కోచింగ్ - శుక్ర, శని, ఆదివారాలు ఈ డ్యూటీ అవగానే - మూడు గంటలు ప్రిపేర్ అవుతుంటాను - అన్నాడు! ఇంతలో హైటెక్ మెట్రోస్టేషన్ చేరాము. అతనికి థాంక్స్ చెప్పి చూశాను - ముఖం వెలిగిపోతోంది. గూగుల్ పే స్కాన్ చేసి ఎక్కువే ఇచ్చి 'బాగా చదువు' అని పంపించాను.

**2.** ఇది కూడా అలాంటిదే - కొత్త డిజైర్ - నాకేదో అనుమానం వచ్చింది. 'ఏమి చదివారు?' ఎమ్.బి.ఎ. డ్రాప్ అవుట్ సార్ - అలాగా ఎందుకు? 'ఫైనాన్స్' 'మరి కారెలా కొన్నావు'? 'కారుకి లోన్ ఇస్తారు' - 'అరె బాబూ - ఎడ్యుకేషన్‌కి ఇస్తారు. కెనరా బ్యాంక్‌లో ప్రయత్నం చెయ్యి' - అంటుండగానే మెట్రో చేరాం. థాంక్స్ చెప్పి ఎక్కువే ముట్ట చెప్పాం - మనం ఎలాంటి ప్రపంచంలో వున్నాము - ఏమి జరుగుతోంది?

* * * *


*ఏప్రిల్ 13వ తేదీ వంగూరి వారి అంతర్జాతీయ మేళాలో '...బనారస్' 'ప్రవాస సాహిత్యం' పుస్తకాలు ఆవిష్కరించాలని అనుకుని వారికి - శ్రీమతి మంగిపూడి రాధిక గారికి (ఈమె విరిసిన మల్లెపూవులా వుంటారు) పుస్తకాలు 12వ తేదీ సాయంత్రం చేర్చాము. ఆదివారం ప్రత్యేకంగా ఇదే పనిమీద ఉదయం 9.30 గం॥ల సమయానికే త్యాగరాయ గానసభ చేరాను. ఉదయం 9.00 గం॥లకు జరగాల్సిన సభ మొదలే కాలేదు - అందుకని 10 గం॥లకే పుస్తకాలు రిలీజ్ పెట్టారు. అలా 11 గం॥ల వరకు జరిగింది. రెండు పుస్తకాలు బొల్లినేని కృష్ణయ్య, ప్రముఖుల సమక్షంలో రిలీజ్ చేశారు. ప్రచురణ కర్తగా '**మిసిమి**' - సంపాదకునిగా నన్ను వేదిక మీదికి పిలిచారు. ఆ తర్వాత ఇక నా అవసరం లేదని - ఒకవేళ వుంటే మండల బుద్ధప్రసాద్ గారిని కలవాల్సి వస్తుందని హాలు బయటకు అడుగు పెట్టాను. సరిగ్గా అప్పుడే బుద్ధప్రసాద్ కారు దిగి అశ్వినికుమార్ గారూ - అంటూ పలకరించారు - అయితే నేను మనసులో ఏమీ దాచుకోలేదు - 'అయ్యా మిమ్మల్ని తప్పించుకోవటానికే వెళ్లిపోతున్నాను. నా అదృష్టం ఇలా వుంది' అన్నాను - ఆయన 'అంత ప్రమాద మేమొచ్చింది రండి' అంటుండగా 'సార్ నేను అడిగానా? పురస్కారం ఇచ్చారు - ఇచ్చింది మీకూ - నాకూ ఇద్దరికీ గౌరవప్రదంగా వుండాలి కదా' 'మీరన్నది కరక్టే లోపలికి రండి -" అని చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లారు. ఇక్కడితో అయితే బాగుండేది - వారు వేదికనెక్కారు - ప్రక్కనే కవి జొన్నవిత్తుల వారు హరితవర్ణం వస్త్రాలతో వెలిగిపోతున్నారు - బుద్ధప్రసాద్ వారి ప్రసంగం మొదట్లోనే - ఉగాది పురస్కారాల కమిటీ చైర్మన్‌గా ఆయన తలవాచి పోయిందని వాపోతూ - పురస్కారం కోసం ఎవరు ఎన్నిపాట్లు పడ్డారో చెప్తూ "ఇక్కడే వల్లభనేని అశ్వినికుమార్‌గారు వున్నారు - వారు అడగలేదు. ఎవరితో రికమెండ్ చేయించలేదు - మేము ఆయన తలుపు తట్టి అవార్డు చేతిలో పెట్టాం - అది మాకు గౌరవం" అన్నారు - అంతే చప్పట్లు మోగాయి. నా గుండె తడిసింది!*




జొన్నవిత్తుల, రాధిక, బుద్ధప్రసాద్



# జ్ఞాన సాధన



*ఆంగ్లమూలం : నారద మహాథేర*

*అనువాదం – అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి*

“**త**న కుపయోగపడనివీ, చెడ్డవీ, అయిన పనులు చేయడం చాలా తేలిక. కాని ప్రయోజనకరమైనవీ, మంచివీ అయిన పనులు చేయడం నిజానికి ఎంతో కష్టం.”

*ధమ్మపద, గాథ. 163.*

గౌతముడు నిరుత్సాహం చెందాడే కాని ధైర్యాన్ని వీడలేదు. అటు అసదృశమైన శాంతిని, పరమ సత్యాన్ని, అన్వేషిస్తూ, మగధ దేశంలో తిరుగుతూ, సేనాని వర్తక కేంద్రమైన ఉరువేలకు కాలక్రమంలో చేరుకొన్నాడు. ఇసుక తిన్నెలతో అక్కడే ఒక నది ప్రవహిస్తోంది. ప్రక్కనే ఓ గ్రామం ఉంది. అక్కడొక అందమైన ప్రదేశాన్ని ఎన్నుకొన్నాడు. అక్కడ అతనికి ఆహారం లభిస్తుంది. అప్పుడతడు ఇలా అనుకొన్నాడు. “నిజంగా ఈ చోటు ఎంత సుందరంగా ఉంది. ఈ అడవి చెట్లు ఎంత మనోహరంగా ఉన్నాయి. జలజల పారే ఈ సెలయేరు ఎంత ఆహ్లాదకరంగా ఉంది. ప్రక్కనే జనపదం గూడ ఉంది. ఇక్కడ నాకు అన్నం లభిస్తుంది. ఏదైనా సాధించాలనుకొనే రాచ బిడ్డల ఆధ్యాత్మిక ప్రక్రియకు ఇది అనువైన చోటు. అది అతని తపస్సుకు సరైన చోటు. ప్రశాంత వాతావరణం. మనోహర పరిసరాలు. దృశ్యం ఇంపుగా ఉంది. తాను లక్షించిన దాని సాధన కోసం ఇక్కడే, ఏకాంతంగా ఉండిపోవాలను కొన్నాడు. అతని భావి గతిని జోస్యం చెప్పిన పిన్న బ్రాహ్మణ పండితుడు కొండణ్ణ, మిగత బ్రాహ్మణుల నలుగురు పుత్రులు బద్దియ, వప్ప, మహానామ, అస్సజి అనేవారు, బుద్ధుని సన్యాసం సంగతి విని, తామూ సంసారాన్ని వదిలివేసి, అతనితో చేరిపోయారు.

ప్రాచీన భారతదేశంలో కర్మకాండ, క్రతువులకు ఉపవాసాలకు, యజ్ఞ, యాగాదులకు ఎంతో ప్రాముఖ్యం ఉండేది. కఠినమైన సన్యాస జీవితం గడిపితేనే తప్ప మోక్షం సాధ్యంకాదనే ఒక నమ్మకం ఆకాలంలో ప్రబలంగా ఉండేది. ఆ నమ్మకాన్ని అనుసరించి గౌతముడు ఆరు సంవత్సరాలపాటు తీవ్ర నిష్ఠతో మానవాతీతంగా జ్ఞానోదయం కోసం తపస్సు చేశాడు. అతని కోమల శరీరం ఎండిపోయి, ఎముకలు బయటపడ్డాయి. అతడు శరీరాన్ని శుష్కింప జేసుకొన్న కొలదీ అతని లక్ష్యం గూడ దూరం కాసాగింది.

తాను ఎంతగా శ్రమించిందీ, తాను ఏఏ విధానాలను అనుసరించిందీ, అంతిమంగా తాను ఎలా విజయం సాధించిందీ, అతని సొంత మాటలలో వివిధ సుత్తలు వివరించాయి. మహాసచ్చకసుత్త అతని ప్రాథమిక ప్రయత్నాలను ఈవిధంగా వర్ణించింది. ‘అప్పుడు ఈ ఆలోచన నా మనస్సులో మెదిలింది. నేను పళ్ళు బిగించి, నాలుకను అంగిలకి నొక్కిపట్టి, నా ధార్మిక ఆలోచనలతో అధార్మికాలోచనలను నిగ్రహించి, అణచి, నాశం చేస్తే ఎలా ఉంటుంది! అందుకని నేను పళ్ళు బిగించి, నాలుకను అంగిలకి తన్ని పట్టి నా ధార్మికాలోచనలతో అధార్మికాలోచనలను నిగ్రహించాను, అణచివేశాను, నాశం చేశాను. ఈ కఠోర ప్రయత్నంలో నా బాహుమూలాల నుంచి చెమట ఏరులై పారింది. ఒక బలవంతుడు బలహీనుని తలో, భుజాలో పట్టి వంచి, పడగొట్టి, లోబరుచుకొన్న తీరులో నేనూ పోరాడాను.

నా శక్తి దుర్దమమైంది. అవిరళమైంది. ఆ నా అప్రమత్తత స్థిరపడింది. ఏది ఏమైనా శరీరం అలిసి పోయింది. శ్రమ నన్ను పైకొన్న కారణంగా, అతి కఠోరంగా శ్రమించిన కారణంగా, నా శరీరం సేద దీరలేదు. అటువంటి బాధాకర సంవేదనలు నాలో కలిగినా, అవి నా మనస్సును ఏమాత్రం ప్రభావితం చేయలేదు. అప్పుడు నేను ఇలా అనుకొన్నాను. శ్వాసరహిత

ఆనందస్థితిని అలవరుచుకొంటే ఎలా ఉంటుంది! అలాగే నేను ముక్కుగుండా, నోటిగుండా ఉచ్ఛ్వాస నిశ్వాసలను నిరోధించాను. ఇలా నిరోధించగానే చెవుల నుంచి వచ్చే గాలి హోరులెత్తించింది. నేను శ్వాసను నిరోధించగానే కమ్మరి భస్త్రీ చేసే నాదంలా, నా చెవి నుంచి వచ్చే గాలి పెద్ద శబ్దాన్ని సృష్టించింది. ఏమైనా నా పట్టు సడలలేదు. నా శక్తి దుర్జేయంగా, అవిరళంగా అలాగే ఉంది. నా (అప్రమత్తత) స్థిరపడిందే కాని, చెక్కు చెదరలేదు. అయితే నా శరీరం మాత్రం ఈ కఠోర శ్రమ వల్ల అలిసిపోయింది. సోలిపోయింది. అటువంటి బాధాకర సంవేదనలు నా మనసు మీద ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. అప్పుడు నేను ఇలా అనుకొన్నాను. శ్వాస రాహిత్యాన్ని ఆచరిస్తే ఎలా ఉంటుంది? అలాగే ముక్కు గుండా, నోటి గుండా, చెవుల ద్వారా శ్వాసను నిరోధించాను. అప్పుడు లోపల బంధితమైన వాయువులు నా కపాలాన్ని మహాబలోపేతంగా మోదాయి. ఒక బలమైన వ్యక్తి, పదునైన సూదితో, తన పుర్రెకు రంధ్రం చేసుకొన్నప్పటి వలె, నేను శ్వాస నిరోధం చేయగానే, లోపలి వాయువులు నా కపాలాన్ని అతి బలంతో, వేగంతో తొలిచాయి. అటువంటి బాధాకర సంవేదనలు నాలో కలిగినా, అవి నా మనస్సును ఏమీ చేయలేకపోయాయి.

అప్పుడు నేను మళ్ళీ ఇలా ఆలోచించాను. మళ్ళీ నేను ఆ శ్వాస రహిత ఆనంద ప్రవాహ స్థితిని అలవరచుకొంటే ఎలా ఉంటుంది! అలాగే ముక్కుగుండా, నోటిగుండా, చెవులగుండా శ్వాసను నిరోధించాను. ఈవిధంగా శ్వాసను నేను ఆపగానే, నా తలలో విపరీతమైన బాధ ఉవ్వెత్తున లేచింది. ఒక బలమైనవ్యక్తి తన తలను గట్టి తోలు పట్టీతో బిగుతుగా కట్టుకొంటే ఎలాంటి నొప్పి కలుగుతుందో, నా తలలో అంతటి విపరీతమైన నొప్పి కలిగింది. ఏమైనా నా పట్టుదల నీరు కారలేదు. ఆ బాధాకర సంవేదనలు నా మనస్సును కొంచెం కూడా కదిలించలేకపోయాయి.

అప్పుడు మళ్ళీ ఆలోచించాను. మళ్ళీ అదే శ్వాసరహిత మహదానంద స్థితి కోసం కృషి చేస్తేనో! అలాగే మూడింటి గుండ శ్వాసనిరోధం చేశాను. ఈ విధంగా ఎప్పుడైతే శ్వాసను నిరోధించానో, అప్పుడు ఎన్నో వాయువులు నా పొట్టను చీరివేశాయి. మంచి నిపుణుడైన కసాయివాడు లేదా అతని శిష్యుడు పదునైన చాకుతో పొట్టను చీల్చినట్లుగానే బహుళ వాయువులు నా పొట్టను చీరి వేశాయి. అయినా నా శక్తి సడల లేదు. అటువంటి బాధాకర సంవేదనలు నా మనస్సును కదిలించలేక పోయాయి. మళ్ళీ నేను ఇలా అనుకొన్నాను. శ్వాసరహిత ఆనంద స్థితిని మళ్ళీ సాధిస్తే ఎలా వుంటుంది! అని, నేను అలాగే శ్వాసను మూడు ద్వారాల నుంచి బంధించాను. ఇలా బంధించగానే, నా శరీరం అంతా భగభగ మండి పోయింది. ఇద్దరు బలవంతులు అయిన మనుషులు ఒక బలహీనుని పట్టుకొని భగ భగ మండే నిప్పులలో వేసి కాలిస్తే, ఎలా వుంటుందో, అలాగే నా శరీరం వేగిపోయింది. అయిన నేను శక్తిహీనుడను కాలేదు. ఆ బాధ నన్ను ఏమాత్రం ప్రభావితం చేయలేదు. ఈ స్థితిలో నన్ను చూసిన దేవతలు ఇలా ''గౌతమ యతి మరణించాడు,'' అన్నారు. మరికొందరు ఇలా "గౌతమ యతి ఇంకా మరణించలేదు. కాని మరణిస్తున్నాడు," అన్నారు. ఇంకొంతమంది ఇలా అన్నారు. "గౌతముడు మరణించలేదు. మరణిస్తూనూ లేదు. అతడు అర్హతుడయ్యాడు" అర్హతుడు ఉండే స్థితి ఇదే.

**విధానంలో మార్పు – నిరాహార పద్ధతి :** అప్పుడు నాలో నేను అనుకొన్నాను. నేను పూర్తి నిరాహార పద్ధతిని అవలంబిస్తేనో! దేవతలు నా దరికి చేరి అన్నారు. మహాశయా! పూర్తిగా ఆహారాన్ని మానెయ్యవద్దు. మీరు గనుక నిరాహారాన్ని పాటిస్తే దివ్య ఓజస్సును నీ శరీర రంధ్రాల గుండా ఎక్కిస్తాము. దానితో మీ ప్రాణం నిలుస్తుంది. అప్పుడు నేను అనుకొన్నాను. నేను గనుక అన్నపానాలు మానివేస్తే, ఈ దేవతలు దివ్య ఓజస్సును నా శరీరం రంధ్రాల గుండా ఎక్కించి నా ప్రాణం నిలుపుతారు. అది నేను మోసం చేసినట్లే అవుతుంది. ఆ అవసరం లేదు, అని వారికి చెబుతూ వారి సహాయాన్ని తిరస్కరించాను. అప్పుడు నాకు ఆలోచన వచ్చింది. కొంచెం కొంచెంగా ఆహారం తీసుకొంటెనో! దానితోపాటు కొద్ది కొద్దిగా ఏ బఠానీల, మసూరాల, పెసల చారో తీసుకొంటేనో! చాలా కొద్దిగా ఘన, ద్రవ ఆహారం తీసుకోవడంతో నా దేహం బక్కచిక్కిపోయింది. ఆహారం లేని కారణంగా నల్లేరు, రెల్లు, కణుపులులా, నా దేహంలోని పెద్ద చిన్న అస్థిసందులు తయారయ్యాయి. ఆహార లేమి వల్ల నా తుంటి, ఒంటె మూపురంలా తయారైంది. పూసల దండలా నా వెన్నెముక బయటకి పొడుచుకు వచ్చి వంగిపోయింది. శిధిలావస్థలో వున్న

ఇంటి వాసాలు చెల్లాచెదురుగా ఉన్నట్లే నా ప్రక్కటెముకలు నిలువకలేకపోతున్నాయి. లోతైన బావిలో నక్షత్రాలు ఎంతో లోతున కనిపించినట్లు, నా కనుగుడ్లు లోపలికి పీక్కుపోయాయి. పచ్చి గుమ్మడి కాయను కోస్తే, ఆ తరువాత ఎండకు గాలికి, ఒడిలిపోయి ఎలా ముడుచుకు పోతుందో అలాగే నా తల చర్మం తయారైంది.

నా పొట్ట చర్మాన్ని నేను ముట్టుకోవాలని ప్రయత్నిస్తే, బదులుగా నాకు వెన్నెముక తగులుతోంది. నేను వెన్నెముకను తాకాలని ప్రయత్నిస్తే, పొట్ట చర్మం తగులుతోంది. పరిస్థితి అలా వుంది. సరిపోయినంత ఆహారం లేని కారణాన నా పొట్ట చర్మం వెన్నెముకకు అంటుకుపోయింది. మలమూత్ర విసర్జనకు వెళ్ళినప్పుడు, అదేచోట కుప్పకూలిపోతున్నాను. శరీరం తిరిగి పుంజుకోవడానికి అని నా అవయవాలను మర్దన చేసుకొన్నాను. అలా చేస్తుంటే, కృశించిన నా శరీరం మీది వెంట్రుకలు రాలిపోయాయి. నన్ను చూసిన వారు ఇలా అన్నారు. "గౌతముడు నల్లబడి పోయాడు". మరికొందరు, నల్లబడిపోలేదు నీలం రంగుకు తిరిగాడు, అన్నారు. ఇంకొందరు, నలుపు కాదు, నీలము కాదు, కపిల వర్ణానికి తిరిగాడు, అన్నారు. సరిపోయినంత ఆహారం లేని కారణాన, నా శుద్ధ చర్మ వర్ణం ఆ మేరకు మారిపోయింది.

అప్పుడు నాకు మరో ఆలోచన వచ్చింది. లోగడ ఏ బ్రాహ్మణుడు గాని, యతి గాని తరుణ, తీవ్ర నిశిత బాధలను అనుభవించారంటే, వారు ఈ మేరకే అనుభవించారు గాని, నా ఇప్పటి స్థితిని దాటి వారు అనుభవించలేదు. అయినా దుర్భరమైన, ఈ చేదు, యతి నియమాల ద్వారా నేను ఉన్నతిని పొందలేదు. మానవ స్థితులను దాటి, సంభోధిని ప్రజ్ఞను పొందలేదు. బహుశ జ్ఞానోదయానికి వేరొక మార్గం ఉందేమో!

**మారుని ప్రలోభాలు :** సుదీర్ఘమైన అతని కఠోర నియమాలు వ్యర్థమని తేలిపోయింది. వాటి మూలాన అతని విలువైన శక్తి ఉడిగిపోయింది. శారీరకంగా అతడు మానవుడే అయినా, సున్నితంగా పోషించబడిన అతని శరీరం ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. అతని సుందర రూపం గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. అతని బంగారు రంగు దేహచ్ఛాయ వెలతెల పోయింది. రక్తం ఇంకిపోయింది. స్నాయువులు, కండరాలు ముడతలు పడిపోయాయి. కళ్ళు లోతుకు పోయాయి. చూపు మందగించింది. అతడు అన్నివిధాల ఒక కంకాళం మాత్రమే! అతడు దాదాపు మృత్యుముఖంలో ఉన్నాడు. అతడు నెరంజరానదీ ఒడ్డున ఇంకా ఆ పరమాన్ని ప్రధాన) ఆకాంక్షిస్తూ పరమభద్రతా (నిర్వాణాన్ని) స్థితి కోసం సమరం సాగిస్తూ ఉండగా నముచీ ఈ విధంగా అన్నాడు. మీరు చిక్కారు. రూపం మారిపోయింది. మృత్యువుకు చేరువలో ఉన్నారు. మీలోని వేయి భాగాలు మృత్యువు పాలయ్యాయి. ప్రాణం ఒక్కటే మిగిలి ఉంది. అయ్యా ప్రాణం నిలుపుకోండి. (చచ్చిపోవడం కంటే) జీవించడం మంచిది. జీవించే, ఏదైనా మంచి సాధించాలి.

బ్రహ్మచర్యం ద్వారా, అగ్నికి నైవేద్యాలు పెట్టటం ద్వారా మంచిని సాధించవచ్చు. ఈ సమరంతో మీరు ఏమి సాధిస్తారు? ఈ సమరపథం చాలా కష్టతరం, కఠినం. సిద్ధి తేలిక కాదు. ఈ మాటలు అంటూ మారుడు ఆ ఉన్నతుని ముందు నిలబడ్డాడు. సిద్ధార్థుడు తన లక్ష్యం సాధించకుండ ఎట్టి పరిస్థితులలోను వెనుదిరిగేది లేదని తీర్మానించుకొని, అశ్వత్థ వృక్షం క్రింద ఆసీనుడయ్యాడు. అతడి బద్ధ శత్రువైన మారుడు సిద్ధార్థుని లక్ష్యం చెదర గొట్టడానికి అతనిపై అన్ని రకాల ప్రలోభాలను ప్రయోగించాడు. అయినా సిద్ధార్థుడు తన లక్ష్యం నుంచి అంగుళమైన కదల లేదు. దానితో మారుడు వెనుదిరగక తప్పలేదు. మారుడంతర్థితుడయ్యాడు.

ఈవిధంగా మాటాడిన మారునికి ఉన్నతుడు సమాధానం చెప్పాడు. ఓ దుష్టుడా, ప్రమత్తుల బంధువా, నీవు స్వార్థ బుద్ధితో ఇక్కడకు వచ్చావు. సద్గుణ లేశం వల్ల గూడ ప్రయోజనం లేదు. నీవు ఈవిధంగా మాట్లాడటం అయోగ్యుల దగ్గరైతే బాగుంటుంది. శ్రద్ధ ఆత్మనిగ్రహం విర్య (విరియ), ప్రజ్ఞ (పఞ్ఞ)లు నావి. ఇలాంటి నాకు జీవితాన్ని గురించి ఎందుకు చెబుతావు? నదీ ప్రవాహాలను గూడా ఈ గాలి ఎండగడుతుంది. ఈ విధంగా పోరాటం సలిపే నాలోని రక్తం ఎందుకు ఎండిపోకూడదు. రక్తం ఎండిపోయినప్పుడు, పిత్తరసం, కఫం గూడా ఎండిపోతాయి. నాలోని మాంసం నాశం అవుతున్న కొలదీ నా మనస్సు ఇంకా ఇంకా స్వచ్ఛమవుతుంది. ఇంకా ఇంకా నా సతీ, జ్ఞానం, ఏకాగ్రతలు స్థిరపడతాయి.

నేను ఇలా అత్యంత బాధతో జీవిస్తున్నప్పుడు నా మనస్సు లాలసను కోరదు. జీవిలోని శుద్ధతను చూడు! కామం నీ ప్రథమ ఆయుధం. రెండోది అరతి అంటే పవిత్ర జీవితం యెడల విముఖత. మూడోది ఆకలి

దప్పులు. నాలుగోది తృష్ణ. ఐదోది సోమరితనం, మందత. ఆరోది భీరుత. ఏడోది విచికిత్స. ఎనిమిదోది విచలనం, మొండితనం. తొమ్మిదోది లాభం, పొగడ్త, సత్కారం చెడ్డమార్గాన ఆర్జించిన కీర్తి. పదోది స్వోత్కర్ష, పరనింద.

ఓ నముచీ ఇదీ నీ దుష్టసేన. పిరికివాడు నీ సేనను జయించలేడు. కానీ జయించినవాడు సుఖాన్ని పొందుతాడు. ఈ ముంజ గడ్డిని నేను ప్రదర్శిస్తాను! ఈ ప్రపంచంలో జీవితానికి ప్రయోజనం ఏమిటి! జీవితంలో ఓటమిపాలై బ్రతకటం కంటే యుద్ధంలో మరణం మేలు! కొంతమంది శ్రమణులు, బ్రాహ్మణులు ఈ యుద్ధంలో పాల్గొన్నట్టు లేదు. వారికి ధర్మమార్గం తెలియదు. దానిని వారు అనుసరించరు. మారుడు ఏనుగు మీద. అన్ని వైపుల సైన్యం మోహరించడం చూసి, సమరానికి సమాయత్తుడ నయ్యాను ముందుకు నడిచాను. మారుడు నన్ను నా స్థానం నుంచి ఏ మాత్రం కదల్చలేక పోయాడు. నీ మహాసేన వాహినిని ఈ ప్రపంచం దేవతలూ అందరూ ఏకమైగూడ జయించలేకపోవచ్చు. ఒక పచ్చి మట్టి చిప్పను రాతితో బద్దలు కొట్టినట్టు, నా జ్ఞానంతో నీ సేనావాహినిని నాశం చేస్తాను. బాగా కుదురుకొన్న ఎరుకతో, ఆలోచనలను నిగ్రహించుకొంటూ, అనేకమంది శిష్యులకు శిక్షణనిస్తూ దేశదేశాలు తిరుగుతాను. వారు శ్రమ, పట్టుదలలతో, నే చెప్పేది పాటిస్తూ, నిన్ను లెక్కచేయకుండా, ఎక్కడకు వెళితే దుఃఖం కలగదో అక్కడకు వెళతారు.

ఆరోజుల్లో, శరీరాన్ని, శుష్కింపజేసుకొంటేనే కాని ముక్తి లభించదని, సన్యాసానికి సంబంధించిన తాత్వికులు భావించేవారు. కాని గౌతముడు, అనుభవంతో, అటువంటి వాటివల్ల ప్రయోజనం లేదని, వాస్తవానికి అవి ఒకడి బుద్ధిని, పట్టుదలను క్షీణింపజేస్తాయని గ్రహించాడు. ఈ బాధాకరమైన విధానాన్ని వదిలివేశాడు. అలాగే దీనికి వ్యతిరేకంగా రెండో అంచున ఉన్న, నైతిక ప్రగతికి ఆటంకమైన స్వర్గసుఖాలలో ఓలలాడే విధానాన్ని కూడ వదిలివేశాడు. ఆ కొస, ఈ కొస కాని మధ్యేమార్గాన్ని ఎన్నుకోవాలనే ఆలోచన చేశాడు. ఈ మధ్యమ మార్గం కాలక్రమేణ అతని బోధకు ముఖ్య లక్షణమైంది. ఆనాడు తన తండ్రి ఏరువాకలో నాగలి దున్నుతున్న సమయంలో, తాను వెలగచెట్టు చల్లని నీడలో, పద్మాసనస్థుడై తన శ్వాసపై తాను కేంద్రీకరించినప్పుడు, సాధించిన పరమానందం లేదా సిద్ధి ఒకసారి గుర్తు చేసుకొని, ఇలా అనుకొన్నాడు. మంచిది, జ్ఞానోదయానికి ఇదేమార్గం.

**మధ్యేమార్గం :** అలా శుష్కించిన దేహంతో, జ్ఞానోదయం సాధ్యం కాదని అతడు గుర్తించాడు. ఆధ్యాత్మిక ప్రగతికి దేహ దారుఢ్యం ముఖ్యం. అందుకని అతడు మితంగా శరీరాన్ని పోషించాలనుకొని, ఘన, ద్రవ ఆహార పదార్థాలను తీసుకోవటం మొదలుపెట్టాడు. అతను ఏదో సాధిస్తాడు, సాధించింది తమకు చెబుతాడని ఎదురు చూసిన అతని శిష్యులు, అతడు తన విధానాన్ని మార్చుకోవడంతో, నిరాశచెంది, అతనిని, ఆ ప్రదేశాన్ని విడిచి, ఇసి పట్టణానికి వెళ్ళి, అక్కడి వారందరికీ, గౌతముడు విలాస జీవితాన్ని గడుపుతున్నాడు, తపో సమరాన్ని విడనాడి, సుఖ జీవితాన్ని స్వీకరించాడు అని చెప్పారు. సహాయం అవసరమైన ఆ సంకట సమయంలో అతనిని ఒంటరి వానిని చేసి, వదిలి పెట్టిపోయారు. అయినా అతడు నిరాశ చెందలేదు. ఆ మహా సమరంలో వారి సాన్నిధ్యం సహాయకారియే అయినా, వారి ఐచ్ఛిక ఎడబాటు అతనికి ప్రయోజన కారియే అయింది. ఏకాంతంగా, అరణ్యాలలో, ఒంటిరతనంలో, గొప్పవాళ్ళు నిగూఢ సత్యాలను కనుగొన్నారు. రహస్యమైన సమస్యలను కూడా ఛేదించారు.

**సత్యోదయం :** కొంత ఘన ఆహారంతో, పోయిన బలాన్ని పుంజుకొన్నాడు. అతడు చిన్నతనంలో సాధించిన జ్ఞానానికి తేలికగానే మెరుగుపెట్టాడు. క్రమక్రమంగా రెండు, మూడు, నాలుగు ఝానాలను గూడ అతడు సాధించాడు. ఝానాల సాధనతో మనస్సును పరిపూర్ణ ఏకాగ్రతతో నిలపగలుగుతున్నాడు. ప్రతి వస్తువును దాని వాస్తవాకృతిలో ప్రతిబింబించే తుడిచిన అద్దంలా, అతని మనస్సు ఇప్పుడు ఉంది. ఈ విధంగా అతని మనస్సు ప్రశాంతమైంది. పరిశుద్ధమైంది. నిర్మలమైంది. లాలస, మురికి నుంచి స్వేచ్ఛ పొందింది. సమ్యమైంది, దృఢమైంది, స్థిరమైంది, అకంపితమైంది. అప్పుడు పూర్వ జన్మల స్మృతులకు సంబంధించిన జ్ఞానం మీదికి మనస్సును మరలించాడు. గత జన్మలలోని తన వివిధ భాగదేయాలను గుర్తుతెచ్చుకొన్నాడు. మొదట ఒక జీవితం, తరువాత రెండు జీవితాలు, ఆ తరవాత మూడు, నాలుగు, ఐదు, పది, ఇరవై, ఏభై జీవితాల వరకు, ఆ తరువాత వంద, వేయి, వందవేలు, ఆ తరువాత అనేక విశ్వ ఆవృతుల (చక్రాల) వలయాన్ని ఆ తరువాత అనేక విశ్వ ఆవృతుల లయం, పరిణామాలను గుర్తు తెచ్చుకొన్నాడు. ఆ చక్రంలో అప్పట్లో తాను పలాన, తన పేరు పలాన, తన కుటుంబం పలాన, తాను పలాన

ఆహారం తినేవాడు, తాను పలాన సుఖదుఃఖాలను అనుభవించాడు, తన అంతం పలాన విధంగా జరిగింది, మళ్ళీ అక్కడ బయలుదేరి తాను మరోచోట జన్మించాడు. ఈ జన్మలో తన పేరు పలాన, కుటుంబం పలాన, కులం పలాన, అనుభవించిన సుఖదుఃఖాలు పలాన, పలాన విధంగా తన అంతం జరిగింది. అక్కడ నుంచి బయలుదేరి ఇక్కడ జన్మించాడు.

ఈ విధంగా తన గతజన్మలలోని వివిధ విషయాల వివరాలను గుర్తుకు తెచ్చుకొన్నాడు. రాత్రి మొదటి జాములో అతడు వాస్తవంగా సాధించిన జ్ఞానం ఇది. గతానికి సంబంధించిన అజ్ఞానాన్ని ఈవిధంగా పారదోలి, అతని మనస్సును జీవుల భవాభావాలపై (అంతరించడం, తిరిగి ఆవిర్భవించడం సారించాడు. విమలమైన దివ్యదృష్టితో, జీవులంతా ఒక అస్తిత్వం నుంచి మరో అస్తిత్వానికి మారడాన్ని పరికించాడు. ఉచ్ఛ, నీచ జీవులు, అంద, అందవిహీన, సుఖులు, దుఃఖులు – అంతా వారివారి కర్మల ననుసరించి గతిస్తున్నారని తెలుసుకొన్నాడు. వారి చెడ్డ పనులు, మాటలు, ఆలోచనలు కారణంగా, మంచి వారిని దూషించిన కారణంగా, తప్పుడు నమ్మకాల కారణంగా, వారి శరీరాలు లుప్తమైన తరువాత, మరణించిన తరువాత, ఈ వ్యక్తులు దుఃఖ భాగులై జన్మిస్తారని గ్రహించాడు. ఈ వ్యక్తులు మంచి పనులు, మాటలు, ఆలోచనల కారణంగా, మంచి వాళ్ళని దూషించని కారణంగా, మంచి నమ్మకాల కారణంగా, వారి శరీరాలు నశించిన తరువాత, మరణించిన తరువాత,, సుఖకరమైన దివ్యలోకాల్లో జన్మిస్తారని తెలుసుకొన్నాడు.

ఈ విధంగా అతడు తన యోగ మానవాతీత దృష్టితో జీవుల భవాభవాలను చూశాడు. ఇది నిజంగా అతడు రాత్రి మధ్య జాములో సాధించిన రెండో జ్ఞానం. భావికి సంబంధించిన అజ్ఞానాన్ని ఏ విధంగా పరిహరించిన అతడు, తన విమల మనస్సును మలినాల పరిచ్ఛేదం వైపుకు మళ్ళించాడు. వాస్తవ విషయానుగుణంగా అతడు గుర్తించాడు. ఇది దుఃఖం. ఇది దుఃఖం కలగడం, ఇది దుఃఖ నివృత్తి, ఇది దుఃఖ నివృత్తి మార్గం. అలాగే వాస్తవ విషయాను గుణంగా అతడు గుర్తించాడు. ఇవి మలినాలు ()ఆసవాలు), ఇది మలినాలు పట్టడం, ఇది మలినాల నివారణం, ఇది మలినాల నిరోధానికి దారి తీసే మార్గం. ఈ గుర్తింపుతో, ఈ గ్రహింపుతో, అతని మనస్సు విషయ వాంఛా మలినం నుంచి, అస్తిత్వ తృష్ణ మలినం నుంచి, ఆ విద్యా మలినం నుంచి విముక్తమైంది.విముక్తుడు కావడంతో, అతడు తెలుసుకొన్నాడు. నేను ముక్తుడనయ్యాను. అతనికి జ్ఞానోదయం అయిది. పునర్జన్మ అంతమైంది. పవిత్ర జీవితం సిద్ధించింది, చేయవలసింది చేశాను. ఇక ఈ స్థితి సంబంధమైంది ఇంకా ఏమీలేదు.


రాత్రి చివరి జాములో అతడు ఆర్జించిన మూడో జ్ఞానం ఇది. అజ్ఞానం అంతరించింది. జ్ఞానోదయం అయింది. చీకటి తొలగిపోయింది. వెలుతురు వచ్చింది.

*శ్రీ వల్లభనేని అశ్వినీకుమార్ గారు,*

*మీతో పరిచయం అవ్వడం చాలా సంతోషంగా ఉంది. మీరు ఏప్రిల్ **మిసిమి**లో బుఱ్ఱా సూరమాంబ గారి గురించి చాలా చక్కటి వ్యాసం ప్రచురించారు. బుఱ్ఱా సూరమాంబ గారు నాకు స్వయాన అమ్మమ్మ గారు! ఆమె తండ్రి సోమంచి భీమశంకర శాస్త్రి గారు, శ్రీ వీరేశలింగం గారి ఆప్తమిత్రుడు. ఏలూరులో నివసించేవారు. వీరేశలింగం గారి మీద పడిన కోర్టు కేసులలో, వకీలుగా భీమశంకర శాస్త్రిగారు వాదించేవారు. భీమశంకర శాస్త్రిగారి ఇంట్లో తిరుపతి వెంకటేశ్వర కవులు, ఆదిభట్ల నారాయణదాసు వంటి ప్రముఖులు అతిథులుగా వచ్చేవారు. ఆయన తెలుగు భాషను, తెలుగు కవులను ప్రోత్సహించేవారు. ఆ కారణంగా, బుఱ్ఱా సూరమాంబ గారు చిన్నవయసులోనే, అప్పటి తెలుగు శైలిలో, పుస్తకాలు రాయడం మొదలు పెట్టారు. ఆమె రచనలు కొన్నింటిని, కొన్ని సంవత్సరాల క్రితం మళ్ళీ ప్రచురించ గలిగాము. ఆ ప్రచురణను మీకు పంపిస్తాను. ధన్యవాదాలు,*

*ఈ అ స శర్మ ,*

*10–4–2025, విశాఖపట్నం*




# జీవన మకరందం

- స్త్రీకి పెళ్లి ఒక కవచం. తానున్న సమాజం నుంచి దృఢమైన రక్షణ.
  రక్షణకవచాలు పూలతో చెయ్యరు.
- రాయటం చేతకాని వాడు విమర్శకుడౌతాడు.
- ఏ కొడుకూ తండ్రిని క్షమించడు.
- నేరస్థులు – రచయితలూ కళాకారులైతే?
- నీ గాయాల్ని మాన్పాలని ఆరాటపడకు. కాలమే లేపనాలు పూస్తుంది.
- ఎవరినుంచీ ఏమీ ఆశించకు. నీకు ఎప్పుడూ నిరాశ ఎదురుకాదు.
- సంతృప్తిని మించిన సంపదేమున్నది. సమయం – సంబంధాలు – శాంతి నీచెంతనే వుంటాయి.
- జ్ఞాపకాలు బాధపెడుతున్నాయా? బాధ కూడా ఒక జ్ఞాపకమే. నీ చుట్టూ చూడు చాలా మంచి విషయాలు ఉన్నాయి. నీ దగ్గర వాళ్లతో మాట్లాడు. జ్ఞాపకాలన్నీ కరిగిపోతాయి.
- వందల టీ.వీ ఛానెల్స్ నడుస్తూ ఉంటాయి. కాని ఏదీ మనకు ఉత్సాహాన్ని ఇవ్వదు. ఎన్నిదారులుంటే అంత అయోమయం మీ ప్రయాణం.
- నవ్వటం నేర్చుకో. నవ్వు నిన్ను వెలిగిస్తుంది. చుట్టూ ఉన్నవారిని దగ్గర చేస్తుంది.
  పరిసరాలను తేలిక చేస్తుంది. నవ్వు ఆరోగ్యకరం.
- స్వేచ్ఛ ఎడారిలాంటిది. ఎటు పోవాలో తెలీదు.
- అయినవాళ్ళూ, కానివాళ్ళూ ఉండరు. అవసరమైన వాళ్లే ఉంటారు.
- బంధాలన్నీ ఆర్థికసంబంధాలే. భ్రమలేమీ పెట్టుకోకు.
- ధన దాహం తీరేది కాదు.
- దేవుడు ఒంటరివాడు.
- మితిమీరిన సంపద వరదలాంటిది. ఎక్కువగా సముద్రపు పాలవుతుంది.



- దుఃఖాశ్రువులు నిన్ను పునీతం చేస్తాయి.
- ఆవేదన ఆధ్యాత్మికం.
- నువ్వు లేకపోతే ఈ లోకం లేదు.
- శృంగారం లేని జీవితం వసంతం రాని ఋతుచక్రం.
- మనచుట్టూ ఉన్న ప్రపంచం మారిపోతూ ఉంటుంది. మనమే మారటానికి ఇష్టపడం.
  అదే నిత్య సంఘర్షణ.
- విశ్వాసం హంసతూలికాతల్పం లాంటిది.
  నీకు నిద్రపట్టినా, పట్టకపోయినా శారీరక సుఖాన్ని మానసిక శాంతినిస్తుంది.
  వర్షంలో గొడుకు క్రిందకి చేరటం, వెచ్చని గుహలోనికి పోవటం హేతువిరుద్ధం కాదు కదా!
- అతిలోక సౌందర్యమాటున అంతులేని విషాదం దాగి ఉంటుంది.
- సౌందర్యానికి, సౌఖ్యానికి, కోరికలకు హేతువేముంటుంది?
- జీవితంలో అత్యంత తన్యతగల విషయం మృత్యువే కదా!
  ఎప్పుడు వస్తుందో, ఎలా తీసుకుపోతుందో తెలీదు.





# బుద్ధ గుప్తనాథుడు

– డా. ఎ.బి. సాయిప్రసాద్

సుమారు 2600 సంవత్సరాల క్రితం "వ్యక్తి పరివర్తనకు అనుకూలమైన జీవనశైలి" గా బౌద్ధం మనదేశంలో పురుడు పోసుకుంది. మూడు పువ్వులు ఆరు కాయలుగా దిన దిన ప్రవర్ధమానమైన బౌద్ధం అనేక కారణాల వల్ల - బౌద్ధంలో వచ్చిన చీలికల వల్ల, మతం జన సామాన్యానికి కొంత వరకూ దూరం కావడం వల్ల, బౌద్ధంలోని మంచి అంతా మన ఉపనిషత్తులలో ఉందన్న ఆది శంకరాచార్యుల బలమైన ప్రచారం వల్ల, బుద్ధుడిని విష్ణువు అవతారంగా స్వీకరించడం వల్ల, హూణుల, తురుష్కుల దండయాత్రల వల్ల, ఇలా కారణాలు ఏమైనా సరే 12వ శతాబ్దం నాటికి భారతదేశంలో అది కనుమరుగైందని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ వాదం తప్పని బౌద్ధం నివురు కప్పిన నిప్పులా భారతదేశంలో ఉండేదని 16వ శతాబ్దంలో రామేశ్వరంకు చెందిన బుద్ధగుప్తనాథుడు వెలిగెత్తి చాటాడు. ఈ అపర బుద్ధుడు భారతదేశం వెలుపల, పొరుగు దేశాలలో, సుదూర ప్రాంతాలలో బౌద్ధాన్ని పునరుజ్జీవింప జేసాడు.

బుద్ధగుప్తనాథుడి కాలం నాటికి బౌద్ధంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. బౌద్ధం మూడు పాయలుగా - థేర్‌వాద (పెద్దలబాట) మహాయాన (గొప్పయానం) వజ్రయాన (వజ్రమార్గం) గా చీలిపోయింది. బౌద్ధ బిక్షువులు పొరుగు దేశాలకు, హూణులు ముఖ్యంగా తురుష్కుల యాతనను భరించలేక వలస వెళ్ళడం జరిగింది. 10వ శతాబ్దంలో బౌద్ధంలోని తంత్రయానం శాఖనుండీ ప్రేరణను గ్రహించిన శైవ, వైష్ణవ, నాథ సంప్రదాయాలు ప్రజలపై తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. దీక్ష పొందిన నాథులు చెవులుకుట్టుకొని కుండలాలను ధరించేవారు. అందుకే వీరిని 'కన్' లేదా 'కాన్‌ఫట్' యోగులుగా పిలిచేవారు. రామేశ్వరంకు చెందిన బుద్ధగుప్తనాథుడిపై తంత్రయానం, గోరక్షనాథుడి ప్రభావంను మనం స్పష్టంగా చూడగలము.

టిబెట్‌కు చెందిన తారనాథుడు తన హాజియోగ్రఫీ (జీవిత చరిత్రలు) బుద్ధగుప్తనాథుడిని గురించి వివరాలు తెలియజేసాడు. అతని ప్రకారం బుద్ధగుప్తనాథుడు రామేశ్వరంకు చెందిన ఒక గ్రామంలో జన్మించాడు. ఆ వూరిపేరు ఇంద్రలింగం. బహుశా ఇది టిబెట్‌కు చెందిన బౌద్ధగ్రంథాలలో రామేశ్వరం పేరులేదా దగ్గరి వూరు పేరు అయి వుంటుంది. ఇతని తల్లితండ్రులు వైశ్యులు (బౌద్ధాన్ని ఒకానొకప్పుడు వైశ్యులే పాటించే వారని కొంత మంది పరిశీలకులు భావిస్తున్నారు.) బుద్ధగుప్తనాథుడు తన తల్లి తండ్రులకు ఎనిమిదవ సంతానం. వీరిది సంపన్న కుటుంబం. బుద్ధగుప్తనాథుడి తల్లి తండ్రులు తమ ఎనిమిదవ సంతానాకి బుద్ధుడు అని నామకరణం చేసి ఉంటారు. వైశ్యులు కావడం వల్ల గుప్తమాటను చేర్చి వుంటారు. గోరక్షనాథుడి ప్రభావం కారణంగా, మొదటి గురువు తీర్థనాథుడి కారణంగా కావచ్చు 'నాథ' అన్న మాట అతడి పేరుకు తగిలించారని భావించవచ్చును. ఇతడి అసలు పేరు ఏమో మనకు తెలియదు. బుద్ధగుప్తనాథుడిగా, తీర్థనాథుడే (Thirta) దీక్ష తరువాత నామకరణం చేసాడని ప్రచారంలో ఉంది. ఇతడి ఇతర గురువులు దేవనార, దీపనాథులు. దీపనాథుడి వద్దే బుద్ధగుప్తనాథుడు వ్యాకరణాన్ని అధ్యయనం చేసాడు. మొదటి 30 సంవత్సరాలు బుద్ధగుప్తనాథుడు రామేశ్వరంలో సిద్ధుల, శైవుల మధ్య గడిపాడు. వారివద్ద నుండే రసాయన, మంత్ర, తంత్ర యోగ విద్యలను బుద్ధగుప్త నాథుడు గ్రహించడమే కాకుండా అభ్యసించాడు.

16 సంవత్సరాల పాటు బుద్ధగుప్తనాథుడు దక్షిణ భారతదేశానికి చెందిన ఒక శివాలయంలో ధ్యానం చేసేవాడు. ఆ తరువాత అతడు తీర్థయాత్రకు బయలు దేరాడు. ఆయాత్రలలో ఒడ్డియానను సందర్శించడం

జరిగింది. ఇది తొలుత మహాసిద్ధులకు సంబంధించినది. ఆ తరువాత టిబెట్‌కు సంబంధించిన బౌద్ధులు ఈ క్షేత్రానికి ప్రాముఖ్యత నిచ్చారు. వారి ప్రకారం ఇది వజ్రయానానికి చెందినది. ఇది DZOGCHEM బోధనలకు జన్మస్థానం. టిబెట్‌కు చెందిన బౌద్ధులు దీన్ని స్వర్గ సమానమైన ప్రాంతంగా భావిస్తారు. వారి భాషలో దీన్ని బేయుల్ అంటారు. ఇది పద్మ సంభవుడి జన్మస్థానం కూడా. ఇది నేటి పాకిస్తాన్‌లోని స్వాట్ జిల్లాలో ఉంది. కొందరు ఇది కాశ్మీర్‌లో ఉన్నదని. కాదు కాదు టజకిస్తాన్, ఉజ్‌బెకిస్తాన్, టర్కమనిస్తాన్‌లో ఉందని భావిస్తే మరికొందరు నేటి ఒరిస్సా రాష్ట్రంలో ఉందని భావిస్తారు.

టిబెట్‌కు చెందిన తారానాథుడు (1575–1635), బుద్ధగుప్తనాథుడి శిష్యుడు. తన గురువు తీర్థయాత్రను గురించి రాస్తూ, "తన యాత్రలో బుద్ధగుప్తనాథుడు ఒకసారి రాజస్తాన్‌లోని రాథోర్ చేరుకున్నాడు. రాథోర్ సంస్థానికి చెందిన కొందరు ఉన్నత ఉద్యోగులు బుద్ధగుప్తనాథుడిని కలిసారు. వారు రాజు తరపున కొన్ని కానుకలు సమర్పించారు. అక్కడ ఒక చిన్న పర్ణకుటీరాన్ని బుద్ధ గుప్తనాథుడు నిర్మించుకున్నాడు. అక్కడే ధ్యానం చేయసాగాడు. ఒక రోజు ధ్యానం చేస్తున్నప్పుడు సుషుప్తిను చేరుకున్నాడు. ఆస్థితిలో ఒక విచిత్రమైన కలను కన్నాడు. ఆ కలలో అతడికి వజ్రయోగిని దర్శనమిచ్చింది. (వజ్రయోగిని ఒక తంత్ర దేవత. టిబెట్‌కు చెందిన బౌద్ధులకు ఒక ముఖ్య దేవత. వజ్రయానంలో ఈమెను స్త్రీ రూపంలోని బుద్ధుడుగా భావిస్తారు.) ఇదేదో ఒకసారి జరగలేదు. ఇది పదేపదే జరిగింది. ఆమె దర్శనం కారణంగా అతనిలో దివ్యజ్ఞానం ప్రవేశించింది. ఒకసారి ఆ దేవత అతనికి మధుబాల (BAR MAID)గా కనిపించేది. ఆమె అనుగ్రహం వల్ల అతడు అన్ని ఆటంకాలను అవలీలగా అధిరోహించ గలిగాడు. ఆమె దర్శనం తరువాతనే బౌద్ధ సంప్రదాయాలను స్వీకరించాడు. ఎనిమిది సంవత్సరాలు బుద్ధగుప్తనాథుడు సాధన చేసాడు. అప్పుడే చక్రసంవర (సంవర అన్న మాట వ్రతం లేదా ప్రమాణలను సూచిస్తుంది. ఇది శైవ పరంపరలోని సంవర. సంవరను పరమ సుఖం అంటారు. ఆ తరువాత హేవజ్ర మంత్రోపదేశాన్ని -OM DEVA PICUVAJRA HUM HUM PHAT SVAHA) పరమగురువు శాంతిగుప్తుడి ద్వారా పొందాడు. గురువు శాంతి గుప్తుడిని ఆశ్రయించి, తనకు సాధికారితను ప్రసాదించమని అభ్యర్థించాడు. దేశయాత్ర ద్వారా ఆ సంబంధమైన సామాగ్రిని పోగు చేసుకొని రా అని గురవు శాంతిగుప్తుడు ఆదేశించాడు. గురవు సూచించిన విధంగా సామాగ్రిని పోగు చేసుకోవడానికి బుద్ధగుప్తనాథుడు బయలు దేరాడు. తొలుత త్రిలింగ ప్రాంతం – శ్రీశైలం, కాళేశ్వరం ద్రాక్షారామంల మధ్య ఉన్న ప్రాంతం– చేరుకున్నాడు. అక్కడ 30 వెండి తులాలకు సమమైన సామగ్రిని సమకూర్చుకొన్నాడు. ఆపైన తిరుమలలో మరింత సామగ్రి అతడికి లభ్యమైంది. చివరిగా గురువు ఉంటున్న కర్నాటక ప్రాంతాన్ని చేరుకున్నాడు. ఇక్కడ అతి ఉత్తమమైన సాధికారితను గురువు నుండి పొందాడు. మరింత సాధికారితను, ఉపదేశాలను శాంతిగుప్తుడి ప్రధాన శిష్యుడైన గంభీర లింగడు నుండి పొందాడు. బుద్ధగుప్తనాథుడు 13 నెలలపాటు శాంతిగుప్తుడి వద్ద గడిపాడు. కొంతమంది ప్రకారం శాంతి గుప్తుడే తన శిష్యుడికి బుద్ధగుప్తనాథుడినే పేరు పెట్టాడు.

బుద్ధగుప్తనాథుడి భారత యాత్రలను గురించి శ్రీ ప్రభాకర్ తమిళరసు దిప్రింట్ (ఇదొక ఆన్‌లైన్ ప్రచురణ) లో ఇలా రాసారు: బుద్ధగుప్తనాథుడి భారతయాత్ర 1570లో గోవా నుండి ప్రారంభమైంది. అన్ని ప్రాంతాలను దర్శిస్తూ కృష్ణానదీ తీరమైన అమరావతిని (ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరం) చేరుకున్నాడు. ఇది 1585లో జరిగిందని పరిశోధకులు భావిస్తున్నారు. తన శ్రీలంక యాత్రలో భాగంగా జామిగిరి దీవిని చేరుకున్నాడు. ఈ దీవిని సుప్రసిద్ధ బౌద్ధ మత ఆచార్యుడు నాగార్జునుడు సందర్శించాడు. ఇక్కడ ఒక బౌద్ధ ఆరామాన్ని నిర్మించాడు. నాగార్జునుడి దివ్య దర్శనం బుద్ధగుప్తనాథుడికి ఇక్కడే కలిగిందట. ఆ తరువాత బుద్ధగుప్తనాథుడు దక్షిణ తీర ప్రాంతంలోని మౌంట్ పాటలక దీవిపై అడుగు పెట్టాడు. బౌద్ధుల ప్రకారం ఇక్కడ బోధిసత్వ అవలోకితేశ్వరుడు నివసించాడు.

బుద్ధగుప్తనాథుడు బౌద్ధాన్ని వివిధ దేశాలలో పర్యటించి ప్రచారం చేసాడని తారానాథుడు (1576–1634) తన హాజియోగ్రఫీలో రాసుకున్నాడు. అతడి ప్రకారం తన యాత్రలో ఒకసారి 'శంఖ ద్వీపం'ను బుద్ధగుప్తనాథుడు చేరాడు. ఇయాన్ సిన్‌క్లయర్ నేటి యేమాన్‌లోని సోకోట్ర దీవిగా దీన్ని గుర్తించాడు. అక్కడి నుండి బుద్ధగుప్తనాథుడు మాల్దీవులను చేరుకున్నాడు. ఒకప్పుడు ఇక్కడివారు బౌద్ధాన్ని పాటించేవారు. ఆ తరువాత ఇది ఇస్లామ్‌ను అనుసరించే దేశంగా మారింది. అక్కడ నుండి ఇతడు శ్రీలంకను చేరుకున్నాడు. ఇక్కడిప్రకృతి

సౌందర్యం అతడిని బాగా ఆకట్టుకుంది. బౌద్ధం దేదీవ్యమానంగా వెలుగుతున్న ఆ దీవిలోని అన్నీ ముఖ్యప్రాంతాలను అతడు చూడడం తటస్థించింది. అక్కడ అతను రామాయణ కాలంనాటి రామసేతువును దర్శించాడు. ఈరోజు ఆసేతువును ఆంగ్లేయుల కారణంగా మనం ఆడమ్స్ బ్రిడ్జి గా గుర్తిస్తున్నాము. అప్పుడు అక్కడున్న రాజు బుద్ధగుప్తనాథుడిని కలుసుకున్నాడు. ఆ రాజు పేరును తారానాథుడు Ra He SHING BHAN DARI. (రాజు సింఘే1) గా పేర్కొన్నాడు. ఈ రాజసింఘే కాండీను 1581 మొదలు 1592 వరకు పరిపాలించాడని ఒక పోర్చుగీసు తన పుస్తకంలో నమోదు చేసాడు. ఇతడి శ్రీలంక యాత్ర 1573 ప్రాంతంలో ప్రారంభమై 1587కు ముందు ముగిసి వుంటుందని సిన్‌క్లియర్ మహాశయుడు ఊహిస్తున్నాడు. సంవత్సరాలు ఏవైనా కానివ్వండి బుద్ధగుప్తనాథుడు శ్రీలంకలో అయిదు సంవత్సరాలు గడిపాడన్నది అక్షరాల నిజం. అక్కడినుండి నేటి ఇండోనేషియాలోని పులవు లింగ్గాను చేరుకుని ఆ తరువాత నేటి చైనాలోని మకావుకు వచ్చాడు. ఆ తరువాత జాంజిబార్ లేక కోమోరో (నేటి ఉత్తర ఆఫ్రికాలోని ఒక దీవి) లో ప్రవేశించాడు. ఈ యాత్రా వివరాలను శ్రీ సీన్‌క్లయర్ మహాశయుడు తారానాథుడి హాజియోగ్రఫి ఆధారంగా వివరించాడు. అతడే తారానాథుడు పేర్కొన్న కొన్ని విషయాలు విశ్వసనీయమైనవిగా స్వీకరించలేమని తన పరిశోధనా పత్రంలో రాసుకున్నాడు. బుద్ధగుప్తనాథుడి శ్రీలంక యాత్రలో, అతడు 700 సంవత్సరాల వయసున్న ఒక యోగిని కాండీ గుహలో కలుసుకున్నాడని, అతడి పేరు యశకర శాంతి అని తారానాథుడు తెలిపాడు. డేవిడ్ టెంపల్‌మాన్ తన పుస్తకం బుద్ధగుప్తనాథ అండ్ లేట్ సర్‌వైవల్ ఆఫ్ సిద్ధ ట్రెడిషన్ ఇన్ ఇండియాలో బుద్ధ గుప్తనాథుడి యాత్రలను గురించి మరికొన్ని విషయాలు తెలియజేస్తున్నాడు. అతడి ప్రకారం ఇతడు ఇరాన్, బాల్క్-ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ కాష్గర్ మధ్య ఆసియా, ముల్టాన్, ఖుష్త్ ఖోరాసన్ బడాక్షన్ మొఘులుల పరిపాలనలోని కొన్ని ప్రాంతాలు కాలినడక ద్వారానే చేరుకున్నాడు. ఆ తరువాత ఓడ ద్వారా ఆగ్నేయ ఆశియా ముఖ్యంగా ఇండోనేషియా నేటి మయన్మార్ లోని కొన్ని ప్రాంతాలు. బహుశా థాయ్‌ల్యాండ్ వరకు పయనించాడు. తూర్పు ఆఫ్రికాలోని మెడగాస్కర్ తీరాన్ని కూడా చేరాడని గ్రంథస్తం చేసాడు. ఇంతగా యాత్రలు చేసినందుకు బుద్ధగుప్తనాథుడిని ప్రశంసిస్తూ 63 సంవత్సరాల వయసున్న బౌద్ధ ధర్మ పరిశోధకుడు నామక్కల్‌కు చెందిన సంపత్, "ఇంత విస్తృతంగా యాత్రలు చేసిన మొదటి తమిళ బౌద్ధుడని" నుడివాడు.

తమిళనాడు రామేశ్వరంకు చెందిన బుద్ధగుప్తనాథుడిని గురించి ప్రపంచానికి ఇటీవలే తెలిసింది. ఇతని శిష్యుడు తారానాథుడు టిబెట్ భాషలో రాసిన హాజియోగ్రఫీ (ఒక సాధువు లేదా మత పరమైన నాయకుడి జీవిత చరిత్ర. కొంత ముఖస్తుతి ఇందులో ఉంటుంది.) ఆధారంగా మనకు తెలియవస్తుంది. ఈ పుస్తకంలో సన్యాసుల జీవిత చరిత్ర లిపిబద్ధమై ఉంది. ఈ పుస్తకంలోని 30శాతం పుటలలో బుద్ధగుప్తనాథుడి సముద్రయానంకు గురించిన ప్రస్తావన ఉంది. ఈ పుస్తకం అందరికి అందుబాటులో ఉండేదికాదు. కొంత మంది పరిశోధకుల వరకే పరిమిత మయి ఉండేది. ఈ జీవిత చరిత్ర ఆంగ్ల అనువాదం జరిగిన తరువాత బాహ్య ప్రపంచానికి బుద్ధ గుప్తనాథుడిని గురించి తెలిసింది. మొట్టమొదటి సారిగా శ్రీయల్. అగస్టిన్ వాడ్డెల్ (AUGUSTINE WEDDEL, 1854–1938) తమ ఒక చిన్న ఆంగ్ల వ్యాసంలో పేర్కొన్నాడు. ఆ తరువాత శ్రీడ్జుజెప్పిటుట్టని (GUISEPPETUCCI – ఇతడు ఇటాలియన్) ఆ హాజియోగ్రఫిను ఆంగ్లంలోనికి అనువదించాడు. అతడు రాసిన ఒక ఆంగ్ల వ్యాసం 1931లో ఇండియన్ హిస్టారికల్ త్రైమాసికలో ప్రచురింప బడింది. ఆ తరువాత స్వర్గీయ హ్యూబర్ట్ డెక్‌లేర్ (HUBERT DECLEER, 1940–2022) బుద్ధగుప్తనాథుడికి సంబంధించిన కొన్ని కొత్త విషయాలు తెలియజేసాడు. బుద్ధగుప్తనాథుడు కొంచం అటు ఇటుగా విజయనగర సామ్రాజ్యానికి చెందిన అళియరామరాయలకు (1542–1565) సమకాలికుడని తేల్చాడు. 2008లో డేవిడ్ టెంపల్‌మాన్ తారానాథుడి హాజియోగ్రఫీను అనువాదం చేసి ప్రచురించాడు. ఈ అనువాదం ద్వారా ఇతడి పేరు బుద్ధనాథుడని హేవజ్ర దీక్ష తరువాత గురువు ఇతని పేరును బుద్ధగుప్తనాథుడిగా మార్చారని రాసాడు. ఇతని మొదటి గురువులు నాథేశ్వరి సంప్రదాయానికి చెందిన వారని ఈ సంప్రదాయంపై బౌద్ధ ప్రభావం ఎక్కువగా ఉందని తెలియ వస్తున్నదని చెప్పాడు.

పైన పేర్కొన్న వివరాలను దృష్టిలో ఉంచుకుని ఇయాన్ సీన్‌క్లయిర్ (IAINSINCLAIR, born1 June 1943) జర్నల్ ఆఫ్ టిబెటన్ లిటరేచర్ 2024, 3(2) 27–60)లో "ది ఇండియన్ ఓషన్ ఐటినరి ఆఫ్ బుద్ధగుప్త

నాథాన్ నామ్‌థర్" ద్వారా ఇంతవరకు ఎవరి ద్వారా కూడా సరిగ్గా గుర్తింపబడని దీవులలో డుంగ్ జి గ్లింగ్ పాలట యిులింగ్గ అముక పొటాల చుంగ్ బాలలో బుద్ధగుప్తనాథుడు సంచరించినాడని తెలిపాడు. బహుశ ఇవి టిబెట్ భాషలోని పేర్లు అయి వుండవచ్చును. ఈ వ్యాసాన్ని ఆధారం చేసుకుని ది ప్రింట్ (మీడియా ప్రచురణ) లో ఎ టమిల్ బుద్ధిస్ట్ యోగి వెంట్ టు జాంజిబార్, మకావు ఇన్ 1500స్ ఛేంజెస్ వాట్ వుయి నో అబౌట్ బుద్ధిజమ్ శ్రీ ప్రభాకర్ తమిళ్ అరసు (జనవరి 31, 2025) వివరించాడు. యేతావాతా తేలిన విషయం బుద్ధగుప్తనాథుడిని గురించిన వివరాలకు మనకు 21వ శతాబ్దంలోనే తెలిసాయి. చాలా చాలా ప్రాంతాలలో పర్యటించి బుద్ధగుప్తనాథుడు 1590 ప్రాంతంలో టిబెట్‌లో అడుగుపెట్టాడు. అక్కడ అతను సుమారుగా 14 లేక 16 సంవత్సరాల తారానాథుడిని కలిసాడు. టిబెట్‌కు చెందిన బౌద్ధులలో తారానాథుడు అతిముఖ్యుడు. టిబెట్ భాషలో ఇతని పేరు Kun-dga ShyingPO. ఆనంద గర్భుడు అన్నది ఈ పేరుకు సంస్కృత అనువాదం. వీరికలయిక వెనుక ఒక అద్భుత కథ ఉంది. తనకు ఇంత వరకు పరియచం లేని బుద్ధగుప్తనాథుడు టిబెట్ వస్తున్నట్లు, అతని పరిచయం, శిష్యరికం ఉపదేశాల కారణంగా తన జీవితం ఒక గొప్ప మలపు తీసుకుంటుందని కలకన్నాడు. గురువు వయసు 76 సంవత్సరాలు శిష్యుడి వయసు 16 సంవత్సరాలు. బౌద్ధానికి సంబంధించిన ముఖ్యంగా వజ్రయానంలోని తంత్ర మంత్ర యోగ విషయాలను తారానాథుడు బుద్ధగుప్తనాథుడి నుండే గ్రహించాడు. బుద్ధగుప్తనాథుడి వాక్కు తారానాథుడికి వేదవాక్కు. బుద్ధగుప్తనాథుడి ఆజ్ఞ తారానాథుడికి సుగ్రీవాజ్ఞ. తన హాజియోగ్రఫీలో బుద్ధగుప్తనాథుడిని గురించి 'మా గురువు గారు ఇలా చెప్పారు'. 'ఇది మా గురువుగారి అభిప్రాయం'. మా గురువుగారు ఈ విషయాన్ని మరోవిధంగా తెలియ జేసారు. అని రాసాడు.

నాథ, నాథేశ్వరీ, వజ్ర యోగినీల ఉపాసన కారణంగా అతనికి కొన్ని అద్భుత శక్తులు సమకూరాయి. అతనిని గురించి తారానాథుడు ఇలా తెలియజేస్తున్నాడు. బక్క పలచని శరీర నిర్మాణం కారణంగా హిమాలయాలలో ప్రయాణం అతనికి సులభ తరమమేది. ఎంత ఎత్తు నుండీ- మూడంతస్తుల మేడ నుండి - కిందకు దూకినా అతనికి గాయమయేదికాదు. జంతువుల పట్ల అతనికి అపారమైన ప్రేమ ఉండేది. పక్షులు అతని చేతిపై నిస్సంకోచంగా వాలేవి. అతడు నివసించే ప్రాంతంలోని జంతువులు తమ వైర భావాన్ని మరచిపోయి ఒకటిగా సంచరించేవి. అతడికి ఆకలి దప్పులు ఉండేవికాదు. ప్రకృతి శక్తులు అతనికి కావలసిన అన్న పానీయాలను సమకూర్చేవి. అతను ఎముకలు కొరికే చలిలో కూడా నగ్నంగా ఉండేవాడు. అతని దర్శనానికి వచ్చినవారు రెండు మూడు మీటర్ల వ్యాసార్థంగా అతడి నుండీ వేడిని పొందేవారు. అతడు నీటిపై నడుస్తున్నప్పుడు అరికాలికి తేమ అయ్యేదికాదు. భూమిపైన నడుస్తున్నప్పుడు అతడిపాదాలు భూమికి బెత్తడు ఎత్తులో ఉండేవి. ఎదుటివాడి మనోభావాలను, ఆలోచనలను అతడు తన అలౌకిక శక్తుల ద్వారా చాలా సునాయాసంగా తెలుసుకో గలిగేవాడు. యోగాభ్యాసం కారణంగా, తంత్ర యోగినీ విద్యల కారణంగా ఊపిరిని బిగబెట్టి తన శరీరాన్ని ఒక టీకప్పులో ఇమిడేంతగా మార్చుకొనే శక్తి అతడికుండేది. శ్వాసను వదులుతున్నప్పుడు ఎనిమిది వివిధ శరీరాలుగా మార్చుకోగలిగెడివాడు. ఇంతకు బుద్ధగుప్తనాథుడు బౌద్ధ ఆరామాలలో చేరి బౌద్ధ బిక్షువుగా దీక్షను స్వీకరించలేదు. అతడు బౌద్ధానికి చెందిన యే విశ్వవిద్యాలయంలోను శిక్షణ పొందలేదు.అతడు బౌద్ధ విహారాలను కాకుండా దేశ విదేశాలలో ఉన్న పీఠాలను దర్శించేవాడు. మూడు నెలల పాటు టిబెట్‌లో గడిపి రామేశ్వరం చేరుకున్నాడు. ఆ తరువాత తన గురువైన శాంతి గుప్తుడిని కలుసుకున్నాడు. ఆ తరువాత కూడా బుద్ధగుప్తనాథుడు తన భారత ఉపఖండం యాత్రను కొనసాగించాడని తారానాథుడు తన హాజియోగ్రఫిలో రాసాడు.

డా. అంబేద్కర్ మహాశయుడు కొలంబో (శ్రీలంక) లోని యంగ్ మెన్స్ బుద్ధిస్ట్ సభలో "రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ బుద్ధిజమ్ ఇన్ ఇండియా" విషయంగా మాట్లాడుతూ, బుద్ధగుప్తనాథుడి తరువాత బౌద్ధం భారతదేశంలో భౌతికంగా కనుమరుగయింది. నేను ఒప్పుకుంటాను. కాని ఒక ఆధ్యాత్మిక శక్తిగా ఇంకా అది ప్రచారంలో ఉందన్నాడు". బెల్జియంకు చెందిన రచయిత కున్రాడ్ ఎల్స్ట్ తనపుస్తకం-బుద్ధవాజ్ ఎవ్వరి ఇంచ్ ఎ హిందులో మన రాజ్యాంగాన్ని గురించి ఇలా రాసాడు: Under Jawaharlal Nehru, India's FIRST Prime Minister, Buddhism was turned into the Unofficial State religion of India, adopting the Lion Pillar of the, Buddhist Emperor Ashoka as a State Symbol...

బౌద్ధం మన దేశంలో కొనసాగుతూనే ఉంది. ఇక ముందు కొనసాగుతుంది.

డా. ఎ. బి. సాయిప్రసాద్
విశ్రాంత హిందీ ఆచార్యులు, బెంగళూరు -560076,
ఫోన్ : 9980567541

# తైత్తిరీయోపనిషత్తు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

యజుర్వేదానికి సంబంధించిన ఉపనిషత్తులను రెండుగా వర్గీకరించడం జరిగినది. అవి శుక్ల యజుర్వేదానికి సంబంధించినవి : బృహదారణ్యక, ఈశ. కృష్ణ యజుర్వేదానికి చెందినవి : తైత్తిరీయ, కఠ, శ్వేతాశ్వతర, మైత్రానియ. దీని ప్రకారం ప్రస్తుత తైత్తిరీయోపనిషత్తు కృష్ణయజుర్వేద సమూహానికి చెందినది. తైత్తిరీయ అరణ్యకంలోని ఏడు, ఎనిమిది, తొమ్మిది భాగాలతో ఇది రూపొందిందని తెలుస్తుంది. ఈ ఉపనిషత్తు మూడు భాగాలుగా ఉంది. మొదటిది శిక్షావల్లి, రెండవది బ్రహ్మానందవల్లి, మూడవది భృగువల్లి. 'వల్లి' అనే పదానికి చాలా అర్థాలు ఉన్నాయి. ఒకటి, భాగము లేదా అధ్యాయము. రెండు పాకే చెట్టు లేదా 'లత'. మూడు దయ, సమతుల్యత. హిందూ దేవతల సమాచారం ప్రకారం వల్లీదేవి శ్రీ మహావిష్ణువు, లక్ష్మీదేవిల కుమార్తె, సుబ్రహ్మణ్యస్వామి పత్ని. హిందువులలో చాలా మంది ఆడపిల్లలకు, మహిళలకు వల్లి, వల్లీదేవి అనే నామం ఉండడం సాధారణం. అయితే ఇక్కడ 'వల్లి' అంటే భాగము లేదా అధ్యాయము అనే అర్థములో ఉపయోగించడం జరిగినది. కొద్ది మంది భాష్యకారుల ప్రకారం ఈ ఉపనిషత్తుపైన చెప్పిన మూడు భాగాలతో పాటు, మరొక రెండు నారాయణ ప్రశ్నము, చిత్త ప్రశ్నములతో కలిపి ఐదు భాగాలుగా ఉంది. అయితే ఎక్కువ మంది మొదటి మూడు భాగాలనే గ్రహించి వ్యాఖ్యానాలు వ్రాయడం జరిగినది. దానిననుసరించి ఈ వ్యాసంలో కూడా పైన చెప్పిన మూడు భాగాల ఆధారంగానే విశ్లేషణ చేయడం జరిగినది.

మొదటి భాగమైన 'శిక్షావల్లి'లో గురు, శిష్య సంబంధాలు, ముఖ్యంగా శిష్యుడు లేదా నేర్చుకొనే విద్యార్థి లేదా 'అధ్యాయి' ఏ విధంగా ఉండాలి, నడచుకోవాలి, ఏ ఏ సూచనలు పాటించాలి, నైతిక జీవనం ఎలా గడపాలి, శీల నిర్మాణం ఏ విధంగా ఉండాలి అన్న విషయాలపై వివరణ ఉంది. రెండవ భాగమైన 'బ్రహ్మానందవల్లి'లో బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవడం, బ్రహ్మానందాన్ని పొందే మార్గం, ప్రాణం దాని మూలాధారం, మాయ, చైతన్యం వంటి విషయాలపై సుదీర్ఘ వివరణ ఉన్నది. ఇక మూడవ భాగం (భృగువల్లి)లో భృగు మహర్షిని గురించిన కథ, బ్రహ్మతత్వాన్ని సాధించడానికి అవసరమైన నియమాలు, ఆచరణలు చెప్పబడినవి. మొత్తంగా మూడు భాగాలతో కలిపి మొత్తం 32 అధ్యాయాలు ఉన్నాయి. శిక్షావల్లిలో 12, బ్రహ్మానందవల్లిలో 10, భృగువల్లిలో 10. వీటినే 'అనువాకాలు' అనే పేరున కూడా పిలవడం జరిగింది. అనువాకం అంటే శృతి యొక్క భాగం. శృతి అంటే విన్నది, వినడం, శబ్దం, పిలుపు అన్న అర్థాలు ఉన్నాయి. అందుచేతనే వేదాలను 'శృతులు'గా చెప్పడం జరిగింది. తేలికగా అర్థమయ్యే విధంగా, అనువాకం అంటే భాగం లేదా అధ్యాయం అని చెప్పుకోవచ్చు. మొత్తాన్ని మూడు భాగాలుగా గుర్తించాము కాబట్టి, అనువాకాలను అధ్యాయాలుగా పరిగణిద్దాం.

ఒక్కొక్క భాగంలో ఉన్న ప్రతి అధ్యాయంలో ఏమి ఉన్నది అని వరుసక్రమంలో చెప్పుకొనే బదులు, మొత్తం ఉపనిషత్తు భాగాలలో లేదా అధ్యాయాలలో ఉన్న పునరుక్తి కారణంగా, చెప్పబడిన అంశాల ప్రాధాన్యంగా, వివిధ శీర్షికల రూపంలో విషయాన్ని ఈ వ్యాసంలో వివరించడం జరిగింది. ఇంతకుముందు చెప్పుకున్నట్లు ఒకే ఉపనిషత్తు లోనే కాకుండా వివిధ ఉపనిషత్తులలో చెప్పబడిన అంశాల పరంగా చాలా పునరుక్తి ఉంది. దానినంతటిని సంగ్రహపరిచి, అసలు విషయాన్ని సూటిగా చెప్పే ప్రయత్నం ఇక్కడ చేయబడినది. తైత్తిరీయ ఉపనిషత్తులో వివరించబడిన కొన్ని ముఖ్యాంశాల వివరణ ఈ విధంగా ఉంది.

సృష్టి ఏ విధంగా జరిగింది? తైత్తిరీయోపనిషత్తు ప్రకారం ఆత్మ లేదా బ్రహ్మం నుండి ఈథర్ వెదజల్లబడింది. రసాయన శాస్త్రం ప్రకారం ఈథర్ అనేది ఆక్సిజన్, ఆల్కలిన్ లేదా అరిల్‌తో కలగలసిన రసాయనము. ఈథర్ బరువులేనిది, పారదర్శకముగా ఉండేది. రాపిడికి గురికానిది, గుర్తించవీలులేనిది, విశ్వంలో ఉన్న పదార్థం మొత్తంలో కలగలసి ఉంటుంది. అటువంటి 'ఈథర్' నుండి గాలి, గాలి నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి, భూమి నుండి వృక్షజాతులు, వాటి నుండి విత్తనాలు, వాటి నుండి మానవునికి అవసరమైన 'ఆహారం'

(Food) ఉద్భవించాయి. ఈ వివరణ చాలా సహేతుకంగా, శాస్త్రీయంగా ఉంది. మరొక వివరణ ప్రకారం విశ్వంలో దిగువన భూమి, పైన ఆకాశం, మధ్యన వాయువు ఉన్నాయి. వీటితోపాటుగా దివ్యకాంతి ఒకటి ఉంది. అందులో అగ్ని మొదటి అంశగా, సూర్యుడు చివరి అంశగా ఉన్నారు. ఈ రెండింటి సంధానకర్తగా మెరుపు, వాహకంగా ఉంది.

మాండూక్యోపనిషత్తుపై విపులమైన, విశేషమైన భాష్యం వ్రాసిన గౌడపాదుని ఉద్దేశ్యంలో విశ్వం భగవంతుని ఇష్టపూర్వకంగా సృష్టించబడింది. ఈశ్వరుడు తనను తాను అధికునిగా చూపించుకోవడం కోసం, తన ప్రాభం కోసం విశ్వాన్ని సృష్టించాడు. అదే విధంగా తన 'మాయ'ను అనేక రూపాలలో ప్రదర్శింపజేయడం కోసం విశ్వాన్ని సృష్టించాడు. ఇది అతనికి ఒక గారడి. వేరొక దృక్కోణంలో పరిణామం అనేది దైవం యొక్క సహజ స్వభావం. అందుచేత విశ్వసృష్టి జరిగింది. వీటన్నింటికంటే భిన్నమైన అభిప్రాయం ఏమనగా, విశ్వం అన్నది ఒక కల. యాదృచ్ఛికంగా ఏర్పడిన పరిణామం. ఆధునిక శాస్త్ర పరంగా చూసినా విశ్వం అన్నది ఒక పరిణామ క్రమం. ఒక పెద్ద విస్ఫోటనం ద్వారా ఏర్పడిందనదేది, కణభౌతిక శాస్త్రం, కృష్ణబిలాలుపై జరుగుతున్న పరిశోధనల ఆధారంగా నిరూపించబడింది. ఇదే మాదిరి అవగాహన ఈ ఉపనిషత్తుపరంగా కూడ ఉండడమనేది విశేషమే.

ఉపనిషత్తులలో తరచు ఉపయోగించబడే ఒక పదం 'హిరణ్యగర్భ'. దీనిని సృష్టికర్తకు పర్యాయపదంగా ఉపయోగిస్తారు. వివరణ ప్రకారం బ్రహ్మం తనను ఒక బంగారు గుడ్డు రూపంతో సృష్టించుకొన్నాడు. హిరణ్యగర్భ అనే ఈ బంగారు గుడ్డు ఒక సంవత్సరం చీకటి లేదా శూన్యంలో తేలియాడి, అటుపైన రెండు భాగాలుగా విడిపోయి ఒకటి స్వర్గంగాను, రెండవది భూమి (పృథ్వి)గాను ఏర్పడింది. బ్రహ్మమే తనను తాను ఈ బంగారుపిండం రూపంలో సృష్టించుకొన్నాడని, అతనే వేద దేవుడు లేదా 'ప్రజాపతి'గా పిలవబడుతున్నాడని తెలుస్తుంది. మత్స్య పురాణం ప్రకారం, విశ్వం అనేది ఒక గొప్ప లయ తర్వాత విస్ఫోటనం చెందింది. దానిలో భాగంగా బ్రహ్మం 'స్వయంభు'గా బంగారు గుడ్డు రూపంలో తనను తాను సృజించుకొన్నాడు.

సంహిత అంటే ఏది?

సంహిత అంటే కొన్ని అక్షరాలు లేదా మాటలు లేదా పదాల యొక్క కూర్పు. ఆ విధంగా పరిగణిస్తే ఉపనిషత్తులన్ని సంహితలే. ప్రతి ఉపనిషత్తు వేద మంత్రాల కూర్పు లేదా కలయిక. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం ఈ కూర్పులో ఐదు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి : విశ్వం %–% దీని ప్రకారం దిగువ భూమి, పైన ఆకాశం, మధ్యలో వాయువు ఉన్నాయి. రెండు : దివ్యకాంతి – ఇందులో అగ్ని మొదటి అంశగా, సూర్యుడు చివరి అంశగా, నీరు ఈ రెండింటి సంధానకర్తగా, మెరుపు దాని వాహకంగా ఉన్నాయి. మూడు : జ్ఞానం - ఇందులో బోధకుడు మొదటి అంశ. సాధకుడు లేదా విద్యార్థి రెండవ అంశ. బోధన అనేది వాహకం. నాలుగు : సంతానం. ఇందులో తల్లి మొదటి అంశ, తండ్రి చివరి అంశ. సంతానమే వీరి మధ్యన వారధి. సంతానోత్పత్తి కార్యము వాహకము. ఐదు : ఆత్మ – నోటిలోని క్రింది దవడ (Jaw) మొదటి అంశ, పై దవడ చివరి అంశ వాక్కు లేదా మాట ఫలితము. నాలుక వాహకము. ఈ విధమైన ఐదింటి కలయికే సంహిత. అదే ఉపనిషత్తు యొక్క స్వరూపము.

మాయ అంటే ఏమిటి?

ఈ పదం ఉపనిషత్తులలో, హిందూ వ్మాయంలో చాలా చోట్ల కనబడుతుంది. ఉపనిషత్తులు 'ఆత్మ జ్ఞానాన్ని నిజమైన విద్య అని, అవిద్య లేదా అజ్ఞానాన్ని, అవగాహన లేకపోవడాన్ని 'మాయ'గా చెప్పడం జరిగింది. బృహదారణ్యక ఉపనిషత్తు ప్రకారం 'ఉనికిలో లేనిది' మాయ. శ్వేతాశ్వతర ఉపనిషత్తు ప్రకారం 'ఉనికిలో లేనిది' మాయ. శ్వేతశ్వతర ఉపనిషత్తు ప్రకారం 'ప్రకృతి' మాయ. బ్రహ్మం మాంత్రికుడు. మానవులు ఈ మాయపట్ల ఆకర్షితులవుతారు. తద్వారా వారు భ్రమలకు, బంధాలకు కట్టుబడిపోతారు. ఈ మాయ తొలగిపోతే అసలైన జ్ఞానం లేదా నిజమైన జ్ఞానం బట్టబయలౌతుంది. గౌడపాదుడు తన మాండూక్యోపనిషత్తులో 'సత్', అసత్ అనే భావనలను విడమర్చి చెప్పాడు. సత్ అంటే ఉండడం. అసత్ అంటే లేకపోవడం.

వైష్ణవం ప్రకారం మాయ విష్ణువు యొక్క తొమ్మిది శక్తులలో ఒకటి. మాయ అనేది విష్ణువు యొక్క నిద్ర. దుష్టశక్తులను నాశనం చేయడానికి అవసరమైనప్పుడు విష్ణువు నిద్ర నుండి మేల్కొంటాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి మాయ గురించి వివరిస్తూ ఈ విధంగా చెబుతాడు. మానవులు మాయ యొక్క త్రిగుణాలచే

భ్రమపడి నాశనరహితుడను, శాశ్వతుడను అయిన నన్ను తెలుసుకోలేకపోతున్నారు. మాయ యొక్క మూడు గుణాలు అజ్ఞానం, మోహం, మంచితనం, ఇవి మానవ చైతన్యాన్ని కప్పి వేస్తున్నాయి. స్వల్పకాలిక శారీరక సుఖాలపట్ల ఆకర్షితులైన మానవులు నిజాన్ని గుర్తించలేకపోతున్నారు. ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతములలో కూడా ఈ భావన ఉంది. ద్వైతము ప్రకారం మాయ అనేది దేవుని శక్తి. ప్రపంచం మొత్తం దేవుని సృష్టి. అద్వైతం ప్రకారం మాయ అన్నది చైతన్యంతో కూడిన అనుభవ వాస్తవికత. మాయ మానవునికి, ప్రపంచానికి అంటే చరాచర జగత్తుకు మధ్య బంధాన్ని సృష్టిస్తుంది. ఎవరైతే ఈ బంధాన్ని ఛేదించ గలుగుతారో వారు బ్రహ్మాన్ని లేదా విశ్వాత్మను పొందుతారు. ఇక విశిష్టాద్వైతం ప్రకారం మాయ 'ప్రకృతి'. సృష్టిలో ప్రకృతియే నిజమైనది.

మాయ అన్నది జైనం, బౌద్ధంలను కూడా ఆక్రమించి ఉన్నది. జైనంలో మాయ అంటే మోసం (సమ్యక్త్వ). మానవుడు సరైన నమ్మకాన్ని చేరడంలో అడ్డుపడేది. మాయ తప్పుడు సమాచారానికి మూలం. తప్పుడు కోరికలను, చర్యలను ప్రేరేపించేది. క్రోధం, గర్వం, దురాశలతో కగలిసి మాయ మానవుని అణచివేస్తుంది. బౌద్ధం ప్రకారం మాయ అనేది మోసం లేదా వేషధారణ. అనారోగ్యమైన మానసిక కారణాలలో 'మాయ' ఒకటి. మోహం, కామం వంటి వాటితో ఇది సంబంధం కలిగి ఉంటుంది. దీనినే భ్రాంతి అని కూడా చెప్తారు. దీనికి సమాంతరమైన ఇతర భావనలైన కల, బుడగ, ఇంద్రధనుస్సు, మెరుపు, నీటిలో ప్రతిబింబించే చంద్రుడు, ఎండమావి, మాయాజాలం. భ్రమలైన వాటన్నింటి నుండి విముక్తి పొందడమే జ్ఞానం.

తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం విశ్వం యొక్క భౌతికరూపమే మాయ. విశ్వంలో ఉన్న పదార్థము, వస్తువులు, ఆకాశము, మనిషి, అన్నీ కూడా మాయ యొక్క ప్రతిరూపాలే. నృసింహ ఉత్తర తపనియ ఉపనిషత్తు మాయను గురించి ఈ విధంగా చెప్తుంది. "మాయ అన్నది చీకటి వంటిది. అదే అజ్ఞానం. అది ఉన్నట్లుగాను, లేనట్లుగాను తోస్తుంది. అది ఆత్మతో కలగలసి ఉన్నట్లు అనిపిస్తుంది. అయినప్పటికి, అది అనంతము, శాశ్వతము''. అవిద్యయే మాయ. అది నిజమైనది. ప్రతిమనిషి తన దైనందిన జీవితంలో మాయను అనుభవిస్తాడు. విశ్వం అంతా మాయతోనే నిండి ఉంటుంది. దీనిని వివరించడం కష్టం. అది ప్రతివ్యక్తి యొక్క అనుభవంలోనికి వస్తుంది. శుద్ధ చైతన్యం ద్వారా మాయ అనుభవంలోనికి వస్తుంది. మాయ అనేది ఉనికిలో లేనిది. మాయ యే మానవుని ఆత్మను ప్రకాశవంతం చేస్తుంది. మాయ ఆత్మను 'జీవుడు', 'ఈశ్వరుడు' అనే రెండుగా విభజిస్తుంది. అయినప్పటికీ అది జీవునిలోగాని, ఈశ్వరునిలోగాని ఉండదు. మాయ శుద్ధ చైతన్యంలో ఉంటుంది. దానంతట అదే ప్రకాశిస్తుంది. ఈ విధంగా విశ్వం మొత్తం మాయతో నిండి ఉంటుంది. ఎవరైతే దీనిని గురించిన పూర్తి అవగాహన కలిగి ఉంటారో వారు జ్ఞానాన్ని పొంది, బ్రహ్మాన్ని చేరతారు.

**పంచకోశాలు :** తైత్తరీయ ఉపనిషత్తులో ఇదొక ముఖ్యమైన భావన. జీవాత్మ చుట్టూ అరలు, అరలుగా అనేక తొడుగులు లేదా పొరలు ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా తెలుసుకుంటే తప్ప బ్రహ్మతత్వం బోధపడదని ఈ ఉపనిషత్తు చెపుతుంది. పంచకోశాలు అంటే అయిదు అరలు లేదా పొరలు లేదా తొడుగులు. అవి : (1) అన్నమయ కోశం (2) ప్రాణమయ కోశం (3) మనోమయ కోశం (4) విజ్ఞానమయ కోశం (5) ఆనందమయ కోశం. వీటినే మానవుని యొక్క ఐదు శరీరాలుగా చెప్పడం జరిగింది.

**అన్నమయకోశం :** ఇది బహిర్గతంగా ఉండేది. దేహాన్ని నిలుపుకోవడానికి, పోషణకు, శక్తికి ఇది అవసరం. మానవుడు అన్నం లేదా ఆహారం యొక్క సారమే. భూమిపై ఉన్న జీవజాలం అంతా ఆహారం నుండి పుట్టినదే. దానిపైన ఆధారపడే ప్రాణికోటి మనుగడ సాగిస్తున్నది. కాబట్టి ఆహారమే బ్రహ్మము. అందుచేతనే "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్న ఆర్యోక్తి బలపడింది. అదే ఔషధం. మానవుని క్షుద్బాధ(ఆకలి) నుండి విముక్తం చేసేది అన్నమే. వ్యక్తి మరణించిన తరువాత 'అన్నకోశం' దేహం నుండి విడువడుతుంది. ధ్యానించే వ్యక్తికి ఈ విధమైన స్పృహ ఉండాలి. "నేను అన్నం నుండే ఉద్భవించాను. నా ఆత్మ అన్నమే. నా ఉనికి అన్నమే. చివరకు నేను అన్నంలోనే కలిసిపోతాను". కావున అన్నమే బ్రహ్మంగా చెప్పబడు తున్నది. చనిపోయిన వ్యక్తికి పిండ ప్రధానం చేయడానికి కారణం, దేహమే అన్నమయం. ఆహారం జీవునికి ఆరు రకాలుగా ఉపయోగపడుతుందని చెప్పబడింది. ఆహారం నుండి రక్తం ఏర్పడుతుంది. రక్తం నుండి మాంసం,

మాంసం నుండి కొవ్వు, కొవ్వు నుండి బొమికలు, బొమికల నుండి మజ్జ, దాని నుండి వీర్యం ఏర్పడతాయి. పునరుత్పత్తికి ఇదే మూలం. అన్నమయ కోశంను గురించిన జ్ఞానము బ్రహ్మన్ని తెలుసుకోవడానికి మొదటి మెట్టుగా చెప్పబడింది.

**ప్రాణమయ కోశం :** ప్రాణం అన్నది జీవులందరి మనుగడకు మూలాధారం. దీని ఆసరాగానే దేవతలందరు నివశిస్తారు. దీనినే విశ్వప్రాణంగా భావిస్తారు. ప్రాణాన్నే బ్రహ్మంగా పూజించేవారు తమ పూర్తి జీవితకాలాన్ని పొందుతారు. అన్నమయ కోశం బహిర్గతంగా ఉంటే, ప్రాణమయ కోశం, లోపల, అంతర్గతంగా ఉంటుంది. ప్రతి మానవుని యొక్క శరీరంలో రెండు రకాలైన శక్తులు ఉంటాయి. అవి : జ్ఞానశక్తి, క్రియాశక్తి. ప్రాణం అన్నది క్రియాశక్తి ద్వారా ఏర్పడుతుంది. ప్రాణం ఐదు కార్యాలను నిర్వర్తిస్తుంది. అవి : ఉచ్ఛాశ్వసము, నిశ్వాసము), దీనినే అపానమని కూడా పిలుస్తారు. వ్యానము, ఉదానము మరియు సమాన శ్వాస. హృదయంలోనే ప్రాణం ఉంటుంది. గుదంలో అపానం ఉంటుంది. నాభిలో సమాన ఉంటుంది. గొంతులో ఉదానం ఉంటుంది. వ్యానం అన్నది మొత్తం దేహాన్ని ఆవరించి ఉంటుంది. ఈ విధంగా ప్రాణం మానవుని యొక్క మనుగడలో క్రియాశీలకంగా ఉంటుంది. ప్రాణం అన్నది బ్రహ్మం యొక్క నాల్గవ పాదంగా చెప్పబడింది. అదే వాక్కు . బ్రహ్మానికి మానవునికి మధ్య బంధాన్ని కుదిర్చేది ఇదే. మిగిలిన మూడు : శ్వాస, కన్ను, చెవి. ప్రాణం వాయువు ద్వారా కాంతివంతం అవుతుంది. ప్రాణం ఉన్నంతవరకే జీవిక ఉంటుంది.

**మనోమయ కోశం :** ఇది మనసుకు సంబంధించినది. సంకల్ప వికల్పాలు దీని ద్వారానే ఏర్పడతాయి. మనోమయ కోశము జ్ఞానాన్ని పొందడానికి వీలైన చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కుల ద్వారా బహిర్గత మవుతుంది. ఇవన్నీ కేవలం బాహ్య అంగాలు మాత్రమే. ప్రాణమయ కోశం యొక్క అంతర్గత రూపమే మనోమయ కోశము. ఇంద్రియాలన్నింటిలోకి మనస్సు ప్రధానంగా చెప్పబడింది. ప్రాణమయం దేహం అయితే, దాని అధిపతి మనస్సు లేదా మనోమయం.

**విజ్ఞానమయ కోశం :** మనోమయ యొక్క అంతర్గత రూపమే విజ్ఞానమయ. జ్ఞానం యొక్క స్వరూపాన్ని ఈ విజ్ఞానమయ తెలియజేస్తుంది. వ్యక్తి ఒక పనిని చేపట్టాలా? వద్దా అన్న సందేహం కలిగినపుడు, ఈ విజ్ఞాన మయ అతనికి సహాయపడుతుంది. వేదాలలో చెప్పబడిన పూజాదికాలు, కర్మకాండలు, బలిదానాలు అన్నింటికి విజ్ఞానమయమే మూలం. ఇది సత్వగుణం ప్రధానంగా కలిగి ఉంటుంది. నేను (I), నాది అన్న అహంకారాన్ని నియంత్రిస్తూ మానవుడు మంచి-చెడు, తప్పు, ఒప్పు, ఉపయోగకరమైనది. నిరుపయోగ మైనది అన్న వివేచనను ఇది కలిగిస్తుంది. అందుచేత మనిషి విచక్షణా స్వభావాన్ని కలిగి మంచిచెడులపై అవగాహనతో ఒక నిర్ణయం చేస్తాడు.

**ఆనందమయకోశం :** ఆనందమయం, విజ్ఞానమయం నుండే వెలువడుతుంది. విశ్వం యొక్క ప్రాథమిక స్వభావం ఆనందమే. దీని నుండే ప్రతిదీ సృష్టించబడినదని భావిస్తారు. మానవుల ఉనికికి ఈ కోశమే ముఖ్యము. దీనినే ఆధ్యాత్మిక లేదా కారణ శరీరం అని కూడా పిలుస్తారు. ఆనందమయకోశం అతీంద్రియ మనస్సుతో అనుసంధానించబడి ఉంటుంది. ఈ స్థితిలో మానవులు తమ ప్రవర్తనలో స్థిరంగా ఉంటారు. దేవునితో సంబంధం, ప్రకృతిపై శ్రద్ధ వంటి విషయాలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. మానవుని జీవన ప్రయాణంలో ఇదే చివరి దశ. ఆత్మ పరమాత్మలో ఐక్యమయ్యే స్థితి. దీనినే ముక్తిగా పేర్కొన్నారు. పంచకోశం యొక్క వివరణ మానవుని యొక్క అనేక స్థితులను సూక్ష్మంగా పరిశీలిస్తుంది. కావున ఈ నమూనా రోగనిర్ధారణ సాధనంగాను, చికిత్సకు సరైన మార్గం ఏర్పరచేదిగాను నిర్ధారించబడింది. ధ్యానం, యోగా వంటి సాధనాలు వీటినుండే ఉద్భవించాయని పంచకోశ సిద్ధాంతాన్ని ఎంతగా అవగాహన చేసుకుంటే అంతగా ఆనందమయ జీవితం గడపవచ్చని చెప్పబడింది. ఈ ఉపనిషత్తులో మూడవ భాగమైన 'భృగువల్లి'లో భృగును గురించిన కథ ఉన్నది. వరుణుని కుమారుడైన భృగు తన తండ్రిని బ్రహ్మతత్వాన్ని తెలియజేయమని కోరతాడు. దానికి వరుణుడు తపస్సు ద్వారా దానిని సాధించవచ్చునని చెప్తాడు. బ్రహ్మతత్వాన్ని తెలుసు కోవడానికి అవసరమైన నియమాలు, ఆచరణలు ఈ పంచ కోశాలలో ఉన్నాయని వాటి స్వాధీనం ద్వారా బ్రహ్మన్ని తెలుసుకోవచ్చని పేర్కొంటాడు. అందుచేత ఈ పంచకోశాలను గూర్చిన విచారణ అత్యంత ఆవశ్యకం.

**బ్రహ్మన్ని లేదా బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవడం :** తైత్తరీయ ఉపనిషత్తులో ముఖ్యమైన భాగం బ్రహ్మన్ని లేదా

బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవడం. మొదటి భాగమైన 'శిక్షావల్లి'లో సాధకుడు లేదా అధ్యాయి బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి అవసరమైన అర్హత ఏ విధంగా సాధించాలి అన్న అంశంగా సుదీర్ఘ వివరణ ఉంది. ప్రతిదినము వేదాలను అధ్యయనం చేయడం, పవిత్ర కార్యాచరణను ఆచరించడం, పవిత్ర గ్రంథాలను చదవడం, తప్పనిసరిగా చేయాలి. అదే విధంగా దేవతలందరికి అధిదేవుడైన విశ్వరూపుని తనకు ధ్యానం ద్వారా విజ్ఞానము, సంపద కలిగే విధంగా ఆశీర్వదించమని వేడుకోవాలి. తన దేహాన్ని ధ్యానానికి అనువుగా మలచమని, నాలుక మంచి మాటలు మాట్లాడే విధంగా చూడమని, అన్ని ఇంద్రియాలు సహకరించే విధంగా చేయమని ప్రార్థించాలి. అగ్నికి ఆవాహనం ద్వారా అన్ని రకాల సంపద ఏర్పడేటట్లు చేయమని అభ్యర్థించాలి. ఈ విధంగా సాధకుడు ముందుగా ఈ విధంగా తయారు కావాలి. బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి అవసరమైన నాలుగు అంశాలతో కూడిన ధ్యానాన్ని ఈ ఉపనిషత్తు బోధిస్తుంది. అవి : భుహ్, భువహ్, సువహ్ మరియు మహహ్. వీటిలో చివరి అంశగా బ్రహ్మం చెప్పబడింది. అదే ఆత్మగా, వివిధ దేవతలు, దేహంలోని వివిధ అంశాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రహ్మం యొక్క స్వరూపం, మార్గం, ఫలితం మొదలైన అంశాలను గూర్చిన వివరణ ఈ విధంగా ఉంది. బ్రహ్మ మనుష్యుని యొక్క హృదయ కుహరంలో నివశించి ఉంటాడు. విష్ణువు సాలగ్రామంలో ఏ విధంగా కొలువై ఉంటాడో, అదే విధంగా బ్రహ్మం మానవునిలో ఉంటాడు. ఎప్పుడైతే మానవుడు, హృదయకుహరంలో ఉన్న బ్రహ్మంను ధ్యానిస్తాడో, ఫలితంగా బ్రహ్మం సాక్షాత్కరిస్తాడు. దేహం మొత్తాన్ని ఆవహిస్తాడు. ఈ విధంగా బ్రహ్మంను ఉపాసించడాన్ని 'ధార విద్య లేదా శాండిల్య విద్య' అని కూడా పిలుస్తారు. ఇది నూతనంగా అభ్యసన మొదలు పెట్టిన అభ్యాసకులకు సాధ్యం కాదు. దీనికి ఎంతో సాధన అవసరం. బ్రహ్మంను తెలుసుకొన్న వ్యక్తి తన మనస్సుకు, బుద్ధికి, వాక్కుకు, చూపుకు తానే సర్వాధికారి అవుతాడు. ఆ విధంగా అగ్ని, వాయువు మరియు సూర్యుని (ఆదిత్యుడు) యొక్క శక్తులను తాను పొందుతాడు. ఆ విధంగా తానే బ్రహ్మం అయి నిలుస్తాడు. అదే ధ్యానం యొక్క అంతిమ ఫలితము.

బ్రహ్మం యొక్క స్వరూపాన్ని మరింత విపులంగా పేర్కొంటూ, బ్రహ్మం అనేది ఐదు పదాలతో కూడిన పంక్తిగా చెప్పబడింది. ఈ ఐదు పదాలు ఏవనగా దేవతలు, మానవులు, ప్రాణాలు, ఇంద్రియాలు, దేహంలోని భాగాలు, ఐదు దేవతల వివరణలు : అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. పంచభూతాలు ఏవనగా, నీరు, ఓషధులు, అడవిలోని చెట్లు, ఆకాశం, ఆత్మ. ఇక్కడ ఆత్మ అనగా విశ్వం యొక్క ఆత్మగా గుర్తించాలి. శరీరం ఆధారంగా మొత్తం ఐదు ధాతువులు ప్రవహిస్తుంటాయి. పైన చెప్పిన ఐదు రకాలైన ప్రకృతి అంశాలను తనలో ఇముడ్చుకొని, ధ్యానంలో ఆత్మను, పరమాత్మలో లగ్నం చేస్తాడో అతనే బ్రహ్మం లేదా ప్రజాపతి అవుతాడు.

మాండూక్యోపనిషత్తులో 'ఓం' యొక్క విశిష్టతను ఇంతకుముందు (ఏప్రిల్ సంచిక, 2025) తెలుసుకున్నాము. తైత్తిరీయ ఉపనిషత్తు కూడా 'ఓం' యొక్క ప్రాశస్త్యాన్ని, బ్రహ్మంను చేరుకోడంలో దాని ప్రాముఖ్యతను వివరిస్తుంది. తైత్తిరీయ ఉపనిషత్తు ప్రకారం 'ఓం' అంటే బ్రహ్మమే. ఓంను ఉచ్చరించడం ద్వారా సాధకుడు తన సమ్మతిని తెలియజేసిన వాడౌతాడు. బ్రహ్మం కూడా తన సమాధానాన్ని లేదా అంగీకారాన్ని ఓం ద్వారానే తెలియజేస్తాడు. వేదాలను వల్లెవేసే ముందు ఓం ద్వారానే అనుమతి కోరతాడు. అటుపైన ఓం అనే శబ్దం విశ్వమంతటా వ్యాపించి ఉన్నదని గుర్తిస్తాడు. కేవలం ఓంను ఉపాసించడం ద్వారానే గాకుండా, మానవుడు తన విద్యుక్త ధర్మాలను నెరవేర్చాలి. ధర్మాలను విస్మరిస్తే, ఉపాసన ఆశించిన ఫలితాన్ని ఒనగూడ్చదు. ఈ ధర్మాలు ఏవనగా, మంచి పనులు చేయడం, ఆలోచనలు పవిత్రంగా, సత్యంతో కూడినవై ఉండడం, వేదాలను అధ్యయనం చేయడం, తపస్సు చేయడం, ఉపవాసం ఉండడం, ఇంద్రియాలపై అదుపు కలిగి ఉండడం, నిశ్చలత్వాన్ని కలిగి ఉండడం. నైమిత్తిక కర్మలను చేయడం కూడా ఇందులోకి వస్తాయి. సందర్భాన్ని బట్టి ఆచరించే కర్మలు ఈ కోవలోకి వస్తాయి. ఉదాహరణకు, గ్రహణం రోజున ఆచరించవలసిన విధులు, పితృదేవతలకు చెల్లించే తర్పణలు, శిశువు జన్మించినప్పుడు, వ్యక్తి మరణించిన సందర్భంలో నిర్వహించే విధులు. బ్రహ్మంకు సంబంధించిన జ్ఞానం నశింపులేనిదని, దివ్యసంపదను అందిస్తుందని, సంసార వృక్షాన్ని ఛేదిస్తుందని చెప్తుంది.

బ్రహ్మమే సత్యం, జ్ఞానం, అనంతం. హృదయంలోనే బ్రహ్మం నివశించి ఉంటాడని తెలుసుకొన్నవాడుబ్రహ్మమే అవుతాడు. బ్రహ్మ విద్య అంటే ఆత్మను గురించిన శాస్త్రీయ

అవగాహనే. అజ్ఞానం పూర్తిగా తొలగిపోవాలంటే బ్రహ్మాన్ని గూర్చిన సంపూర్ణ అవగాహన ఏర్పడాలి. అజ్ఞానమే అన్ని విచారాలకు లేదా దుఃఖాలకు మూలము. సంసార బంధం నుండి విముక్తం కావాలంటే బ్రహ్మాన్ని తెలుసుకోవాలి. శుద్ధ చైతన్యం పొందినప్పుడు మాత్రమే బ్రహ్మం యొక్క తత్వం బోధపడుతుంది. ఇది ధ్యానం, నిర్వికల్ప సమాధి ద్వారా సాధ్యపడుతుంది. మొదటగా బ్రహ్మాన్ని గూర్చిన ఆలోచన చేయాలి. ఆ పైన ధ్యానించాలి. సృష్టిలో బ్రహ్మాన్ని మించినది ఏదీలేదు. అదే అన్నింట ఉత్కృష్టమైనది. మంచి, చెడులు అతనికి అంటవు, పరిమితులు లేవు, బ్రహ్మం అనంతమైనది. బ్రహ్మం యొక్క సృష్టి అయిన భ్రాంతియే మాయ. విశ్వం యొక్క పదార్థతత్వానికి ఈ మాయే కారణం. ఇది మూడు గుణాల కలయిక. ఒకటి సత్వగుణము రెండవది రజోగుణము మూడవది తమస్సు లేదా చీకటి. తమస్సు అన్నమయ కోశానికి కారణము. రజోగుణము ప్రాణమయ కోశానికి కారణము. విజ్ఞాన మయానికి సత్వగుణము కారణము. ఈ చివరి రెండింటి కలయిక ద్వారా జ్ఞానశక్తి ఏర్పడుతుంది. సత్వగుణము ఆనందమయానికి కూడా కారభూతమవుతుంది. అదే ప్రేమను, సంతోషాన్ని, ఆనందాన్ని జనింపచేస్తుంది. బ్రహ్మం యొక్క వివరణ ప్రకారం మానవుని రూపం ఈ విధంగా ఉంది : ప్రేమ తలగాను, మోదం కుడిభాగం గాను, ప్రమోదం, ఎడమభాగంగాను, ఆనందం మెండెము గాను, బ్రహ్మం తోకగాను చెప్పబడింది. ఈ తోక భాగాన్ని చేరడమే బ్రహ్మాన్ని చేరడంగా చెప్పవచ్చు.

ఎవరైతే బ్రహ్మాన్ని ఉనికిలేని దైవంగా భావిస్తాడో, అతనుకూడా ఉనికిలేని వ్యక్తి అవుతాడు. అట్లే ఉనికి ఉన్నదిగా భావిస్తే తనుకూడా ఉనికిలోనికి వస్తాడు. ఎవరికైతే బ్రహ్మం యొక్క ఉనికిని గురించి విశ్వాసం ఉండదో అతను, ఇంద్రియాలోలుడుగానే ఉంటాడు. చెడు ప్రవర్తన కలిగి ఉంటాడు. అతను కేవలం తనను భౌతికమైన దేహంగానే భావిస్తాడు. అందుచేత అతను శాశ్వతత్వాన్ని లేదా నశింపులేని స్థాయిని పొందలేడు. జనన మరణ చక్రబంధంలోనే కొట్టుమిట్టాడుతుంటాడు. బ్రహ్మాన్ని గురించిన సందేహం ఎవరికి రావలసిన అగత్యం లేదు. ఎందుచేతనంటే, బ్రహ్మం ఇంద్రియానుభవానికి లోను కానిది. ఇంద్రియాల ద్వారా దాని ఉనికిని తెలుసుకొనే వీలులేదు. బ్రహ్మమే స్థూల సూక్ష్మరూపాలుగా ఉంటాడు. కాలము, ప్రాంతము, కార్యకారణ సంబంధాలకు అతీతంగా ఉంటాడు.

ఉనికిలేని బ్రహ్మం అటుపై ఉనికిలోనికి వస్తాడు. తనను తాను సృష్టించుకుంటూపోతాడు. స్థూల, సూక్ష్మ రూపాలు ధరిస్తాడు. బ్రహ్మమే బ్రహ్మానందాన్ని అనుగ్రహిస్తాడు. ఉనికి లేనిది అంటే బహిర్గతంకానిదని అర్థం. విశ్వం యొక్క సృష్టికి ముందు, బ్రహ్మం ఈ స్థితిలో ఉంటాడు. తదుపరి క్రమేపీ తనను తాను బహిర్గతం చేసుకోవడం ప్రారంభిస్తాడు. విశ్వంలోని అన్నింటిని తానే సృజిస్తాడు. దీనినే 'సుకృత' అంటారు. అంటే మంచిపని లేదా మంచిగా చేయబడినది. బ్రహ్మం ఉన్నాడనే విషయం ఆయన క్రియల ద్వారా బహిర్గతమవుతుంది. భూమిపై మానవులు తమ తమ విధులను, క్రియలను ప్రారంభిస్తారు. బ్రహ్మమే జీవిక లేదా జీవనాధారం, అన్ని ఇంద్రియానుభవాలకు అదియే మూలం. బ్రహ్మం లేకుండా కన్ను చూడలేదు. చెవి వినలేదు. మిగిలిన అవయవాలు కూడా తమ పని తాము చేయలేవు. బ్రహ్మమే లోకానికి సంతోషాన్ని లేదా ఆనందాన్ని తెస్తాడు. అజ్ఞానం వల్లనే భయం జనిస్తుంది. దేహానికి అంటిపెట్టుకొని ఉన్న జీవుడు, క్రమేపీ భయాన్ని చెందుతాడు. ప్రాణం లేదా చైతన్యం దేహాన్ని వదలిన మరుక్షణం, తాను శవంగా మారతాననే స్పృహ కలుగుతుంది. దాని వలన భయం ఏర్పడుతుంది. వేరొక అర్థంలో భయం అన్నది ద్వంద్వ భావన ఉన్నందు వలన కూడా ఏర్పడుతుంది. అంటే తాను వేరు, బ్రహ్మం లేదా సృష్టికర్త వేరు అన్నది. సృష్టిలో వేరొక వ్యక్తి లేదా వస్తువు ఉన్నదనే భావన భయానికి మూలమన్నది ఈ ఉపనిషత్తులో భావన. తైత్తిరీయ ఉపనిషత్తు మూడవ భాగమైన భృగువల్లిలోని పదవ అనువాకంతో ముగుస్తుంది. ఈ అనువాకంలో విశ్వప్రార్థన ఉంది. అది ఈ విధంగా సాగుతుంది.''మంచి హృదయాన్ని, మంచి బుద్ధిని, నమ్మకాన్ని, భక్తిని, తెలివిని ఇవ్వమని, ఆధ్యాత్మిక బలాన్ని ఇవ్వమని, మనస్సుపై నియంత్రణ చేకూరాలని, దురాశ,కామం, కోపం, అసూయ వంటివి అన్ని నశించి దివ్యసుగుణాలు కలగాలి".

స్వస్తి! ఓం శాంతి! ఓం శాంతి!! ఓం శాంతిః!!

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

# లలిత సంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

**9. పాడకే నా రాణి**

రచన : అడవి బాపిరాజు

సంగీతం, గానం : ఘంటసాల

నఠభైరవి–ఝంప

**పాడకే నారాణీ! పాడకే పాట**

**పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే ॥పాడకే॥**

1. రాగమాలాపించి వాగులా ప్రవహించి
సుడిచుట్టు గీతాల సురిగిపోనీయకే ॥పాడకే॥

2. కల్హార ముకుళములు కదలినవి పెదవులు
ప్రణయపద మంత్రాల బంధించె జీవనము ॥పాడకే॥

3. శ్రుతిలేని నా మదికి చతురగీతాలేల?
గతిరాని పాదాల గతుల నృత్యమ్మటే ॥పాడకే॥

**భావం :** రాణీ! నా రాణీ! నీ పాట మాధుర్యానికి నా ప్రాణాలు మరిగిపోతున్నాయి. ఈ సౌఖ్యాన్ని భరించలేను. పాడకు, పాట పాడకు. రాగాన్ని, వాగులా నా చుట్టూ ప్రవహిస్తూ, అందులో సుడులు సుడులుగా తిరిగే పాటలతో నన్ను అదృశ్యపరచకు. సౌగంధికపు పూమొగ్గలవంటి నీ పెదవులు కదిలి ప్రణయ మంత్రాలను ఉచ్చరిస్తూ నా జీవితాన్ని బంధిస్తున్నాయి. శ్రుతి తెలియని నా హృదయానికి ఇంత చక్కని గీతాలేం తెలుస్తాయి? నడక రాని పాదాలకు నృత్యగతులు వస్తాయా?

**అర్థాలు :** మరిగె = కాగెను, రుచిపొందెను; సురిగిపోవు = అదృశ్యమగు; కల్హారము = ఎరుపు, తెలుపు కలగలిసిన కలువపువ్వు, సౌగంధికాపుష్పం; ముకుళం = మొగ్గ; చతురము = నేర్పు. ఇది కూడ అడవి బాపిరాజుగారి "శశికళ" గేయకావ్యంనుండే స్వీకరింప బడింది. బాపిరాజు గారి సమకాలికులైన మరో మధురభావ కవివర్యులు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఆలోచనకిది సమాంతరంగా ఉండడం గమనించండి.

**"మ్రోయింపకోయ్ మురళి**
**మ్రోయింపకోయ్ కృష్ణా!**
**తీయ తేనియ బరువు**
**మోయలేదీ బ్రతుకు" అంటారు కృష్ణశాస్త్రిగారు.**

**విపరీతమైన విషాదాన్ని ఎలాగైతే భరింపలేమో,** అంతులేని సౌఖ్యాన్ని కూడా భరింపలేమన్న మానవనైజాన్ని కవితీకరిస్తే అలా సుశ్రావ్యమైన పాటగా మారుతుం దన్నమాట! మనం నిత్యజీవితంలోని కొన్ని సందర్భాలలో "ఇంత మంచితనాన్ని నేను భరించలేను" అని అనుకోవడం మన అనుభవంలో ఉన్నదేకదా! అలాగే కృష్ణుని మురళీగానమాధుర్యాన్ని అతిగా ఆస్వాదించి,భరించలేని స్థితికి వచ్చారొకరు. ప్రియురాలి పాట మాధుర్యానికి మురిసిపోతున్నారింకొకరు. అందుకే ఈ భావుకుడు "పాడకే నా రాణి" అంటూ తాను పాడాడు. ఆ రాణిని ఎందుకు పాడవద్దంటున్నాడో మూడు చరణాల్లో ముచ్చటగా చెప్పారు. అపురూప పదప్రయోగాలను, సాభిప్రాయ పదనిర్మాణాలను పరిచయం చేయడంలో సిద్ధహస్తులు బాపిరాజుగారు.

'ప్రాణాలు మరిగాయ'ట. అంటే మసిలిపోతున్నాయా, లేక ఆ పాటకు ఈ ప్రాణాలు రుచిమరిగాయా? ఏదన్నా అనుకోవచ్చు. ఆ రాణి రాగం ఆలపించి,వాగులా మారిపోయిందని ఒక్కసారి ఊహించుకోండి. ఎంత మనోహరమైన ఉత్ప్రేక్ష ఇది ! ఎన్ని మురిపాల అతిశయోక్తులు సాక్షాత్కరిస్తాయో కదా! వనితల పెదవులను దొండపండ్లతోనో, పగడాలతోనో సరిపోల్చడం సాధారణ కవిసమయం. మరి ఈయన అసాధారణకవిగదా! ఎరుపు,తెలుపు కలగలిసిన కలువ మొగ్గలలాగా పెదవులున్నాయని చెప్పడం ఎంత సుందరమో గమనించండి. శ్రుతిలేని వాడికి పాటలెందుకు? నడక రాని వాడికి నాట్యమెందుకు? అంటే, ఆమెలోని కళాప్రావీణ్యాన్ని అందుకోగలిగే అర్హత తన హృదయానికి లేదని ఈ భావుకుని భావన. ఘంటసాల మేష్టారు ఈ పాటను హిందూస్తానీ సంప్రదాయానికి చెందిన అసావరి రాగంలో, ఝంప తాళంలో బాణీ సమకూర్చారు. ఈ రాగాన్ని కర్ణాటక సంగీత సంప్రదాయంలో 'నఠభైరవి'అని పిలుస్తారు. దీనికి సంబంధించిన వివరాలను డా॥ఎం.చిత్తరంజన్‌గారు 'హాసం' వ్యాసంలో చెప్పారు. నఠభైరవి రాగాన్ని ప్రధానంగా అనుసరిస్తూనే ఘంటసాల అసావరి రాగపు పోకడలను

అక్కడక్కడా స్పృశించారు. 'సారిమగమగ సారిగప నిదనిదపా దా...మగపా' అనేప్రయోగాలను తరచుగా ప్రయోగిస్తూ శాస్త్రీయరాగాన్ని లలితమనోహరంగా ప్రదర్శించారు. అయితే నేపథ్యసంగీతంలో 'నిదనిద నిసదనిప' అనే సంచారంలో అసావరిని స్పష్టంగా చూపారు. "వారసత్వం' సినిమాలోని 'ప్రేయసీ మనోహరీ' పాట వినండి, ఈ పాట స్వరూపం సంపూర్ణంగా ప్రత్యక్షమవుతుంది. ఆయన అభిమాన రాగాల్లో ఇది కూడా ఒకటి. దీనికి చాలా దగ్గరగా ఉండే 'రాగేశ్వరి' రాగం అంటే ఆయనకు మరీ పిచ్చిప్రేమ. పాటముందు, పాట చివరలలో సాకీలు పాడడం బహుశా ఘంటసాలలోనే మనం ఎక్కువగా చూస్తాము. ఈ లక్షణం సాలూరు రాజేశ్వరరావుగారిలో కొంత కనిపిస్తుంది. కాని ఎక్కువగా 'సాకీ' ని ప్రేమించినవారు ఘంటసాల మాష్టారే. ఇప్పటికీ నేటి సినిమా పాటలలో ముఖ్యంగా హిందీ పాటలలో ఈ సాకీ ఎక్కువగా సాగడం గమనిస్తే విచిత్రమనిపిస్తుంది.

ఈ పాటకు ముందు 'సాకీ' ఆలాపనలో 'రాణి' పదంమీద ఇచ్చిన గమకం అనితరసాధ్యం. అది ఆయన సంతకం. నేపథ్యసంగీతంలో వయొలిన్స్, వేణువు, క్లారియోనెట్, గిటార్‌లను ఎంతో చక్కగా ఉపయోగించు కున్నారు. చరణాల ముందు ఇచ్చే బిట్‌వర్క్‌లో కౌంటర్‌ను కూడా పొదిగారు. అన్ని చరణాలకు ఒకే తీరుగా సమకూర్చారు. పాటతోపాటు వయొలిన్స్ అనుసరించడం విశేషం. మూడవ చరణంలోని రెండవ భాగంలో "గతుల నృత్యమ్మటే" ను ఒక అక్షరం జాగా వదిలి, గతుల దగ్గర ఆగి పాడితే పదాలు సహజసిద్ధంగా ఉండేవి. కాని ఈ విధానం పూర్తిగా శాస్త్రీయమైపోయి, అనుసరించడానికి క్లిష్టంగా ఉంటుందని భావించారేమో ! 'గతుల' ను సమంలో అందుకుని "నృత్యమ్మటే' అని పాడాల్సివచ్చింది. సామాన్యప్రజలకు కష్టం కలిగించకూడదన్న ఆయన అభిమతమే దీనికి ఆధిపత్యం వహించింది. 'పాడకే' అంటూ సాకీతో హాయిగా ముగించారు.

**10. బహుదూరపు బాటసారి**

**రచన సంగీతం, గానం : ఘంటసాల**

<u>**కల్యాణి-తిశ్ర గతి**</u>

**వచ॥మృతి అంటే భయంలేనటువంటి వ్యక్తి పాడుతున్న పాట**

**బహుదూరపు బాటసారీ!**

**ఇటు రావో ఒక్కసారి ॥బహు॥**

1. అర్ధరాత్రి పయనమేలనోయీ?
పెను తుఫాను రేగనున్నదోయీ
నా కుటీరమిదేనోయ్, విశ్రమింప రావోయి
వేకువనే పోదమోయ్ ॥బహు॥

2. పయనమెచటికోయి ఈ
పయనమెచటికోయి? నీ
దేశమేనటోయీ?
నా ఆశలు తీరునోయి
నీతో గొనిపోవోయ్ ॥బహు॥

**భావం :** చాలా దూరం వెళ్ళాలనుకుంటూ సాగిపోతున్న బాటసారీ! ఒక్కసారి ఇటు రావయ్యా! ఇంత అర్ధరాత్రి ప్రయాణం చేయడం ఎందుకు? బైట తుఫాను వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిగో ఇదే నా కుటీరం. ఈ రాత్రి ఇక్కడనే విశ్రమించు. తెల్లవారిన తరువాత ఇద్దరం కలిసి వెళదాం. అయినా నీ ప్రయాణం ఎక్కడికి? నీ దేశానికే గదా! నీతోపాటు నన్నూ తీసుకుని వెళ్ళు, నా ఆశలు తీరిపోతాయి.

**అర్థాలు :** రేగుట = పెరుగుట, వేకువ = ఉదయం, విశ్రమించు = విశ్రాంతి తీసుకో. దీన్ని 1948లో రాసినట్లు ఘంటసాల ఓ రేడియో కార్యక్రమంలో చెప్పారు. లభించినంతవరకు చూస్తే ఘంటసాలగారి రచనలు దీంతోపాటు మొత్తం 15 దాకా ఉన్నాయి. దొరకనివి ఇంకెన్నో! ఆ పాటలున్న డైరీ కోసం సావిత్రమ్మగారు ఇంకా అన్వేషిస్తున్నారు. పేరుకివి లలితగీతాలే అయినా ఒక్కటి కూడా సంతోషంతో రాసింది కాదు (ఎంతహాయి-67 తప్ప). ఎంతో సున్నితమైన మనస్సు కలవారు కనుక ఆ మనస్సు చితికినప్పుడో, కలవరపడినప్పుడో, నిరాశానిస్పృహలతో విసిగిపోయినప్పుడో, అనారోగ్యం విజృంభించినప్పుడో భావనిర్భరస్థితిలో ఈ పాటలు పుట్టాయని ప్రతి పాటా సాక్ష్యమిస్తున్నది. అయితే నైరాశ్యం, లేకపోతే వైరాగ్యం ఈ రెండే ఆయన పాటల మీద దాడి చేశాయి. ఈ పాటల్లో రికార్డుగా లభించినవి ఐదు, వాద్యరహితంగా పాడింది ఒకటి. ఈ ఆరు మాత్రమే ఆయన కంఠంనుండి వినగలుగుతాం. వీటిలో ఏదైనా వెండితెరకు ఎక్కివుంటే ఇంకెంత బాగుండేదో అని వీటిని విన్నప్పుడు అభిమానులకు అనిపించకపోదు. అయితే ఆ మాటే ఘంటసాలతో ఎవరో అన్నారట. అందుకాయన ''సముద్రాలగారిలాంటి మహారచయితలుండగా నేను రాయడమేమిటి?" అన్నారట

వినయంగా. అని సావిత్రమ్మ గారు గుర్తుచేసుకుంటూ చెప్పారు. ఘంటసాల రచనల్లో బాగా ప్రసిద్ధమైన మొదటి పాట ఇది. ఘంటసాలగారు మద్రాసుకు వచ్చిన తొలినాటి కాలంలో ఓసారి ఆయన శోభనాచల స్టూడియోలో ఉండగా, అర్ధరాత్రి వేళ పెట్రోమాక్స్ లైట్లతో ఒక శవాన్ని శ్మశానానికి తీసుకువెళ్ళడం కనిపించింది. ఆ దృశ్యమే ఈ పాటకు ప్రేరణ అయింది. ('మీ ఘంటసాల'-పి.సంగీతరావు పుట నెం.84)

రాయప్రోలు, దేవులపల్లి మొదలైన మహాకవుల 'భావకవిత్వప్రభావం' ఈ పాటమీద ఎక్కువగా కనిపిస్తున్నది. కనుక దీన్ని ఎవరికి తోచినట్లు వారు వ్యాఖ్యానించుకునే వీలుంది. అన్ని రకాల దారులు ఈ పాటలో కనిపిస్తాయి. ''దారిన పోయే ప్రయాణీకుడు'' అనే భౌతికార్థంలో తీసుకుంటే, బాటసారి వెంటబడి పోతానన్న సామాన్యుడే కనిపిస్తాడు. తన కుటీరం ముందునుండి వెళుతున్న ఎవరో బాటసారిని కుటీరయజమాని ఆపాడు. సాటి మనిషిమీద ఉండే ప్రేమతో ఇంత అర్ధరాత్రి ప్రయాణం ఎందుకు? నాయింట్లో ఉండు. ప్రొద్దునే ఇద్దరం కలిసి వెళదాం. నీ దేశానికి వస్తే నాకున్న ఆశలన్నీ తీరిపోతాయి. అని యిలా మామూలుగా చెప్పుకుంటూ పోవచ్చు. కాని పాటకు ముందుగా మేష్టారు, తన పాటరచనలోని వస్తువును ఒక వాక్యంలో సూచించారు. 'మృతి అంటే భయంలేని........' అనడం వలన ఇది ఖచ్చితంగా తాత్త్వికమే అని చెప్పక తప్పదు. కాబట్టి దీన్ని తాత్త్వికదృక్పథంతోనే అర్థం చేసుకోవాలి.

బహుదూరం అంటే, స్వర్గం లేదా మోక్షం. అంతకంటె దూరం ఇంకేదీ ఉండదు. అందరూ ఎప్పుడో ఒకప్పుడు అక్కడికి వెళ్ళవలసినవారే కాని అర్ధరాత్రి అంటే నడిమి ప్రాయంలో వెళ్ళాలనుకోరు. అందుకే పూర్తిగా బ్రతుకు తెల్లారేదాక, అవతారలక్ష్యం తీరేదాక విశ్రమించి వెళదాం అన్నారు. అంతా మన చేతుల్లోనే ఉన్నట్లు ఒక ఊహ. నీ దేశమైనా, నా దేశమైనా ఒకటే దేశం. అదే పరలోకం, పరమలోకం. భూమిమీద ఆశలుంటే అక్కడికి వెళ్ళలేం. అక్కడికి వెళ్ళాక, మోక్షం కావాలన్న ఆశ తీరుతుంది. వెళుతున్న సాటి జీవిని తననూ అక్కడికే తీసుకుపొమ్మని ప్రార్థిస్తున్న ఒక ఆత్మఘోష ఈ పాటంతా వెన్నెల్లాగా పరుచుకుంది. చిన్న చిన్న, సరళమైన పదాలతో, లోతైన తత్త్వరహస్యాన్ని ఇమిడ్చి రచించిన మేష్టారు, నిజంగా ఆ బాటసారితో కాదు, అతనికంటె ముందే, తెల్లవారకుండా అర్ధరాత్రిలోనే (మధ్య వయస్సులోనే) వెళ్ళిపోయిన 'బహుదూరపు బాటసారి' అయ్యారు.

ఈ ఆధునిక లలితసంగీత వాగ్గేయకారుడు తనకు బాగా ఇష్టమైన కల్యాణిరాగంలో, త్రిశ్రగతిలో దీనికి బాణీచేసి మధురంగా ఆలపించారు. సాకీ ప్రారంభం కాకముందు పియానో, వయొలిన్, తార్‌శహనాయ్ లాంటి వాద్యాలతో ఉదాత్తమైన స్వరలహరులు శ్రోతలను చల్లగా పలకరిస్తాయి. వాటితోపాటు 'వచనం', దానివెంట సాకీ హాయిగా వినిపిస్తాయి. పదాన్ని స్వరంలో వినిపించడం, స్వరాన్ని పదంలో పొదగడం మేష్టారిలో ఉన్న ఒక గొప్ప ఆదర్శపూర్వకమైన అలవాటు. 'బహుదూరపు' అనడంలో 'దూరాన్ని' చూపిస్తూ ఆధారషడ్జమంనుండి తారషడ్జమం వైపు నడిపిస్తారు. ఈ రెండింటి మధ్య ఏడు స్వరాల దూరం ఉందిమరి! 'పెను తుఫాను రేగనున్నదోయి' దగ్గర ఇచ్చిన వాద్యసంగీతం రెండు ఆవర్తాలలో అర్ధరాత్రి,తుఫానులను చిత్రించింది. 'విశ్రమింప రావోయి' లో 'రావోయి' ని రెండోసారి అద్భుతమైన సంగతితో పాడారు. రెండు చరణాలకు వేర్వేరు రీతులతో 'బిట్‌వర్క్' ను సమకూర్చారు. గానంలో కాకుండా వాద్యసంగీతంలో మాత్రం శుద్ధమధ్యమ, సాధారణగాంధారాలను కలుపుకుంటూ 'బిట్' ను ఏర్పరచడం ఆయన వైదుష్యానికి ఒక ప్రశంసాపత్రం. ముగింపులో 'బాటసారీ, ఒక్కసారీ' లను సాకీగా పాడడమే కాక వాద్యసంగీతపు వరసనుకూడ ఏర్పరచడం చెప్పుకోదగ్గ విశేషం. ఘంటసాల గానంలోనూ, బాణీలోనూ ఒక స్పష్టమైన స్వరశిల్పం, పరిపక్వత ఈ పాటలో నిండుగా కనిపిస్తాయి. మేష్టారి సహాయకులలో ఒకరైన ఎం.రంగారావుగారు ఈ పాటను రికార్డు చేయిస్తూ, ''రెండోవైపు 'మరణసమయుమిదియే' అనే మరో స్వీయరచనను కూడ రికార్డు చేద్దాం" అన్నారు. దానికి మేష్టారు ఇష్టపడక " ఇవి పరస్పరం జతకావు, వేరే పాట చేద్దాం"అంటూ కొనకళ్ళవారి 'రావోయి బంగారి మామా' పాటను చేశారు. అది ఆయనలోని విజ్ఞత. ఈ విషయాన్ని కూడా సావిత్రమ్మగారు ఓ సందర్భంలో చెప్పారు. 1951-52ల మధ్య ఈ పాట గ్రామఫోన్ రికార్డుగా వచ్చింది.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# పరిమళించే పద్యం

– ఆచార్య పి హరినాథ్

**జయంతి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః**
**నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయం**

"రససిద్ధులైన కవులకు జయము. వారి కీర్తి శరీరానికి ముసలితనం లేదు మరణంలేదు." శతాబ్దాల క్రితం భర్తృహరి చెప్పిన మాటలు నేటికీ హృదయంలో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. అలాంటి కవులను కీర్తించే గాథలెన్నో ఉన్నాయి.

కాళిదాస మహాకవి తొలిసారిగా భోజ దర్శనానికి వెళ్ళినప్పుడు ఒక సంఘటన జరిగింది. భోజుని చూడగానే కవి ఒక అందమైన శ్లోకం చెప్పాడు భోజుడు ఎడమొగం చేసి కూర్చున్నాడు. కాళిదాసు మనస్సు చివుక్కుమంది. ఈ శ్లోకం నచ్చలేదేమో అనుకుని అంతకంటే అందమైన శ్లోకం చెప్పాడు. మహారాజు పెడముగం పెట్టాడు. బహుశా ఈ శ్లోకంలో రసజ్ఞత చాలదేమో అనుకుని ఇంకో అపూర్వ భావనరమ్యమైన శ్లోకం చెప్పాడు. రసజ్ఞశేఖరుడైన బోజుడు సింహాసనం నుంచి లేచి కిందికి దిగాడు. నేరుగా కాళిదాసు వద్దకు వచ్చి రెండు భుజాలను పట్టుకుని చిరునవ్వుతో కళ్ళలోకి చూశాడు. పొంగిపోతున్న ఆనందంతో అన్నాడు:

మహాకవి నీ ఒక్కొక్క శ్లోకానికి నా రాజ్యంలోని ఒక్కొక్క దిక్కును సమర్పించుకున్నాను. ఇక నావద్ద ఇవ్వడానికి ఏమీలేదు. నా రాజ్యాన్ని నీకు ఇస్తున్నాను. సింహాసనాన్ని అధిష్ఠించు కవీశ్వరా నా ఆస్థానాన్ని అలంకరించు అది కవి శక్తి కవినోట ఒకమాట దొర్లితే అది కలకాలం నిలబడి పోతుంది. మామూలు మనుషులు కాగితాలపై రాస్తారు. మహాకవులు జనం నాలుకల మీద రాస్తారు. అవి మరువని కథలు. చెరగని సుధలు. తరగని నిధులు. గుడి కూలిపోవచ్చు, నుయ్యి పూడిపోవచ్చు, చెరువుగట్టు తెగిపోవచ్చు, అడవులు మాడిపోవచ్చు, కానీ చెడనిది పద్యం ఒకటే – అని కుడి ఎడమల కీర్తికన్న గువ్వల చెన్నడు అన్నాడు. పద్యం ఎప్పటికీ నిలబడి ఉంటుంది అది కవిత్వానికి ఉన్న విలువ. దీన్ని మనకు అందిస్తూ ఏనుగు లక్ష్మణకవి అందమైన కందంతో విందు చేశాడు.

**సుకృతాత్ములు రససిద్ధులు**
**సుకవీంద్రులు విజయనిధులు సుమ్ము తదీయా**
**ధిక కీర్తి శరీరంబులు**
**ప్రకట జరా మరణ జన్మ భయ రహితంబుల్**

అలాంటి మహాకవులకు మాటే మంత్రం. మీమాటలు మంత్రంబులు, మీమెట్టిన యెడప్రయాగ అని ప్రవరుడు సిద్ధుడితో అనడంలో రహస్యమదే. మనిషికున్న ఆభరణాలు అన్నింటిలోకి మాట గొప్పది–అంటాడు కవి.

**కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలాం**
**న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః**
**వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతాధార్యతే**
**క్షీయంతే ఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం**

పురుషులకు అందం ఇచ్చేది మాట (ఇక్కడ పురుష అంటే కేవలం మగవాళ్ళు అని కాదు. జీవి అని అర్థం. ఉద్యోగం పురుష లక్షణం అన్నప్పుడు కూడా విశాలార్థంలో "ప్రయత్నించడం జీవలక్షణం" అనే తప్ప స్త్రీపురుష భేదం కాదు) కేయూరం అంటే మోచేతులకు భుజానికి మధ్య ధరించే ఆభరణం. అవి సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి. వాటిని భుజానికి కట్టుకుంటారు. అలాగే, వెలిగిపోయే చంద్రహారాలు తేజస్సును అధికంగా చేస్తాయి. వాటిని కంఠాభరణంగా ధరిస్తారు. పచ్చ కర్పూరం కస్తూరి వంటి సుగంధ జలాలలో స్నానాలు చేస్తారు. పరిమళాలను ఇచ్చే లేపనాలు ఒంటికి పూసుకుంటారు. తలలో మల్లెలు, సంపెగలు, మరువాలు ధరిస్తారు. ఇవన్నీ అలంకారం కోసం మనుషులు చేస్తారు. కానీ ఇవేవీ పెద్దగా అందం ఇవ్వవు. మనిషి ధరించిన అన్ని ఆభరణాలు ఏదో ఒవిధంగా నశించిపోతాయి. కేయూరాలు మాసిపోతాయి. హారాలు జారిపోతాయి. పుష్పాలు వాడిపోతాయి. లేపనాలు వీడిపోతాయి. ఇక మిగిలింది ఏమిటి? అందమైన మాట ఒక్కటే మిగులుతుంది – సంస్కారబద్ధంగా ఉండే మాట నిలబడుతుంది–అదే నిజమైన అలంకారం అని కవి అంటున్నాడు. ఈశ్లోకంలోని 'వాగ్భూషణంభూషణం' అనేది శతాబ్దాలుగా ఒక లోకోక్తిగా మారిపోయింది. ఏనుగు లక్ష్మణకవి దీన్ని ఆంధ్రీకరిస్తూ

**భూషలు గావు మర్త్యులకు భూరి మయాంగద తార హారముల్**
**భూషిత కేశపాశ మృదుపుష్ప సుగంధజలాభిషేకముల్**
**భూషలు గావు పూరుషుని భూషితు జేయు బవిత్ర వాణి వా**
**గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్**

అని స్పష్టం చేశాడు విశిష్ట శక్తి నిచ్చేది విద్య. ఈ శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? దీనికోసం ఎక్కడ వెతకాలి? కన్నడ భాషలో ఒక సామెత ఉంది" దేశనోడికోశ ఓది" అని. శాస్త్రాలను చదవాలి, దేశాలను చూడాలి. అప్పుడు తెలిసివస్తుంది. విద్ అంటే తెలియడం. అలా తెలిసి వచ్చినది 'విద్య'. ఏదైనా ఒక అంశం గురించి తెలిసి ఉండడమే విద్య. అందుకే కవి అంటాడు

**విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం**
**విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః**
**విద్యా బంధుజనో విదేశ గమనే విద్యా పరా దేవతా**
**విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యా విహీనః పశుః**

మనుషులకు విద్య అనేది అపూర్వమైన అందాన్నిస్తుంది. ఇది రహస్యంగా దాచబడిన గుప్తనిధి లాంటిది. విద్యవల్ల భోగాలు కలుగుతాయి. సుఖాలు లభిస్తాయి. దీనివల్ల కీర్తి కలుగుతుంది. పదిమంది చెప్పుకుంటారు. మహా గురువులకు కూడా దిశానిర్దేశం చేసేది విద్య. విదేశాలకు వెళ్ళినప్పుడు-అంటే-తన ప్రాంతాన్ని విడిచి మరో అన్య ప్రాంతానికి వెళ్ళినప్పుడు బంధువులా తోడు నిలబడేది విద్య. తాను కోరుకున్నదల్లా ప్రసాదించే మహాశక్తి విద్య. అందుకే అదిదైవం. దానితో సమానమైన ధనం ఏముంటుంది? అది రాజసన్మానాలను అందుకుంటుంది. ఒక మహాకవి, శిల్పి, గాయకుడు-వీరంతా విద్యావంతులే. వారి విద్యలో వారు ప్రవీణులు. వీరి మహావిద్యా ప్రభావం ఎప్పటికీ నిలబడి ఉంటుంది. అలాంటి విద్యను తెలియని వాళ్లని ఏమనగలం? మనిషి అని ఎలా అనగలం? పశువనాల్సిందే - అంటాడు కవి. దీనికి అందమైన ఆంధ్రీకరణ ఎప్పటికీ నిలబడిపోయే పద్యం శ్రీ ఏనుగుల లక్ష్మణకవి గారిది

**విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్**
**విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్**
**విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లేదిలన్**
**విద్య నృపాల పూజితము విద్య నెరుంగని వాడు మర్త్యుడే**

ఆచార్య పి. హరినాథ్,
మైసూర్, ఫోన్ : 9480443108

## కమ్మతెమ్మెరలు

**దుగ్గాడ గేట్ - లాండ్ లైన్ కాల్**

"నమస్కారం రామరాజు గారు! మీతో మాట్లాడవచ్చా?" ఒక తెలియని లాండ్ లైన్ కోడ్-040 తెలిసిన గొంతులా పలకిరించారు. మీరు వ్రాసిన వ్యాసం 'బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్ 78 బ్యాచ్' పై లింక్‌లు బాగున్నాయని అన్నారు. ముందరగా ఆ 78 బందం బ్యాచ్ వారు ఎవరైనా ఏమోయని అనుకొన్నాను. అంతలోనే నేను కాంతారావుని ఆల్వాల్ నుండి మాట్లాడుతున్నానని అన్నారు. అయ్యా! నేను గతనెల మీ సరస్వతీ మహల్‌లో-**మిసిమి** బృందంతో మీ ఆతిధ్యం స్వీకరించానని అన్నాను. ఆ విషయం అంతగా పట్టించుకోక "మీరు అగ్రికల్చరల్ కాలేజ్ 78 బ్యాచ్‌లో ఉన్నారా?" యని ప్రశ్నించారు." "లేదండి అది **మిసిమి** ఇచ్చిన అసైన్ మెంట్. గాలినుండి ఆక్సిజన్ తీయడం మామూలే సార్! అసలు విలువైన సంబందం స్వచ్ఛమైన హైడ్రోజన్ మంటలో కాలాలని" సినీసోదిగా అన్నాను.

"ఏమటండీ! హేమంత్ అంతలా మహమ్మద్ రఫీ పాటలు పాడారా! అశ్విని గారికి అంత నచ్చాయంటే-నాకూ పువ్వులుగా గుచ్చుతున్నాయి, వివరంగా చెప్పరూ?" అవతల ఆల్వాల్ నుండి అడిగారు. "సార్! అన్నీ నాకు తెలియవు. అశ్విని సార్ నాకు అంటించి వదిలారు, బాపట్ల కాలేజ్ దరిదాపు తెలియదు, ఎక్కడో అమెరికాలో "హేమంతం" కూడా తెలియదు-**మిసిమి**నే అడగగలరు" సవినయంగా-ఆ వినియభూషణుడికి విన్నవించుకొన్నాను. "నేను ప్రతి సంవత్సరం మహమ్మద్ రఫీ పేరిట ఒక అవార్డ్ ఇస్తూ-పాత బస్తీలో ఏర్పాటు చేసుకొని స్మరణగా ఒక కళాకారునికి సన్మానం చేసుకొంటాం"-దుగ్గాడ గేట్ (పిఠాపురం పవనంలో) మా తోడల్లుడిగారి తోటలో ఉన్న నాకు-వచ్చేపోయే రైళ్ల కూతల కేకలలో సరిగ్గా వినేలోపు-"అశ్విని గారికి ఫోన్ చేసి ఆయన **మిసిమి** ఆఫీస్ కాలాన్ని వృధా చేయను, వచ్చి మాట్లాడుతాను" అని నమస్కారాలతో ఉంటానని ముగించారు-ఆయనే స్వచ్ఛమైన తెలంగాణా నివాసి-తెలుగు సంస్కృతికి+ భారత సంపూర్తికి నిలువటెట్టు అద్దం-శ్రీ యం.యల్. కాంతారావు గారు. **మిసిమి** టీం చదువరులకు ఒక ఫోన్ కాల్ గా !

- *ఐ.వి. రామరాజు, 9912644386.*

# ట్యునీసియా - 2

**ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు**
**తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ**



సిడి బో సెయిద్, ట్యునీసియా

**సిడి బో సెయిద్ :** ట్యునిస్ నగరానికి ఉత్తర దిశగా, 20 కి.మీ. దూరంలో, ఒక కొండవాలు మీద మధ్యధరా సముద్రంలోకి జారి పోతున్నట్టు ఒక అందమైన ప్రదేశం ఉంది. 13 వ శతాబ్దానికి చెందిన సూఫీ ఫకీర్, బో సెయిద్ గౌరవార్థం, ఈ గ్రామాన్ని 'సిడి బో సెయిద్' అని పిలుస్తారు. ఈ నాటికీ, ఈయన స్థానికులకుఆరాధ్యుడు. అక్కడకు వెళ్ళగానే, మామూలుగా చాలా దేశాలు, సంస్కృతులలో కనపడే కట్టుబాట్లలో ఇమడని స్వేచ్ఛా పూరిత కళాత్మక వాతావరణం తాలూకు ప్రకంపనలేవో మమ్మల్ని తాకాయి. సముద్రపు చల్లగాలి తగిలి, ప్రతాపాన్ని తగ్గించుకున్నట్లున్న శీతాకాలపు మధ్యాహ్న సూర్యుడు, వీధులకిరువైపులా బారులు తీరిన చక్కని, చిన్న చిన్న దుకాణాలు... ఓహ్! మనోహరంగా మా అందరి మనసు దోచేసింది ఈ ముచ్చటైన గ్రామం. అనుకోకుండా తారసిల్లిన ఈ గ్రామం, సముద్రపు నురుగుతో చెలిమి కోసం గోడలకు, గోపురాలకు తెలుపురంగు పులుముకుని, అంబర గౌరవార్థం తలుపులూ కిటికీలకు నీలిరంగులు పూసుకుంది. అంతటా క్రమం తప్పకుండా అలముకున్న ఈ రెండు రంగులూ, సాగరంతో సంగమిస్తున్న అంబరపు సంబరం ఇక్కడి గ్రామస్థుల జీవితంతో ఎంతగా మమేకమైపోయి ఉన్నదో తెలుపుతున్నాయి.

నేపథ్యంతో కలిసిపోతున్న గ్రామ దృశ్యం కనువిందుగా, ఆహ్లాదంగా కనిపించింది. తెల్లని గోడలమీదకు ఎదిగి, వాలిపోయి, నిలువెల్లా గులాబీ రంగు అద్దుకున్న కాగితం పూల చెట్ల అతిశయం 'సాదా సీదా' నచ్చని చిత్రకారుడి హస్త విన్యాసానికి అద్దం పడుతోంది. వర్ణాల వైవిధ్యం కళ్ళు చెదిరేలా అలరిస్తోంది. ఇవన్నీ నాకు 'అలవాటైన ఆభరణాలే లే' అంటున్నట్టు, మధ్యధర చల్లగా అలలను చిలుకుతూ, నీలాకాశం మీదకు తుంపరలు చల్లుతూ ఆడుకుంటోంది నిరార్భాటంగా. సిడి బో సెయిద్ ను త్రినీల వర్ణాల ప్రదేశంగా అభివర్ణిస్తారు. సాగర సలిలపు నీలం, నింగిన నిండిన సునీలం, దర్వాజాలకద్దిన వర్ణ వినీలం. ఇక్కడ మన కళ్ళ ముందు ఏది ఎక్కువగా కనపడుతుందో చెప్పటం కష్టం.

దృష్టంతా కళాసృష్టి మీదే నిలిపిన చిత్రకారుల కళా క్షేత్రాలు, హస్తకళా నిలయాలు, ప్రత్యేకంగా తయారయ్యే వస్తువులను మాత్రమే విక్రయించే విలక్షణమైన దుకాణాలు, ఇంకా చక్కగా అమర్చిన తినుబండారాలతోవీధులు జీవం నింపుకుని ఉన్నాయి. భారత దేశంలో లానే, చాలా ఇస్లామిక్ దేశాల్లోనూ హెన్నా కళకు మంచి జనాదరణ ఉంది. ఇక్కడ కూడ హెన్నా, ఇంకా ఇతర విద్యలను ప్రదర్శించే వాళ్ళు చాలా మంది ఉన్నారు. వాతావరణం చైతన్యంతో నిండి ఉంది. పక్షులతో విన్యాసాలు చేయించే ఒకతను, ఒక పెంపుడుడేగతో మా దగ్గరకు వచ్చి, దానిని మా పిల్లల చేతి మీద ఉంచుతానని అడిగాడు. వాళ్ళు భయపడకుండా వెంటనే ఒప్పుకోగానే, అది వాళ్ళ తలల మీదకు ఎక్కి కూర్చుంది. నా సంగతి అటు ఉంచితే, వాళ్ళకు మాత్రం ఈ అనుభవం బాగా నచ్చింది.

ఈ లోగా, మా డ్రైవరు హాటెమ్, కారులో కూర్చోకుండా, ఊళ్ళోకి వచ్చాడు. అప్పుడే, అక్కడ ఒకచోట జనం గుంపులుగా చేరి ఉండటం కనిపించింది. నా ముఖంలో ప్రశ్నార్థకం చూసిన హాటెమ్, అక్కడ బాంబిలోని డోనట్లు అమ్ముతున్నారని చెప్పాడు. ట్యునీసియా పిల్లలంతా వీటిని చాలా ఇష్టపడతారని అతను అనగానే, మా పిల్లలు కూడ ఉత్సాహం చూపించారు. బాంబిలోని డోనట్లు తినాలంటే, సిడి బో సయిద్ కంటే మించిన ప్రదేశం లేదని చెబుతూ, మూడు గంటల తరువాత అతనిని మేము కలుసుకోవలసిన చోటు మాకు చెప్పి హాటెమ్ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

వెళుతూ వెళుతూ బాంబిలోని స్టాల్ పక్కనే ఉన్న, కెఫే డెస్ నాట్స్ లో కాఫీ త్రాగటం మర్చిపోవద్దని కూడ చెప్పాడు.

క్యూలో నిలబడి, మా వంతు వచ్చాక, అరడజను బాంబిలోని డోనట్లు కొన్నాము. డోనట్లు మాకు కొత్తేమీ కాదు. ఇంగ్లండ్‌లో కొన్నిచోట్ల వాటి తయారీలో అన్ని దశలను చూపిస్తూ, అప్పటికప్పుడు తయారైన వేడి వేడి డోనట్లను అమ్మే చోట్లు చాలా ఉంటాయి. కాని ఇక్కడి డోనట్లు నోట్లో వేసుకోగానే, నాకు కోటయ్యగారి కాకినాడ కాజా, ఒంగోలు అల్లూరయ్యగారి మైసూర్ పాక్, ఆత్రేయపురం పూతరేకులు గుర్తొచ్చాయి. ఇవన్నీ చాలా చోట్ల దొరికినా, ఆయా ప్రదేశాలలో ఆ మహా ప్రవీణుల చేతి మహిమను తోసి పుచ్చలేము. ఈ సిడి బో సయిద్‌లో దొరికే బాంబిలోని డోనట్లు కూడ, ఆ గాలి, ఆ నీళ్ళు, ఆ వంటవాళ్ళ చేతి మహిమ వలన కాబోలు, విడమరచి చెప్పలేనంత రుచిగా ఉన్నాయనటంలో అతిశయోక్తి లేదు. ఆ డోనట్ల తయారీ విధానాన్ని గోప్యంగా ఉంచుతారని హటెమ్ చెప్పాడు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. స్థానిక రుచులను ఆస్వాదించేటప్పుడు, అవి ఎట్లా ఉన్నా, నాకు వారి సంస్కృతీ సంప్రదాయాలను చవి చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అవి ఎట్లా ఉన్నా, వాటిని విమర్శించక పోవడమే, నాకు ఆతిధ్యమిచ్చిన స్థానికులకు నేనివ్వగలిగే గౌరవం అనుకుంటాను. కెఫె డెన్ నాట్స్, 250 సంవత్సరాలుగా, అలుపు లేకుండా తన వద్దకు వచ్చిన వారందరికీ కాఫీ అందిస్తూనే ఉంది. లోపల అంతా అరబిక్ శైలిలో అలంకరించబడి ఉంది. అతిధులు కూర్చోటానికి నేల మీద కార్పెట్లు పరచి ఉన్నాయి. లోపల ఎట్లా ఉందో చూద్దామని వెళ్ళినవాళ్ళం, కాఫీ త్రాగకుండా రాలేక పోయాము. భవన్లు పై అంతస్తు మీద నుండి మెడిటరేనియన్ ఆడుకుంటూ కనపడుతోంది. అక్కడకు కాఫీ త్రాగటానికి వచ్చిన మహామహులలో ప్రసిద్ధులైన, చిత్రకళాకారులు, రచయితలు, వేదాంత్ విజ్ఞాన ఖనులూ ఉన్నారు. ఆంద్రె జీడ్, స్విస్ కళాకారుడు పాల్ క్లీ, ఇంగ్లీషు తాంత్రికవిద్యావేత్త అలీస్టర్ క్రోలీ, జర్మన్ పెయింటర్ ఆగస్ట్ మాక్కె, ఫ్రెంచి తత్వవేత్త, మైఖెల్ ఫోకల్ట్ ఇత్యాదుల మనఃశరీరాలు ఇక్కడి కాఫీతో స్ఫూర్తి పొందాయట. కారెవరూ కాఫీ మహిమకతీతం. అసలే పనీ చెయ్యక పోయినా, తోచడంలేదని అనుకోకుండా, ఒక వారం పాటు, కాళ్ళు చాపుకుని నేను కాలం గడిపేయ గలిగిన చోటు ఈ సిడి బో సయిద్. ఇక్కడి వాతావరణం అలాంటిది. నింపాదిగా, విశ్రాంతిగా నరాలలో అలజడిని జోకొట్టే మహత్తు ఏదో ఉందిక్కడ. నాకంటే ముందు ఎంతో మంది విజ్ఞులు ఈ సంగతి గమనించటం వలనే.. ఈ ప్రదేశానికి అంతటి ప్రశస్తి. ఇక్కడి నుండి వెళ్ళబోయే ముందు, ఆ కొండ మీద మాకొక రెస్టారెంటు విలక్షణంగా కనిపించింది. దాని పేరు, కెఫె డెస్ డెలిసెస్. అక్కడ నుండి కనిపించే అద్భుత దృశ్యాలు దానికే ప్రత్యేకం. విస్తార సముద్రం, దానిని కట్టడి చేసే సాగర తీరం, దానిని తీర్చి దిద్దిన సైకతపు అంచు, దూరానపరచుకున్న పర్వత శ్రేణులు అంతా చిత్రకారుడి కుంచె నుండి ఉద్భవించిన, వంకలేని వన్నె చిన్నెల ఊహా చిత్రంలా కళ్ళ ముందుకు వచ్చింది. అక్కడి నుండి కదిలితే, ఆ అపురూప దృశ్యం కనుమరుగై పోతుందన్న భయంతో వీలైనంతగా వాటిని మా కెమేరాలో మూటకట్టుకున్నాము.

క్షుద్బాధ తీర్చుకోవటానికి మాత్రమే కాకుండా, స్థానిక రుచులు ఆస్వాదించాలనే లక్ష్యంతో, బ్రిక్ అనే పదార్థాన్ని పురమాయించాము. దానితో పాటు కుస్కస్, చేపలను కూడ. బ్రిక్ దాదాపు మన సమోసా లాంటిది. దీని లోపల ఉల్లిపాయలు, మసాలాతో కలిపి తయారుచేసిన గుడ్డుకూర ఉంది. మఘ్రెబ్ (వాయవ్య ఆఫ్రికా) ప్రాంతంలో ముఖ్యమైన ఆహార పదార్థం కుస్కస్. చుట్టూ కనిపిస్తున్న అందమైన దృశ్యంలో భాగమైపోతూ, మా లంచ్ ముగించాము. భోజనం ఒక మాదిరిగా ఉంది. కాని, స్థానిక విలువల బట్టి చూస్తే బిల్లు ఘనమే. స్థానాన్ని బట్టి విలువలు మారటం ప్రపంచమంతా ఉన్నదే కదా! పోనీలే, ఇంత చక్కని ప్రదేశంలో, ఆకలి తీర్చుకున్న అనుభవం కోసం ఆ మాత్రం ఇవ్వచ్చేమోలే అనుకున్నాము.

**బార్డో:** మొట్ట మొదటి సారి ట్యునీసియా వెళ్ళాలనుకున్న కారణాన్ని నా మనసు వెతుక్కుంటూ, మమ్మల్ని, ట్యునిస్ నగర శివారులో ఉన్న లే బార్డో ప్రాంతానికి నడిపించింది. అక్కడ 15 వ శతాబ్దపు సువిశాల రాజభవనంలో నాకు అత్యంత ఆసక్తికరమైన మ్యూజియమ్ ఉంది. సాధారణంగా మ్యూజియమ్లను చూడటం ఒకపాఠ్య గ్రంథం చదవటంలా ఉంటుంది. వాటిని పొగడటం అంటే, పాఠ్య గ్రంథాన్ని ఒక మంచి నవలగా చూపించటం లాంటి వ్యర్థ ప్రయత్నంలా ఉండొచ్చు. కాని ఈ బార్డో మ్యూజియమ్ అసాధారణంగా ఉంది. రోమన్ మొజాయిక్‌ల వైభవాన్ని చూడాలనుకున్న, నాలాంటివాళ్ళు ఇక్కడకు తప్పని సరిగా రావలసిందే. మూడంతస్తులలోప్రదర్శించబడుతున్న, వివిధ



బార్డో మ్యూజియమ్

రకాల రోమన్ మొజాయిక్ కళాఖండాల సేకరణ, ప్రపంచంలో మరెక్కడా కనపడదేమో! ఇవన్నీ రోమన్ల జీవనశైలికి అద్దం పడుతున్నాయి. వాటిలో సూక్ష్మంగా పొందు పరచిన వివరాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. కొన్ని మొజాయిక్‌లు చాలా పెద్దవి. ఇవి ఆ కాలంలో ధనికుల గృహాలలో (రోమన్ విల్లాలు) కుడ్య చిత్రాలట. పురావస్తు సేకరణకోసం జరిపిన త్రవ్వకాలలో, నేలమీద పరచిన మొజాయిక్‌లను దెబ్బ తినకుండా సంరక్షించ గలిగారు. మొత్తం చిత్రాన్ని నేల నుండి పెకలించటమంటే, అందునా అంత పెద్ద వాటిని, మాటలు కాదు. ఎంతో ప్రయాసతో కూడిన పని. కాని ఈ పనిలో వాళ్ళు నూటికి నూరుపాళ్ళు సఫలీకృతులై, ఇంత అద్భుత కళా వైభవాన్ని భావి తరాలకోసం సంరక్షించి ప్రదర్శిస్తున్నారని మాకనిపించింది.

మొజాయిక్ కళలో నన్ను ఆకట్టుకున్న ముఖ్యమైన విషయం, అంత చిన్న పింగాణీ ముక్కలను, రాళ్ళను నేర్పుతో, ఓర్పుతో అతుకుతూ కూడ, సునిశిత భావ ప్రకటనను ఏ మాత్రం అలక్ష్యం చేయకపోవటం. వాటిలో పొందుపరచిన ముఖాలు సజీవంగా, వివిధ భావాలను పలుకుతూ ఉంటాయి. పెద్ద పెద్ద దృశ్యాలను, వేలాది అంశాలతో, రంగుల బదులు రాళ్ళను వాడి రూపొందించటం నిజంగా విశిష్టమైన, విలక్షణమైన కళ. పురాతన గ్రీకు, రోమన్ల కాలం నుండి, ఇటీవలి మధ్య యుగాల బైజాంటీన్ కాలం వరకూ కూడ ఈ కళను ఆదరించి, పెంచి, పోషించిన ధనవంతులు కళాపోషకులనే చెప్పాలి.

ఈ పెద్ద పెద్ద మొజాయిక్‌లతో పాటు, ఇంకొన్ని కళాకృతులు ఉన్నాయి. వీటిలో నన్నాకర్షించినది, గ్రీకు దేవత ఆఫ్రొడైట్ పాలరాతి విగ్రహం. దీనితో పాటు మరి కొన్ని కళాకృతులను క్రీ.శ. 80 వ సంవత్సరంలో, ప్రస్తుత ట్యునీసియాలో భాగమైన మహ్దియా తీరంలో ధ్వంసమైన ఓడ నుండి సంగ్రహించారు. 9/10 శతాబ్దాలనాటి ఖురాన్ చేవ్రాలు మరొక విశేషం ఇక్కడ. ఒకసారి చూడటం ముగిసిన తరువాత, నా భార్యా పిల్లలను, విశ్రాంతి గదిలో వదలి, నేను మళ్ళీ ఒకసారి నాకు బాగా నచ్చినవాటిని తనివితీరా చూసొచ్చాను. నాలుగు గంటల పాటు ఈ మ్యూజియమ్లో గడిపిన తరువాత, నాకు కలిగిన సంతృప్తిని ఇక్కడ పంచుకుంటున్నాను. గ్రీకు-రోమన్ మొజాయిక్ కళను నాలా అభిమానించే వారిని తప్పకుండా ఇక్కడకు వెళ్ళమని చెపుతాను. ఐతే, మేము ఇక్కడకు వెళ్ళొచ్చిన మూడు నెలల లోపే, 2015, మార్చ్ 18వ తేదీన బార్డో మ్యూజియమ్‌లో హృదయ విదారకమైన సంఘటన జరిగింది. ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టులు ఇద్దరు, మ్యూజియమ్‌లో ప్రవేశించి, నిరాఘాటంగా జరిపిన తుపాకీ కాల్పులలో, 22 మంది యూరోపియన్ సందర్శకులు మరణించారు. ఆ ఇద్దరు టెర్రరిస్టులు కూడ కాల్చివేయబడ్డారు. ఈ వార్త నన్ను కలచి వేసింది. ఆ రోజు అక్కడ ఎవరున్నా అంతేగా?

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న టెర్రరిస్ట కార్యకలాపాలను గురించి విన్నప్పుడల్లా, నేను చాలా కాలం పాటు దిగ్భ్రమకు గురౌతాను. బార్డో మ్యూజియమ్లో దురాగతం జరిగే నాటికి, ఆ మ్యూజియమ్ జ్ఞాపకాలు మా మనసుల్లో ఇంకా సజీవంగా ఉన్నాయి. అదే దురాగతం మేము వెళ్ళిన రోజు జరిగి ఉంటే, నేను, నా కుటుంబం ఏమైపోయేవాళ్ళం? న్యూయార్క్‌లో ట్విన్ టవర్లు కూల్చబడటానికి సరిగ్గా రెండు సంవత్సరాల ముందు, నేను అక్కడ తిరగటం నా కెంతో గుర్తు. ఆ అనుభవాలను భావి తరాల వారికి శాశ్వతంగా దూరం చేసే హక్కు ఎవరికైనా ఎందుకు ఉంటుంది? విధ్వంసానికి ఎక్కువ సేపు పట్టదు. కాని నిర్మాణం అంత తేలిక కాదు.

**కైరువాన్ :** మఘ్రిబ్ ప్రాంతంలో, కైరువాన్ ముస్లింలకు నాలుగవ పుణ్య క్షేత్రం. మక్కా, మదీనా, జెరూసలెమ్ మొదటి మూడు. కాని దీని గురించి భారతదేశంలో చాలా మంది ముసల్మాన్లకు తెలియదు. అంటే దీని ప్రాశస్త్యం స్థానికమనుకోవచ్చు. ఇది హమ్మామెట్ నుండి రెండు గంటల ప్రయాణపు దూరంలో ఉంది. దాదాపు 120 కి.మీ. అక్కడకు చేరాక, ఇరుకు వీధులన్నీ దాటుకుంటూ, గ్రేట్ మోస్క్ చేరాము. దీనిని సిడి ఓక్బా మోస్క్ అని కూడ పిలుచుకుంటారు. ఈ మసీదు ఈ నగరానికి ఒక గొప్ప ఆకర్షణ. ఇస్లామిక్ ప్రపంచంలో ఇది అతి పురాతనమైనది.

మగ్రెబ్‌లో మసీదుల నిర్మాణానికి దీనిని నమూనాగా తీసుకుంటారు. పాత కాలపు, నిదానపు పోకడలే ఇక్కడి ప్రత్యేకత. సాఫీ నడచి పోయే జీవన శైలి మన కళ్ళ ముందు కనిపిస్తుంది.

హాటెమ్ సలహా ప్రకారం, పిల్లలకు ఆ మసీదు గురించి వివరంగా తెలపటం కోసం, ఒక గైడును పెట్టుకున్నాము. మాకు తెలిసినంత మాత్రమే చెపితే వాళ్ళను ఆకట్టుకోలేమనిపించింది. పైగా మాకు కూడా ఎంతో సమాచారం అతని ద్వారా లభించింది. తొలుతగా క్రీ.శ. 670వ సంవత్సరంలో నిర్మితమైన ఈ మసీదు, 9 వ శతాబ్దం నాటికి ఉచ్ఛ స్థితికి చేరుకుంది. దృఢమైన గోడలు కోట గోడల మాదిరిగా కనిపిస్తున్నాయి. అంతర్భాగంలో, చుట్టూ గదులు వసారాలతో ఉన్న ప్రాంగణం ఉంది. ఒక ప్రక్కన చతురస్రాకారంలో నిర్మించబడి, పై భాగంలో ఒకే ఒక మెట్టు మీద గోపుర నిర్మాణంతో ఉన్న మినారెట్ కనిపించింది. అది ఈ మసీదు ప్రత్యేకత అట. మసీదు ప్రధానమందిరం స్తంభాల మీద నిర్మితమయింది. లోపలకు వెళ్ళటానికి ముస్లిములకు మాత్రమే అనుమతి. నాలాంటి ఔత్సాహిక యాత్రికులను, లోపలకు తొంగి చూడటానికి గుమ్మం వరకు రానిస్తారు. అక్కడున్న ఒక గైడు, కొన్ని స్తంభాలు, రోమన్ కార్థేజ్ నుండి తరలించుకుని వచ్చినవని చెప్పాడు. అక్కడ తిరుగుతున్నప్పుడు, ఒక గైడు మమ్మల్ని అక్కడ పరచిన పాలరాతి నేలను గమనించమని చెప్పాడు. పరిశీలనగా చూసిన మీదట, అక్కడి నేల నెమ్మదిగా, ఆ ప్రాంగణం మధ్యకు వాలుతున్నట్టు కనపడింది. విశాల ప్రాంగణంలో కురిసిన వర్షపు నీటిని ఉపయోగించు కోవడానికి అదొక ప్రత్యేకమైన ఏర్పాటట. ప్రాంగణం మధ్యలో చేరిన నీటిని భూగర్భ జలాశయంలోకి చేర్చుతారట. అక్కడ మరొక రెండు బావులు కూడ ఉన్నాయి. ఇటువంటి ముఖ్యమైన విషయాల గురించిన ప్రణాళికలతో నిర్మించ బడటం వలనే దీనిని నమూనా నిర్మాణంగా భావిస్తు న్నారనిపించింది.

ప్రాంగణం మధ్య ఉన్న ఒక పెద్ద నీడ గడియారం పిల్లలను ఆకట్టుకుంది. కాల గమనాన్ని సూర్య గమనంతో జోడించి, 360 డిగ్రీలతో 24 గంటలను అనుసంధానం చేసి, నీడ ఆధారంగా కాలాన్ని కొలవొచ్చు అని ప్రపంచంలో చాలాచోట్ల ఆలోచన సాగింది. భారత దేశంలో జైపూర్ జంతర్ మంతర్, భారతీయుల ఖగోళ శాస్త్రపరిజ్ఞానానికి ఒక మచ్చు తునక. ఇక్కడున్న గడియారాలు, ఘడియలను లెక్కకు తేవడమే కాకుండా, గ్రహాల కదలికలను, ఋతువుల క్రమాన్ని, నక్షత్ర మండలాల కదలికను కూడ చూపిస్తాయి. ఇంత విజ్ఞానం పిల్లలకు అప్పటికప్పుడు పూర్తిగా అవగతం కాకపోయినా, వారిలో కుతూహలాన్ని రేకెత్తించిందనటంలోసందేహం లేదు. నేను తెలుసుకున్న వివరాల ప్రకారం కైరువాన్, 8–9 శతాబ్దాల కాలంలో, ఒక వెలుగు వెలిగిన అరబ్ నగరం. అప్పట్లో ఈ మసీదు, ఒక గొప్ప విజ్ఞాన్ కేంద్రం. 9 వ శతాబ్దం లో, అరబ్బులకు, స్థానిక బర్బర్లకూ మధ్య ఏర్పడిన స్పర్ధ వలన, చాలా మంది అరబ్బులు కైరువాన్ వదలి, ప్రస్తుత మొరాకోలోఉన్న ఫెజ్ కు తరలి వెళ్ళి పోయారు. అక్కడ వారు కైరువాన్ మసీదు నమూనాలో, ఆల్ కైరువాన్ అని పిలవబడే మరొక మసీదును నిర్మించుకున్నారు. తరువాత కాలంలో అది విశ్వ విద్యాలయంగా, విజ్ఞాన్ కేంద్రంగా విలసిల్లింది. విజ్ఞానధనులు తరలి పోవటం కైరువాన్‌కు తీరనిలోటు. ఆల్ కైరువాన్ విశ్వవిద్యాలయం (ఆల్ క్వరావియిన్ అని కూడ పిలవబడుతుంది), నిరాఘాటంగా కొనసాగిన అతి పురాతన విశ్వ విద్యాలయంగా యునెస్కో గుర్తింపు కూడ పొందింది. ఈ నాటికీ, సుదూరాన ఉన్న ఫెజ్ నగరపు పోలికలను కైరువాన్‌లో దాని గత వైభవపు చిహ్నాలుగా మనం గమనించవచ్చు. కైరువాన్‌లో హటెమ్ మాకు చూపించిన మరొక యాత్రా విశేషం, సిడి సాహెబ్ జౌవియా. ఈ భవనంలో ప్రొఫెట్ మహమ్మద్ శిరోజాలను సంస్కరించే పని చేసిన సిడి సాహెబ్ సమాధి ఉంది. స్థానికుల కథనం ప్రకారం, సిడి సాహెబ్ వద్ద ఎప్పుడూ ప్రొఫెట్ మహమ్మద్ తలవెంట్రుకలు మూడు ఉండేవట. మహామహుల తల వెంట్రుకలు, గోళ్ళు, కొన్నిసార్లు దంతాలు, ఎముకల వంటి అవశేషాలను ఆరాధించటం, పవిత్రంగా కొలవటం చాలా మతాలలో అమలులో ఉంది.

కైరువాన్ వీధులలో మా అంతట మేము చాలా సేపు తిరిగాము. భయం గానీ, కొత్త చోటుకు వచ్చామనే బెరుకు గాని మాకేమీ అనిపించలేదు. మేము గమనించిన దేమంటే, మాలాంటి యాత్రికులు తక్కువగా ఉన్నారని. ఒక విధంగా ఆ ప్రదేశం దాని తత్వాన్ని నిలిపి ఉంచు కోవటానికి కారణం, అక్కడికి ఎక్కువగా యాత్రికులు రాకపోవటమేనేమో. వారణాసి, జెరూసలెమ్, క్వోమ్, సాన్ సెబాస్టియన్ నగరాల మాదిరిగా ఇక్కడ, యాత్రికులను రప్పించుకోవటానికి ఏర్పరచిన ప్రత్యేక ఆకర్షణలేమీ మాకు

కనపడలేదు. తన దోవన తను, తన పంథాలో తను, తన నైజాన్ని నిలుపుకుంటూ అంతర్ముఖమైసాగిపోతున్న పురాతన పవిత్ర ప్రదేశంలా కైరువాన్ నాకు కనపడింది. సందర్శకులుగా ఈ లక్షణాన్ని, గమనించి, గౌరవించి రావటం మనం చేయగలిగిన పని. నగరమంతా తివాచీలు, స్వీట్లు అమ్మే దుకాణాలతో నిండిపోయి ఉంది. ట్యునీసియాలో ఈ రెంటికీ కైరువాన్ ఉనికి పట్టని తరువాత తెలిసింది. ఒకచోట, హాటెమ్ సలహా ప్రకారం 'సెగ్ని' అనే షాపులోకి వెళ్ళాము. అక్కడ జన సమ్మర్ధాన్ని చూస్తేనే, స్థానికులలో దానికున్న ఆదరణ తెలిసిపోయింది. వాళ్ళతో మాట్లాడున్నప్పుడు, ఎక్కువ మంది, రవ్వ, ఖర్జూరాలతో చేసి, తేనెలో మాగబెట్టినట్టున్న కేకు ముక్కలను కొనుక్కుంటున్నారని గమనించాము. దాని పేరు, మక్రూడ్. మేము కూడ కొన్ని ముక్కలను, వాటితో పాటు రకరకాల పదార్థాలతో నింపిన బ్రెడ్‌ను కొనుక్కున్నాము. దానితో, మధ్యాహ్న భోజనం కోసం, ప్రత్యేకంగా ఆగకుండా, నడుస్తూనే ముగించాము.

కైరువాన్ వదలి వచ్చేసే ముందు, ఒక తివాచీల దుకాణానికి వెళ్ళాము. అది ఒక పాత మార్కెట్ భవనంలో ఉంది. ఇది 17 వ శతాబ్దంలో, స్థానిక గవర్నర్ గారి నివాస గృహమట. అక్కడున్న సేల్స్‌మాన్‌తో మాటలు కలిపి, ట్యునీసియా కార్పెట్ల తయారీ గురించి వాకబు చేయటంతో, అతను మమ్మల్ని, అదే భవనంలో కొంత మంది మహిళలు, తివాచీలను నేస్తున్న విభాగానికి తీసుకెళ్ళాడు. తివాచీ తయారీని ప్రత్యక్షంగా చూసిన మా పిల్లలిద్దరూ, అక్కడ నేత పనివారి నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు. ఒక చిన్న తివాచీ తయారీ వెనుక ఎంతో కష్టం, తరతరాలుగా సంక్రమించిన పనితనం ఉన్నాయి. మా కందరికీ ఇదొక మంచిఅనుభవం.

**ఎల్ జమ్ :** అక్కడి నుండి బయలు దేరి, 70 కి.మీ. దూరంలో ఉన్న ఎల్ జమ్ వెళ్ళటానికి గంటా పదిహేను నిముషాలు పట్టింది. కార్థేజ్ వైభవోపేతంగా ఉన్న కాలంలో దీని పేరు థీస్డ్రస్. తరువాత ఇది రోమన్ల వలస పట్టణంగా మారింది. రోమన్ల హయాంలో ఇక్కడ ఒకపెద్ద వలయాకారపు రంగ స్థలం (ఆమ్ఫి థియేటర్) నిర్మించబడింది. శిథిలమవటానికి ముందు 150 సంవత్సరాల పాటు ఈ ప్రదేశం రోమన్ల కళా కేంద్రంగా విలసిల్లింది.

రోమ్ నగరంలో ఉన్న అతి పెద్ద కోలోసియమ్, తరువాత మూడవ స్థానంలో నిలిచేది ఎల్ జమ్



ఎల్ జమ్ కోలోసియమ్.

కోలోసియమ్. ఇది చాలా పెద్దదిగా ఉండటమే కాకుండా, రోమ్ కోలోసియమ్ కంటె మెరుగుగా నిలబడి ఉంది. కాల గమనంలో విదేశీ దండయాత్రల ఆటుపోట్లు తట్టుకుని, ఇప్పటికీ రూపు రేఖలు కోల్పోని పండు ముదుసలి ఎల్జమ్ కోలోసియమ్, 30000 మంది ఒకేసారి కూర్చుని, ఆట పాటలు, నృత్య, గాన, నాటకాల వంటి కళా ప్రదర్శనలను వీక్షించటానికి వీలుగా, మెట్లు మెట్లుగా గుండ్రంగా నిర్మించబడి ఉంది. పెద్ద రాతి బండలను కూర్చొనే సీట్లుగా వాడారు. ఇప్పటికీ చెదరకుండా ఉన్న వాటిని చూడగానే నాకు, ఈ రోజుల్లో స్టేడియమ్‌లలో వాడుతున్న ప్లాస్టిక్ కుర్చీలు గుర్తొచ్చాయి. ఈ కోలోసియమ్ మధ్యలో నిలబడిన నన్ను, కాలంలో వెనుకకు వెళ్ళి, బెన్ హర్, గ్లాడియేటర్ వంటి హాలీ వుడ్ సినిమాలలో చూసిన రోమన్ కాలపు భావనలు చుట్టుముట్టాయి. మేము అక్కడికి వెళ్ళే సరికే ఆ రోజు వచ్చిన సందర్శకులు చాలా వరకు వెళ్ళిపోతున్నారు. మొత్తం థియేటర్ మా కోసమే అన్నట్లుంది. మా గైడ్‌తో మేము మాత్రమే ఉన్నాము. ఏకచ్ఛత్రాధిపత్యం లభించటంతో, ఇక మా పిల్లలు, స్వేచ్ఛగా, యథేచ్ఛగా, థియేటర్ మొత్తాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. వాళ్ళిద్దరూ మా కోసం ఒక ఉత్తుత్తి గ్లాడియేటర్ ఫైట్‌ను కూడ ప్రదర్శించటంతో, మాకు, మాతో పాటు ఉన్న హాటెమ్, మా గైడుకు, రోమన్ల కాలం నాటి ప్రేక్షకత్వం కూడ లాభించింది.

ఈ భవనం క్రింది భాగం చాలా వరకు, బందీలను ఉంచే చీకటి గదులకు, గ్లాడియేటర్లకు గ్రీన్ రూములకు, వారి ప్రదర్శనలలో ఉపయోగించుకునే జంతువుల నుంచటానికి వాడేవారట. నేను రోమ్ కోలోసియమ్‌ను చూడటానికి వెళ్ళినప్పుడు, అక్కడ అలనాడు గ్లాడియేటర్ ప్రదర్శనలకు ఎంత మంది వెళ్ళే వారో ఇంచుమించు అంతమంది ఆ శిథిలాలను చూడటానికి ఆ రోజు అక్కడ

కనపడటం గుర్తొచ్చింది. అంత సందోహం ఇక్కడ లేదు. కాల మహిమ అలానే ఉన్నా, స్థాన మహిమ అంత బలంగా లేదు అనుకున్నాను. ఐతే, అదే మాకు కలసి వచ్చింది. నింపాదిగా తిరుగుతూ, కూలంకషంగా అన్నీ తెలుసుకో గలిగాము. ఈ కోలోసియమ్ కూడ ప్రపంచవారసత్వ సంపదలో భాగంగా యునెస్కో వారి గుర్తింపు పొందింది.

ఇక్కడ గైడు మాకు మరొక కథ చెప్పాడు. దిహ్యా అనే బెర్బర్ రాణి, వాయవ్య ఆఫ్రికాలో ముస్లిమ్ అరబ్బుల దురాక్రమణలను ఎంతో కాలంపాటు నిలువరించిన వీర వనిత. వారితో ఆమె సలిపిన ఆఖరి పోరాట సమయంలో, తన సైన్యాన్ని కోలోసియమ్ వద్ద మోహరించిందట. మూసా బిన్ నుసేర్ ఆధ్వర్యంలో నడప బడిన ఉమయ్యాద్ అరబ్ సైన్యంతో జరిగిన వీర పోరాటంలో దిహ్యా ప్రాణాలర్పిం చిందట. దిహ్యా పరాక్రమం, దేశ భక్తి, త్యాగాలు ఈ నాటికీ బెర్బర్ల సంస్కృతిలో భాగంగా నిలిచిపోయాయి.

ఇక్కడ కూడ ఒక చిన్న మ్యూజియమ్ ఉంది. పురావస్తు త్రవ్వకాలలో లభించిన మొజాయిక్‌లు ఇక్కడ ఉన్నాయి. గంటన్నర పాటు వీటిలో పొందుపరచిన చిన్న చిన్న వివరాలను అభినందించి, హమ్మామెట్‌కు తిరిగి ప్రయాణమయ్యారు. ఇక్కడి నుండి హమ్మామెట్ 155కి.మీ. వచ్చేటప్పుడు, హమ్మమెట్ నుండి, కైరవాన్, ఎల్ జామ్‌ల మీదగా త్రికోణంగా సాగిన మా ప్రయాణం మొత్తం 350కి.మీ. ఐనా మాకు అలుపు అనిపించలేదు. కాని మా పిల్లల వైపు నుండి ఆలోచించినప్పుడు, ఇదంతా కొంచెం పెద్దవాళ్ళ వ్యవహారం అనిపించింది నాకు. వాళ్ళేమీ అనకపోయినా, మరుసటి రోజు పూర్తిగా వాళ్ళ కోసమే ఏదైనా చెయ్యాలనుకున్నాను. సోస్సెకు దగ్గరలో ఒక జంతు ప్రదర్శనశాల (జూ) ఉన్నట్లు తెలిసింది. దీని పేరు ఫ్రిజియా పార్క్. మరునాడు ముందుగా అక్కడికి వెళ్ళాము. మనుష్యులు ఎంత ప్రయత్నం చేసినా, జూ లో ఉండే జంతువులకు, వాటి సహజ పరిసరాలకు సమీపంగా ఉండే వాతావరణం ఏర్పాటు చేయటం కష్టం. కాని ఫ్రిజియా పార్కు ఈ విషయంలో సఫలమయిందని చెప్పవచ్చు. సువిశాలమైన ఈ పార్కులో, జంతువులతో పాటు మేము కూడ అటవీ వాతావరణం అనుభవించ గలిగాము. చాలా కాలంగా, చీటా, లెప్పర్డ్, జాగ్యువార్‌ల మధ్య ఉన్న తేడా గురించి ఇదమిత్థంగా తేల్చుకోలేక పోతున్నాను. ఇక్కడ ఈ మూడింటిని చూడటంతో ఆ తేడా నాకు స్పష్టమయింది. తెలుగులో అన్నిటినీ చిరుత పులులను అంటాము. మూడూ గండు పిల్లుల జాతివే అయినప్పటికీ, వేటికి వాటికి ప్రత్యేక లక్షణాలున్నాయి. చీటా భూమి మీద అత్యంత వేగంగా పరుగెత్తే జంతువు. లెప్పర్డ్ చెట్లెక్కగలదు. చీటాల మీద గుండ్రని చిన్న చిన్న నల్ల మచ్చలుంటాయి. తల చిన్నగా ఉండి, ముఖం మీద కళ్ళ నుండి నల్లని కన్నీటి చారికలా ఉంటుంది. శరీరం బాణంలా దూసుకు పోవటానికి వీలుగా సన్నగా పొడవుగా ఉంటుంది. లెప్రర్డ్ మీద మచ్చలు నల్ల పువ్వుల్లా ఉంటాయి. జాగ్యువార్ పెద్ద తలతో, కొంచెం భారీ శరీరంతో దిట్టంగా ఉంటుంది.

ఒకప్పుడు భారత దేశం చీటాలకు ప్రసిద్ధి. బ్రిటిష్ వారి కాలంలో, తెల్ల దొరలకు, వారి సావాసులైన అలనాటి రాజా వార్లకు మృగయా వినోదం కలిగించినవి అవే. ఆ వినోదమే వాటన్నిటినీ పొట్టన పెట్టుకుని, ఆ జాతి అంతరించి పోవటానికి కారణమయింది. నా చిన్న తనంలో, చీటా ఫైట్ అనే అగ్గి పెట్టెలు ఉండేవి. అవి నాకింకా బాగా గుర్తు. మన దేశంలో ఇప్పుడవి లేవు. కాని ఇవి ఇంకా ఆఫ్రికాలోనూ, మధ్య ఆసియాలోనూ ఉన్నాయి. ఈ మధ్యే భారత దేశానికి నమీబియా నుండి ఎనిమిది, దక్షిణ ఆఫ్రికా నుండి 12 చీటాలు పంపబడ్డాయని వార్త. మనకు అక్కడక్కడా కనిపించాయని వార్తల్లో వినిపించేవి, లెప్పర్డ్‌లు. వాటినే మనం చిరుత పులులని పిలుస్తాము. జాగ్యువార్‌లు కూడ మనకు లేవు. కాని ఈ మూడిటిని ఇక్కడ ఫ్రిజియా పార్కులో చూడగలిగాము.

ఆ రోజు సాయంత్రం, ట్యునీసియాకు డిస్నీలాండ్ అనుకునే కార్థేజ్‌లాండ్‌కు వెళ్ళాము. ఉత్తర ఆఫ్రికాలో మొదటిగా ఏర్పాటు చేసిన థీమ్ పార్క్ ఇది. ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఏనుగు బొమ్మలను, హాన్నిబాల్ గజబలంలోని ఏనుగుల మాదిరిగా తయారు చేశారు. ఇవి నిజమైన ఏనుగులేమో నన్నట్లు ఉన్నాయి. లోపల కూడ, కార్థేజియన్ల కాలంలోకి వెళ్ళిన అనుభూతి ప్రధానంగా ఏర్పాట్లు చేశారు. పిల్లా పెద్దా అందరినీ వినోదంలో ముంచి తేల్చే విశేషాలెన్నో అక్కడ ఉన్నాయి. ముఖ్యంగా మా పిల్లలకు ముందు రోజు అనుభవాలకు సరైన విరుగుడు దొరికింది.

**కేప్ బాన్ :** మరునాడు ఈ నాటి ట్యునీసియా నిజరూపాన్ని తెలుసుకోవాలని అడగటంతో, హటెమ్ మమ్మల్ని కేప్ బాన్ ద్వీప కల్పం వైపుకు తీసుకెళ్ళాడు. మధ్యధరా సముద్రంలోకి చొచ్చుకు వచ్చిన పక్షి ముక్కులాంటి నేల కొమ్ము కొస ఇది. ఆ ప్రాంతమంతా వ్యవసాయప్రధానమైన

సాగు భూమి. మధ్యధరా తీరం వెంబడి నారింజ, ఆలివ్ తోటలు కనిపించాయి. ప్రపంచంలో అత్యధికంగా ఆలివ్ నూనెను ఎగుమతి చేసే దేశాలలో ట్యునీసియా నాలుగవ స్థానంలో ఉందని తెలిసి నేను ఆశ్చర్యపోయాను.

కొంచెం దిగువన కోర్బస్ బీచ్ ఉంది. తీరాన కొలవున్న కొండల మీద నుండి సముద్రంలోకి జాలువారుతున్న వేడి నీటి జలపాతాలు అంత అందంగా ఇంకెక్కడా కనపడవు. ట్యునిస్ నుండి చాలా మంది, వీటిని చూడటం కోసమే, దినసరిగా ఇక్కడకు వస్తారట. అక్కడ పురుషులు స్నానాలు చేస్తుంటే, స్త్రీ లు అక్కడి టాంకులలో చేరిన నీళ్ళలో పాదాలు తడుపుకుంటున్నారు. అనేక ధాతువులఖనులైన పర్వతాల మీద ప్రయాణం చేసి ఇక్కడకు చేరిన నీరు సహజ వ్యాధి నిరోధకమని స్థానికుల నమ్మకం. ముఖ్యంగా చర్మ సంరక్షణకు. మేము పాదాలు కడగటంతో సరిపెట్టుకున్నాము. హాటెమ్ మాకు దొరకటం నిజంగా మా అదృష్టం. ఎంత పరిశోధన చేసినా, ఒక ప్రాంతం గురించి స్థానికులకు తెలిసినంతగా మనం తెలుసుకోలేము. అందుకు ఒక ఉదాహరణగా, హాటెమ్ మాకు చూపించిన ఒక విశేషం, ఒక తారు రోడ్డు మీద. నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మీద ఒక చోట కారు ఆపి మమ్మల్ని దిగి చూడమన్నాడు. రోడ్డు ఒక ప్రక్కన క్రిందికి వాలుతూ పోతోంది. మేము వెళ్ళే వైపు ఎత్తుగా ఉంది. మళ్ళీ మేమందరమూ కారెక్కిన తరువాత, కారును న్యూట్రల్ గేరులో పెట్టాడు హాటెమ్. మేమంతా కారు వెనక్కి జారి పోతుందని చూస్తున్నాము. దానికి భిన్నంగా కారు ఎత్తుగా ఉన్న ముందు వైపుకు జారటం మొదలెట్టింది. భూమ్యాకర్షణకు లొంగని ప్రదేశాలు, భూమి మీద అక్కడక్కడా ఉన్నాయట. వాటిలో ఇదొకటి. ఇది వరకు, కాలిఫోర్నియాలో శాన్ ఫ్రాన్సిస్కో సమీపంలో ఇటువంటి విశేషాన్ని నేను చూశాను. దీనికి శాస్త్రీయ వివరణ కోసం చూసినపుడు, ఆ ప్రాంతంలో మాకు కనపడిన ఎత్తు పల్లాలు కేవలం దృక్కోణపు మిధ్యమాత్రమేనట. అక్కడ స్పష్టమైన దిగంతపు రేఖ కనపడక పోవటమే దీనికి కారణమని తెలిసింది. ఏమైనా దీనిని తెలుసుకున్న స్థానికులు, మాకు చూపించిన హాటెమ్ అభినందనీయులు.

ఇన్ని విశేషాలు చూసినా, నా మనసు ఇంకా సంతృప్తి పడలేదు. ఇంకేదో చూడలేదని అనిపిస్తూనే ఉంది. దేశం చూడటమంటే, వింతలు విశేషాలూ చూడటమేనా? ఇంకేమీ లేదూ!! ట్యునీసియా వ్యక్తిత్వాన్ని, అస్థిత్వాన్ని,



కేప్ బాన్ కోర్బస్ బీచ్

నైజాన్ని పట్టి చూపేదేదో నేను ఇంకా చూడలేదు. ఇంకా ప్రజలతో మమేకమవ్వాలి. వారి దినచర్య చూడాలి. వారి అలవాట్లు, నమ్మకాలు, ఆలోచనలు తెలుసుకోవాలి. కాని ఈసారి నేను భార్యా పిల్లలతో విహార యాత్రకు వచ్చాను. నా దృక్కోణంలో యాత్ర కొనసాగిస్తే, ఏడు సంవత్సరాల నా పిల్లలకు, వాళ్ళ సంతోషమే తన సంతోషమనుకునే నా భార్యకు న్యాయం చేసినట్లు కాదు. వారి దృష్టిలో హాలి డే కి వెళ్ళటమంటే, దైనందిన జీవితంలో నెమ్మదిగా వేళ్తూనే యాంత్రికతను తప్పించుకోవటానికి వీలు కల్పించే ఉత్సాహ పూరితమైన ప్రాంతానికి వెళ్ళటం. కొన్నిసార్లైనా, ముఖ్యంగా వాళ్ళతో కలసి వచ్చినప్పుడైనా, నా ప్రాధాన్యతలను పక్కకు పెట్టటం సమంజసం. ఆ రోజు సాయంత్రం హొటల్‌లో కలసిన ఒక జర్మన్‌తో మాటలు కలిపినప్పుడు, అతను దగ్గర్లో ఉన్న బర్బర్ పల్లెకు వెళ్ళమని సూచించాడు. ఇది నా ఆలోచనలకూ, నా పరివారపు ఆకాంక్షలకు మధ్యే మార్గంలా అనిపించింది. ఈ విషయమే మా వాళ్ళతో చెప్పాను. మరునాటి కార్యక్రమంలో ఒంటెల మీద సవారి కూడ ఒకటి.

**బెర్బర్ పల్లెలో ఒంటె సవారీ :** కావలసిన ఏర్పాట్లు చూడటానికి హాటెమ్‌ను పురమాయించాను. ఉదయాన్నే మేమంతా ఉపాహారం ముగించిన తరువాత, హాటెమ్ కారు గ్రామీణ ప్రాంతం వైపుకు దారి తీసింది. దోవంతా ఆలివ్ తోటలు, మొక్క జొన్న చేలు, కూరగాయల మళ్ళు. కనుల పండుగగా ఉంది. గ్రామాలను దాటుకుంటూ 45 నిముషాల ప్రయాణం తరువాత, పొలాల మధ్య ఉన్న ఒక ఫార్మ్ హౌస్ చేరుకున్నాము. అక్కడ చాలా గుర్రాలు, ఒంటెలు ఉన్నాయి. అప్పుడే, ఒంటె స్వారీ ముగించుకున్న నలుగురు యువత కనిపించారు. చూడటానికి ఫ్రెంచ్

వారిలా ఉన్నారు. మేము కూడ, పెద్ద వాళ్ళిద్దరం ఒక్కొక్క అమ్మాయితో రెండు ఒంటెల మీదకు ఎక్కి కూర్చున్నాము.

మా బర్బర్ గైడు మా ముందున్నాడు. అతని వెనుక మా ఒంటెలు. మా వెనుక, ఒక గుర్రపుబగ్గీ. అదెందుకు? అని అడిగినప్పుడు అవసరమైతే ఉంటుందని సమాధానం. అసలు సంగతేమిటంటే..ఆ పెద్ద పెద్ద ఒంటెల వీపు మీదకు ఎక్కి కూర్చోవాలంటే, మన రెండు కాళ్ళనూ బాగా అడంగా విరగ దీసి, అటూ ఇటూ వేసి కూర్చోవాలి. కొంచెం సేపు ఫరవాలేదు. కాని ఆ రోజు మా ఒంటె మీద ప్రయాణం రెండు గంటలట. మాలాంటి వారి పరిస్థితి మా గైడుకు బాగా తెలుసనుకుంటాను. కొంచెం సేపట్లో మా పరిస్థితి విషమించితే, మమ్మల్ని వెనక్కి తీసుకు/ మోసుకు రావటానికే ఈ గుర్రపు బండి ఏర్పాటు.

అసలు విషయం తెలుసుకున్న తరువాత మా పిల్లలు మాత్రం, 'మేము మాత్రం ఒంటె స్వారీ పూర్తి కాకుండా దిగము' అని ప్రతిజ్ఞ చేశారు. గైడు కూడ నవ్వుకుంటూ "అలా అయితే సరే. మీరు కావాలనుకుంటేనే గుర్రపు బండి ఎక్కండి" అన్నాడు. ఒంటెలు నెమ్మదిగా, తక్కుతూ తారుతూ మట్టి రోడ్ల మీద సాగుతున్నాయి. ఉయ్యాల డోలికలు మా కందరికీ ఆనందంగా ఉన్నాయి. పొలాలు, ఆలివ్ తోటలు, అకేషియా చెట్ల మధ్య నుండి సాగి పోతున్నాము. ఎక్కడో సన్నగా ఒక చిన్న అసౌకర్యం. ఒంటె మూపు మీద మేమందరమూ అటూ ఇటూ కదలటం మొదలెట్టాము. ఎట్లాకూర్చుంటే అసౌకర్యం తగ్గుతుందోనని ప్రయోగాలు చేస్తున్నాము. మా పిల్లలకైతే పైకి ఏమన్నా అనటానికి చిన్న పాటి సిగ్గు. కాసేపు ఆ సిగ్గు పని చేసింది. కాని కాళ్ళ మధ్య నుండి కటి భాగమంతా పాకి పోయిన నొప్పి కాసేపటికి దుర్భరమై పోయింది. ఇక సిగ్గు, బిడియం, మొహమాటంలాంటి వాటన్నిటినీ నొప్పి జయించేసింది. ఇక లాభం లేదని, గుర్రపు బండి ఎక్కుతామని అడిగేశాము. పెదవుల వెనుక నవ్వు బిగబట్టిన మా బర్బర్ గైడు, మమ్మల్ని గుర్రపు బగ్గీలోకి అనుమతించాడు. మనసులో 'బ్రతుకు జీవుడా!' అనుకున్నాను. మేము వెళ్ళిన బర్బర్ పల్లె, మట్టి గుడిసెలతో ప్రశాంతంగా ఉంది. అక్కడ ఇద్దరు స్త్రీలు రొట్టెలు తయారు చేస్తున్నారు. ఒకరు పిండి కలుపుతుంటే మరొకరు మట్టి పాత్ర మీద పిండిని వత్తుతూ రొట్టె చేస్తున్నారు. రొట్టె కాలుతున్న వాసన తాజాగా ముక్కు పుటాలకు విందు చేస్తూ ఆకలి పుట్టిస్తోంది. ఒక అరడజను రొట్టెలు కొని, వాటిని తింటూ ఆ గ్రామమంతా తిరిగి చూశాము. రొట్టెలు పైన కరకరలాడుతూ, లోపల మెత్తగా చాలా రుచిగా ఉన్నాయి. మొత్తం మీద, మా వాళ్ళకు కావలసిన సాహసకృత్యం ఒంటె సవారీ రూపంలోనూ, నాకు కావలసిన స్థానికుల సాంగత్యం రెండూ ఆ రోజు దొరికాయి.

హమ్మామెట్ : హమ్మామెట్ కేంద్రంగా మా యాత్ర మొత్తం సాగినా, అప్పటి వరకూ హమ్మామెట్ పట్టణం చూడలేదు. రేపే తిరుగు ప్రయాణం. అందుకని, ఎలాగైనా ఆ రోజు సాయంత్రం పట్టణం లోకి వెళ్ళాలనుకున్నాము. హమ్మామెట్ మల్లె పూలకు, ఆలివ్ తోటలకు ప్రసిద్ధి. పట్టణ వీధుల్లో అంతటా మల్లె పూల సౌరభం నిండి ఉంటుందని విని ఉన్నాము. కాని అది మాకు అనుభవం కాలేదు. పాత బస్తీలో మదీనా ప్రాంతం వెయ్యి సంవత్సరాల నాటిది. దుకాణాలతో నిండిన వీధులలో భవనాలన్నీ వెల్ల వేయబడి, తెల్లగా ఉన్నాయి. కస్బా అనబడే పురాతనమైన కోట కనిపించింది. ట్యునిస్, సోస్సె లతో పోల్చినప్పుడు ఈ పట్టణం చిన్నదే అయినా, హడావుడి లేకుండా, మా అంతట మేము తిరిగి చూడటానికి వీలుగా ఉంది. 20 వ శతాబ్దం మొదట్లో హమ్మామెట్ ఒక చక్కని పట్టణంగా, రచయితలను, కళాకారులను, రాజకీయ వేత్తలను ఆకట్టుకుంది. సర్ విన్ స్టన్ చర్చిల్ కొంత కాలం పాటు ఇక్కడ ఉండి, తన అనుభవాలను క్రోడీకరించుకున్నాడట.


హమ్మామెట్ సముద్ర తీరంలో, కొండల అంచున సాగిపోయే మార్గం, మధ్యధరా సముద్రంలోకి సూర్యుడు ఒదిగి పోతున్న అలౌకిక దృశ్యాన్ని, అద్భుతంగా మా కళ్ళ ముందు ఆవిష్కరించింది. ఆ సాయంత్రం, ఆకాశ నీలం, నారింజ, ఎరుపురంగులను కలుపుకుంటూ%ొ%మధ్యధర అద్దంలో చూసుకుంటూ%ొ%చివరకు సంధ్య దుపట్టా కప్పుకుని, సూర్యుడి నుండి శెలవు తీసుకునే వరకు%ొ%మా ట్యునీసియా యాత్ర సాగింది. ఒక ప్రత్యేకమైన దేశపు భౌగోళిక, సాంస్కృతిక, సాంఘిక. చారిత్రక వర్ణచిత్రాలను మా కళ్ళ ద్వారా మనసులో నింపుకున్న ఆనందంతో లండన్ తిరిగి వచ్చాము.

మి

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: జయశ్రీ అట్లూరి (స్టోక్ ఆన్ ట్రెంట్)
e-mail: jayasreeatluri@hotmail.com

# ఆయన హృదయమే ఓ గ్రంథాలయము

– మిసిమి



లంకా సూర్యనారాయణ

*లంకా వారితో నా అనుబంధం ఒకనాటిది కాదు – ఎప్పుడు కలిశామో – ఎందుకు కలిశామో? శారదగారి బెజవాడ సరస్వతీ గ్రంథాలయంలో ఒక సందర్భంలో. ఆయన గుంటూరు నుంచి, నేను బెజవాడ నుంచి అతిథులుగా హాజరయ్యాం – మీరు గుంటూరు రండి, అన్నారు, ఆ కార్యక్రమం తర్వాత, మీతో ఈ కార్యక్రమంలో పాల్గొనటం నాకు గౌరవం – అంటూ. తర్వాత గుంటూరు ఎప్పుడు వెళ్లానో వెంటనే చెప్పలేను – కాని నేను కాంద్రేగుల నాగేశ్వరరావు ఆయన ఆతిథ్యం ఎన్నిసార్లు పొందామో – ఎలాగంటే మా పరిశోధనకు వారి గ్రంథాలయం ఒక నిధి. కాని ఎలా అక్కడ రోజుల తరబడి వుండాలి – అదే ఆయనతో చెప్పాం – రండి – మా అతిథులుగా అని – దేవస్థానం అతిథి గృహంలో అన్ని ఏర్పాట్లు చేసేవారు – కాని ఉదయాన్నే టిఫిన్ కారియర్లో టిఫిన్ తెచ్చేవారు – మేము మూడు గంటలు పుస్తకాలు వెతుక్కుంటూ గడిపితే – మళ్లీ కారియర్‌తో భోజనం తెచ్చేవారు – సాయంత్రం మా పాటికి మమ్మల్ని వదిలిపెట్టమని అడిగేవాళ్లం – ఆయన కొంటెగా నవ్వి – సరే – రేపు ఉదయం కలుస్తాను – వెళ్లలేక వెళ్లేవారు – మాకేమీ అసౌకర్యం కలుగుతుందో అని ఆయనపడే తాపత్రయం చూస్తే – మాకు ఏమి చేయాలో తోచేది కాదు – ఈవిధంగా హైదరాబాద్ నుంచి రెండు మూడుసార్లు వెళ్లాం – ఎప్పుడు వెళ్లినా అదే అతిథి గృహం – అదే ఆతిథ్యం – అతిథి మర్యాదలు – అలా వెళ్లిన ఒక సందర్భంలో గిరిధర్ గౌడ్‌ని కలవాలి అని మేము అనుకుంటున్నది ఆయన విని – ఇంటికి తీసుకువెళ్లి – కారు మీద కవరు తీసి – తాళం చేతిలో పెట్టారు! అది వేరే కథ – ఇవన్నీ – తీర్చలేని రుణం – తర్వాత పిడిఎఫ్ సౌకర్యం వచ్చిన తర్వాత అంతా ఫోన్‌లోనే జరిగి పోతుంది. ఎన్నో లైబ్రేరీలు చూశాను. న్యూయార్క్ సెంట్రల్ లైబ్రరీ – వాషింగ్టన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ – శాన్‌ఫ్రాన్సిస్కో పబ్లిక్ లైబ్రరీ – బ్రిటీష్ లైబ్రరీ – వీటన్నిటిలో పుస్తకాలు వుంటాయి – కాని గుంటూరు అన్నమయ్య గ్రంథాలయంలో – లంకా సూర్యనారాయణ గారు – మిమ్మల్ని రెండు చేతులతో ఆహ్వానిస్తారు – ఆయన వెచ్చని ఊపిరితో ప్రాణం పోసుకున్న పుస్తకాలుంటాయి – మిమ్మల్ని ఆప్యాయంగా పలకరిస్తుంటాయి. ఒకసారి వెళ్లి చూడండి!*

– ఎ.కె.

గుంటూరు బృందావన్ కాలనీలో ఉన్న అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయంలో అడుగుపెట్టగానే తెల్లటి దుస్తుల్లో ఉన్న ఓ పెద్దాయన సాదరంగా ఆహ్వానించారు. ఆయనే లంక సూర్యనారాయణ గారు. తన సొంత ఖర్చుతో వేలకొద్దీ పుస్తకాలు ఎన్నో సంవత్సరాలుగా సేకరించిన పెద్ద మనిషి.. ఒక దశలో వారి ఇల్లంతా పుస్తకాలతో నిండిపోయిందిట. ఎటుచూసినా గుట్టలు గుట్టలుగా పుస్తకాలు. సాధారణంగా ఇళ్ళలో పుస్తకాలు పేరుకు పోవడాన్ని ఎవరూ ఒప్పుకోరు. అలాంటిది ఆయనకు కుటుంబం అండగా నిలిచింది. కుటుంబమంటే ఆయన భార్యా పిల్లలు. ఈ పుస్తకాల కోసం లక్షల రూపాయలు ఖర్చుచేశారు. సంకల్పం దృఢమైనదయితే ప్రకృతి కూడా సహకరిస్తుందంటారు. అలా గుంటూరు బృందావన్ కాలనీలోని ఆ వేంకటేశ్వర స్వామి ఆలయం వారికి చోటిచ్చి ఆ పుస్తకాలకు వెలుగు దీపమయ్యింది.

**మిసిమి** గతంలోనే వారికృషిపై వ్యాసం వెలువరించింది. ఈసారి **మిసిమి** బృందం గుంటూరు పయనమయింది. ఇంతటి బృహత్తరమైన ప్రయత్నాన్ని ఆయన చుట్టూ ఉన్న వారు ఎలా కర్తవ్య దీక్షతో ఆ బాధ్యతను తలకెత్తుకున్నారో చెప్పటానికి ప్రయత్నం చేసింది. నిజానికి సూర్యనారాయణ గారికి మాట అంతగా సహకరించటం లేదు. కానీ కూడదీసుకుని, కూడబలుక్కుని ఆయన చెబుతుంటుంటే ఆ మాటల సారాంశం గుండెకు తాకినట్లనిపించింది. స్వతహాగా చదువరి అయిన వారికి పుస్తకాలు సేకరించాలన్న ఈ ఆలోచన కాలేజీ రోజుల్లోనే కలిగింది. నెమ్మదిగా మాట మాటను పేర్చి చెప్పే ప్రయత్నం చేశారు

1951నాటి ఆంధ్రపత్రికను గుర్తుచేసుకున్నారు. దాని వెల అప్పట్లో ఎంతో చెప్పాలని ప్రయత్నం చేశారు.. ఆయనకు ఆ పత్రిక అంటే అంతిష్టం. ఇలా పుస్తకాలు సేకరించాలన్న ఆలోచనకు బీజం అప్పుడే పడిందన్నారు. నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ ఆ పుస్తకాలను ఎలా జాగ్రత్తగా దాచారో చూపించారు. బయోగ్రఫీలు, పద్య కావ్యాలు, ఇంగ్లీష్ ఫిక్షన్, పత్రికలు, డిక్షనరీలు ఇంకా అనేక రకాల పుస్తకాలు. ఆయన ప్రతి పుస్తకాన్ని ప్రేమగా తడుముతుంటే ఆ పుస్తకాలు పులకించిపోయాయనిపించచింది. ఇలస్ట్రేటెడ్ వీక్లీకి సంపాదకత్వం వహించిన ఏ.యస్.రామన్ తెలుగువారు. ఆ పత్రిక ఒక కాపీలో వారు సూర్యనారాయణ గారిని మెచ్చుకుంటూ సంతకం చేసిన అపురూప సంచికను మాకు చూపారు. 1964 నాటి సంచిక అది.

2001లో ప్రముఖ నటులు కొంగర జగ్గయ్య వీరి కృషిని శ్లాఘిస్తూ ముత్యాల్లాంటి దస్తూరీతో ఉత్తరం పంపించారు. తమ పుస్తకాన్ని పంపుతూ మద్రాసుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆ లెటర్ మాకు చూపారు. దాంతోపాటు ఆయన సేకరించిన నాలుగు వందల కాఫీ టేబుల్ బుక్స్ దొంతర చూపుతున్నప్పుడు వారి కళ్లలో తడి నీడలు. ఇవన్నీ ఆయన తన సొంత నిధులతో కొన్న పుస్తకాలు.. వారి ఈ నిస్వార్థ సేవలో పాలుపంచుకుంటున్న కుటుంబ సభ్యులు నిజంగా ధన్యులు. ఈ గ్రంథాలయంలో తమవంతు పాత్ర పోషిస్తున్న అక్కడి సభ్యులను పలకరించింది **మిసిమి.** ముందుగా వారి పెద్దబ్బాయి విజయసారథి ఎంతో భావోద్వేగానికిలోనై చెప్పిన కబుర్లు వారి మాటల్లోనే.

"నాపేరు విజయసారథి.. నేను సూర్యనారాయణ గారి పెద్దబ్బాయిని. ముప్పై సంవత్సరాలు ఉద్యోగం చేశాక, ప్రస్తుతం వారి సేవలోనే ఉన్నాను. మా నాన్నగారి స్వగ్రామం గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు. మా తాతగారు లక్ష్మి నారాయణ గారికి వారి ఊరిలో సాయంకాలాలలో పురాణ కాలక్షేపం చేస్తుండేవారు. ఆతన పుస్తకాలు బాగా చదివేరు. వేయిపడగలు చాలా కాలం వారి వద్ద ఉండేది. చెదలు ఇష్టపడి ఆ పుస్తకాన్ని తినేసే వరకు. ఆయనకు పుస్తకాలు చదివే అలవాటు బాగా ఉండేది. అదే మా నాన్నకు వచ్చింది. 1946లో మా తాతయ్య కాలం చేశాక, మా పిన్ని గారి భర్త ఉప్పలపాటి ఆనందరావు గారి ప్రభావం మా నాయన మీదుండేది. ఆయన వామపక్ష వాది. పుస్తకాలు కొనటం చదవటం ఆయన హాబీ. అలా ఆయన ప్రభావం కూడా ఉండేది. మా నాయనగారికి రెండే వ్యసనాలు. ఒకటి పుస్తకాలు, రెండోది సినిమాలు. ఫొటోగ్రఫీ అంటే ఇష్టం కూడా. ఎప్పుడూ ఓ కెమేరా ఆయన బ్యాగ్‌లో ఉండేది. మా నాన్నగారు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. ఆయన చేసే ఉద్యోగాన్ని అప్పట్లో పొగాకు ఇన్స్పెక్టర్ అని పిలిచేవారు. ఆ తర్వాత అది సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అయ్యింది. ఇప్పుడు జి.యస్.టి.గా మారింది.



విజయసారథి.

**మిసిమి : పుస్తకాలు కొనటం ఎప్పుడు అలవాటు అయింది?**

**విజయసారథి :** ఇది ఒక్క రోజులో జరిగింది కాదండీ. 1950నుంచి మొదలైన ఈ అలవాటు ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. అంటే డెబ్బై ఐదేళ్ల ప్రయాణం ఆయన ఈ పుస్తకాలతో. మా నాన్నగారి తొలి రోజుల సర్వీస్ అంతా రాయలసీమలో గడిచింది. గిద్దలూరు, పెందుర్తి, తాడిపత్రి, నంద్యాల పట్టణాల్లో పనిచేసి కర్నూలు దగ్గరున్న అలంపూర్ చేరారు.

ఈయనకన్నా గొప్ప వ్యక్తి మా అమ్మ వరలక్ష్మి గారు. మా నాయనగారికెంతసేపూ పుస్తకాలు, ఫ్రెండ్స్. ఇంటిని ఆయన పట్టించుకున్నది తక్కువే. ఆవిడ ఎప్పుడూ అడ్డుచెప్పలేదు. ఏమయ్యా, ఈ సంసారం, పిల్లలు నీకు పట్టరా అని ఆవిడ అడగలేదు. ఇవాళ వీళ్ళు భోజనానికొస్తున్నారని మా నాయన చెబితే మారు మాట్లాడకుండా వడ్డించి పెట్టేది. ఈయన ఎన్ని జన్మలెత్తినా ఆవిడ ఋణం తీర్చుకోలేనిది. అది ఆయన అదృష్టం. 2022లో ఆవిడ కాలం చేశారు. ఇక పిల్లల విషయానికొస్తే నేను పెద్దవాడిని. నా తర్వాత ఇంకో ఇద్దరున్నారు. నేను బి.ఏ చదివాను. రెండోవాడు బి.కాం చదివాడు. అందుకని మూడో తమ్ముడు ఇంజనీరింగ్ చదవాలని నిశ్చయించుకుని అలాగే చదివించాము. ఆయన ఉద్యోగ ప్రస్థానంలో భాగంగా 1970లో ఆయన ఏలూరు వచ్చారు. అది ఆయన సాహిత్య ప్రస్థానానికి ఎంతగానో దోహదపడింది. అక్కడ ఆయన స్నేహితులు ఆయన జీవితాన్నే మలుపు తిప్పారు. కాళోజీ నారాయణరావు గారిది వరంగల్ అయినా అక్కడే పరిచయం అయ్యారు. మరొకరు కొమ్మన రాధాకృష్ణ. ఈరోజుకీ ఆయనతో కూచుంటే, ఆయన చెప్పే కబుర్లతో కాలం తెలియదు. వారితోపాటు వేగుంట కనక రామచందర్, లింగం వీరభద్రయ్య చౌదరి గారు. వీరందరికీ ఆద్యుడు గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు. వీరంతా సంవత్సరానికొకసారి సంక్రాంతి సభలని జరిపేవారు. ఆ సభల్లో రచయితలు ఎక్కడెక్కడనుంచో వచ్చి పాల్గొనేవారు. ఇక వెలగా వెంకటప్పయ్య గారితో మా నాన్నగారి అనుబంధం చివరి వరకూ సాగింది. వారంటే ఈయనకు ఎంత అభిమానమంటే ఈయన ఉండే బజార్‌కి ఆయన పేరు పెట్టించారు. మా నాన్నగారిని మీరు పుస్తక సేవ చేస్తున్నారు అని చూడండి. ఆయన ఒప్పుకోరు. నా ఇష్టం నలుగురికి ఉపయోగపడిందంటారు. ఇవ్వటం తప్ప తీసుకోవటం తెలియదు ఆయనకు. ఈ పుస్తకాలను జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చారు. దురదృష్టం ఇవాళ ఆయనకు అన్ని అవయవాలు సహకరించటం లేదు.

**మిసిమి** : **అన్నీ కొన్నవేనా.. ఎవరైనా ఇచ్చినవి కూడా ఉన్నాయా?**

**విజయసారధి :** కొంతమంది పెద్దలు ఇష్టంగా తమ పుస్తకాలు పంపించారు. వారిలో సంజీవదేవ్ గారు ఇంకా ఎంతోమంది ఉన్నారు. శ్రీరమణ గారికి ఈయన అంటే ఎంతో ఇష్టం. ఆయన మా నాన్నగారిని గ్రంథాళ్వార్ అని పిలిచేవారు.

**మిసిమి** : **ఈ గ్రంథాలయం ఏర్పడక ముందు దెబ్బై వేల పుస్తకాలు ఉండేవి అన్నారు. నిజమేనా?**

**విజయసారధి :** అవునండీ.. వంటింట్లో, వాకిట్లో, మంచాలకిందా, అటకమీద ఎక్కడ చూసినా పుస్తకాలు ఉండేవి. చేయి తగిలితే చాలు.. పువ్వులు జలజలా రాలినట్లు, పుస్తకాలు జారిపడుతుండేవి. ఆయన దృష్టంతా ఆ పుస్తకాలు.. వాటి భద్రతే..

**మిసిమి** : **నటులు కొంగర జగ్గయ్య గారు మీ నాన్నగారికో ఉత్తరం రాశారు కదా.అదే సందర్భంగానో చెప్పండి?**

**విజయసారధి :** జగ్గయ్యగారికి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి పుస్తకం అనువాదం చేస్తున్నప్పుడు మా నాయన గురించి ఆయన పుస్తకాల సేకరణ గురించి చెప్పారు. ఆ చెప్పింది బి.ఎస్.ఆర్.కృష్ణగారు. ఆయన ఇందిరాదత్ గారి వరల్డ్ తెలుగు ఫెడరేషన్‌లో ఏదో బాధ్యతలో ఉన్నారు. గుంటూరు పక్కనే ఉన్న సిరిపురంలో ఉంటారు. ఆచార్య ఎన్.జి.రంగా గారి శిష్యులు దరువూరి వీరయ్య గారి బంధువు. అలా వారి వలన జగ్గయ్యగారి పరిచయం నాన్న కు ఏర్పడింది. ఇక్కడనుండి ఏవో పుస్తకాలు కావాలంటే పంపించాము. నిజానికి జగ్గయ్య గారి ఒకమ్మాయి ఇక్కడే గుంటూరులో ఉండేది. నాన్నకు ఉత్తరం రాస్తూ మిమ్మల్ని ఇప్పటివరకు కలుసుకోకపోవటం దురదృష్టం అని పేర్కొన్నారు. అప్పటికే జగ్గయ్యగారి ఆరోగ్యం దెబ్బతింది. మద్రాసు రండని ఆహ్వానించారు. నాన్నకు ఫోన్ చేసి మాట్లాడారు.

**మిసిమి** : **ఉద్యోగంతో పాటు పుస్తకాలు కొనే హాబీని ఎలా బేలన్స్ చేసుకున్నారు?**

**విజయసారధి :** నిజానికి నాన్నగారి గురించి అందరికీ తెలిసింది. ముఖ్యంగా సండే మార్కెట్‌లోని సెకండ్ హేండ్ బుక్ షాపుల వారికి నాన్నంటే ఎంతో ప్రేమ. ఆయన కోసం పుస్తకాలు తీసి దాచిపెట్టేవారు. కబురు పంపించేవారు. అది నాన్న పట్ల వారు చూపిన గౌరవం అనుకుంటాను. అలా విజయసారధి గారు తండ్రిగారి నిస్వార్థపూరిత ప్రయత్నాన్ని మాకు పరిచయం చేశారు. ఆయన కళ్ళలో నీటిపొర. ఆయన గుండెలో ప్రేమతో కూడిన తృప్తి

గోచరించాయి. నిజానికి ఈ ఆధ్యాత్మిక గ్రంథాలయంలో కొంతమంది ఉద్యోగులు కూడా ఉన్నారు. వారిలోని అంకితభావం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. బహుశః అది సూర్యనారాయణ గారి పట్ల వారు చూపే ప్రేమాభిమానాలకు సంకేతం అనుకోవచ్చు. ఎప్పటినుండి ఈ గ్రంథాలయం ఇక్కడ ఏర్పాటయింది. ఇప్పుడు ఈ గ్రంథాలయ నిర్వహణ ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇక్కడి లైబ్రేరియన్ సుభాషిణి గారిని కలిశాం. వారు చాలా ఆసక్తికరమైన అంశాలు మాతో షేర్ చేసుకున్నారు

**మిసిమి** : **ఇక్కడకు అంటే వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో ఎలా ఈ అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పడిందో చెప్పండి?**

**సుభాషిణి :** 2012 డిసెంబర్ 25న తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో ఇక్కడ ఈ గ్రంథాలయం మొదలయ్యిందండీ.. తి.తి.దే.వారి జెఈఓ వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఒక దేవాలయంలో ఒక ఆధ్యాత్మిక గ్రంథాలయం ఉండాలన్న ఆలోచన అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్వీ సుబ్రహ్మణ్యం గారిది. ఆయనకు ఈ రెడీమేడ్ గ్రంథాలయం ఎంతగానో నచ్చింది. ఇలాంటిది ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని ఆయన తలిచారు కానీ అది వీలుపడలేదు. ఆయన అనుకున్న ప్రాజెక్టులో ఇదే మొదటిది.. ఇదే చివరిది. మొదట సార్ వారింటి నుంచి సెల్లార్‌లోకి పుస్తకాలు చేర్చాం. తరవాత నెమ్మదిగా ఇక్కడికి ఆ పుస్తకాలు తీసుకురావడం జరిగింది. వీటినన్నిటిని కేటగిరీల వారిగా అమర్చాం. తితిదే వారు రెండు సంవత్సరాల పాటు నిధులు సమకూర్చారు. కొంత ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు గుడివారే ఆర్థికంగా మాకు సహాయపడుతున్నారు. అంతకుముందు కూడా గుడి వారే సహాయపడ్డారు. ప్రస్తుతం మా అందరి జీతభత్యాలు, కరెంట్ బిల్లు దేవస్థానం వారి చలవే. ఇక్కడికి గుంటూరులోని ప్రముఖ రచయితలు వల్లూరి శివప్రసాద్, పాపినేని శివశంకర్ లాంటి వారందరూ వస్తారు.



లైబ్రేరియన్ సుభాషిణి

మళ్లీ విజయసారథి గారు ఈ లైబ్రరీ నిర్వహణకు సంబంధించి అనేక విషయాలు చెప్పారు. అవి వింటే మీరూ ఆశ్చర్యపోతారు. 2022లో మా అమ్మ గారు పోయాక పుస్తకాలపై ఆయన ఖర్చు పెరిగింది. మా నాన్నగారి పెన్షన్ అరవై వేలయితే ఆయన ఎనభై వేలు ఖర్చుపెడతా ఉన్నారిప్పుడు. అదెలా సాధ్యం అంటే అలా జరిగి పోతా ఉందంతే. మా చిన్నాబ్బాయితో ప్రతి ఆదివారం సండే మార్కెట్‌కు వెళుతున్నారు. ఇంకా ఎక్కువ పుస్తకాలు కొంటున్నారు. మా అమ్మగారి చివరిరోజుల్లో మా తమ్ముడు దగ్గరకు వరంగల్ తీసుకువెళ్ళాం. మా మరదలు డాక్టర్ కావటం ఒక కారణం. మా పెద్దబ్బాయి యుఎస్ నుంచి వచ్చాడు. వాడికి తాతా, నానమ్మలంటే ఇష్టం. వాడిని తీసుకొద్దామని ఎయిర్పోర్ట్‌కు వెళుతుంటే ఈయనా వస్తానన్నాడు. ఆయనకు ఎక్కడికో వెళ్ళాలి. ఇంకొన్ని పుస్తకాలు కొనాలి. ఆ ప్లేస్ ఆయనకు గుర్తు లేదు. ఐదేళ్ళ క్రితం వచ్చాడా ప్లేస్‌కు ఆయన.. ఆ ప్లేస్ చెప్పలేదు. అరగంట తిరిగాక గుర్తు పట్టాడు. అది తెలంగాణ సాహిత్య అకాడమీ వారి సేల్స్ కౌంటర్ దగ్గరకు. జేబులో పైసా లేకపోయినా ఆరువేల ఐదొందల రూపాయల విలువ చేసే పుస్తకాలు కొన్నాడు. ఇప్పుడు ఈయన రాలేకపోతున్నాడని అందరూ ఇక్కడికే తమ పుస్తకాలు తీసుకొస్తున్నారు. అది ఆయనకు దక్కిన గౌరవం అనుకుంటాను.

**మిసిమి** : **గుంటూరుకి ఎప్పుడు షిఫ్ట్ అయ్యారు?**

**విజయసారథి :** 1974లో గుంటూరు వచ్చేశామండీ.. ఇక్కడో అడ్డా ఉందాయనకి. నవోదయా పబ్లికేషన్స్ రమేష్ గారిని ఉన్నారు. ఆరోజుల్లో సంజీవ్ దేవ్ గారొస్తుండేవారు. కాళోజీ నారాయణరావు గారు వరంగల్లు వెళ్ళినప్పుడల్లా కలిసేవారు.

**మిసిమి** : **రోజూ ఎంతమంది ఇక్కడికి వస్తారు?**

**విజయసారథి :** ఇక్కడికి రోజూ వచ్చే వారికంటే ఫోన్ ద్వారా అడిగేవారు ఎక్కువ. పుస్తకం ఇస్తే గ్యారంటీగా తిరిగొస్తుందన్న నమ్మకం లేదు. ఇక్కడున్న మా లైబ్రరీ అసిస్టెంట్ అమరనాథ్ పిడీఎఫ్ చేసి పంపిస్తాడు. ఎంతలావు పుస్తకం అయినా సరే.

**అమర్నాథ్** : నా పేరు అమర్నాథ్ అండీ. ఎవరైనా ఏదైనా పుస్తకం అడిగితే అది ఉందో లేదో చెక్ చేస్తాను. ఉంటే స్కాన్ చేసి యాప్ ద్వారా ఎడిట్ చేసి పి.డి.ఎఫ్.చేస్తాం. ఇప్పటివరకు పధ్నాలుగు వందల పుస్తకాలు పి.డి.ఎఫ్.ఫార్మాట్ లోకి మార్చాం. అడిగేవారిలో ఎక్కువగా హైదరాబాద్, బెంగుళూరు నగరాల వారుంటారు. మిగిలిన చోట్ల నుంచి కూడా ఎంక్వయిరీలు వస్తాయి. లోకల్‌గా ఉండేవారు పర్సనల్‌గా వచ్చి అడుగుతుంటారు.



కంప్యూటర్ అసిస్టెంట్ అమరనాథ్‌తో రామరాజు

**విజయసారధి :** ఇక్కడికి ఆ మధ్య వెంకయ్యనాయుడు గారు 2022మార్చి1న వచ్చి చూసి వెళ్ళారు. ఆయనకు ఎంతో నచ్చింది ఈ గ్రంథాలయం. నాన్నగారిని అభినందించి వెళ్ళారు.మా నాన్నగారు తనకు నచ్చిన వస్తువులను జాగ్రత్తగా కాపాడుకుంటారు. ఉదాహరణకు మా నాన్నగారు ఆరునెలలు క్రితం వరకు స్కూటర్ ఎవరికి ఇచ్చేవాడు కాదు. పుస్తకం ఎంతో, అదీ అంతే ఆయనకు. శుక్రవారం లైబ్రరీకి సెలవు. అయినా సరే ఆయన ఇక్కడికి వచ్చి ఓసారి చూసుకుంటే కానీ ఆయనకు నిద్ర పట్టదు. ఆయనకి ఎంత ఇన్వాల్వ్ మెంట్ అంటే పుస్తకాలతో.. మీరు ఏదైనా అంశం గురించి ఒక పుస్తకం అడిగితే పది పుస్తకాలు మీ ముందుంచుతారు. ఏ పుస్తకం ఎక్కడుందో ఆయనకు కొట్టిన పిండి. ఇక్కడ కేటలాగింగ్ చేశారని సుభాషిణి గారు చెప్పారు కదా. ఈ స్పైరల్ బైండ్స్ చూడండి.. ఇవన్నీ వాటి వివరాలతో కూడి ఉన్నాయి.

**మిసిమి** : **ఎమ్.వి.రాయుడు గారు పుస్తకాలను డిజిటైజేషన్ చేస్తున్నారు కదా. వారితో టచ్‌లో ఉంటారా?**

**విజయసారధి :** రాయుడు గారి దగ్గర లేనివి మేం స్కాన్ చేస్తాం. నాన్న యాభై సంవత్సరాలపాటు వివిధ పత్రికల్లో వచ్చిన ఎడిటోరియల్స్ పేజీలను దాచి ఉంచారు. అవన్నీ నూటైదు అట్టపెట్టెల్లో ఉన్నాయి. అవి రాయుడు గారు తీసుకొని వెళితే నాయన ఎంత బాధపడ్డాడో.. (చెబుతున్న విజయసారధి గారి కళ్ళలో నీళ్ళు). అలాగే మాలతీ చందూర్ గారి ప్రమదావనం కటింగ్స్ ఎన్ని జాగ్రత్తగా దాచారో ఆవిడ కూడా ఒకసారి ఇక్కడికి వచ్చారు. (ఉన్నట్టుండి విజయసారధి గారి దృష్టి ఈ గ్రంథాలయం భవిష్యత్తు వైపు మళ్ళింది) వైరాగ్యమనుకోవాలో, చేతకానితనం అనుకోవాలో.. ఇవ్వాళ ఉమ్మడి కుటుంబాలు లేకుండా పోయాయి. మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతున్నాయి.. కొంతమంది మా నాన్నను అడుగుతారు, సూర్యనారాయణ గారు మీ తర్వాత పరిస్థితి ఏమిటని.. ఉన్నన్నాళ్ళు ఉంటుంది అంటాడాయన. ఆ తర్వాత మనం పట్టుకున్నా ఆగుతుందా అంటాడు. సామ్రాజ్యాలు సామ్రాజ్యాలే కూలిపోయాయి. ఇక ఇదేమవుతుందన్న ఆలోచన దేనికి. ఉన్నన్నిరోజులు ఉంటుంది. ఇదీ ఆయన ఫిలాసఫీ..

విజయసారధి గారి రెండో అబ్బాయి శశి రోజూ తాత గారిని ఉదయం తొమ్మిదిన్నరకు దింపి వెళతాడు. మళ్ళీ మధ్యాహ్నం పన్నెండున్నరకు భోజనం చేయించటం కోసం తీసుకువెళ్తాడు. తిరిగి మూడున్నరకు తీసుకొచ్చి సాయంత్రం ఆరున్నరకి మళ్ళీ ఇంటికి తాతతో కలిసి వెళతాడు. ఇలా రోజుకు నాలుగుసార్లు కారులో ప్రయాణం చేయిస్తాడు. విజయసారధి గారు ఇంకో విషయం చెప్పారు. వెలగా వెంకటప్పయ్య గారు, సూర్యనారాయణ గారు రోజూ కొన్ని సంవత్సరాల క్రితం వేటపాలెం లైబ్రరీకి వెళ తుండేవారు. నార్ల వారి సంపాదకీయాలు పన్నెండు వాల్యూమ్స్ తిరిగి ప్రచురించడానికి ప్రయత్నం చేశారు. అప్పట్లో విజయసారధి గారి పెద్దబ్బాయి శ్రవణ్ కుమార్ వారితో కలిసి వెళుతుండేవాడు. తన పని ఆ ఎడిటోరియల్స్ జెరాక్స్ తీయటం.. తిరిగి వాటిని రీప్రింట్ చేసినప్పుడు వెలగా వెంకటప్పయ్య గారు లంకా శ్రవణ్ కుమార్ సహాయాన్ని ప్రత్యేకంగా ఆ పుస్తకంలో ప్రస్తావించారని మురిసిపోయారు. మళ్ళీ రెండో అబ్బాయి శశి మాట్లాడుతూ తను తాత గారిని సి.వి.ఎన్.ధన్, బుర్ర కథ పితామహుడు షేక్ నాజర్ దగ్గరకు తీసుకువెళ్ళే వాడినని గుర్తు చేసుకున్నారు.



లంకా శశి

తాతగారితో ఎన్నో మీటింగ్స్‌కు వెళ్ళానని, వెళ్ళిన చోట ప్రముఖుల ఆటోగ్రాఫ్స్ తీసుకోవడం తాతయ్య నేర్పాడని చెప్పారు శశి.

ఈ గ్రంథాలయంలో మెంబర్ షిప్ ఫీ అంటూ ఏమీలేదు. అలా అని పుస్తకాలు ఎవరికి పడితే వారికి ఇవ్వరు. పుస్తకాలు తీసుకుని వెళ్ళే వారి సంఖ్య అరవైకి మించదంటారు వారు ఒకవేళ ఇచ్చినా వారి గుండె కొట్టుకుపోతుంది ఆ పుస్తకం తిరిగి వచ్చేవరకు. అలాగే ఏ పుస్తకం ఎక్కడుందో వారికి తెలిసినట్టు ఎవరికీ తెలీదు అంటారు విజయసారధి. ఇచ్చిన పుస్తకం తిరిగొచ్చేవరకు సూర్యనారాయణ గారికి నిద్ర పట్టదు.

మాకొక అరుదైన పుస్తకం చూపించారు. అది భారత రాజ్యాంగం చేత్తో రాసిన రాత ప్రతి. అరుదైన ఈ పుస్తకంలో డ్రాఫ్ట్ కమిటీ సభ్యులంతా సంతకాలు చేసిన పుస్తకం. ఆ మధ్య అనిల్ నౌర్య అనే జర్నలిస్ట్ ఈ గ్రంథాలయం తెలిసి విజిట్ చేశారు. డ్రాఫ్ట్ కమిటీలో ఒకరైన మహావీర్ త్యాగి మనవడాయన. తాతగారి సంతకం చూసి భావోద్వేగానికి గురై చిన్నపిల్లాడిలా ఫొటోలు తీసుకున్నాడంటారు విజయసారధి. ఈ గ్రంథాలయానికి విజ్ఞులైన పెద్దలు రోజూ రావటం విశేషం. అలాంటివారిలో ఇరువురిని కలుసుకున్నాం. వారిరువురూ డెబ్బయ్యవపడిలో ప్రవేశించిన వారే. మొదటివారు డా.సీతారామారావుగారు. డాక్టర్ కోర్సు చేసి రెండు దశాబ్దాల పాటు ప్రాక్టీస్ చేసి న్యాయశాస్త్రం చదవాలనిపించి, ప్రాక్టీస్ ఆపేసి B.L, LLM కోర్సులు చేసి ప్రాక్టీస్‌లో దిగారు. కారణాలేవయినా డాక్టర్ ప్రాక్టీస్ మానేసి, లా ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు.


డా. సీతారామారావు

ఈ గ్రంథాలయం గురించి ఆయన అభిప్రాయం అడిగితే ఆయన ఏమన్నారంటే "నేను ఈ లైబ్రరీ మొదలయిన దగ్గర్నుంచి వస్తున్నాను. ఈ ఊళ్ళో చాలా లైబ్రరీలు ఉన్నాయి.. కానీ దీని ప్రత్యేకత దీనిదే. తన ఉద్యోగం తను చేసుకుంటూ పుస్తకాలకు ఇంత సేవ చేయటాన్ని ఎలా మెచ్చుకోవాలో కూడా తెలియటం లేదు. ఇక్కడ బుక్స్ మరెక్కడా దొరకవని అనిపిస్తుంది. ఒకవిధంగా ఇది గొప్ప రిఫరల్ లైబ్రరీ. నేను రంగా గారి పుస్తకాల గురించి వస్తూ ఉంటాను. నేను రంగా గారి అభిమానిని. నేను రాసిన ఆరేడు పుస్తకాలు రంగా గారి గురించి రాసినవే.

డాక్టర్ గారు చెప్పినదానికి అదనంగా చెప్పాలంటే ఆరోజుల్లో ఎన్.జి.రంగాగారు, వాసిరెడ్డి శ్రీ కృష్ణగారు, లింగం వీరభద్ర చౌదరిగారు, వెలగపూడి రామకృష్ణ గారు ఈ నలుగురు బార్ ఎట్ లా చదివిన ప్రముఖులు. వీరిలో వాసిరెడ్డి శ్రీ కృష్ణ ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయ్యారు అన్నారు విజయసారధి.

మరో పెద్దాయన్ని ఈ సందర్భంగా కలిశాం. వారి పేరు పెద్ది సాంబశివరావు గారు. మెడికల్&హెల్త్ డిపార్ట్మెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. వారు రూపొందించిన యూనికోడ్ విధానం అన్నమయ్య కీర్తనలకు సెర్చ్ ఇంజన్‌గా మారింది. ఆయన ఏమన్నారంటే "నేను ఇరవై ఆరేళ్ళబట్టి ఇక్కడే గుంటూరులో ఉంటున్నాను. మా ఊరు ఉన్నవ పక్కనున్న పెదగట్టిపాడుకు చెందిన ఒకాయన దగ్గర ఎన్నో పుస్తకాలు ఉంటాయని ఎవరో చెబితే, వెతుక్కుంటూ ఆయన ఇంటికి వెళ్ళి పరిచయం చేసుకున్నాను. ఆశ్చర్యం. ఇల్లో పుస్తక ప్రపంచంలా ఉంది. ఎటుచూసినా పుస్తకాలే.. మంచంమీద, కింద, పక్కన..పైనా.. ఇలా ఎటు చూసినా.. ఆ పరిచయం పెరిగి పెద్దదయ్యింది. ఆయన ఇక్కడ గుడిలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తుంటే వెంటే ఉన్నాను. పుస్తకాల అమరిక ఒక కొలిక్కి వచ్చాక వాటి వివరాలతో కూడిన పట్టిక అంటే కేటలాగ్ అవసరమని భావించాను. యూనికోడ్ నేర్చుకున్నాను. దానివలన పుస్తకాల సార్టింగ్ సులభం. తెలుగు భాషలో మొదటి కేటలాగ్ అని అనుకోవచ్చు. వికీపీడియా సాయంతో నెట్‌లో పెట్టాను. అన్నమయ్య


పెద్ది సాంబశివరావు

కీర్తనలపై కొంత వర్క్ చేశాను. పధ్నాలుగు వేల ఏడువందల కీర్తనలు అందుబాటులో ఉన్నాయి. అవన్నీ ఇరవై తొమ్మిది వాల్యూమ్స్‌లో ఉన్నాయి. ఒక కీర్తనలోని ఒక పదం సెర్చ్ చేస్తే అది ఏ వాల్యూంలో ఉందో తెలిసే ప్రక్రియ రూపొందించాను. నలభై డిక్షనరీలు నెట్‌లో అందుబాటులో ఉండేవిధంగా చూశాను. ఇదంతా ఈ గ్రంథాలయం నుంచే చేయగలిగాను. ఇంకా అభివృద్ధి చేయటానికి స్కోప్ ఉంది. అరుదైన పుస్తకాలు గుర్తించగలగాలి.



లంకా వారితో చెన్నూరి

సూర్యనారాయణ గారు ఎంత సున్నిత మనస్కులో చెప్పాలి. కొన్నేళ్ళ క్రితం ఒక ఉద్యోగస్తురాలు చెదలు పడుతున్నాయని కొన్ని పుస్తకాలు పారేసింది వారికి సమాచారం ఇవ్వకుండా. అది ఆయన కనిపెట్టి ఎంత బాధపడ్డారో చెప్పలేను. ఆయన కళ్ళలో ఎంత దుఃఖం పొంగిపొరలిందో ఆ రోజున." అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయంలో అలా వారందరూ ఆ గ్రంథాలయం గురించి చెబుతుంటే సమయం తెలియలేదు. ప్రతి పుస్తకాన్ని కన్నబిడ్డలా చూసుకునే లంకా సూర్యనారాయణలు ఎంతమంది ఉంటారు ఒకరన్నా ఉంటారా! సందేహం వెంటాడసాగింది..

సూర్యనారాయణ గారి మనవడు శశి చెప్పిన మాటలు కాస్త మనసును తెరిపిన పడేశాయి. వారబ్బాయికి ముచ్చటపడి తాతగారి పేరు పెట్టారుట. పేరు పెట్టినందుకు ఆయన పోలికలే వచ్చాయి. పుస్తకాలంటే ప్రాణం మావాడికి. ఆయన వారసత్వం నిలిపేవాడొచ్చాడనుకుంటున్నాం అన్న మాటలు మాలోను ఆనందాన్ని నింపాయి. బయటకు వస్తుంటే మొత్తం అందరూ బయటకు వచ్చి మాకు వీడ్కోలు పలికారు.

సూర్యనారాయణ గారబ్బాయి విజయసారథిగారన్నట్లు మా నాన్నగారు ఉద్యోగం కాకుండా ఒకటే వ్యాపకం పెట్టుకున్నారు. పుస్తకాన్ని ప్రేమించారు.. గౌరవించారు. అక్షరాన్ని శ్వాసించారు.. ఏమీ ఆశించకుండా.. అందుకే ఆయన పుస్తకాలకు ప్రేమ గంధం పూసిన గ్రంథాళ్వార్.. వారికి శతకోటి వందనాలు.

***- చెన్నూరి సీతా రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** ఏప్రిల్ సంచిక అందింది. మొదటగా చదివేది జీవనమకరందం. **"భూమ్మీద ఎంత ఎండ ఉందో అంత దుఃఖం ఉంది"** –ఈ ఒక్క మాట ఎంత లోతయింది! ఎన్ని పుటల వ్యాఖ్యానం చేయొచ్చు దీనిమీద! ఒక సాంద్రమైన సత్యాన్ని సూత్రప్రాయంగా చెప్పారు. చాలా విలువైన మాట ఇది. బౌద్ధ వాఙ్మయ సూత్రంలాగా చాలా గాఢంగా ఉంది. అలాగే మరో మాట –**"విజ్ఞానం మాట్లాడమంటుంది జ్ఞానం వినమంటుంది"** ఎంత చక్కగా చెప్పారు ! తెలుసుకునే కొద్దీ మనిషి మౌని అయిపోతూ వస్తాడు. "తెలిసి కొంటిని నాకేమి తెలియదనుచు "అని ఉమర్ ఖయ్యాం చెప్పినట్టుగా (దువ్వూరి వారి అనువాదం)



"జీవన మకరందం మధురంగా ఉంది. జీవనానుభవాలను కాచి వడపోసి, వాటి నిగ్గు తేల్చి భావితరాలకు బాటగా సూత్రప్రాయంగా అందిస్తూ ఉంది. మీకు వినయంగా అభినందనలు తెలుపుతున్నాను

*- హరనాథ్, మైసూర్, ఫోన్ : 9480443108*

# నా ప్రయాణం నూరేళ్ల పండుగ....

– మిసిమి



పెద్ది సత్యనారాయణ

**గుం**టూరు ఏసి కాలేజీలో బి.ఏ చదివారు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఎమ్.ఎ చేశారు. ఓరియంటల్ కాలేజీ – పొన్నూరు – ప్రిన్సిపాల్ చేశారు. పాలపర్రులో హైస్కూలు వ్యవస్థాపించారు. కొండవీటి వెంకటకవి వీరి సహాయకారి. తుమ్మల సీతారామమూర్తి వీరికి అతిథి, మిత్రులు – గుర్రం జాషువాకి సన్నిహితులు. ఆచార్య రంగాతో కలిసి తిరిగారు – వారితోనే రాజగోపాలాచారిని కలిశారు. తర్వాత కాలంలో ఎన్టీరామారావుతో గంట రాజకీయాల గురించి మాట్లాడారు. రాజకీయాలలో రాకుండా తప్పించుకున్నారు. కమ్యూనిస్టుల ఉద్ధాన పతనాలను చూశారు! 1929లో జన్మించిన వీరు కుటుంబం ఎప్పుడూ వ్యవసాయాన్ని వదులుకోలేదు. అలాగే పెద్దివారు 96 సంవత్సరాలుగా వ్యవసాయ క్షేత్రాన్ని – సాహితీ క్షేత్రాన్ని నమ్ముకునే ఎన్ని కష్టాలు నష్టాలు భరిస్తున్నా అందులోనే కొనసాగుతున్నారు. కొన్నేళ్ల వరకూ బెంగుళూరు – నేల మంగళ దగ్గర వ్యవసాయ క్షేత్రంలో వుండేవారు. స్వంతమో – కౌలుకో ఎప్పుడూ వంద ఎకరాల్లో అన్నిరకాల పంటలు పండిస్తారు. ఇప్పటికీ వీరి వ్యాపకం వ్యవసాయమే – నాతో నేలమంగళ నుంచి బేలూరు, హలిబేడు దర్శించారు (అప్పుడు వారికి 86 సం॥.)

లా చదివిన కృష్ణకుమార్ వీరి పెద్దబ్బాయి – వీరికి తోడుగా ప్రస్తుతం బెంగుళూరులో వుంటున్నారు. ఆ ప్రక్కనే అమ్మాయి కూడా వుంటుంది. వారికి నాకూ చాలామంది ఉమ్మడి స్నేహితులు వున్నారు. వారిలో డా. రాజగోపాలరావు ముఖ్యులు – నేను వారితో మాట్లాడుతుండగానే జూ. కాలేజి కరస్పాండెంట్, దానశీలి–లక్ష్మీరెడ్డి, నాటక ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు వచ్చారు! కేవలం వారిని కలవటానికే బెంగుళూరు వెళ్తాను అంటే – ఒక్కరే ఎందుకు అని రాంబాబు– రామరాజు నాతో వచ్చారు! నాలుగు గంటలు (ఆరోజు–ఆదివారం–వారు ఉపవాసం) వారి చరిత్ర – జ్ఞాపకాలు – పేర్లతోసహా చెప్పుకుంటూ వచ్చారు. ఇది ఒక సాంఘిక చరిత్ర. మన సమీప చరిత్ర – **మిసిమి** పాఠకుల కోసం.

– ఎ.కె.

**“మ**ట్టీ, సాహిత్యం మనిషిని వికసింపచేస్తాయి.” ఆయన వయసు తొంభై ఆరేళ్ళు. మాట వింటే నవయువకుడిలా ధ్వనిస్తాడు. పట్టుపంచె, లాల్చీతో తళతళా మెరుస్తుంటారు. **మిసిమి** సంపాదకులు అశ్వినీ కుమార్ గారు వారితో జరిపిన సంభాషణ, పెద్ది సత్యనారాయణ గారు నడిచొచ్చిన బాటను పట్టి చూపుతుంది.. వారి సంభాషణ నుంచి కొన్ని భాగాలు **మిసిమి** అభిమాన పాఠకుల కోసం.

**మిసిమి : పెద్ది సత్యనారాయణ గారు మీరు ఎక్కడ చదివారు? ఎక్కడ పనిచేశారు?**

**పెద్ది సత్యనారాయణ :** నేను బి.ఏ.చదివింది గుంటూరులో. ఎమ్.ఏ.మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో చదివాను. ఇక పనిచేసింది ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా. ఈ కళాశాల పొన్నూరు సమీపంలోని నిడుబ్రోలులో ఉంది. తర్వాత మా స్వగ్రామం పాలపర్రులో హైస్కూల్ స్థాపన చేశాను. అంతకుమునుపు స్కూల్ కోసం ఎన్నో కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వచ్చేది. ఆ ప్రభుత్వ ఉద్యోగం మానేసి మా ఊరిలో స్కూల్ నెలకొల్పాలని అనుకొనేవాడిని.

అందుకని చేస్తున్న ఉద్యోగం మానేసి కొంత ప్రభుత్వ నిధులు మంజూరు చేయించుకుని స్కూల్ పెట్టాను. మాఊరు పెదనందిపాడుకు మూడు మైళ్ళ దూరంలో ఉంటుంది. మా మేనమామ గారు కరెస్పాండెంట్‌గా, నేను హెడ్మాస్టర్‌గా 1980లో స్కూల్ పెట్టాం. తర్వాత నాకో ప్రమాదం తప్పింది. అది రాజకీయాల్లోకి రావటం.

**మిసిమి : ఎవరు మిమ్మల్ని రాజకీయాల్లోకి రమ్మన్నారు?**

**పెద్ది సత్యనారాయణ :** ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు.. ఇద్దరూ రమ్మన్నారు. 1989లో ఎన్టీఆర్ ఎన్నికల్లో ఓడిపోయారు. గుర్తుందికదా. అది జరిగిన సంవత్సరానికి ఒక పత్రికా ప్రకటన జారీ చేశారు. తెలుగుదేశం పార్టీలో చేరాలనుకునేవారు, ఫలానా చోటుకి రండి అన్నది ఆ ప్రకటన సారాంశం. నేనప్పుడు హైదరాబాద్‌లో మా అమ్మాయి దగ్గర ఉన్నాను. నాకు రాజకీయాల గురించి కాదు కానీ, ఆ నెపాన ఎన్టీఆర్‌ని చూడొచ్చని వెళ్ళాను. ఊరికి దూరంగా ఉన్న నాచారం స్టూడియో ఉంది కదా. అక్కడకు రమ్మన్నారు. వెడితే చాలామంది వరుసలో ఉన్నారు. లోపలికి వెళ్లిన వారు ఐదారు నిమిషాలయ్యాక వచ్చేస్తున్నారు. నేను వెళ్ళాను. కానీ ఎన్టీఆర్ నాతో ఇరవై నిమిషాలు మాట్లాడారు. కారణం నేను రాజకీయాల్లో వారి కంటే ముందే ఎప్పటినుంచో ఉన్నాను. (నవ్వు). నేను చిన్నప్పటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో ఉండేవాడిని.



కృష్ణకుమార్, ఎ.కె., పెద్ది సత్యనారాయణ, లక్ష్మీరెడ్డి, పాటిబండ్ల ఆనందరావు, సి.ఎస్. రాంబాబు

**మిసిమి : కమ్యూనిజాన్ని ఎవరంటకట్టారు మీకు (నవ్వు)**

**పెద్ది సత్యనారాయణ :** మా బాబాయి పెద్ది వెంకటసుబ్బయ్య, బసవపున్నయ్య వంటివారు గుంటూరు క్రిస్టియన్ కళాశాలలో 1935వ సంవత్సరంలో చదివారు. వీళ్ళంతా కమ్యూనిస్టులు. ఆ రోజుల్లో క్విట్ ఇండియా ఉద్యమం కారణంగా కమ్యూనిస్టు పార్టీ బలపడింది. ప్రజానాట్యమండలి వారి బుర్రకథలు ప్రజలకు కమ్యూనిస్టులను దగ్గర చేశాయి.

**మిసిమి : మరి రంగా గారి ప్రభావం మీమీద లేదా?**

**పెద్ది సత్యనారాయణ :** రంగా గారితో పరిచయం మామూలు పరిచయం కాదు. తీవ్రపరిచయం (నవ్వు). ఆయన ఎం.పి.గా ఉన్నప్పుడు నెల రోజుల పాటు ఆయన గెస్ట్‌గా ఉన్నాను. అదెలా అంటే నేనప్పుడు వరల్డ్ టీచర్స్ ఫోరంలో పాల్గోటానికి ఢిల్లీ వచ్చాను. అందులో జిల్లాకు ఒకరి చొప్పున ఎంపిక అయ్యారు. నన్ను గుంటూరు జిల్లా తరఫున డి.ఈ.ఓ. నన్ను ఎంపిక చేశారు. పనిలోపనిగా రంగా గారిని కలిశాను. అప్పుడు పార్లమెంటు సమావేశాలు లేవు. చివరిరోజున వారి దగ్గరకు వెళ్ళాను. "మా మీటింగ్స్ అయిపోయాయి సర్.. వాళ్ళు ఏర్పాటు చేసిన బస కూడా ఖాళీ చేయాలి.. ఇక ఇంటికి వెళ్ళిపోతున్నా" అంటే రంగాగారు నన్ను తన గెస్ట్‌గా ఉండమన్నారు. త్వరలో జనవరి 26వస్తోంది. అప్పుడు జరిగే పెరేడ్ చూసి వెళ్ళమని ఆర్డరేశారు. ఇప్పుడు చూడకపోతే మళ్ళీ ఈ సందర్భం కోసం రాలేవు అని కాస్త మందలించారు కూడా (నవ్వు) పైన గెస్ట్ రూం ఉంటే అది నాకిచ్చారు. ఆయన ఖాళీగా ఉండటం నాకు కలిసొచ్చింది. బోల్డన్ని విశేషాలు, విశ్లేషణలు వారి ద్వారా వినగగలిగాను. ఇదెప్పుడు జరిగిందంటే 1988లో. ఆయన ఒకప్పుడు బాగా వెలిగిన వ్యక్తి. అందరితోను ఎంతో ఆప్యాయంగా మెలిగిన గొప్ప మనీషి.

**మిసిమి : రంగా గారి క్వార్టర్స్, మరో ఎంపీ రాజగోపాలరావు నాయుడు క్వార్టర్స్ పక్కపక్కనే ఉండేవి. వాటి మధ్య దారిని బుక్స్ రాక్స్‌తో అలంకరించి ఒక లైబ్రరీ చేసేశారు ఆ దారిని. నేనొక వారంరోజులు రాజన్న అతిథిగా వున్నాను!**

**పెద్ది సత్యనారాయణ :** అవును మీరన్నది నిజమే.. ఇక్కడో విషయం చెప్పాలి.. అంతవరకూ రాజకీయాలంటే బ్రాహ్మలే. ఆ రోజుల్లో వారు చాలా త్యాగాలు చేశారు. ఎన్.జి.రంగాగారు రాజకీయాల్లోకి వచ్చాక అప్పటివరకు జిల్లా కేంద్రాలకు పరిమితమైన రాజకీయాలు పల్లెటూళ్ళకు వచ్చాయి. కమ్యూనిస్టులు నాశనము అవటానికి కారణం

కూడా రంగాగారే. పి.సి.జోషి ఉన్నంతకాలం నేను కమ్యూనిస్టు పార్టీలో ఉన్నాను. దీనికి నేపథ్యం ఏమిటంటే నా పదిహేనో ఏట గుంటూరు వెళ్ళాను. అక్కడ కాలేజీలో బి.ఏ.చదవటానికి. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు జైళ్లలో ఉండటంతో ఈ కమ్యూనిస్టులు ఈ అవకాశాన్ని బాగా వాడుకున్నారు. పల్లెటూళ్ళలో రేడియోలు లేవు. ఉన్న సినిమాలు జిల్లా కేంద్రంలో ఒకటో రెండో ఉండేవి. జనం ఖాళీగా ఉండేవారు. ఎవరు మీటింగ్ పెట్టినా ఊరు ఊరంతా వచ్చి కూర్చునేది. అలా నేను కూడా ఆ సభల్లో పాల్గొన్నాను.

**మిసిమి : మళ్ళీ ఎన్టీఆర్ దగ్గరకు వద్దాం. ఆరోజేమయింది!**

**పెద్ది సత్యనారాయణ :** నాకు ఇరవై నిమిషాల పాటు రామారావుగారితో మాట్లాడే అవకాశం వచ్చిందని చెప్పాకదా. నేను అప్పటి విషయాలు రంగా, రాజగోపాలాచారి, కమ్యూనిస్టు చెబుతుంటే ఆయన ఆసక్తిగా విన్నారు. తమాషా ఏమిటంటే నేను చిన్నప్పటినుండి బలహీనంగా ఉండేవాడిని. దాంతోటి నాకు ఆటల్లో ఆసక్తి లేదు. నా ఆసక్తంతా రాజకీయలే. సరే.. విషయానికి వస్తాను. చంద్రబాబునాయుడు గారు నన్ను.. మీరు బయటకూచోండి పిలుస్తాం అన్నారు. నా ముందు వెళ్ళినవారినెవరినీ కూర్చోమనలేదు. ఇంకో ఇద్దరు ఉన్నారు.. నాకు కబురొచ్చింది. కబురు రాగానే అదృష్టం బాగుండి నేను లోపలికి వెళ్ళలేదు. ఎందుకో చెప్పమంటారా (పెద్దగా నవ్వుతూ).. నాకు తొంభై ఎకరాల వ్యవసాయముంది. అందులో కౌలు భూమి కూడా ఉంది. మా అబ్బాయి లా డిగ్రీ చేస్తున్నాడు గుంటూరులో.. ఇవి వదిలిపెట్టి రాజకీయాల్లోకి ఎలా వెళ్తాను చెప్పండి!

**మిసిమి : సరే మీరు రాజకీయాలు తప్పించుకున్నారు. మరి బెంగుళూరు ఎప్పుడు, ఎందుకు వచ్చారో చెప్పండి?**

**పెద్ది సత్యనారాయణ :** జీవితం అన్నీ లింకులే! ముందు నా బాల్యం, చదువు గురించి చెబుతాను. నేను మా తల్లిదండ్రులకు ఒకడే కుమారుడను. మా పెద్ది వారి వంశంలో ఎనిమిది తరాలుగా ప్రతి తరంలోను ఒక కొడుకు, ఒక కుమార్తె ఉండటం జరుగుతోంది. అందువలన పాతికెకరాల భూమి చెక్కు చెదరకుండా ఉంది (నవ్వు). మా స్వగ్రామం పాలపర్రు. గుంటూరుకి ఇరవై మైళ్ళ దూరంలో ఓల్డ్ మద్రాసు మార్గంలో ఉంది. ఆ మార్గంగుండా ఇంగ్లీష్ సేనతో క్లైవ్ కాలినడకనే వెళ్ళాడు. మా నాయన పేరు జానకి రామయ్య, అమ్మ పేరు సాయమ్మ. నేను పుట్టిన సంవత్సరం 1929. ఆ రోజుల్లో ఏటుకూరి వెంకటనర్సయ్య, జాషువా, తుమ్మల సీతారామ మూర్తి బ్రాహ్మణేతర కవుల్లో సుప్రసిద్ధులు. ఒకసారి వెంకటనరసయ్య గారు మా ఊళ్ళో నాలుగు రోజులు ఉన్నాడు. మా ఊరి పేరు పాలపర్రు కాదు పాలమర్రు అంటాడాయన. ఒర్రు అంటే ప్రవాహం. ఆరోజుల్లో మా ఊరిలో విశాలమైన రోడ్లు ఉండేవి. ముప్పై ఎకరాల మంచినీటి చెరువు ఉండేది. ఆ నీళ్ళు తాగితే ఎటువంటి రోగాలైనా పోతాయని నమ్మకం అందరికీ. దీన్ని పెద్ది వారి చెరువు అనేవారు. మా పూర్వీకులు తమ నూట యాభై ఎకరాల పొలం కోసం ఆ చెరువు తవ్వించారు. ఇప్పటిలా కాదు కదా.. ఆరోజుల్లో ఏదయినా ఋతువులు ప్రకారం జరిగేవి. ఎండయినా, వానయినా, చలి పులయినా.. బట్టలుతికే చెరువు వేరే ఉండేది. దాన్ని చాకలి చెరువు అనేవారు. నా చిన్నప్పుడు నేను బలహీనంగా, బక్కగా ఉండే వాడినని చెప్పాను కదా.. అది నాకు లాభించింది. నేను పుస్తకాలు బాగా చదువుతుండేవాడిని. అందుకని నన్ను ప్రత్యేకంగా చూసేవారు. అట్లా నేను మైపాడు హైస్కూలులో చదివాను. ఆరోజుల్లో పట్టణాలు మినహాయిస్తే, హైస్కూల్ ఉన్న గ్రామాలు ఐదే. మా హైస్కూలులో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉండేది. నేను చేరానందులో. ఇది కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ సంస్థ. ఆరోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎలా ఉండేదంటే, కేవలం తమ పార్టీ మాత్రమే ఉండాలి. అపోజిషన్ అవసరం లేదన్నట్టుండేవారు. 1935లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది అప్పటి కేంద్ర ప్రభుత్వం. క్విట్ ఇండియా ఉద్యమం నడిచే రోజుల్లో చాలా మంది కాంగ్రెస్ నాయకులు జైళ్లలో ఉండేవారు. రష్యా, ఇంగ్లాండ్, అమెరికా దేశాలు, హిట్లర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుండటంతో కమ్యూనిస్ట్ పార్టీ కూడా ఇది ప్రజా యుద్ధం, ఇంపీరియల్ యుద్ధం కాదు అని ప్రకటించి ప్రభుత్వానికి మద్దతు తెలిపింది. ప్రతివారు ప్రభుత్వానికి సహాయపడాలని తీర్మానం చేసింది. ఆ తీర్మానంతో ప్రభుత్వ వ్యతిరేకత కూడా కమ్యూనిస్టుల మూలంగా చల్లబడింది. ఈలోగా ప్రభుత్వం కూడా కమ్యూనిస్టులపై నిషేధం సడలించింది. కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా కర్షక, కార్మిక, రైతుకూలీ సంఘాలేర్పడ్డాయి. అప్పట్లో పి.సి.జోషి కమ్యూనిస్టు పార్టీ ఆలిండియా

నాయకుడిగా ఉంటే ఆంధ్రలో నెల్లూరుకు చెందిన పుచ్చలపల్లి సుందరయ్య నాయకుడుగా ఉండేవారు. పి.సి.జోషి కమ్యూనిస్టు పార్టీని అచ్చమైన జాతీయ పార్టీగా నడిపారు. రష్యా తొత్తుగా కాకుండా జాతీయ పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఉండేది. ఇలా ఈ మూడు నాలుగేళ్లలో కమ్యూనిస్టు పార్టీ బలపడుతుండగా, కేరళ పార్టీ నాయకుడిగా ఉన్న రణదావే ఒక తీర్మానం చేశాడు. దాని ప్రకారం అధికారంలోకి రావాలంటే ప్రజా పోరాటం చేయాలని ఆ తీర్మానం సారాంశం. దానికోసం చైనాలోలాగా మనం కూడా ప్రజాసైన్యాన్ని నిర్మింపచేసి కేంద్ర ప్రభుత్వంపై దండయాత్ర చేయాలన్న తీర్మానం చేసి, ఆ తీర్మానంలో ఆయన నెగ్గి పి.సి.జోషిని పార్టీ నుండి డిస్మిస్ చేశారు. ఘోరమైన తప్పు చేశారు.

**మిసిమి : రంగా గారితో మీ అనుభవాలు చెప్పండి?**

**పెద్ది సత్యనారాయణ :** 1937వ సంవత్సరంలో మా ఊళ్ళో రంగా గారు ఓ సభ పెట్టారు. అప్పుడు నా వయసు ఎనిమిదేళ్ళు. సభెందుకు పెట్టారంటే అప్పుడాయన ఢిల్లీలోని కేంద్ర శాసనసభకు (అప్పట్లో పార్లమెంటుని అలాగే పిలిచేవారు). సభ్యుడిగా పోటీ చేస్తూ ప్రచారం కోసం మా ఊరు వచ్చాడు. అప్పుడు వోటు హక్కు అందరికీ ఉండేది కాదు. టాక్సులు కట్టేవారికి మాత్రమే ఉండేది. అంటే సంపన్నులుకే ఆ అవకాశం ఉండేది. రంగా గారికి నిడుబ్రోలులో ఆస్తిపాస్తులు బానే ఉండేవి. ఆయనను బార్ ఎట్ లా చదవటం కోసం ఇంగ్లాండ్ పంపించారు. దానివెనక ఆంజనేయ రెడ్డి గారనే టీచర్ ప్రోత్సాహం ఉంది. అలా ఆయన ప్రచారం కోసం వచ్చినప్పుడు రంగా గారిని చూశాను. రంగా గారు ఎంత షోకిల్లాగా అందంగా ఉంటారంటే, నెహ్రూ గారు కూడా ఆయనతో సరితూగరు. ఆయన మాటతీరు రాయలసీమ ప్రాంతానిది. చాలా ఆకర్షణీయంగా ఉండేది. గుంటూరు, సర్కారు జిల్లాల ఉచ్చారణ కాదు.

**మిసిమి : రాజగోపాలనాయుడు ఆయన శిష్యుడు కదా – రాజన్న – గల్లా అరుణ గారి తండ్రి.**

**పెద్ది సత్యనారాయణ :** అవును – పొన్నూరు ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నప్పుడు రంగా గారిని మర్యాదపూర్వకంగా కలవటం అవసరమని నా దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన కొండవీటి వెంకటకవి అనటంతో తనతో కలిసి రంగా గారి దగ్గరకు వెళ్ళాను.వెంకటకవి గారు చాలా లౌక్యుడు.ఎవరినైనా మాటలతో పడగొట్టేసే చమత్కారి. నన్ను పరిచయం చేసి వెళ్ళిపోయాడు. నేను, రంగా గారు మేమిద్దరమే ఉన్నాం. అదే రోజున ఒక వార్త వచ్చింది.యూరోప్ లోని జెకొస్లొవేకియా దేశంలోని జాతీయ నాయకులను రష్యా వారు తీసుకెళ్ళో, కిడ్నాప్ చేసో చంపేశారని వార్త పేపర్లో వచ్చింది. రష్యా వారు సగభాగం ఆక్రమించటంతో అక్కడి నాయకులు ఎదురు తిరిగారు. ఎదురు తిరిగిన వారిని మట్టుబెట్టారు. రంగా గారు కమ్యూనిస్టులను ఉద్దేశించి ఇలా చేయటం చాలా ఘోరమని చెబుతూ see their cheeks అన్నారు. నాకర్థం కాలేదు. తరవాత ఇంటికివెళ్ళి డిక్షనరీ చూశాను. అఘాయిత్యం అని తెలుసుకున్నాను. ఈలోగా భోంచేసే వేళవటంతో రండి భోంచేద్దాం అన్నారు. లేదండీ నేను భోజనం చేసే వచ్చాను అనటంతో నాకేదో జ్యూస్ తెప్పించారు. ఆయన భోజనానికి వెళ్ళారు. వెళ్ళొస్తానని బయలుదేరాను. గాంధీ గారి జీవితం మనకు సగమే తెలుసు అట్లాగే రంగా గారి జీవితం కూడా మనకు సగమే తెలుసని నా అభిప్రాయం. 1977లో జరిగిన ఎన్నికల్లో ఆయన ప్రతిపక్షంలో ఉంటే ప్రధాని అయ్యుండేవాడు. అంతకుమునుపే ఆయన కాంగ్రెస్‌లో చేరాడు. ఈయన్ని స్వతంత్ర పార్టీ అధ్యక్షుడిని చేశాడు రాజగోపాలాచారి. దేశం బాగుపడటంలో రాజగోపాలాచారి ప్రభావం చాలా ఉంది. దేశం నాశనము కావటానికి నెహ్రూగారెంత కారణమో, పూర్తిగా నాశనం కాకుండా ఉండటానికి రాజగోపాలాచారి అంత కారణం. భారతదేశ రాజకీయాలపై ఆయన ప్రభావం చాలా ఉంది. నెహ్రూగారు బతికుంటే ఓడిపోయేవారు. ఎందుకంటే రాజగోపాలాచారి అన్ని పార్టీలలోని ఇంటలెక్చువల్స్‌ను ఏకం చేశాడు. ఆయన గొప్ప స్టేట్స్ మన్. అలాంటివారెవరున్నారు? ఇంకో విషయం గుర్తొస్తుంది. నేను హైస్కూలులో ఉన్నప్పుడు ఎస్.ఎఫ్.ఐ. వాళ్ళు “ది స్టూడెంట్” అనే పత్రిక నడిపేవారు. ఎస్సెల్సీ చదువుతున్నప్పుడు ఆ పత్రిక చదివి ఇంగ్లీష్‌లో మాట్లాడుతుండేవాడిని. ఇప్పుడు వృద్ధాప్యంలో ఉండటంతో చాలా విషయాలు మర్చిపోతున్నాను. నా వయసు తొంభై ఆరు జరుగుతోంది. వయసు పెరుగుతోంది. మతిమరుపు కూడా పెరుగుతోంది. రెండూ రైలుపట్టాల్లా చాలా సమాంతరంగా నడుస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీపై పూర్తి విరక్తి ఎప్పుడు కలిగిందంటే 1955లో. ఆ విరక్తి రాజగోపాలాచారి గారి పుణ్యమే. అప్పుడు రాజగోపాలాచారి గారు స్వతంత్ర పార్టీ పెట్టి దేశమంతటా తిరుగుతున్నారు.

అప్పటికే కమ్యూనిస్టు పార్టీ మూలపడింది. చైనాలోలోగా సాయుధ పోరాటం చేయాలని కమ్యూనిస్టు పార్టీ యువకులకు కర్రసాము, కత్తి ఫైటింగ్ అంశాలపై శిక్షణ ఇవ్వటం, జాతీయ పార్టీలా నడిపిన పి.సి.జోషిని తీసేయటం ఇవన్నీ మనసు విరిచేశాయి. రాజగోపాలాచారి వాక్కులు కళ్ళు తెరిపించాయి.

**మిసిమి : తుమ్మల సీతారామ మూర్తి గారితో మీ పరిచయం, అనుబంధం గురించి చెప్పండి!?**

**పెద్ది సత్యనారాయణ :** మా ఊరు పాలపర్రులో ఒక పూరింట్లో లైబ్రరీ పెట్టారు. దానిపేరు విజ్ఞాన మందిర్. అక్కడ సీతారామ మూర్తి గారి "రాష్ట్రగానం" ఇతర పుస్తకాలు ఉన్నాయి. అంతరార్థాలు అర్థం కాకపోయినా యతిప్రాసల మూలంగా, గణాల మూలంగా ఒక మాధుర్యం చవిచూశాను ఆ పద్యాలలో. *"కడివెడు పాలు పిండెదవు కానీ నీ కంచములోకి గంజి నీళ్ళే"* ఇలాంటి సీసపద్యాల పంక్తులు ఆకర్షించాయి. నా చదువు అయిపోయిన తర్వాత బి.ఈడి. చేసినవారికి జూనియర్ కాలేజి ప్రిన్సిపల్‌గా నియమాకం కోసం ప్రకటన వచ్చింది. బి.ఈడి.చేస్తే మంచిదనిపించింది. అందుకని గుంటూరులో బి.ఈడి చేయటం మొదలుపెట్టాను. పెళ్ళయింది. కాపురం పెట్టాను. ఒకరోజు హిందూ కాలేజీలోని దండయ్య హాల్‌లో సాహిత్య సభ జరుగుతోంది. సీతారామమూర్తిగారు వక్త. నేను సాహిత్య సభలకు తప్పకుండా వెళ్ళేవాడిని. ఆయన చాలా బాగా మాట్లాడతాడు. ఆరోజున వినసొంపైన ప్రసంగం చేశాడు. రాత్రి తొమ్మిది గంటలయింది. సభానంతరం ఆయన్ని కలిసి మా ఇంటికి ఆహ్వానించాను. ఈ రాత్రివేళ వెళ్ళటం కష్టం మీకు అని చెప్పాను. మా ఇంట్లో ఉండకూడదా అన్నాను. మీరెవరు అన్నాడు. నాగురించి, నేను ఎవరో చెప్పాను. నేను తెలుగు ఎమ్మే చేశానని, సాహిత్యం అంటే ఇష్టమని.. ఈ సంగతులన్నీ చెప్పాను. ఆయనకు కూడా నా సంగతులు నచ్చాయేమో, వెళ్దాం పదమన్నాడు. మా ఆవిడ కూడా ఈయన్ని చూసి అప్పటికప్పుడు వేడి వేడి భోజనం వండి వడ్డించింది. పొట్లకాయ కూర, ఇంకో ఇగురు చేసింది. ఆమెను పలకరించాడు. మా ఇంట్లో కట్టలు కట్టలుగా ఉన్న పుస్తకాలు చూశాడు. సంతృప్తి చెందాడు.. మర్నాడు ఉదయం వెళ్ళిపోతాడనుకున్నాను.. వెళ్ళలేదు.. ఉన్నాడు.. ఆయన మంచి కాఫీ ప్రియుడు. చక్కటి కాఫీ తాగి, గోధుమ రవ్వ ఉప్మా తిన్న తరువాత ఇక్కడ లేళ్ల రామారావు అనే కానిస్టేబుల్ ఉన్నాడు. ఆయన చిన్నపాటి కవి. నా గ్రంథాలను అతను చదవటం, గౌరవించటం చేస్తాడు.. తరచుగా కలుస్తుంటాం. ఆయనకు కబురు చేయగలరా అని అడిగాడు. పోలీసు స్టేషన్‌కు కబురు పంపిస్తే, ఆయన వచ్చాడు. ఇద్దరి మధ్య సాహిత్య గోష్ఠి జరిగింది. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశాను. విశ్రాంతి తీసుకుంటూ నాతో మాట్లాడుతునే వున్నారు–మళ్లీ టీ, పకోడి పెట్టాము – సాయంత్రం ఆరుగంటలకు 'వెళ్ళి వస్తాను సత్యనారాయణ గారు' అన్నారు సీతారామ మూర్తి గారు.. బస్టాండుకు తీసుకువెళ్ళి వారిని బస్సు ఎక్కించాను. (ఇప్పుడు విరిసిన ఆయన నవ్వు–సంభాషణ చివరి వరకు వెలుగుతూనే వుంది!)

**మిసిమి : తర్వాత మీ జీవితంలోని ముఖ్య ఘట్టాలు?**

**పెద్ది సత్యనారాయణ :** 1952లో నా వివాహం జరిగింది. బాపట్లకు నాలుగు మైళ్ళు దిగువనుండే జమ్ములపాలెం మా పరిణయ వేదిక. పొన్నూరు ఓరియంటల్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థి కొల్లా కృష్ణారావు నాకు సన్నిహితుడు. కొంతకాలం చదువాపేసి మళ్ళీ చేరటంతో కొంచెం పెద్దవాడే. నా పెళ్లి సందర్భంగా ఒక పుస్తకం అతను ప్రచురించాడు. దానిపేరు విశ్వకుటుంబంలో సరికొత్త కాపురం. అందులో కొండవీటి వెంకటకవి రెండు పద్యాలు రాశాడు. వెంకటకవి అప్పటికే టీచర్. మా కొల్లా కృష్ణారావు వెంకటకవిని వెంటపెట్టుకుని వచ్చాడు. మరోపక్క జాషువా గారు కూడా వచ్చారు. అతనే ఆరోజు సభాధ్యక్షుడు. సీతారామమూర్తిగారు కూడా రెండు పద్యాలు రాశారు. జాషువా గారు నా గురించి మాట్లాడాక, వెంకటకవి కూడా మాట్లాడాడు. సీతారామమూర్తి గారు రాలేదు. జాషువా గారికి నూట పదహార్లు కానుకగా ఇచ్చాం. వెంకటకవి గారికి అర్ధ నూటపదహార్లు కానుకగా ఇచ్చాం. జాషువా గారన్నాడు కదా.. ఇక నాకు నెలరోజుల వరకు దిగుల్లేదు అన్నాడు. ఆ తర్వాత జాషువా గారి గురించి చిన్న వ్యాసం రాశాను. అది అచ్చయింది. అందులో నేను మంచి రచన జరగాలంటే అల్లసాని గారు ఏమేమి కోరుకున్నారో ఆ పద్యంతో ప్రస్తావించాను. కానీ కవి జాషువా గారికి ఇవేవీ అక్కర్లేదు. బస్తా బియ్యం, బీడీ కట్ట ఉంటే చాలని చెప్పాను. వెంకటకవి గారితో పరిచయం పెరిగింది. వెంకటకవి గారు పొన్నూరు ఓరియంటల్ కాలేజీలో పనిచేసేవారని



పెద్ది గారితో రామరాజు

చెప్పాను కదా. ఆయనకి, ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌తో పడేది కాదు. ఆయన సంప్రదాయవాది. ఛాందసుడు. ఈయన హేతువాది, నాస్తికత్వం వెలగబెడతాడు. మిమ్మల్ని తరువాత కలుస్తాలెండి అన్నాడు. బి.ఈడి అయ్యాక కలిశాడు. మా ప్రిన్సిపాల్ అహంభావ పూరితంగా వ్యవహరిస్తున్నాడు. లెక్చరర్లందరూ ఫిర్యాదు చేస్తున్నారు. త్వరలోనే ఆయన్ని తొలగిస్తారు లెండి అన్నాడు. అలాగే ఆయన్ని తొలగించారు. వెంకటకవి మహా లౌక్యం కలవాడు అని చెప్పాను కదా. మాటలతో ఇట్టే పడగొట్టేస్తాడు.. అది ఎన్టీ రామారావు అయినా, ఇంకో పుల్లయ్య అయినా. నన్ను ఆ కాలేజీలో అప్లయి చేయించాడు. నాతీరు, అర్హతలు నచ్చి నన్ను నియమించారు. నాకు బి.ఈడీ ఉండటంతో హైస్కూల్, కాలేజీ రెండూ నాకు అప్పగించారు. పొన్నూరులో కాపురం పెట్టాను. కొన్ని సంవత్సరాల తరువాత ఇది కాదు నేను చేయాల్సింది అనిపించింది.. 1958ప్రాంతంలో అనుకుంటాను, తిరిగి పాలపర్రు వచ్చి హైస్కూల్ స్థాపన చేశాను. మా మేనమామ గారు కరస్పాండెంట్, నేను హెడ్మాస్టర్‌గా ఉండేవాళ్ళం. రకరకాల గ్రాంట్స్ తెప్పించి బిల్డింగ్ అదీ కట్టించాను. అక్కడి పోరంబోకు భూమి మాకు ఉపయోగపడింది. జీవితం మనం అనుకున్నట్లు సాగదు.. దాని వెంట మనం పోవాలే కానీ మనవెంట అదిరాదు. పరిస్థితులు, సంఘటనలు జీవితంలో చోటు చేసుకుంటాయి.. కానీ మన ప్రమేయం ఉండదు. పాలపర్రులో జీవితం విసుగనిపించింది. నాకు కన్నెగంటి పాపారావనే స్నేహితుండేవాడు. అతను వాళ్ళ ఊరు నర్సాయపాలెంలో నాచేత హైస్కూల్ పెట్టించాడు. ఆ స్కూల్‌కు కన్నెగంటి పాపారావు కరస్పాండెంట్

ఆ హైస్కూల్ లో ప్రతి సంవత్సరం వార్షికోత్సవం జరిపి, ఒక కవిని సన్మానిస్తారు. ఒక సంవత్సరం సీతారామమూర్తిగారికి సన్మానం చేయాలని సంకల్పించారు. ఆయన్ని సభకు అధ్యక్షుడిగా ఎవరిని పిలవమంటే పాలపర్రులో పెద్ది సత్యనారాయణ గారని ఉంటారు. ఆయన్ని పిలవండని కోరారు సీతారామమూర్తి గారు.. సైకిళ్ళేసుకుని ఇద్దరు టీచర్లు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న మా ఊరు అంటే పాలపర్రుకు వచ్చారు. వారికి దాహం ఇచ్చారు మా నాన్న. మా నాన్నను నేననుకుని ఆహ్వానించారు. ఆయన సత్యనారాయణ నేను కాదు, మా అబ్బాయి.. పిలుస్తానాగండని లోపలికి వచ్చాడు. లోపలికి వచ్చి లుంగీలో ఉన్న చూసి, విషయం చెప్పి ధోవతి కట్టుకురమ్మన్నాడు. ఆయనకు బయట వారి ముందు లుంగీలో ఉండటం నచ్చదు.. నన్ను పిలిచారు. ఇంకో మిత్రుడితో కలిసి వస్తానని చెప్పాను. కమ్యూనిస్టుల ప్రభావంతో ఉపన్యాసం చెప్పటంలో కాకలు తీరి ఉన్నానప్పటికే. బి.ఏ.చదువుతున్నప్పుడు వక్తృత్వ పోటీల్లో ప్రథముడిగా అనేకసార్లు వచ్చాను. అలా నర్సాయపాలెంలో సభకు అధ్యక్షత వహించి నలభై ఐదు నిమిషాలు మాట్లాడి సీతారామమూర్తి గారిని, పాపారావు ని ఆశ్చర్యపరచాను.అప్పుడున్న విద్యా విధానానికి వ్యతిరేకంగా మాట్లాడాను. ఆనాటి ఉత్సవాన్ని చాలా గొప్పగా నిర్వహించారు.పాపారావు చాలా ప్రభావితం చెందాడారోజున. మాకు బస హైస్కూలులోనే ఏర్పాటు చేశారు. నన్ను మాత్రం మనిషిని పంపించి, ఇంటికి ఆహ్వానించాడు. రాత్రి ఒంటిగంట వరకు మాట్లాడుతూ ఉన్నాం. నేనంటే గురి కుదిరింది పాపారావుకు. ఆరోజుల్లో పాపారావు కర్నాటకలో ఐదొందల ఎకరాలు సాగు చేస్తుండేవాడు. పిల్లల బాగోగులు ఓ లెక్చరర్ గారికి అప్పగించి, ఆయనకు డబ్బు పంపిస్తూ ఉండేవాడు. రెండేళ్ళ తర్వాత ఆ పిల్లలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నారు. లాభంలేదని గుంటూరొచ్చి తన పిల్లలతో ఇంకో పదిమంది పిల్లలను పోగేసి హాస్టల్ పెట్టాడు. చూసుకునే బాధ్యత నాకు పెట్టాడు. సీతారామమూర్తిగారితో పరిచయం బాగా పెరిగి గుంటూరు ఎప్పుడు వచ్చినా మా ఇంట్లో ఉండేవాడాయన. మా పిల్లలు కొంచెం పెద్దవారయ్యారు. మా అమ్మాయికి సంబంధాలు చూడటం మొదలు పెట్టాం. పసుమర్రులో ఒక సంబంధం వచ్చింది.. నిడుబ్రోలు బ్యాంక్‌లో

పనిచేస్తున్నాడు.ఆ కుర్రాడి మంచి చెడులు విచారించమని కోరాను. చాలా మంది సరే లెండి అని ఊరుకుంటారు. కానీ ఈయన అలాంటి మనిషి కాదు కదా. ఆ బ్యాంకుకు వెళ్లి శ్రీరామచంద్రమూర్తి ఎవరో అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు స్టాఫ్ ఈయనను గుర్తుపట్టి దణ్ణం పెట్టారు. సీతారామమూర్తిగారు దగ్గరలో ఉన్న పోస్టాఫీసుకు వెళ్లి కార్డు రాసి పోస్టు చేశాడు. మూడోరోజు ఆ కార్డు మాకు చేరింది.

***"చూచితి మీ అల్లుడిని***
***తను రోచియు చక్కదనము***
***మదాత్మను దోచెనయా"***

***అని రాశారు.*** చాలుకదా.. ఒక మనిషిని ఆయన చూసిన తీరుకు.. కవుల వాక్కు వృథా పోదు. కవులల్లో ఈయన మహర్షి.ఆయన నోట అల్లుడు అన్న మాట వచ్చింది. తప్పకుండా అల్లుడవుతాడని చెప్పాను. అలాగే పెళ్లి జరిగింది. ఇంకో పెళ్లి పుస్తకం వేశాం. దాంట్లోకూడా పది పద్యాలు రాశారు సీతారామమూర్తి గారు. ఆయనకు ముగ్గురు కొడుకులు. ఒకబ్బాయి పెళ్లి తర్వాత విడాకులకు దారి తీసింది. కానీ దానికి ఆయన దానికి తన బాధ్యత ఉందని బాధపడ్డారు నాతో..

**మిసిమి** : **బెంగుళూరు ఎప్పుడొచ్చారు?**

**పెద్ది సత్యనారాయణ :** జీవితం లింకులతో కూడి ఉంటుంది. మా అబ్బాయికి చిన్నప్పుడు మిలిటరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో సెలక్షన్ వచ్చింది. నాలాగే వాడూ బలహీనంగా ఉండేవాడు. మూడే సీట్లున్నాయి. పరీక్ష రాయాలి. మోడల్ పేపర్ తెప్పించి ప్రిపేర్ చేయించాను. మావాడు సెలెక్ట్ అయ్యాడు. ఇంటర్వ్యూలో Why do you look taller than your father అని అడిగితే My father is also equally tall అని చెప్పాడు. ఆ సమయస్ఫూర్తి నచ్చి ఎంపిక చేశారు. తర్వాత మెడికల్ ఎగ్జామినేషన్‌కు వెళ్ళాడు. చాలా వైద్య పరీక్షలు చేశారు. ఆర్థోపెడిక్ డాక్టర్ bow legs అని రిజెక్ట్ చేశారు. అప్పీల్ చేసుకోమని అక్కడున్న ఒక తెలుగాయన సలహా ఇచ్చాడు. మావాడికి పన్నెండేళ్ళు.. కానీ నాకే ఆ సలహా నచ్చక మా వాడిని కోరుకొండ స్కూలు పరీక్షకు సిద్ధం చేయించాను. అక్కడ కూడా సీటు లభించింది. అదేమిటో మా వాడిని చేర్పించటానికి కోరుకొండ వెళ్ళాలని ప్రయత్నం చేసిన ప్రతిసారీ మా ఆవిడకు ఫిట్స్‌లా వచ్చేవి. దాంతోటి ఆ ప్రయత్నం కూడా ఆగిపోయింది. నాకు హోమియో వైద్యం మీద నమ్మకం ఎక్కువ. డా.పావులూరి కృష్ణయ్య చౌదరి గారితో నాకు స్నేహం ఉండేది. వారికి మా ఆవిడ కేసు చెప్పాననుకోండి. అది వేరే విషయం.

తర్వాత మా వాడిని గుంటూరులోని అరండల్ పేటలో ఉన్న క్రిస్టియన్ స్కూల్లో చేర్పించాను. సుప్రీంకోర్ట్ జడ్జి నాగేశ్వరరావు, మావాడు కలిసి చదువుకున్నారు. జాలయ్య కాలేజీలో ఇంటర్మీడియట్, బి.కాం చదువుకున్నారు. గుంటూరులో ఉన్నా కదాని వ్యవసాయం మొదలు పెట్టాను. ఒకరోజు పాపారావు ఫోన్ చేస్తే నా పొలం చూద్దువు కానీ రమ్మన్నాను. ఆయన కనిపెట్టిన పత్తి విత్తనాలు ఇస్తే వేస్తానని తెలియచేశాను. ఆరోజుల్లో యూరియా బ్లాక్ మార్కెట్లో అమ్మేవారు. పాపారావు యూరియా నాలుగు సార్లు వాడండి అంటే యాభై ఎకరాలకు సరిపడా అవసరమైన యూరియా తెప్పించాను. తను చెప్పినట్లు వాడితే ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మామూలుగా అయితే పదిహేను క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఇలా ఉంటుంది ఆయన సలహా (నవ్వు)

**మిసిమి** : **ఇంతకీ మీరు బెంగుళూరు ఎందుకొచ్చారో చెప్పలేదు**

**పెద్ది సత్యనారాయణ :** అంతకన్నా ముందు దాని నేపథ్యాన్ని చెబుతాను. మీకు కన్నెగంటి పాపారావు పరిచయం చెప్పాలి. పాపారావుగారి ఊరు, మా అత్తగారి ఊరు ఒకటే.. జమ్ములపాలెం. అది మా పరిచయానికి దారి తీసింది. పాపారావు తేజో సంపన్నుడు. అందం, ఆకర్షణ రెండూ ఉన్నవాడు. అయితే పెద్ద ఆస్తేమీ లేదు. నర్సాయపాలెంలో వారి పెద్దమ్మ తన భూమిని సాగుచేసుకోమని ఇచ్చేసింది. పాపారావులోని సుగుణాలను గమనించిన వీరమ్మ అనే ఆవిడ తన కూతురునిచ్చి పెళ్ళి చేసింది. పాపారావు అప్పుడు ఎస్.ఎస్.ఎల్.సి.చదువుతుండేవాడు. బావమరిదిని జాగ్రత్తగా చదివించి ఐయ్యేఎస్ కోచింగ్ ఇప్పించాడు. అతను ఐ.పి.ఎస్.కు సెలెక్ట్ అయ్యి హైదరాబాద్ పోలీసు కమీషనర్‌గా కూడా చేశాడు. వీరమ్మగారికి అరవై ఎకరాల పొలముండేది. దాని మీద వచ్చిన డబ్బంతా చిన్న చిన్న

బస్తాల్లో నింపి దాచేది. అప్పుడప్పుడ ఒక్కో బస్తా అల్లుడుకి పంపేది. ఎకరం మూడొందలుండేది. పాపారావు కొంటూ పోయాడు. కానీ పాపారావు ఐదొందల ఎకరాలు ఇలా కొన్నా పెద్ద సంపాదించలేపోయాడు. కారణం యూరియాను లెక్కా పత్రం లేకుండా వాడటం. ఇక్కడ గుంటూరులో పిల్లలను హాస్టల్‌లో పెట్టాడు. అంతకుమందొ టీచర్‌కు బాధ్యత అప్పగిస్తే సరిగ్గా చూడలేదు. నేను మావాడు చదువు కోసం గుంటూరు వచ్చి వ్యవసాయం కూడా చేస్తున్నా కదా. నన్ను కాస్త సాయం కోరితే నేను సరేనని ఆయన పిల్లలను కూడా చూసేవాడిని అని చెప్పాను కదా... మా అబ్బాయి, పాపారావు కొడుకు కిషోర్ మంచి స్నేహితులు. అప్పుడే మార్కెట్లో పత్తి హైబ్రిడ్ విత్తనాలు వస్తున్నాయి. పాపారావుకు ఒక శాస్త్రవేత్త పరిచయమై, పాపారావు నమ్మకస్తుడని భావించి, ఆ విత్తనాలన్నీ పాపారావుకే ఇచ్చేవాడు. పాపారావు మంచి డిమాండ్ ఉండటంతో బాగానే అమ్ముకోగలిగాడు. బానే సంపాదించగలిగాడు. ఈలోగా పిల్లలు పెద్దవారయ్యారు. అప్పట్లో మా దగ్గర రైతులు కొంతమంది పట్టు పురుగులు పెంచి వాటిని కర్నాటకలో అమ్మి లాభం గడిస్తుండేవారు. మీరు బెంగుళూరు ఎందుకు వెళ్ళారు అన్నారు కదా.. గుంటూరు దగ్గరున్న మేడిపల్లి వంటి గ్రామాలకు తుపాను తాకిడి ఉండేది. ఎప్పుడూ పంట నష్టం జరుగుతుండటంతో మనం కూడా బెంగుళూరు ప్రాంతంలో భూమిని కొంటే బావుంటుంది కదా అనిపించింది. అలా మా అబ్బాయి కృష్ణ కుమార్, పాపారావు గారబ్బాయి కిషోర్‌ను సంప్రదించాడు. అతను పేపర్ ప్రకటన ఇచ్చాడు. బెంగుళూరుకు ముప్పై కిలోమీటర్ల దూరంలో నేల మంగళం అనే ఊరులో యాభై ఎకరాలు కొన్నాం. పట్టుపురుగుల పెంపకం చేశాం.అందరు కొంచెం భూమిలో చేస్తే, మేము పెద్ద మొత్తంలో చేశాం. పట్టు పురుగులతో సమస్య ఏమిటంటే ఇరవై రోజులు బావుంటుంది.. ఇరవై ఒకటో రోజు పాడైపోతుంది. మేం భూములు కొన్న తీరు చూసి మమ్మల్ని గుంటూరు దొరలనేవారు. అయితే పట్టుపురుగుల పెంపకం మాకు లాభించలేదు. ఆ దిగులులో ఉన్నప్పుడు ఓ దారి దొరికింది. ఒక బస్సు ప్రయాణంలో పక్క ప్రయాణీకుడు, రెండెకరాల్లో అరటి తోట వేశానని, బాగా లాభం వచ్చిందని చెప్పాడు. మళ్ళీ ఆశ. మేం కూడా అరటి, బొప్పాయి సాగు చేయటం మొదలు పెట్టాం.తరువాత పూల సాగు మొదలుపెట్టాం. నెమ్మదిగా తేరుకున్నాం. అక్కడ ఓ రిటైర్డ్ ఇంజినీర్ పెద్ద ఇల్లు కట్టుకుంటే, ముచ్చటపడి కొనుక్కున్నాం. అక్కడే నా ఎనభయ్యవ పుట్టినరోజు జరిగింది. అశ్వనీ గారు..ఇది నా బెంగుళూర్ కథ.

**మిసిమి : ఎన్ని ఇబ్బందులున్నా సాహిత్యాన్ని వదల్లేదు మీరు మీ చుట్టూ పుస్తకాలు కనిపిస్తున్నాయి.**

**పెద్ది సత్యనారాయణ :** చిన్నప్పటి నుంచి కమ్యూనిస్టు పార్టీలో తిరగటం వలన చదవటం, మాట్లాడటం అలవాటయింది. చదవటం అనే రసజ్ఞత ఉండటంతో భోజనం కన్నా బుక్ ముఖ్యమైపోయింది (నవ్వు). అందుకే పుస్తకాల మధ్యలో ఉంటాను. ఇక్కడకన్నా నేల మంగళం ఫార్మ్‌లో ఉన్న ఇంట్లో మూడువేల పుస్తకాలున్నాయి.

**మిసిమి : మిసిమి పై మీ అభిప్రాయం**

**పెద్ది సత్యనారాయణ :** అద్భుతమైన పుస్తకం..వేరే చెప్పేదేముంది. మీ పరిచయం రవీంద్రభారతిలో కలిగింది.

**మిసిమి** : గుర్తుంది. మీరొక బెంగాలీ నాట్య ప్రదర్శనకు వచ్చారు. మీ పంచెకట్టు మమ్మల్ని ఆకర్షించింది. మీరు బయట కనిపిస్తే తెలుగు వారు అయి ఉంటారని పరిచయం చేసుకున్నాం. ఆ అనుబంధం ఇలా కొనసాగుతోంది. తొంభై ఆరులో ఉన్నారు. మీ గొంతులో శబ్ద సౌందర్యం తగ్గలేదు. మీఅంతట మీరు అన్ని పనులు చేసుకోగలుగుతున్నారు. మీ నూరవ పుట్టినరోజు నాడు మళ్ళీ మేమొచ్చి ఇలాగే మీతో కొంతసమయం గడుపుతాం. ఆచార్య ఎన్.జి.రంగా, మహాకవి జాషువా, తెలుగు లెంక తుమ్మల సీతారామమమూర్తి, కొండవీటి వెంకటకవి, కన్నెగంటి పాపారావు.. వీరందరితో మీకున్న మధుర స్మృతులు మాతో పంచుకున్నారు. తద్వారా **మిసిమి** పాఠకులకు ఇవన్నీ చేరుతున్నాయి.. అంతేకాదు ఆనాటి సామాజిక పరిస్థితులు ఎలా ఉండేవి, జీవన ప్రమాణాలు, సాంఘిక ఆచారాలు వంటి అంశాలను చాలా ఓపికగా గుర్తు చేసుకున్నారు.. ధన్యవాదాలు సత్యనారాయణ గారు.

**పెద్ది సత్యనారాయణ :** నేనే మీకు కృతజ్ఞతలు చెప్పాలి.నన్ను నా బాల్య, యవ్వనాల రోజుల్లోకి తీసుకెళ్ళినందుకు....

నిజానికి ఆయనతో ఇంకా సమయం గడిపేవారమేమో.. అప్పటికే ఆయన్ని కలవటం కోసం బెంగుళూరు తెలుగు సంఘం అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి గారు, "పడమటి గాలి" నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు.. వీరిరువురూ

అరగంట నుంచి ఎదురు చూస్తున్నారు.. అన్నట్లు పెద్ది సత్యనారాయణ గారికి ఆచార్య తంగిరాల సుబ్బారావు సన్నిహిత మిత్రులు. ఇటీవలే వారు అనారోగ్యంతో కాలం చేస్తే సత్యనారాయణ గారు మిత్రుడికి నివాళిగా స్మృతి సంచిక తీసుకొచ్చారు. ఆ కాపీలను మాకు బహుకరించారు. **మిసిమి** పత్రిక తరపున పొందూరు ఖద్దరు పంచె-కండువా, పళ్ళు, మిఠాయి వారికి అందచేశాము. వారితో పాటు **మిసిమి** బృందంగా మేముంతా ఎనభై ఏళ్ల వెనక్కి ప్రయాణం చేసి ఆ జ్ఞాపకాలు మూటకట్టుకొచ్చాం. వాటిని అక్షరరాశులుగా మీకు పంచిపెడుతున్నాం....



మిసిమి తో తండ్రీకొడుకులు

*సత్యనారాయణ గారిని రవీంద్ర భారతిలో ఒక బెంగాలీ నాటకం చూడటానికి వెళ్లినపుడు - వారు కోరా ఖద్దరు పంచె - చొక్కా, పైన పెద్ద అంచు కండువాతో కనిపించారు. ఆవిధంగా నాకంట పడితే తప్పనిసరిగా పలుకరిస్తాను. వారు 'అశ్వినికుమార్ మీకోసమే చూస్తున్నాను రండి' అని భుజంమీద చేయి వేసి ఎన్నో సంవత్సరాలుగా తెలిసిన వ్యక్తిగా కలిసిపోయి ఎన్నో కబుర్లు చెప్పారు. పక్కనే వున్న డా. రాజగోపాలరావు గారిని పరిచయం చేశారు. ఆ కలయిక మాకు బంధమైపోయింది. వారు హైద్రాబాద్ వచ్చేముందు నాకు ఫోన్ చేసి ఒకరోజు నాతో గడపాలి అని అనేవారు. అనటమే కాదు - అప్పుడు వారమ్మాయి ఎస్.ఆర్. నగర్‌లో ఉండేవారు - వారింటికి భోజనానికి పిలిచేవారు. ఊరికే పిలవటం కాదు - నాకు ఇష్టమైన కూరలు వండించి వడ్డించేవారు. అలా ఒక పగలు గడిచిపోయేది. రాజభవన్ రోడ్‌లో ఇంద్రప్రస్థ రాజగోపాల రావు గారింటికి వెళ్లి ఒకపూట గడిపేవారం - అదొక భోగం! నన్ను నేలమంగళం రమ్మంటే - ఇద్దరు మిత్రులతో వెళ్లాము - మాకు బస ఏర్పాటు చేసి పొలంలోని వారింట్లో అక్కడ పండిన కూరగాయల్తో భోజనం పెట్టారు. ఆవునెయ్యి వేసి గారాం చేశారు. బేలూరు - హలిబేడు - బాహుబలి క్షేత్రాలు తిరిగాం. బెంగుళూరు తిరిగాం - ఆ తర్వాత నేను బెంగుళూరు విశ్వవిద్యాలయంలో మాట్లాడటానికి వచ్చానని తెలిసి - నేలమంగళం నుంచి - పండ్లు ఫలహారాలు తెచ్చి సమ్మానించారు - నా రచనలన్నీ చదివి అమూల్యమైన ఉత్తరాలు రాశారు - ముఖ్యముగా 'డాక్టరుగారు' ఆయన్ని కదిలించి వేసింది. నేలమంగళలో నన్ను అదిమి పట్టుకుని కన్నీరుపెట్టారు - ఆయనకు నేనేమి ఇచ్చాను? ఏమివ్వగలను - ఈ అక్షర మాలలు గాక?? మొన్న ఆయన దర్శనానికి వస్తున్నానని అనగానే - వారి అబ్బాయి కృష్ణకుమార్‌తో అన్ని ఏర్పాట్లు చేయించారు. కకూన్ సూట్‌లో వుంచి కారు, డ్రైవర్‌ని సిద్ధం చేశారు. మేమున్న మూడురోజులు మాకు ఏ లోటూ రానివ్వలేదు - ఆదివారం ఆయనతో గడిపాం. పొందూరు ఖద్దరు పంచెలు - కండువా తీసుకెళ్లాను. ఎంతో ప్రేమతో తీసుకుని కండువా ధరించి ఫోజు ఇచ్చారు. ఆయన నవ్వు - నెలబాలుని నవ్వే సుమా.*

అశ్వినికుమార్

**సంభాషణ : అశ్వినీకుమార్**

**ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

# చుక్కలతో చిత్రాలు
## (Pointillism Paintings)



జార్జి సూర చిత్రించిన
ఆదివారం మధ్యాహ్నం జెట్ ద్వీపం మీద

*– టి.వి. ప్రసాద్*

**కా**న్వాస్ మీద చిన్న చిన్న చుక్కలతో తయారయ్యే పెద్ద పెయింటింగ్; చిన్న రంగుల చుక్కలు వేటికవే విడివిడిగా, దగ్గర దగ్గరగా పేర్చుకుంటూపోతే తయారయ్యే సుందరమైన ఆకారం ఇది. చుక్కలతో చిత్రించే పెయింటింగ్ శైలిని పాయింటిలిజం (Pointillism) అంటారు. దీన్నే ప్యాంటయిజం, ప్యాటఇజమ్ అని కూడా ఉచ్ఛరించవచ్చు. ఈ వ్యాసంలో 'పాయింటిలిజం' ఉచ్ఛారణే వాడబడింది.

పాయింటలిజం తొలి దశలో డివిజనిజం అనీ, క్రోమోలూమినరిజమ్ అనే పేర్కొనబడింది. ఈ సాంకేతికత పందొమ్మిదవ దశాబ్దపు మలి దశలో పుట్టుకొచ్చింది. దీనిలో ముద్రావాద (Impassionism) శైలీ లక్షణాలు ఎక్కువ. రంగులను విడగొట్టి వాటిని చుక్కల రూపంలోకి మార్చి ఒకదాని పక్కన ఒకటి పేర్చడంతో నేత్రభ్రమ వల్ల ఆశ్చర్యం గొల్పే పెద్ద రూపాలు ఏర్పడతాయి.

పాయింటలిజానికి మరో పేరు నియో ఇంప్రెషనిజం. ఇది కళాచరిత్రలో ముఖ్యమైన సాంకేతిక మలుపు. వర్ణ విభజన (డివిజనిస్ట్) టెక్నిక్‌ను పాయింటలిజంగా పేర్కొన్నా అది సరికాదు అని జార్జి స్యూర, పాల్ సిగ్నాక్‌లు అంటారు. వారు దీన్ని డివిజనిజంగా పేర్కొన్నారు. ఐనా వారి ప్రమేయం లేకుండానే ఇది పాయింటలిజంగా స్థిరపడింది. ఇంప్రెషనిస్ట్‌లు (ముద్రావాదులు) నిజ జీవితంలో ఏమి చూశారో దానికి కాంతివంతమైన చిత్రరూపం కల్పించారు. వీరు నదురైన రంగుల మిశ్రమంతో, బ్రష్‌తో తడిమినట్లుండే (Strokes) ప్రకృతి చిత్రాలు రచించారు. మోనే (Monet), పిసారో, డిగాస్, రెన్వాలు (Renoir) ఈ కోవకు చెందిన ఇంప్రెషనిస్ట్ చిత్రకారులు. నియో ఇంప్రెషనిజం, ఇంప్రెషనిజం యొక్క మెరుగైన అభివృద్ధి రూపం. సహేతుకమైన, శాస్త్రీయమైన పద్ధతిలో అభివృద్ధి చెందిన 1880ల నాటి ఉద్యమం. ఒకే పరిమాణంలో చిన్న చిన్న చుక్కల్ని (tiny dots). వేటికవే విడివిడిగా కన్పించే రంగుల్ని దగ్గర దగ్గరగా వేసి చిత్రానికి రూపం కల్పించడం దీని ప్రత్యేకత. ముద్రావాద ఉద్యమ కళాత్మక పద్ధతుల పునర్మాణ ఫలితం చిత్ర కళాశైలిలో వర్ణ మిశ్రమ, చుక్కల పద్ధతి పుట్టుకకు కారణమైంది. వెలుతురు వల్ల దూరం నుండి చూస్తే రంగుల ప్రభావం అమితంగా కన్పిస్తుంది. రంగుల్ని విడివిడిగా ఉపయోగిస్తారు కాబట్టి దానికి ఈ శైలీ. సాంకేతికతా చిత్రకారులు పెట్టుకున్న పేరు డివిజనిజం.

**కంటిచూపు – శాస్త్రీయత (Science of the Eye) :** కేవలం పాయింటిలిజం కళాకారులకే కాకుండా ఇతర చిత్రకారులకూ అవసరమైన కంటి చూపు విజ్ఞానాన్ని పెంచి కెమిస్ట్ మైఖేల్ యూజీన్ షెవ్రూల్ (chevreul) తన పుస్తకం 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ హార్మనీ అండ్ కాంట్రాస్ట్'లో వర్ణ సామరస్యం, వైరుధ్యాలకు చెందిన సూత్రాలను వివరించాడు.

పారిస్ నగరంలో బట్టల మీద రంగుల డిజైన్‌లు (Patterns) వేసే టాపెస్ట్రీ పనివారు తాము ఉత్పత్తి చేసే బట్టల మీద డిజైన్లు మరింత వర్ణమయంగా శక్తివంతంగా ఉండాలని కోరుకుంటారు. సలహా కోసం వారు షెవ్రూల్‌ను సంప్రదిస్తారు. ఐతే టాపెస్ట్రీ పనివారి రంగుల్లో ఏ లోపం లేదనీ, వాటి మిశ్రమంలోనే అసలు రహస్యం దాగి వుందనీ కనిపెట్టాడు. టాపెస్ట్రీలోని రంగుల ప్రభావం కన్నులు చేసే మాయ అనీ, కెమిస్ట్రీ కాదనీ తెలియజెప్పాడు. వివిధ వర్ణాలు రెంటిని పక్కపక్కన పెట్టి చూస్తే అవి మరీ శక్తివంతంగా



జార్జి సూర

కన్పిస్తాయని చెబ్తాడు. (ఉదా॥ ఎరుపు, పసుపు రంగులు, నీలి, నారింజ రంగులు). టాపెస్ట్రీ వనివారు షెవ్రూల్ సూత్రాన్ని ఆచరణలో పెట్టి టాపెస్ట్రీలకు ఆకర్షణ కలిగిస్తారు. వారు రంగు రంగుల దారాల్ని వక్కవక్కన అమర్చి టాపెస్ట్రీకి బలం, ఆకర్షణ చేకూర్చినట్లుగా పాయింటలిస్టు కళాకారులు కూడా వివిధ వర్ణాల చుక్కలతో ప్రయోగాలు చేసి విజయం సాధించారు. వీరిలో జార్జి సూర (స్యూరత్) ప్రముఖుడు.

**పాయింటలిజం లక్షణాలు :** దీనికున్న ప్రత్యేక లక్షణాల వల్ల పాయింటలిజం మిగతా శైలులకన్నా విలక్షణంగా వుంటుంది. పాయింటిలిజం టెక్నిక్ భిన్నంగా ఉండటం దీనిక్కారణం. చుక్కల్తో సౌందర్యాన్ని సృష్టించడం ఈ కళ (pixelated aesthetics) మొదటి లక్షణం. ఫొటోగ్రాఫ్‌లో, కంప్యూటర్ మానిటర్ మీద ఎన్నో పిక్సెల్స్ కలిస్తే ఆకారం ఏర్పడ్డట్టుగా, అన్నీ ఒకే పరిమాణంలో వున్న, విడి విడి రంగుల చుక్కలు అసంఖ్యాకంగా కలిస్తే చక్కని రూపం ఏర్పడుతుంది. ఈ శైలీ పెయింటింగ్‌లోని ప్రతిబిందువూ (చుక్కా) శుద్ధమైన రంగును కలిగి వుంటుంది. ఇవి ఒక దానితో ఒకటి కలిసిపోని విడివిడి వర్ణ సంకరం కాని చుక్కలు. ఇది రెండవ లక్షణం. ఒక రంగు తర్వాత మరొక రంగుచుక్కలు అన్నీ కలిసి చిత్రానికి పరిపూర్ణ రూపం కలిగిస్తాయి. చుక్కలతోనే వెలుగు నీడలు, లోతు (depth) చూపించవీలవుతుంది. అంతిమంగా జీవం పోసుకున్న అందమైన దృశ్యం కనులముందు ఆవిష్కరిస్తుంది.

నిర్దిష్టమైన ప్రణాళిక – ఆచరణ మూడవ లక్షణం. ఇది గీతలు లేని పెయింటిగు, వైరుధ్యమైన వర్ణాల చుక్కలు పక్కపక్కన పేర్చబడడంతో నేత్ర భ్రమ వల్ల అవి అన్నీ కలిసి పోయినట్లు కనిపించి రంగు, రూపానికి కారణమవు తాయి. పెయింటింగుకు దూరం జరిగే కొద్దీ కొత్త రూపం సమగ్రంగా కన్పిస్తుంది.

**జార్జి సూర (Georges Seurat) : (1859– 1891)** ఇతడు పాయింటలిజంకు ఆద్యుడు. అందుకే సూర కింగ్ ఆఫ్ పాయింటలిజంగా, ఫాదర్ ఆఫ్ పాయింటలిజంగా గుర్తింపు పొందాడు. ఇతడి తొలి చిత్రమే "ఆదివారం మధ్యాహ్నం జెట్ ద్వీపం మీద" (1884–86) అన్న పెయింటింగ్. ఆ తర్వాత లేబరర్స్, బేదర్స్ అట్ ఆస్నీర్, మరెన్నో డజన్ల కొద్ది పెయింటింగులు రచిం చాడు. బేదర్స్ (స్నానం చేసేవారు) చిత్రం లండన్ నేషనల్ ఆర్ట్ గాలరీలో ప్రదర్శింవ బడుతోంది. మొత్తం మీద 173 పెయింటింగులతో అన్నీ చుక్కలతో సృజించినవే. పాయింటలిజం టెక్నిక్‌ను పరిచయం చేశాడు.

**సూర పెయింటలిస్ట్ కళాఖండం – గ్రాండ్ జెట్ ద్వీపం పై ఒక ఆదివారం మధ్యాహ్నం...** దీన్ని చూసిన ఫ్రెంచి కళా విమర్శకుడు ఫిలిక్స్ ఫినియన్ నియో ఇంప్రెషనిజాన్ని చుక్కలతో పెయింటింగ్. పాయింటలిజం అని చులకనగా వ్యాఖ్యానిస్తాడు. స్యూరత్, సిగ్నాక్‌లు దాన్ని డివిజనిజం అనడానికే యిష్టపడినా ఈ శైలీ చిత్రకళ పాయింటలిజంగా స్థిరపడింది. (ఫినియన్ విమర్శించినా సిగ్నాక్ అతని పోర్ట్రేట్‌ను చుక్కల్లో చిత్రించి ఫినియన్‌కు అమరత్వం కలిగించాడు. అది మీమీ – న్యూయార్క్‌లో ప్రదర్శించ బడుతోంది). ఈ పెయింటింగులు శక్తివంతమైన రంగులు, చుక్కలతో నేత్ర భ్రమ వల్ల సుందరమైన రూపాలుగా కన్పిస్తాయి. ఇది ఇటలీలో 19, 20 శతాబ్దాల్లో నియో ఇంప్రెషనిజంగా వ్యాపించింది. అక్కడ 'శ్రామికులకు న్యాయం' లాంటి సామాజికాంశాలకు ప్రాధాన్యత లభించింది.

**పెయింటింగ్ విశ్లేషణ :** చిత్రం పూర్తి పేరు గ్రాండ్ జెట్ ద్వీపం మీద ఒక ఆదివారం మధ్యాహ్నం అని అర్థం వచ్చే ఫ్రెంచి భాషలో ఉంటుంది. 1884–1886 మధ్య జార్జి సూర చిత్రించిన కళాఖండం. ఇది పెయింటలిస్ట్ లందరికీ నమూనాగా ఉపయోగపడింది. సుమారు 2×3 మీటర్ల పెద్ద కాన్వాస్ మీద చిత్రించబడిన ఇది ప్రస్తుతం న్యూయార్క్ మెట్రో పాలిటన్ మ్యూజియంలో ప్రదర్శించ బడుతోంది. సూర(త్) పెయింటింగ్‌లో కన్పించే పార్క్ నిర్మాణానికి వెలుతురు, వర్ణాల ద్వారా రూపం కల్పించాడు. ఈ కళాఖండాన్ని చిత్రించడానికి ముందు ఎన్నో స్కెచ్‌లు, డ్రాయింగ్‌లు వేసి శ్రద్ధగా అంతిమరూపం యిచ్చాడు. కంటి చూపు ప్రభావం, రంగుల కలయికల సూత్రాన్ని (షెవ్రూల్ పరిశోధనాంశం) ఈ పెయింటింగ్‌లో చూపించాడు.

గ్రాండ్ జెట్ ఐలాండ్ పారిస్‌లో ప్రవహించే సీన్ నది మధ్యలో ఉన్న ద్వీపం. ఒకప్పుడు పారిశ్రామిక వాడగా

వున్న ఈ ప్రాంతం తర్వాత పబ్లిక్ గార్డెన్‌గా మారింది. ద్వీపం నగరం మధ్యలో వున్న పల్లె ప్రాంతంలా నగర వాసులకు పల్లెశోభతో ఆటవిడుపుగా వుంటుంది. వారాంతాల్లో విలాసపురుషులకిది విశ్రాంతి ప్రదేశం. ద్వీపం పొడవు రెండు కిలోమీటర్లు వెడల్పు 200 మీటర్లు. ఆదివారం వచ్చిందంటే పారిస్ జనాలు ఎండనుండి తప్పించుకోవడానికి, స్నానం చేయడానికి, చల్లని గాలి కోసం నది ఒడ్డుకు చేరుకుంటారు. చిత్రంలో చూడగానే అనేకులు నది పక్కనున్న పార్క్‌లో సేద తీరునట్లు కన్పిస్తారు. ఒక విలాస జంట, గొడుగు నీడలో ఒక మహిళ, పొడవు టోపీ ధరించిన పురుషుడు పార్కులో తిరుగుతున్నట్లు చూస్తాము. చేపలకు గాలం వేస్తున్న మరో మహిళ, నదిని చూస్తున్న కొంగ, గోధుమ రంగు తలతో తెల్ల కుక్క, అల్లిక పనిలో మహిళ, ట్రంపెట్ వాయిస్తున్న వ్యక్తి, నిశ్చలంగా నిల్చున్న ఇద్దరు సైనికులు, పడవలో గొడుగు కింద ఇంకో మహిళ. తమ సంతానంతో ఆడుకుంటున్న దంపతులతో పార్కు సందడిగా కన్పిస్తుంది. కుడివైపునున్న మహిళ చేతిలోని తాడుకు ఒక కోతిని, ఎడమవైపు ఒక స్త్రీ చేపలు పట్టడం చూస్తాము. ఆ రోజుల్లో ఈ ప్రాంతం ధనికులు వేశ్యలకోసం వెదుకులాడే ప్రాంతం. గాలం వేస్తున్న స్త్రీ అందుకు ప్రతీకేమో అన్పిస్తుంది. చిత్రంలోని మనుషులు రకరకాల పనులు చేస్తూ చిన్నపాటి సమాజానికి ప్రతీకలుగా అన్పిస్తారు. ఈ పెయింటింగ్ 1886లో మొదటిసారి పారిస్ ఇంప్రెషనిస్ట్ ప్రదర్శనలో వెలుగు చూసింది.

సూర దే మరొక పెయింటింగ్ 'స్నానం చేసేవారు' (Bathers at Asnieres) ఆదివారం మధ్యాహ్నం... చిత్రం తర్వాత పెయింట్ చేయబడింది. రెండు చిత్రాల్లో వెలుగు నీడల ప్రభావాన్ని చూస్తాము. ఆదివారం మధ్యాహ్నం చిత్రం రూపొందించడంలో జార్జి సూర రెండు లక్షలకుపైగా చుక్కల్ని ఉపయోగించాడు.

ఫ్రాన్స్‌లో పాయింటలిజం కొద్దికాలమే జీవించినా తర్వాతి అనేక దశాబ్దాల వరకు ఇతర దేశాల్లో ముఖ్యంగా ఇటలీలో ప్రభావం చూపింది. దీని తొలినాళ్ళలో వాంఘో, పికాసో, మాంట్రియన్, కిన్‌డిస్కీలు కూడా కొద్ది కాలం పాయింటలిజం ప్రభావానికి లోనైనవారే! మళ్ళీ దాదాపు వందేళ్ళ తర్వాత 20వ శతాబ్దపు టాపెస్ట్రీలు రంగు దారాల డిజైన్లు సిల్కు, ఉన్నిలో మగ్గం మీద చేతితో నేసిన తెరలు, అందమైన, ఆకర్షణీయమైన తివాచీలు మొదలైన అలంకరణ వస్త్రాలు. చివరిదశలో చిగుర్లు వేసాయి. వర్తమాన కళాకారులు ప్రస్తుతం పాయింటలిజంలో అనేక ప్రయోగాలు చేసి కొత్త పుంతలు తొక్కుతున్నారు.

**ఆదివారం మధ్యాహ్నం... చిత్రంపై విమర్శ :** ఎర్నెస్ట్ బ్లాక్ (Ernest Bloch) చరిత్రకారుడు, మార్క్సిస్ట్ మేధావి, చిత్రంలోని రాజకీయ, సాంఘిక ప్రాధాన్యతను గుర్తించాడు. సమాజ సోమరితనానికి ఈ చిత్రం దర్పణం అంటాడు. చిత్రంలో ఆధునిక జీవితపు, యాంత్రికతను చూశాడు. మరొక ఆధునిక చరిత్రకారుడు విలియం ఆర్, ఎవర్‌డేల్ ఇందులో ప్రజాస్వామ్య లక్షణాలను చూశాడు. పల్లె, పట్టణాల కష్టజీవులు, బూర్జువాలు వ్యవసాయదారులు, ఫాక్టరీ పనివారు కలిసిపోవడం ఒకవైపు సమాజ మాధుర్యాన్ని మరోవైపు సమాజంలోని వైరుధ్యాలను చూపిస్తుంది అంటాడు. చిత్రపు అంచులు, లోపలి చిత్రానికి ఉపయోగించిన రంగులకు వ్యతిరేకంగా వుంటాయి. ఆవలి ఒడ్డు పిల్లవాడు – మేమే భవిష్యత్తు, రండి మాలో కలవడం అని అంటున్నట్లనిపిస్తుంది. ఈ పెయింటింగ్ రెండు దశల్లో జరిగింది, వెలుగు నీడల వైరుధ్యం చూపడంతో చిత్రంలో కదలిక కన్పిస్తుంది. బూర్జువా విశ్రాంత సోమరి జీవితానికి, సామాజిక ఏకాంతానికి, సామాజిక వైభవానికి ప్రతీక అని, చిత్రం రెండంచుల పదునైన కత్తి అని వ్యాఖ్యానించబడింది.

**ప్రముఖ పాయింటలిజం చిత్రకారులు పాల్ సిగ్నాక్ (Paul Signec) (1863–1935) :** ఇతడు జార్జి సూర శిష్యుడు. సూర మరణించే వరకు అతని వెంట వుండి పని చేశాడు. సూర మరణం తర్వాత రెండవ ప్రముఖ పెయింటర్‌గా గుర్తింపు పొంది, పాయింటలిజం టెక్నిక్‌ను మరింత పరిపుష్టం చేశాడు. పాయింటలిజం కలిగించే భ్రమపై తన గురువుతో కలిసి అనేక ప్రయోగాలు చేశాడు. వెనిస్ గ్రాండ్ కెనాల్ ముంగిట (ఎంట్రెన్స్ టు గ్రాండ్ కెనాల్) 1905 చిత్రం సిగ్నాక్ పెయింటింగుల్లో బాగా పేరు గాంచింది. ఇతడు కూడా వందలాది పాయింటలిజం పెయింటింగులు వేశాడు. ఎంట్రెన్స్ టు ది గ్రాండ్ కెనాల్ పెయింటింగ్‌లో బ్రష్ పనితనం, మెరుపులు, ఆర్భాటం లేని లేతరంగుల చుక్కలతో చిత్రించిన సుతి మెత్తని చిత్రం.

**ఛార్లెస్ ఆంగ్‌రాండ్ (Chrless Angrand) (1854–1926):** ఈ ఫ్రెంచి ఆర్టిస్ట్ నియో ఇంప్రెషనిస్ట్ పెయింటింగుల ద్వారా పేరు గడించాడు. పారిస్ చిత్ర కళా రంగంలో



పాల్ సిగ్నాక్ చిత్రించిన ఎంట్రెన్స్ టు గ్రాండ్ కెనాల్



మాక్సి మిలీయమ్ లూస్ చిత్రించిన మార్నింగ్ ఇంటీరియర్,

1880-1890ల మధ్య ముఖ్య వ్యక్తిగా గుర్తింపు పొందాడు. తన పెయింటింగులన్నిటినీ గాఢత తక్కువగా ఉన్న మధ్యస్త లేత రంగుల్లో చిత్రించాడు. మ్యూటెడ్ కలర్స్‌లో చిత్రించిన వీధిలో జంట (Couple in the Street) 1887 నాటి చిత్రం ప్రత్యేకమైనది. ఫ్రాన్స్ జాతీయ కళాశాల తిరస్కరించినా తన సొంత శైలితో రాణించాడు. చిన్న చుక్కల స్థానంలో పెద్ద పెద్ద బ్రష్ రంగుల అద్దకంతో చిత్రాలు రచించాడు.

**థియోవాన్ రైసెల్ బర్గ్ (Theovan Rysselberghe) 1862-1926 :** బెల్జియానికి చెందిన పెయింటర్, 20వ శతాబ్ది మలుపులో ఐరోపా కళారంగంలో ప్రముఖ పాత్ర పోషించాడు. కోస్టల్ సీన్ (సముద్ర తీర దృశ్యం), జీన్ పిసారో పోర్ట్రేట్, మోడల్ పగటినిద్ర (The Models Siesta). మేడమ్ థియోవాన్ పోర్ట్రేట్, ఏలిస్ సీథ్, బేథింగ్ వుమన్ మొదలైన అనేక చిత్రాలు వేశాడు. ఏలిస్ సీథ్ (Alice Sethe) 1888 ఇతడి మొదటి పాయింటలిస్ట్ పెయింటింగ్.

**మాక్సి మిలీయమ్ లూస్ (Maximilien Luce) :** ఈ ఫ్రెంచి చిత్రకారుడు పాయింటలిజం టెక్నిక్‌లో తన గురువైన సూరను మించిపోయాడు. చిత్రాలను ఎంతో మక్కువతో, శక్తివంతంగా చిత్రించాడు. మార్నింగ్ ఇంటీరియర్, ద పోర్ట్రేట్ ఆఫ్ ట్రోపెజ్‌లు ఇతని ప్రఖ్యాత చిత్రాల్లో రెండు. మొత్తం 165 కళా కృతుల కర్త. ఇతని చిత్రాల్లో ఎక్కువ భాగం ప్రకృతి దృశ్యాలు. నగర దృశ్యాలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. స్వతంత్ర కళాకారుల సంఘానికి తన స్నేహితుడు సిగ్నాక్ తర్వాత అధ్యక్షుడయ్యాడు.

**హెన్రీ ఎడ్మండ్ క్రాస్ (Henry Edmund cross) 1856-1910:** ప్రముఖ నియో ఇంప్రెషనిస్ట్ పెయింటర్లలో ఒకడు. కామిల్ పిసారో, క్లాడ్ మోనేల ప్రభావితుడు. పారిస్ స్వతంత్ర కళాకారుల వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. ఆ సమయంలోనే ఇతర చుక్కల కళాకారులతో పరిచయాలు పెంచుకున్నాడు. ఇతని ఎన్నో పెయింటింగుల్లో లాండ్‌స్కేప్, రాబోయే తుఫాన్, ద పింక్ క్లౌడ్, ఫిషర్ మన్‌లు కొన్ని మాత్రమే. అతని పనితనంలోని నేర్పు హెన్రీ మాటిస్ వంటి గొప్ప చిత్రకారుల మీద ప్రభావం చూపడంతోపాటు ఫావిజం పుట్టుకకు దారి తీసింది.

**హెన్రీ మాటిస్ 1869-1954 :** ఇతడు కూడా ఫ్రెంచి దృశ్యకళారుడే. ఫావిజం పెయింటింగుతో పేరు గాంచాడు. ఇతని చిత్రాల్లో వర్ణమిశ్రమం ప్రవహిస్తున్నట్లుంది. లక్స్-కామ్ (Luxe Calme) 1904 నాటి చిత్రం పాయింటలిజం, ఫావిజమ్ లక్షణాల మిశ్రమం. దీన్ని ఫావిజం పుట్టుకకు మూలంగా భావిస్తారు. ఇది విశ్రాంతి - భ్రమల (Fantasy) కూర్పు.

**ఏన్ రోసలీ బోక్ (Anne Rosalie Boch):** నాటి సమకాలీన చిత్రకారుల బృందంలో బోక్ బెల్జియానికి చెందిన మహిళా ఆర్టిస్టు. చిత్ర కళా కృతుల సేకర్త. నియో ఇంప్రెషనిస్ట్‌గా పేరు గాంచినా బోక్ తొలి దశ చిత్రాలన్నీ ఇంప్రెషనిస్ట్ శైలీ చిత్రాలే. సమకాలీన చిత్రకారుల చిత్రాలను సేకరించిన కళా ప్రేమికురాలు.

వివిధ దేశాలకు చెందిన పాయింటలిజం పెయింటర్లందర్నీ పరిచయం చేసుకోవడం కష్టసాధ్యం.

కో–జోస్టర్ (నెదర్లాండ్స్), జార్జి మోరెన్, జెల్లీ విల్కర్ సన్, అల్బర్ట్‌డు బోయిసీ, హెన్రీ విల్లెయిర్మ్, పిలె గ్రాఅశ్రీశ్రీవ్ గిన్ బర్ట్‌కోంబాజ్ స్పైరో బొకారిక్, ఆదామ్ షక్రీలు ఆయా దేశాల ప్రసిద్ధ చిత్రకారులు. చివరిగా విన్సెంట్ వాంఘో, పికాసోల గురించి ప్రత్యేకంగా చెప్పుకుందాం.

**విన్సెంట్ వాంఘో (1853–1890) :** 19వ శతాబ్ది చివరిదశలో పాయింటలిజం చాలా మంది కళాకారులపై తీవ్రమైన ప్రభావాల్ని చూపించింది. వాంఘో కూడా ఈ ప్రభావం నుండి తప్పించుకోలేకపోతాడు. ఐతే వాంఘో చుక్కలకు బదులుగా బ్రష్‌తో తట్టినట్లు (Strokes) ఉండే పద్ధతిలో 'అండర్ గ్రోత్' పెయింటింగ్‌ను సృష్టించాడు. ఇతడు డచ్ ఇంప్రెషనిస్ట్ చిత్రకారుడు. పాశ్చాత్య చిత్ర కళారంగంలో మిక్కిలి ప్రభావశీలి. ఇతడి చిత్రాలు చాలా వరకు అతడి జీవిత చరమాంకం, చివరి రెండు సంవత్సరాలలో వచ్చినవే. ఈ దశలోనే వాంఘోకు సూర, పాల్ సిగ్నాక్‌లతో కల్గిన పరిచయం, అండర్ గ్రోత్ పెయింటింగ్ పుట్టుకకు కారణమయింది. 'అండర్ గ్రోత్' వాంఘో పాయింటలిజం శైలికి, అతనికి జీవితంలోనే కాదు – శైలిలోనూ స్థిరత్వం లేదని చెప్పడానికి చక్కని ఉదాహరణ. అత్యంత సాంకేతిక ప్రాధాన్యత కలిగిన పాయింటలిజం నుండి త్వరలోనే బయటపడతాడు. వాంఘో పోర్ట్రేట్లలోను, స్టారీనైట్ పెయింటింగ్‌లోనూ పాయింటలిజం లక్షణాలు స్ఫుటంగా కన్పిస్తాయి.

పాబ్లో పికాసో చిత్ర కళలో పికాసో నుండి తప్పించుకున్న ఏ ఒక్క శైలీ కన్పించదు. ఏ శైలిలో చిత్రాలు వేసినా అవన్నీ గొప్ప కళాఖండాలుగా నిలిచి పోయాయి. 1917లో చిత్రించిన 'ద హేపీ ఫేమిలీ' పాయింటలిస్ట్ టెక్నిక్‌కు, దాని లక్షణాలకు గొప్ప ఉదాహరణ. దైనందిన కృత్యాల (జనర్) ధోరణిలో పాయింటలిజమ్ శైలిలో వేసిన చిత్రం. కుటుంబంలోని సంతోష సన్నివేశాన్ని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆత్మీయత, ప్రశాంతత అన్నింటినీ చూపించాడు. నదురైన, వైవిధ్యం కలిగిన వర్ణాలూ, సాంకేతిక ప్రతిభ ఆర్టిస్టుగా పికాసో గొప్పతనాన్ని చాటుతాయి.

**పాయింటలిజం శైలీ ప్రత్యేకతలు – సమస్యలు :** అంత సులభంగా ఆచరణ సాధ్యం కాని ప్రత్యేక శైలి. రంగుల స్వభావం రంగుల మిశ్రమ పరిజ్ఞానం అవసరం. చుక్కలు ఎంత చిన్నవిగా, ఎంత దగ్గర దగ్గరగా ఉంటే చిత్రం అంత ప్రభావ శీలిగా ఉంటుంది. ఇది సాంప్రదాయక చిత్ర రచనా పద్ధతికి పూర్తి వ్యతిరేకం.

పాయింటలిజం పెయింటింగ్ చాలా సమయం తీసుకుంటుంది. ఒక్కొక్క చుక్కనూ జాగ్రత్తగా వేసుకుంటూ పోవాలి. చిత్రం అంతిమ రూపాన్ని ముందే ఊహించడం పెద్ద సమస్య. ప్రతిభావంతులకే సాధ్యమయ్యే పని. చిత్ర రచనలో ఏ రంగులో ఎంత మేర చుక్కలు, ఏ రంగు పక్కన ఏ రంగు వేయాలో తెలియడం అవసరం. ఈ శైలీ పెయింటింగ్ చిత్రించడానికి నేర్పుకుతోడు ఓర్పు కూడా కావాలి. చిత్రం పూర్తి కావడానికి వారాలు, నెలలు, సంవత్సరాల టైం పడ్తుంది. ముందుగా పాలెట్ మీద రంగులు కలుపుకుని కాన్వాస్ మీద బ్రష్ పని చేయడం కుదరదు. రంగుల చుక్కల్ని నేరుగా కాన్వాస్ మీదనే వేయాలి. ఇదొక వింత, ప్రత్యేకమైన కళ (Idiocyneratic Art) విమర్శలనెన్ని ఎదుర్కొన్నా చిత్ర కళలో పాయింటలిజంది ప్రత్యేక స్థానం. కళాచరిత్రలో ఈ ఉద్యమానిది కీలక మలుపు.

**పాయింటలిజం – ప్రస్తుత పరిస్థితి :** 19వ శతాబ్దపు చివరి, 20వ శతాబ్దపు తొలి దశాబ్దాలలో రాణించిన ఈ కళ కొంతకాలం వరకు కనుమరుగై మళ్ళీ 20వ శతాబ్దపు చివరి దశలో, వందేళ్ళ విరామం తర్వాత కొత్త ప్రయోగాలతో చిగురిస్తోంది. వర్తమాన కళాకారులు చుక్కల స్థానంలో వేరే వివిధ వస్తువులతో ప్రయోగాలు చేస్తున్నారు. ఒకనాటి కళా ఖండాలకు కొత్త మాధ్యమాల్లో కొత్త రూపాల్ని యిస్తున్నారు. మిగ్విల్ పెయిడ్రో (Mignel Peidro) ఎన్‌డారా 2011 నాటి చుక్కలతో సృజించిన హీరో సృష్టికి 3.2 మిలియన్ చుక్కలను, ఒక సంవత్సర కాలాన్ని వెచ్చించవలసి వచ్చింది.

వర్తమాన ఆర్టిస్టుల్లో జేన్‌పెర్కిన్స్, జాన్‌వెర్మీర్ కళాఖండం. గర్ల్ విత్ పెర్ల్ ఇయర్‌రింగ్ చిత్రాన్ని వేలాది వివిధ సైజుల బటన్స్ ఉపయోగించి పాయింటలిజం శైలిలో ఆధునిక పాప్ ఆర్టుగా మార్చి చూపింది. కెర్విన్ బ్లాక్ బర్న్ వ్యర్థాలతో ప్రయోగాలు చేస్తున్న మరో మహిళా ఆర్టిస్టు, హెన్రీ విలెయిర్మ్ (నెదర్లాండ్స్), జార్జిమోరెన్, జెల్లీ విల్కర్‌సన్, అల్బర్ట్ డుబోయిస్, చుక్ క్లోజ్ తదితరులు వివిధ దేశాల వర్తమాన పాయింటలిస్ట్ ఆర్టిస్టులు.

ఇతర చిత్రకారులు చుక్కల్లో చంద్రుణ్ణి చూపిస్తే పాయింటలిస్టులు చుక్కల్తో చంద్రుణ్ణి చూపిస్తారు.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

## పురస్కారాల స్వీకారం
# వ్యక్తిగత సంఘర్షణ

*– గొంటి బాబ్జి*

ఎవరికైనా అవార్డు లభించింది అంటే, వారు చేసిన కృషిని గుర్తించి, పది మందిలోనూ గౌరవించడం, వారికి ఒక ప్రత్యేకతను అందించడం. అప్పటికే ప్రజాదరణ పొందారన్న దానికి రుజువు కావచ్చు, ఇక ముందు పొందబోతారనే దానికి సూచనా కావచ్చు–అవార్డు. అది చేకూర్చే ప్రయోజనం ఏదో ఉందని మాత్రం స్పష్టంగా ఊహించవచ్చు. స్థూలంగా చెప్పాలంటే–ఇంతే, కాని దానిలో చాలా మెలికలున్నాయి.

కొంత మందికి ఇవ్వడం ద్వారా అవార్డుల ఘనతను పెంచుదామని ఇచ్చేవారు ప్రయత్నాలు చేస్తే, ఆ అవార్డును సామ దాన భేద దండోపాయాలతో– పుచ్చుకుని, తద్వారా 'ఘనత'ను కొట్టేయ్యాలని అనేకులు ప్రయత్నిస్తూ ఉంటారు. వారి అర్హత గురించి అనేక అనుమానాలు వినవస్తాయి. దూషణ భూషణ తిరస్కారాలకు అతీతమైన కార్యశూరులు వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగిపోతారు. అది ఎంత చిన్న సంస్థ అయినా సరే, లోపాయకారీ ఒప్పందాల వల్ల లభిస్తున్నా సరే, డబ్బులిచ్చి కొనుక్కుని అయినా సరే అవార్డు కొట్టేయ్యాలి అని గట్టి పట్టుతో ఉన్నవారు, ఇప్పుడు దానిని దక్కించుకున్న వారి కోసం చప్పట్లు కొడితే, ఏదో ఒక రోజున మన ప్రయత్నాలో, పైరవీలో ఫలించి మనకు అవార్డు అంటూ వచ్చినప్పుడు– మన కోసం కూడా చప్పట్లు కొట్టే గుంపు ఉంటారనే ముందు చూపుల వారూ అనేకులు ఉంటారు, నా మట్టుకు నాకు, వారితో పేచీ ఏదీ లేదు. అవార్డులనేవి కొన్ని ద్వారాలను తెరుస్తాయి, కొన్ని మార్గాలను సుగమం చేస్తాయి అని మెజారిటీ ప్రజలు నమ్మినప్పుడు–వాటి కోసం వారికి చేతనయిన మార్గాలలో ప్రయత్నిస్తున్నారు తప్పేముంది అనుకుంటాను.

అయితే, అధికార చర్యలను ప్రతిఘటించేవారు, దాని నిర్ణయాలను వ్యతిరేకించేవారూ–'అవార్డును పుచ్చుకోవడం – ఆమోదాన్ని అందించడంతో సమానం' అనే అవగాహన కారణంగా అవార్డులను తిరస్కరిస్తారు. తమ స్థాయికి తగినవని తోస్తేనే తీసుకుని, కాని పక్షంలో వదులుకునే వారు, తమ భావజాలానికి అనుకూలమైన వాటిని మాత్రమే ఆమోదించేవారు, కేవలం తటస్థ /ప్రైవేట్ సంస్థల నుండి మాత్రమే తీసుకునేవారు, ప్రభుత్వం నుండి లభించడం అంటే యావత్ ప్రజానీకానికి ప్రాతినిథ్యం వహించేదని భావించి వాటిని మాత్రమే స్వీకరించేవారూ –ఇలా ఎన్నో రకాలు. ఆ స్పందనలలో ఉండే స్వల్ప భేదాలూ, ఈ వైవిధ్యం– అంతా గతంలోని మాట. ఇప్పుడు ఆ గొంతుకలేవీ వినబడడం లేదు పెద్దగా. అసలు ఏ ఒకరినో ఎంపిక చేసి వారికి ఒక ప్రత్యేకతను ఆపాదించడం, గౌరవాన్ని కట్టబెట్టడం–అనే ఆలోచననే మౌలికంగా తిరస్కరించేవారూ ఉంటారట కానీ నేను చూడలేదు. "ఎప్పుడో మాకు రావలసింది కనీసం ఇప్పటి కన్నా ఇచ్చారు కానీయండి" అని మూలిగే 'గతకాల ప్రతిభావంతుల'ను చాలా మందిని చూస్తున్నాం.

ఇన్ని రకాల వారున్నారు కాబట్టే, ఎప్పటికప్పుడు– అవార్డు స్వీకారానికి సమర్థనగా వింతవింత కారణాలు వినబడుతూ ఉంటాయి. విప్లవాత్మక మైన భావాలను, ఉత్తమ శిల్పంతో–కథల్లో లోతుగా ప్రవేశపెట్టి తెలుగుకథను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లిన రచయిత ఒకరు–'ఏ అవార్డునైనా, రివార్డునైనా–కథ కోసం తాను చేపట్టిన ఒకానొక ప్రాజెక్టు కోసమే వాడతాను' అని ప్రకటించి– అవార్డులను స్వీకరించారు. తిరుగుబాటును అతి శక్తివంతంగా తన కవిత్వంలో వినిపించిన కవి మరొకరు – 'నా కవిత్వానికీ, అవార్డుకూ ఏ సంబంధమూ లేదు, అది తీసుకున్నా–నా గొంతుక అదే స్థాయిలో పలుకుతుంది' –అని నొక్కి చెప్పారు. ఇలా అవార్డుల గురించి పరస్పర వ్యతిరేక అభిప్రాయాలు వినవస్తున్నా, అవార్డుల గురించిన

చర్చ జరుగుతూనే ఉంది. ఏమిటి కారణం? ఎవరు ప్రశ్నిస్తున్నారు, ఎందుకు ప్రశ్నిస్తున్నారు? దాని గురించి చర్చించే ముందు, ఎవరినిప్రశ్నిస్తున్నారు-అనే విషయంలో స్పష్టత ఉండాలి.

పురాణాలలో కొత్త స్వారస్యాలు వెతికి చెప్పే పండితులకో, 'సెల్ఫ్ హెల్ప్' అనే పల్ప్ ఫిక్షన్ రాసుకునే లౌకికులకో అవార్డులు వస్తే, దాని గురించి ఎవరూ ప్రశ్నిస్తారనుకోను. అయితే, ఆలోచనాపరులూ, పదికాలాల పాటు నిలిచే అక్షరాలు రాసి ప్రజల మనసులపై ముద్ర వేసిన సాహిత్యకారుల విషయంలో ప్రశ్నలు లేచే అవకాశం ఉంది. ఏ రచనలకు, రచయితకూ ప్రాసంగికత ఉందో, వారి గురించే చర్చ జరుగుతుంది. మరి ఇప్పుడు అవార్డు లభించిన విప్లవకవి గురించి-ఎవరికీ పట్టనేలేదు నిజానికి. ఇస్తే తీసుకుంటాం, లేదంటే ఊరుకుంటాం-ఆ విషయాని కంత కంటే ప్రాముఖ్యత లేదు అని నిజాయితీగా నమ్మి, ఆ ప్రకారంగానే ఆచరించే సాహిత్యకారులు ఉంటారు. వారిలో అసాధారణ ప్రతిభాశాలులు, లబ్ధ ప్రతిష్ఠులు కూడా ఉంటారు-నేను వారికి మాత్రమే ఈ చర్చను పరిమితం చేస్తున్నాను. ఒకవేళ అవార్డు వైపు మొగ్గు చూపినా-అది కేవలం సాహిత్యపరమైన కారణాల వల్లనే-అంటే మరింత ఎక్కువ మందికి తమ రచనలు చేరుకుంటాయనో, మరిన్ని భాషలలో పాఠకులకు అందుతాయనో, ఎన్నో తరాల పాటు సుస్థిరంగా మన స్మృతి నిలిచి ఉంటుందని ఆశ తప్ప, స్వార్థ పరత్వమో, స్వీయానురాగమో ప్రేరణలు కావని కూడా ఒప్పుకుని, ఆ తర్వాతనే చర్చ సాగిద్దాం.

బాధ్యతతో రచనా వ్యాసంగం సాగించే వారు, ప్రజాస్వామిక విలువలను రచనలలో ప్రధానంగా చిత్రీకరించేవారు-రచయితలను జైలులో వేసిన సమయంలో-అవార్డును స్వీకరించడం ఎంత వరకూ సమంజసం అన్న ప్రశ్న లేచినప్పుడు-"వారి ఇష్టం, తీసుకుంటారో మానుతారో, మనమెవరం నిర్ణయించడానికి?" "నిజానికి ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వారినీ, ఆ పరిధి లోనికి రాని రచనలనీ-ప్రశ్నించలేము, విప్లవ రాజకీయాలతో సంబంధం పెట్టుకున్నవాళ్లే అవార్డుల పట్ల ఈ దృక్పథంతో వ్యవహరించడం లేదు, ఇంక అలా పెట్టుకోనివారిని ఏమనగలం?"అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

బలమైన గొంతుకలను, తమ పక్షాన చేసుకోవడానికి ప్రభుత్వం అందించే లంచాలు అవార్డ్‌లనే అవగాహన కొన్ని సందర్భాలలో మనకు కనిపిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ, అవార్డు స్వీకారం అనేది పూర్తిగా వ్యక్తిగతమైన విషయం అనీ, నైతిక చట్రంలో దానిని పెట్టి, తూచకూడదనీ అంటున్నారు. విప్లవాల కబుర్లు చెప్పి, వెనుదిరిగి ప్రభుత్వపు పంచన చేరిన వారిని విమర్శిస్తే అర్థం ఉంది గానీ, అలాటి వాగ్దానాలు చెయ్యని వారిని ఎలా అడుగుతాం అని కూడా చాలా మంది అంటున్నారు. కానీ ఇది వ్యక్తుల మీద 'మాట తప్పేరన్న' అభియోగాన్ని మోపే సందర్భం కాదు. ఈ విషయానికున్న ప్రాముఖ్యత ఎటువంటిదంటే, వ్యక్తిగత స్థాయిని దాటి సామూహిక స్థాయిలో దాని గురించి, సంవాదం జరగవలసి ఉంది.

మరొక కోణంలో కూడా చర్చ జరుగుతోంది-అనాదిగా తీరిక సమయమన్నదే అందనివ్వకుండా, శతాబ్దాల తరబడి వారి కళనూ, సృజననూ- ప్రధాన స్రవంతిలోకి రాకుండా అడ్డుకుని, ఇక దశాబ్దాల నుండి వారి సృష్టిని వారికే తెలియకుండా చేజిక్కించుకుని-అంచుల్లోకి నెట్టివేయబడిన సమూహాలు-స్త్రీలూ, దళితులూ - వారికి సంబంధించిన చర్చ. ఈ గుర్తింపు, గౌరవాల రాజకీయాలలో వారి వైఖరి ఎలా ఉండాలి అన్నది కూడా చర్చనీయాంశమే. దానికి సంబంధించిన ఒక అభిప్రాయాన్ని ఇక్కడ ప్రస్తావించడమే తప్ప-వివరంగా చర్చ చెయ్యబోవడం లేదు: "ముందు నుయ్యి, వెనక గొయ్యిలా ఉంటోంది దళితులకు, ఈ వామపక్ష భావాల సాహిత్యకారులు ఎక్కడుంటే అక్కడ-ఇదే జరుగుతుంది, వీళ్ల మాటలు వినకపోతే, దుష్ప్రచారం చేస్తారు, దూరం పెడతారు, సరే అని వీళ్ల మాట విని అవార్డులను కాదనుకుంటే, ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేస్తుంది. ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను, ప్రభుత్వపు ఫలానా పాలసీకి నిరసన అనో, మరేదో చర్యకు వ్యతిరేకంగా అనో-మీమీద ఏదైనా ఒత్తిడి తెస్తారేమో. మీరు అదేదీ పట్టించుకోకండి, అవార్డులు వద్దనడం, వెనక్కి ఇచ్చేయడం వంటి కుప్పిగంతులు వెయ్యకండి, మరీ ముఖ్యంగా-దళిత రచయిత్రులను ఉద్దేశించి ఈ సలహా చెప్తున్నాను" అని హెచ్చరికలు వినవస్తున్నాయి.

ఏదో ఒక ఒత్తిడి వల్లనే తప్ప, అవార్డ్ వద్దనే నిర్ణయాన్ని స్వంతంగా ఎవరూ తీసుకోరనీ, అవార్డును

సాధించడం, బయటి ఒత్తిడులకు లొంగకుండా దానిని ఉంచుకోవడం– అదే దళిత రచయితల తక్షణ కర్తవ్యం అనీ వీరి విశ్వాసం అనుకుంటాను. ఏది ఏమైనా, దళితులపై దాడులు ఎప్పటికంటే కూడా ఎక్కువైన ఈ తరుణంలో–ఏది సరైన అడుగు, ఏది వారి లక్ష్యం వైపు పడే అడుగు అనేది నిర్ణయించుకోవలసింది వారే.

వెరసి, అవార్డు అంటూ రావడమే సృజనకు శిఖరాయమానమైన మజిలీ అనే ఏకాభిప్రాయానికి వచ్చారు మనలో చాలా మంది.కాబట్టి అవార్డులు నిరాకరించడం –త్యాగం చెయ్యడంతో సమానంగా భావిస్తున్నారు, వాటిని నిరాకరిండం అంటే–తనకుమాలిన ధర్మమే. అలాటి 'ఆదర్శాలను' రచయితల మీద రుద్దుతున్నారు అభ్యుదయ వాదులు–అనే అభిప్రాయంతో చాలా మంది ఉన్నారు. దానితో నేను ఏకీభవించడం లేదు. దీనిలో మనం సాధారణంగా పరిగణనలోకి తీసుకోని అంశాలు ఉన్నాయని నా ఉద్దేశం. అవార్డులను సైద్ధాంతికంగా వ్యతిరేకించడాన్ని కాకుండా, వాటి ఫలితాలను, ప్రభావాలనూ ప్రాపంచిక దృష్టికోణంతో చర్చించే ప్రయత్నం చేస్తాను. ఆ సందర్భంలో 'ఇమేజ్'కు ఉదాహరణగా చూపించడానికి –తెలుగు సాహిత్యంలో 'స్టార్'లంటూ ఎవరూ కనబడక కొంచెం ఇబ్బందిపడ్డాను–వేరే రంగాల ప్రముఖుల పేర్లు చెప్పక తప్పలేదు. ముందుగా ఒక విషయాన్ని స్పష్టపరుచుకోవాలి. అవార్డు అంటే–కేవలం పరోపకార పరాయణత్వంతో ఒకరు మరొకరికి అందించే ఒక బహుమతి అనే భ్రమలో ఉన్నాం. దాని నుండి బయట పడాలి. మనం అప్పుడప్పుడు పొగడ్తలు వింటూ ఉంటాం చూడండి, 'ఫలానా వారి వల్ల అవార్డుకే పేరు వచ్చిందని', అది నిజమే కూడా కొన్ని సందర్భాలలో. పుచ్చుకునే వారికే కాదు, ఇచ్చేవారికీ, ఇప్పించే వారికీ–లాభం రకరకాల రూపాలలో (గుడ్‌విల్, లెజిటిమసీ, రెలవెన్స్) ఉంటుంది.

దీనిని వివరించడానికి ఒక ఉదాహరణ ఇస్తాను: అడ్వర్టైజ్మెంట్ రంగంలో బ్రాండ్ అంబాసిడర్‌లు ఉంటారు. వారి ఉత్పత్తికి సరిపోయే, ప్రజల మనసులో నాటుకుపోగల ఒకఇమేజ్‌ను వారు ఊహించుకుంటారు, దానికి కేంపెయిన్ ద్వారా రూపకల్పన చేస్తారు, దానిని పోషించగల ప్రముఖుల కోసం వెతుకుతారు, అప్పటికే అటువంటి ఇమేజ్‌ను ఆ ప్రముఖులు సాధించి ఉంటే కేంపెయిన్ మరింత ప్రభావం చూపే అవకాశం ఉంటుంది కనక అటువంటి వారికి మరింత గిరాకీ. సినిమా నటి తాప్సీ పణ్ణు విషయమే తీసుకోండి, ఒక బలమైన, స్వతంత్ర వ్యక్తిత్వం అనే గుర్తింపు అప్పటికే వచ్చింది కనక ఎముక లకు పుష్టిని ఇస్తుందని చెప్పే పానీయానికి ఆమెను ఎన్నుకున్నారు. అంటే అందచందాలూ, సినిమాల విజయమూ, నటనా సామర్థ్యం మాత్రమే కాదు, 'ఇమేజ్' –అంటే ప్రజలు ఆమెను ఎలా చూస్తున్నారు అనేది అక్కడ ప్రధాన అంశం. సాహిత్యకారుల విషయంలో ఇమేజ్ అంటే, వారి భావజాలం, వారు నమ్మే విలువలతోపాటు, ప్రజల మనసులను తాకగల వారి నైపుణ్యం అని అర్థం చేసుకోవాలి. అరుంధతీ రాయ్ బుకర్ అవార్డ్‌ను తీసుకుంది. విశ్వవ్యాప్తంగా, బుద్ధిజీవులకు పరిచయం అయ్యింది. దాని వల్ల తన భావాలకు, తాను సహకారం అందించే ఉద్యమాలకూ ప్రచారం జరిగింది.

మరో విషయం, ఎంపిక చేసుకునేది సంస్థలే కాదు –ప్రముఖులకు కూడా తమ ఇమేజ్ గురించి పూర్తి అవగాహన ఉంటుంది. ఏ బ్రాండ్‌కు తమ పేరును జోడించాలనే విషయంలో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. ఆమిర్ ఖాన్ సినిమా అవార్డులకు దూరంగా ఉండడం – ఆదర్శవాదమో, త్యాగమో కాదు. అదే అయితే, ఆస్కార్ కోసం వెళ్లి ఉండేవాడు కాదు, దీనానాథ్ మంగేష్కర్ అవార్డును పుచ్చుకుని ఉండేవాడు కాదు. సినిమా అవార్డ్‌ల చవకబారు వ్యవహారం తన ఇమేజ్‌ను కించపరుస్తుందని భావించాడు. ఈ ఉదాహరణ ద్వారా చెప్పదలుచుకున్న విషయం ఏమిటంటే–తీసుకోవడానికీ, వద్దనడానికీ కూడా –ఎవరికి సమంజసమనిపించే కారణాలు వారికి ఉండవచ్చు అని. కనుక అవార్డులను అందరూ ఒకే దృష్టితో చూస్తారనేది వాస్తవం కాదు. వారి కేది ప్రయోజనకారి అనిపిస్తుందో, వారి సాహిత్య పయనంలో వారే మజిలీ వద్ద ఉన్నారో, వారి సృజనకూ, లెగసీకీ ఏర్పడే హాని, లాభాలేమిటో బేరీజు వేసుకుని–ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటారు.

మరి రచయిత తనకు సరైనదని తోచి తీసుకున్న నిర్ణయం గురించి, పాఠకులకు తమ అనంగీకారం, వ్యతిరేకతను తెలిపే హక్కు, విమర్శ చేసే హక్కు– ఉంటుందా ఉండదా అనేది ప్రశ్న. దానికి జవాబుగా, ఇటీవలే జరిగిన ఉదంతాన్ని తీసుకుందాం: అవార్డు

తీసుకున్నందుకు–తాను అభిమానించే రచయితపై–వ్యక్తిగత స్థాయిలో ఒక వ్యక్తి నిరాశను ప్రకటించారు. రచయిత పరిచయం చేసిన ప్రగతిశీల భావాలతోనూ, జీవితంపై వారు చేసే సూక్ష్మ పరిశీలనలతో ప్రభావితమై, ఆ అక్షరాలతో మమేకం చెంది, వారి ప్రవర్తనలో కనిపించే ప్రజాస్వామిక విలువలను గమనించి, అవే విలువలకు భంగం కలుగుతున్న బయటి పరిస్థితులకు తాను విచలిత మవుతూ, రచయిత నుండి సంఘీభావాన్ని అపేక్షిస్తూ, ఒక అభిమాని వినిపించిన 'భావావేశపు స్పందన' (emotional response) గా నాకది కనిపించింది. రచయిత ఏమని ప్రతిస్పందిస్తున్నారో–తెలియదు కానీ–వారి అభిమానులో, లేక అవార్డుల అభిమానులో గానీ తీవ్రంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం చర్చల దిశ ఎలా ఉందో చెప్పడానికి ఈ రెండు వాక్యాలు చదవండి:

"అవార్డు వచ్చిందని, వారి మీద అసూయ."

''తెలుగులో ఇంకా చాలా మందికి అవార్డులు ప్రకటించబడ్డాయి కదా? వాళ్ళను ఎందుకు విమర్శించడం లేదు?"

రచయితలకూ, వారి రచనల వల్ల ప్రభావితమైన పాఠకులకూ ఉండే అనుబంధాన్ని వీరెవరూ గుర్తించడం లేదనిపించింది. పాఠాన్ని శ్రద్ధగా విని వంటబట్టించుకున్న విద్యార్థే, ప్రశ్నలు అడిగే శ్రమతీసుకుంటాడు. ఒక రకంగా అది ఉపాధ్యాయుడి విజయమే. భావ ప్రసారం జరిగిన చోట, వ్యక్తులు సన్నిహితమవుతారు. ఇబ్బందికరమైన ప్రశ్నలను సైతం వేస్తారు. అంతమాత్రాన ఎవరి కోరికలు మరెవరికీ శిరోధార్యాలు కానవసరం లేదు. విన్నాక, ఆలోచించాక, నిర్ణయం తీసుకునే హక్కు సంపూర్ణంగా రచయితకు ఉంటుంది. దానిని ఎవరూ కాదనరు–అయితే, రచయితను ఆ విషయమై సంబోధించడమే నేరంగా మారిన పరిస్థితి నాకు రుచించడం లేదు. ఆవేదన వ్యక్తీకరణ పట్ల సానుభూతి లేకపోవడం, అలాటి ప్రశ్నలు సంధించే వారందరినీ–కుసంస్కారులుగా, ఓర్వలేనివారుగా, అహంభావులుగా చిత్రీకరించడం అభ్యంతరకరంగా అనిపించింది.

ఇలాటి ప్రతిస్పందనలు, ప్రశ్నలను నీరుగారుస్తాయి. అవార్డులు తీసుకోవడం మానడం అనేది, వ్యక్తిగత నిర్ణయమైనా –ప్రజల మీదా, తోటి రచయితల మీదా ప్రభావం చూపగల నిర్ణయం కనుక, చర్చ జరిగేందుకు సానుకూల పరిస్థితులు ఉండాలి. నిర్ణయం తీసుకునే వారి మనసులో ప్రశ్నలను లేవనెత్తడం, సమాధానాలను సరఫరా చేయగలగడమే–ఈ చర్చలకు లక్ష్యంగా ఉండాలి. అవార్డుకు సర్వవిధాలా అర్హులై, తమ ప్రయత్నం ఏమీ లేకుండా–పిలిస్తే వెళ్తాం, ఇస్తే పుచ్చుకుంటాం అనే వారితోపాటు, ఈ విషయంలో ఇంకా ఏ నిర్ణయానికీ రాని వారికి కూడా ఇలాటి చర్చల వల్ల మేలు జరుగుతుంది. తాము తీసుకునే నిర్ణయపు ప్రభావమేమిటని ఆలోచించు కుంటారు, దానిలో ధ్వనించే రాజకీయాల పట్ల తమకు అభ్యంతరం ఏమైనా ఉందా అని తరచి చూసుకుంటారు. అంతిమంగా నిర్ణయం వారిదే–అది ఏదైనా సరే.

కాలం ఎప్పుడూ ఇలాగే ఉండిపోదు, వ్యక్తులెప్పుడూ ఒక్కలాగానే ఉండరు. ఒకనాడు ప్రజల కోసం పనిచేసిన వారు, ఇప్పుడు ఉద్యమాలను హేళన చేయవచ్చు. అలాగే తన చుట్టు పక్కల ఏమౌతోందనేది ఏనాడూ పట్టని వ్యక్తి –తన దృష్టిని ఏ మారుమూల ప్రదేశానికో ప్రసరించి, అక్కడి ప్రజలను సంఘటిత పరచవచ్చు. ఇవేళ ప్రజల కోసం మాట్లాడేవారెవరూ, పుడుతూనే సామాజిక స్పృహను తమ వెంటతెచ్చుకుని రాలేదు.

ఒక్కొక్కరికి ఒక్కొక్క సందర్భంలో ఒక స్పృహ కలుగుతుంది. తోటి మనుషుల జీవితాలను లోతుగా పరిశీలించి, వారి అభివృద్ధిని కాంక్షించి బాధ్యతతో రచనలు సాగించే వారికి ఈ స్పృహ కలిగే అవకాశం మరింత ఎక్కువ ఉంటుంది. వారి నుండి సహకారాన్నీ, సంఘీభావాన్నీ అపేక్షించడం ఎన్నటికీ వృథా కాబోదు. కనుక ప్రశ్నలు వేసేవారు వేస్తూనే ఉండాలి.

గొంటిబాబ్జి
పరిశోధకవిద్యార్థి, తెలుగువిభాగం,
ఆంధ్రవిశ్వకళాపరిషత్, ఫోన్ : 8688061477.

# శ్రీకృష్ణ భారతం

– డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి



శ్రీకృష్ణ దేవరాయలు

మహాకవి, శతావధాని డా॥ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ గారు రచించిన రెండవ చారిత్రక కావ్యం 'శ్రీకృష్ణ భారతం' (శ్రీకృష్ణరాయ ప్రబంధం). సుబ్రహ్మణ్య శర్మ గారు 14.2.1938 న కడపజిల్లా వల్లూరు మండలంలోని టి.కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. 16.2.2002 న స్వర్గస్థులయ్యారు. ఆయన నూతన కావ్య ప్రారంభానికి అనువైన కథావస్తువును గురించి ఆలోచిస్తూ, ఒకరోజు గంగాదేవి రచించిన 'మధురావిజయం' అనే సంస్కృత ప్రౌఢకావ్యాన్ని చదివి ప్రభావితులయ్యారు. అంతేగాక ప్రొద్దుటూరుకు చెందిన దుర్భాక రాజశేఖర శతావధాని గారు 'రాణాప్రతాప సింహచరిత్ర'ను, తన గురువైన డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి గారు 'శివభారతం' అనే చారిత్రక మహాకావ్యాలను రచించారని, కడప జిల్లాలో పుట్టడం వల్ల వాళ్ళ మార్గంలోనే విజయనగర వీరుల చరిత్రను మహాకావ్యాలుగా రచించాలని నిశ్చయించుకున్నారు. తత్ఫలితంగా 1957 నుంచి 1987 వరకు 30 సంవత్సరాలు ఆయన తన జీవితాన్ని విజయనగర చరిత్రకు అంకితం చేశారు. మొదట పది సంవత్సరాల కృషితో శ్రీకృష్ణదేవరాయ పూర్వాంధ్ర చరిత్రను 'శ్రీమదాంధ్రాభ్యుదయం'గా, తర్వాత ఇరవై సంవత్సరాల కృషితో శ్రీకృష్ణదేవరాయల చరిత్రను 'శ్రీకృష్ణభారతం'గా రచించారు. ఇంకా శ్రీకృష్ణదేవరాయల బాల్యవృత్తాంతంతో 'శ్రీకృష్ణరక్షణమ్' అనే సంస్కృత నాటకాన్ని కూడా రాశారు.

శ్రీకృష్ణదేవరాయలు సకల దక్షిణ భారత చక్రవర్తి, గొప్ప పరిపాలనాదక్షుడు, మేటి పరాక్రమవంతుడు, మహాకవి, సాహిత్య సంగీత శిల్పకళా పోషకుడు. శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రుల అభిమాన కథానాయకుడు కావడం వల్ల చాలామంది ఆయనపై ఖండికలు, ఖండకావ్యాలు, కావ్యాలు రచించారు. అయితే తెలుగు సాహిత్యంలో శ్రీకృష్ణదేవరాయలపై వెలువడిన కవితారచనలన్నింటికంటే రాశిలోనూ, వాసిలోనూ గొప్పదైన కావ్యం శ్రీకృష్ణభారతం. 3003 పద్య గద్యాలతో, 8 ఆశ్వాసాలతో కూడుకున్న ఈ వీరరస కావ్యం 1990లో వెలువడింది. ఈ గ్రంథం భూతపురి వారికి గొప్పకీర్తితో పాటు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ పద్యకావ్య పురస్కారాన్ని, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని, గజారోహణ గండపెండేర హస్తకంకణ సత్కారాలను, కవిసార్వభౌమ, ఉభయకవి సార్వభౌమలాంటి బిరుదులను సంపాదించి పెట్టింది. భూతపురి వారు పలువురు ఆంగ్ల, ఆంధ్ర చరిత్రకారులు చెప్పిన విషయాలను పాదసూచికల్లో పేర్కొంటూ ఉత్తమ చారిత్రక విలువలతో ఈ మహాకావ్యాన్ని రచించారు.

1953లో కవితారంగంలో కాలుమోపిన భూతపురి వారు 2002 వరకు 49 సంవత్సరాలపాటు కవితా సరస్వతిని ఆరాధించి తరించారు. ఆయన పరమార్థశ్రీ, శ్రీశైల మాహాత్మ్యం, శ్రీ భూతపురి రామాయణం కావ్యాలను, 'అహల్య' అనే స్వతంత్ర నాటకాన్ని రచించడంతోపాటు భాసుని 'ప్రతిమా' నాటకాన్ని, భట్టబాణుని 'కాదంబరి'ని ఆంధ్రీకరించారు. శ్రీభద్రాచల రామ సుప్రభాతం (సంస్కృతం), శ్రీషిరిడీ సాయిబాబా సుప్రభాతం (సంస్కృతం) రాశారు. యజుర్వేదంలోని 'రుద్రానికి', ఆదిశంకరుల 'కనకధారాస్తవానికి', రామాయణంలోని 'ఆదిత్య హృదయానికి' వ్యాఖ్యలు రచించారు.

అవధానవిద్యలో కూడా ఆరితేరిన భూతపురి వారు ఆంధ్ర, తమిళ, కర్ణాటక రాష్ట్రాల్లో అష్టావధాన, శతావధానాలు చేసి కవిపండితుల ప్రశంసలందుకున్నారు. ఆయన 2 శతావధానాలను, సుమారు 160 అష్టావధానాలను చేశారు. ఆయన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా 1959లో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత

కడపజిల్లాలోని టేకూరుపేట, ముద్దనూరు, కొండాపురం, చింతకొమ్మదిన్నె జిల్లాపరిషత్ పాఠశాలల్లో ప్రధానాంధ్ర పండితులుగా పనిచేసి 1996లో పదవీ విరమణ చేశారు. ఆయన విద్యాసేవను గుర్తించి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం 1989లో 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం'తో సన్మానించింది. భరతవంశీయులైన కౌరవ పాండవుల కథ భారతం. ఇది తెలుగువారికి ఇష్టమైన గ్రంథం. ఈ 'భారత' శబ్దం కాలక్రమంలో అర్థ విపరిణామం చెంది "ఎవరిదైనా విస్తృతంగా కలిగిన చరిత్ర" అనే అర్థాన్ని పొందింది. అలాంటి అర్థంతో రచింపబడిందే ఈ శ్రీకృష్ణభారతం. అంతేగాక మహాభారత లక్షణాలైన వివిధ ధార్మిక తాత్త్విక రాజకీయోపదేశాలు, విభిన్న పాత్రల మానసిక ప్రవృత్తుల సంఘర్షణలతో కూడుకున్నదై అష్టదిగ్గజ కవుల శైలిలో ప్రౌఢంగా రచింపబడి నామసార్థక్యంతో విలసిల్లుతున్న గ్రంథమిది. కావ్య ప్రేరకులైన షడ్దర్శనం సుబ్బరామశర్మ గారు నవచారిత్రక కావ్యసృష్టికి నాంది పలికిన దుర్భాక రాజశేఖర శతావధాని గారిని శివునితో, డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి గారిని విష్ణువుతో, ప్రస్తుత కావ్యకర్త అయిన డా॥ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ గారిని బ్రహ్మతో పోల్చి మీరు ముగ్గురూ చారిత్రక కావ్యరచనా కవిత్రయమని పేర్కొంటూ మహాభారతఖ్యాతి పొందగల శ్రీకృష్ణభారతాన్ని రచింపమని ఇలా ప్రేరేపించారు.

**'ధనదాప్తుండగు 'రాజశేఖరు' దతంద్రస్ఫూర్తి రాణాచరి**
**త్ర, ననంతుండగు 'శేషశాస్త్రి' సముదాత్తంబౌ శివాజీచరి**
**త్రను మున్నాడిరి, నీవు వాక్పతివి సుబ్రహ్మణ్యశర్మా! నృసిం**
**హనరేంద్రాత్మజుగాథ నేర్పుఋపు ముద్యద్భారతఖ్యాతిగా'**
***(పీఠిక-40 ప)***

ఈ ముగ్గురు కవుల పేర్లలో త్రిమూర్తుల పేర్లు సహజంగానే ఉండి కావ్యప్రేరకులైన షడ్దర్శనం సుబ్బరామ శర్మగారి భావనను మరింత అర్థవంతం, సౌందర్యవంతం చేశాయి. శ్రీకృష్ణదేవరాయల తండ్రి అయిన తుళువ నరసరాయల పరిపాలనతో మొదలైన గ్రంథం భువన విజయ సభలో అష్టదిగ్గజాలలో అగ్రేసరుడైన అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'ను కృష్ణరాయలు అంకితం తీసుకోవడం, పెద్దనకు గండపెండేరం తొడగడంతో ముగుస్తుంది. చరిత్ర దృష్టితో చూసేవారికి ఇందులో శ్రీకృష్ణదేవరాయల మరణం వరకు సమగ్రంగా చెప్పబడలేదనే భావన కలుగవచ్చు. కేవలం చరిత్ర రచన చేయడం కాక చరిత్రను ఇంచుమించు ఉన్నది ఉన్నట్లుగా చెబుతూనే జాతిని చైతన్యవంతం చేయడం ఆధునిక చారిత్రక కావ్యకర్తల లక్ష్యం. అందువల్ల వాళ్ళు సమగ్రమైన జీవితాన్ని చెప్పరు. అంతేకాక మంగళాది, మంగళమధ్య, మంగళాంతాని అనే భారతీయ సంప్రదాయాన్ని పాటిస్తారు. చరిత్ర ప్రకారం చూసినా కృష్ణరాయల జీవితంలో ఈ ఘట్టం తర్వాత అంతగా చెప్పుకోదగిన విషయాలు లేవు. క్రీ.శ. 1509లో రాజ్యానికి వచ్చిన కృష్ణరాయలు క్రీ.శ. 1529లో చనిపోయాడని చరిత్ర చెబుతున్నది. ఇందులో క్రీ.శ. 1522 వరకు జైత్రయాత్రలు సాగించాడు. వీటి తర్వాతనే తీరికగా భువనవిజయ సభాభవనాన్ని కట్టించి వివిధ భాషా కవులకు స్థానమిచ్చాడు. కనుకనే శర్మగారు ఈ ఘట్టంతోనే కావ్యాన్ని ముగించి తమ భావనా పటిమను చాటుకున్నారు.

భూతపురివారు తమ గురువుగారైన డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి గారి మార్గంలోనే తమ కావ్యనాయకుడైన శ్రీకృష్ణదేవరాయల ధీరోదాత్త లక్షణాలను కావ్యపీఠికలో ఆవిష్కరించారు. వీరాధివీరుడు, సమస్త భారతదేశంలో వేద ధర్మాన్ని స్థాపించడానికి పూనుకున్నవాడు, గొప్పదైన సాహిత్య రంగంలోనూ పరాక్రమానికి నెలవైన యుద్ధరంగం లోనూ చక్రవర్తి, దయాసముద్రుడు, శ్రీవేంకటేశ్వరస్వామిని నిరంతరం ఆరాధించేవాడు, హిందూరాజ్యాన్ని కాపాడాలని కంకణం కట్టుకున్నవాడు అయిన శ్రీకృష్ణదేవరాయలు సామాన్యుడు కాదంటూ చెప్పిన శార్దూల పద్యం చూడండి.

**'వీరోత్తంసు, దశేష భారతధరా వేదార్థ సంస్థాపన**
**శ్రీరమ్యుం, దురు సాహితీ సమరధాత్రీ సార్వభౌముండు, స**
**త్కారుణ్యాంబుధి, వేంకటేశ్వర పదధ్యానైక చిత్తుండు, హిం**
**దూ రాజ్యావన బద్ధకంకణుడు కృష్ణుండేమి సామాన్యుడే'**
***(పీఠిక-34 ప)***

ఈ కావ్యంలో తుళువ నరసరాయల పరిపాలన, శ్రీకృష్ణదేవరాయల బాల్యం, విద్యాభ్యాసం, తిమ్మరుసు జీవిత విశేషాలు, ఆయన బుద్ధిబలం, స్వామిభక్తి, కృష్ణరాయల దిగ్విజయ యాత్రలు, రాజనీతి పటిమ, మతాతీత దృక్పథం, రాయల కళాపోషణ, పరిపాలనా దక్షత, భువన విజయ వైశిష్ట్యం మొదలైన అంశాలు హృదయంగమంగా చిత్రింపబడ్డాయి.

మొదటి ఆశ్వాసంలో విద్యానగర వర్ణన 36 పద్యాల్లో చేయబడింది. నికోలోకాంటి, అబ్దుల్ రజాక్, డొమింగో

పేయస్, బార్బోసా, న్యూనిజ్ లాంటి విదేశీయులు విజయనగరాన్ని చూసి, దాని ఘనతను తమ రచనల్లో పొందుపరచారు. కృష్ణరాయలకు సమకాలికుడైన డొమింగో పేయస్ అనే పోర్చుగీసు యాత్రికుడు “నేను ఒక కొండ ఎక్కి చూశాను. అక్కడ నుండి నగరంలో చాలాభాగం కనిపిస్తుంది. అక్కడ నుండి నాకు కనిపించిన భాగం రోమ్ అంత పెద్దగా ఉంది. చూడడానికి చాలా అందంగా ఉంది” ("What I saw from thence seemed to me as large as Rome and very beautiful to the sight etc") అని విజయనగరాన్ని వర్ణించాడు. కవిగారు ఈ విషయాన్ని పాదసూచికలో ఉదాహరించారు. విదేశీయులు సైతం రోమ్ నగరం లాంటిదని ఇష్టంతో విద్యానగర సౌందర్యాన్ని చూడడానికి వస్తారంటూనే మన దేశంలోని పవిత్రమైన మరియు ప్రసిద్ధమైన అయోధ్య, ద్వారక, కాశీ మొదలైన ప్రదేశాల లాంటిది కాదని వర్ణించారు. నిజానికి రోమ్ ప్రసిద్ధి పొందిన అందమైన నగరమే కాక క్రైస్తవ మతగురువులైన పోపులు నివసించే పవిత్రమైన నగరం కూడా. అందువల్లనే శర్మగారు కూడా మనదేశంలోని అలాంటి నగరాల ప్రస్తావన చేశారు. అంతేగాక తిక్కన మహాకవి లాగా ‘కాదు’ అనే పదానికి ‘అవును’ అనే వ్యతిరేకార్థం చెప్పారు. ‘కాదు’ అనే పదాన్ని పలుమార్లు ప్రయోగించి ఆలంకారికమైన సౌందర్యాన్ని కూడా కల్పించారు. విద్యారణ్యస్వామిచే స్థాపించబడిన విజయనగరం అయోధ్య, ద్వారక, కాశీ లాంటి పుణ్యస్థలమని, అందంతోపాటు ప్రసిద్ధిని కలిగిన నగరమని, సకల సంపదలతో వెలుగొందుతున్న దేవేంద్రునితో సమానులైన రాజులు పరిపాలిస్తున్నారని చెప్పి దాని ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తూ వర్ణించిన పద్యం చూడండి.

**‘ఆ సాకేతము గాదు, ద్వారకయు గా, దా కాశియున్ గాదు, ధా**
**రా సత్పట్టణమేని గాదు, మఱి యింద్రప్రస్థమున్ గాదు, శ్రీ**
**వాసేంద్ర ప్రతిమానులౌ నృపులు శశ్వద్రీతి బాలింప, వి**
**ద్యాసౌందర్యము జూడవచ్చెదరు రోమన్ బ్రీతి వైదేశికుల్’**

***(1 ఆశ్వా - 5 ప)***

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో శ్రీవిల్లిబుత్తూరును వర్ణించినా, అల్లసాని పెద్దన అరుణాస్పద పురాన్ని వర్ణించినా నిజానికి వాళ్ళిద్దరూ చేసింది తాము తమ కళ్ళతో చూసిన విజయనగరాన్ని వర్ణించడమే. భూతపురివారు కూడా కొన్ని పద్యాలు ఉన్నవి ఉన్నట్లుగా వాళ్ళనే అనుకరించి రచించారు. కృష్ణరాయలు విద్యానగరంలోని వరిమళ్ళను, నగర రక్షకుల కర్తవ్యదీక్షను ప్రస్తావిస్తూ ‘తల బక్షచ్చట గ్రుచ్చి బాతువులు.....” అనే మత్తేభ పద్యాన్ని రసవంతంగా రచించాడు. వరిమళ్ళకు పారే నీటి కాలువల మధ్యభాగంలో ప్రాతఃకాలంలో బాతులు రెక్కల్లో తల దూర్చుకొని నిద్రపోతుంటాయి. తెల్లటిముద్దల్లాగా ఉన్న వాటిని చూసి కాపలావాళ్ళు అంతకు ముందే అక్కడ స్నానం చేసి మరచిపోయి వెళ్ళిన బ్రాహ్మణుల బట్టలముద్దలుగా భ్రమపడి, వాటిని వాళ్ళకు చేర్చడానికి తీసుకుందామని రేవుల్లోకి దిగుతారు. ఆ సందడికి బాతులు మేల్కొని పారిపోతాయి. ఆ దృశ్యాన్ని చూసి పైర్లు కాపలా కాస్తున్న అమ్మాయిలు నవ్వుతుంటారంటూ చమత్కార భరితంగా చెప్పిన ఆ భావాన్ని యథాతథంగా అనుకరిస్తూ కవిగారు కూడా మత్తేభ పద్యంలోనే అందంగా ఆవిష్కరించిన తీరు చూడండి.

**‘శిరమున్ టెక్కలలోన గ్రుక్కి బకముల్ క్షేత్రంపుగుల్యాలి ని**
**ద్ర రహింపన్ గని, యూరి యారెకులు ప్రాతస్స్నాత సంయాత భూ**
**సుర పిండీకృత శాటులంచు ద్విజవాస్తుశ్రేణి జేర్పించు సు**
**స్ఫురణన్ రేవుల డిగ్గబాఱ గని నవ్వున్ శాలిగోపీతతుల్’**

***(1 ఆశ్వా - 18 ప)***

కౌసల్యా సుమిత్రల వంటి తిప్పాంబా నాగాంబలతో ఓబాంబను కూడా తుళువ నరసరాయలు భార్యలుగా కలిగి దశరథుడిలా ఉన్నాడని చిత్తూరు జిల్లాలోని నారాయణపురానికి చెందిన అచ్యుతరాయల తామ్రదాన శాసనం పేర్కొంటున్నది. దీనిని శర్మగారు ఇలా అందంగా పద్యరూపంలో చెప్పారు.

**‘జగతీనాయకమౌళికిన్ దశరథక్ష్మానాథు భంగిన్ విలా**
**స గుణాలంకృత మానినీత్రయము శశ్వద్రీతి దిప్పాంబ భా**
**గ్యగతిన్ బెంపగ, నాగలాసతియు వేడ్కల్ దీర్ప, నోబాంబ**
**కీర్తి గురుత్వస్థితి గూర్ప, రాజనితరశ్రీ నిండ జెల్వొందెడున్’**

***(1 ఆశ్వా - 53 ప)***

డొమింగో పేయస్ రాయల రూపాన్ని తెలుపుతూ "He has on his face signs of small pox..." అని రాశాడు. ఇక్కడ రాయలకు ముఖంపై స్ఫోటకపు మచ్చలు ఉన్నాయనే చెప్పబడింది కానీ ఎప్పుడు వచ్చాయనే విషయం చెప్పబడలేదు. ఈ విషయంలో కూడా కవి గారు ఒక చక్కని కల్పన చేశారు. బాల్యంలో ఒక రోజున కృష్ణరాయలకు జ్వరం రాగా తల్లి నాగాంబ దృష్టిదోషమని భావించి తగిన చర్యలు చేపట్టింది. అయినా తగ్గక

పోవడంతో వైద్యుల్ని పిలిపించింది. వాళ్ళు వచ్చి పరీక్షించి అది అమ్మవారని, మందులకు తగ్గదని, శరీరంపై బొబ్బలు లేచి తగ్గుతుందని చెప్పారు. వేపబండారు పట్టించడం వల్ల మూడురోజులకు ఆ వ్యాధి తగ్గి ఆ అమ్మవారి మచ్చలు అలాగే ముఖంపైన, శరీరంపైన నిలిచిపోయాయని ***(1 ఆశ్వా - 125 వ)*** చెప్పారు.

డొమింగో పేయస్ తిమ్మరుసు గొప్పతనాన్ని చెబుతూ "Salvatimica who is the principal person that enters the buildings supervises the whole, for he brought up the king and made him king and so the king looks on him like father, whenever the king calls to him he adresses him as Lord (Sentor-Appaji) Salvatimica and all the captains and nobles of the realm make salaam to him (Appaji)" అని రాశాడు. భూతపురి వారు ఈ విషయాన్ని పాదసూచికలో ఉదాహరిస్తూనే ఒక సన్నివేశాన్ని కల్పించారు. విషాన్నం పెట్టి పసివాడైన శ్రీకృష్ణదేవరాయలను చంపాలని సవతితల్లి తిప్పాంబ ప్రయత్నించగా తిమ్మరుసు కాపాడతాడు. అప్పుడు తుళువ నరసరాయలు తిమ్మరుసుకు కృతజ్ఞతను తెలిపి, సర్వశాస్త్రకోవిదుడవైన నీవు నా కొడుకుకు విద్యాబుద్ధులు నేర్పాలని కోరతాడు. ప్రతిభావంతుడైన నీ కొడుకు నన్ను నోరార అప్పాజీ! అని పిలుస్తాడు కనుక అతని చదువు విషయం నేను చూసుకుంటానని తిమ్మరుసు తుళువ నరసరాయలతో చెప్పినట్లు **(2 ఆశ్వా - 183 వ)** రచింపబడింది. చిన్నతనంలోనే రాయల ప్రతిభాపాటవాలను తిమ్మరుసు గుర్తించినట్లు, ఆదరించినట్లు చెప్పడం ద్వారా కవిగారు భవిష్యత్తులో కృష్ణరాయలు చేయబోయే ఘనకార్యాలు, ఆయనపై తిమ్మరుసు ప్రభావం మొదలైన అంశాలు మనకు ఈ సందర్భంలోనే స్ఫురించేటట్లు చేశారు. ఇదే సందర్భంలో భూతపురివారు తుళువ నరసరాయలతో తిమ్మరుసుకు చెప్పించిన ఈ కందపద్యం ద్వారా తమ పద్యవిద్యా ప్రతిభను ఇలా వెల్లడించారు.

**'నన్నెఱుగుదు సుతు నెఱుగుదు**
**నన్నలమిన శ్రమ లెఱుగుదు నాదుసతుల బు**
**ద్ధిన్నెతి యెఱుగుదు కృష్ణుని**
**మన్నిక కే నెవడ నీకు మంతనమాడన్'**

***(2 ఆశ్వా - 178 ప)***

ఈ పద్యంలో మనకు తిక్కన కృష్ణరాయబార సందర్భంలో చెప్పిన "మమ్మెఱుగు దెదిరి నెఱుగుదు....." అనే పద్యం తీరు స్ఫురించడం పెద్ద విశేషం కాదు. ఈ పద్యం విశిష్టతను ఆచార్య శలాక రఘునాథశర్మ గారు తమ అభిప్రాయంలో తెలియజేస్తూ 'భారతంలో ధర్మరాజు మానసికస్థితి ఎలాంటిదో, ఇక్కడ తుళువ నరసరాయల స్థితి అలాంటిదే. ఇలా తూకమైన సన్నివేశంలో మహాకవి పద్యానికి దీటైన పద్యం రచించాలనే భావన ఏర్పడడం ఉత్తమకవి లక్షణం. ఇలాంటి పద్యాలు ఇందులో కొల్లలుగా ఉన్నాయి' అని అన్న మాటలు అక్షరసత్యాలు.

తుళువ నరసరాయలు, నాగలాంబ పుత్ర సంతానం కోరి విల్లుపుత్తూరులోని మన్నారు శ్రీకృష్ణుని ఆరాధించారు. తత్ఫలితంగా ఆ శ్రీకృష్ణుడే తమ నోముఫలంగా తమ ఇంట పుట్టబోతున్నట్లుగా అనుభూతి చెందారు. 'శ్రీకృష్ణదేవరాయలు శ్రీకృష్ణుని అవతారమని అప్పటివారి నమ్మకం' అని చరిత్ర పరిశోధకులు నేలటూరి వేంకట రమణయ్య గారు 'శ్రీకృష్ణదేవరాయలు' అనే గ్రంథంలో పేర్కొన్నారు. తుళువ నరసరాయలకు మాటిమాటికీ మనస్సులో కొడుకు పుడతాడనే భావనే తలెత్తుతోందని, శ్రీకృష్ణుని శరీరంపై ప్రకాశించే తులసిమాల వాసనలు అంతఃపురంలో గుబాళిస్తున్నాయని, చక్రధరుడు, సత్యభామ భర్త అయిన శ్రీకృష్ణుడు అప్పుడప్పుడు అక్కడక్కడ అంతఃపురంలో నాగాంబకు కనిపిస్తున్నాడని, మాటిమాటికీ నాగాంబకు శ్రీకృష్ణుని కాలిగజ్జెల సవ్వడి వినిపిస్తోందని, పలుమార్లు శ్రీకృష్ణుడు నాగాంబను చూసి అమ్మా! నీ చనుబాలు కోరి నీకు కొడుకుగా పుట్టబోతున్నానని అంటున్నాడని, భగవంతుడైన శ్రీకృష్ణుని దయా విశేషాన్ని తెలుసుకోవడం సాధ్యపడదంటూ కొడుకు పుట్టాలని కోరుకుంటున్న తుళువ నరసరాయల, నాగాంబల మధురానుభూతులను సుబ్రహ్మణ్య శర్మగారు అర్థాంతరన్యాసాలంకారంతో సీసపద్యంలో రసరమ్యంగా ఇలా చిత్రించారు.

**'అడుగడుగున దోచు నెడదలో రాజవర్యు**
**నకు గాబోవు పుత్త్రోదయంబు**
**మాటిమాటికి వీచు మహిపుధామమున గృ**
**ష్ణతులసికా దామసౌరభమ్ము**
**లెడనెడ గనిపించు నింటిలో నింతికి**

**జక్రాధిశోభిత సత్యవిభుడు**
**సారెసారెకు రాణి శ్రవణాల రవళించు**
**శ్రీకృష్ణపాద మంజీరరవము**
**తడవ తడవకు గృష్ణు దత్తరుణి జూచి**
**'వత్తునే తల్లి! నీ చనుబాలు గోరి**
**నీకు సుతుడనై' యంచు వాఙ్నియతి తెల్పె**
**గృష్ణ సత్కృపా పారమ్య మెఱుగ దరమె?'**

కృష్ణరాయల భార్య అయిన చిన్నాదేవి వేశ్యకాంత అని చరిత్రకారుల అభిప్రాయం. కె.ఎస్.కోదండరామయ్య గారు అనే పరిశోధకులు ఆమెను క్షత్రియకాంతగా పేర్కొన్నారు. భూతపురి వారు ఈ విషయాలన్నింటిని పాదసూచికల్లో పొందుపచి, కోదండరామయ్య గారి అభిప్రాయానికి అనుగుణంగా రాశారు. అంతేగాక అభిజ్ఞాన శాకుంతలం నాటకంలో శకుంతలను చూసిన దుష్యంతుడు ఆమె మునికన్యక కాదని అనుకున్నట్లుగా కాళిదాసు మహాకవిని అనుకరిస్తూ చిన్నాదేవిని వెలయాలు పెంచడం వల్ల ప్రజలు ఆమెను కూడా వేశ్యగా భావిస్తున్నారని, అంతమాత్రం చేత ఆమెను వేశ్యగా భావించడం తగదని, ఆమె మంచికులంలో పుట్టిందని నా మనస్సు నిరంతరం ఎలుగెత్తి చాటుతోందని కృష్ణరాయలు తిమ్మరుసుతో చెప్పినట్లుగా చమత్కారయుక్తంగా ఇలా చిత్రించారు.

**'వెలయామెను బెంచె నంచు బ్రజ లా బింబోష్ఠినిన్ వేశ్యగా దలపోయం జని, రంత మాత్రమున నత్తన్వంగినిన్ వేశ్యగా దలపన్ వచ్చునె? యోగ్యమే యది? యమాత్యశ్రేష్ఠ! యత్తన్వి స త్కుల సంజాత యటంచు నా హృదయముద్ఘోషించు నెల్లప్పుడున్'**
***(4 ఆశ్వా - 354 ప)***

కృష్ణరాయలు విజయనగర సామ్రాజ్య పాలకుడుగా పట్టాభిషిక్తుడైన వెంటనే బహమనీ సుల్తాన్ ముహ్మాదుశాహు జిహాద్ ప్రకటించి పెద్దసైన్యంతో విజయనగరంపై దండెత్తి వచ్చాడు. ఆ యుద్ధంలో పాల్గొన్న కృష్ణరాయలు చీల్చి చెండాడే కోరలతో ప్రకాశించే పెద్దపులిలా, అడవులను కాల్చేసే కార్చిచ్చులాగా, చెట్ల కొమ్మలను నాశనం చేసే గాలి లాగా పాండవమధ్యముడైన అర్జునునికి సాటి వచ్చేవాడు అనదగిన పరాక్రమవంతుడై యుద్ధరంగమంతటా తానై ప్రసరించి విజృంభిస్తూ శత్రువీరులను సంహరించాడంటూ తిక్కన మహాకవిని స్ఫురణకు తెస్తూ వీరరసోత్కర్షతో వర్ణించిన విధం చూడండి.

**'విచ్చిన కోరలన్ నెగడు బెబ్బులివోలె, వనంబులేర్చు కా ర్చిచ్చు విధాన, గొమ్మల నశింపగ జేసెదు గాలి మాడ్కి, వి వ్వచ్చున కుద్దియౌ ననెదు పౌరుషవంతుడు కృష్ణభూవిభుం డచ్చటులారులన్ దునిమె నంతట దానయి విక్రమింపుచున్'**
***(4-129)***

మహాప్రౌఢకవి అయిన కృష్ణరాయల చరిత్రను, ప్రౌఢకవులైన అష్టదిగ్గజ కవులను గురించి రచించే కావ్యంలో ఆ ప్రౌఢత తప్పనిసరిగా ఉంటుంది. శర్మగారు ఆరవ ఆశ్వాసంలో రచించిన వసంతఋతు వర్ణన ప్రారంభపద్యం వసుచరిత్రను తలపింపజేస్తుంది. అనేక రకాలైన పర్వతాల మిట్టపల్లాల్లోనూ, భూమండలపు దిక్కుల చివర వరకు ఉన్న అరణ్య ప్రాంతాల్లోనూ, తోటల్లోనూ నివసించే పక్షుల మనస్సులకు ప్రశాంతతను కలిగిస్తూ ఆనందాన్ని నింపుతూ, మనోహరమైన గాలితో, ఇనుప ఈటెలను పోలిన పూలతో ఒప్పుతూ పలువురు విరహులైన బాటసారులను బాధింపజేస్తూ, పర్వతాల గుంపుకు గతజన్మల్లో సిద్ధింపజేసుకున్న అదృష్టమై వసంతకాలం వచ్చిందంటూ రామరాజభూషణుని శైలిలో రచించిన పద్యాన్ని చూడండి.

**'అంత వసంతమొప్పె వివిధాచల దంతుర భూ దిగంత ప ర్యంత వనాంతరాంతర ఖగాళి హృదంతర శాంత సమ్మదా క్రాంత, మనేక పాంథజన కాంత వహంతక కాంత కుంత వ ల్యంత, మగప్రపంచ జనానాంతర సాధిత భాగ్యవంతమై'**
***(6 ఆశ్వా-105 ప)***

శ్రీకృష్ణదేవరాయలు చట్టబద్ధంగా పెళ్ళాడిన భార్యలు పన్నెండుమంది అని, వీరిలో ముగ్గురు పట్టమహిషులని, అందులో ఒకామె గజపతి కూతురని డొమింగో పేయస్ చెప్పాడు. మరో పోర్చుగీసు యాత్రికుడైన న్యూనిజ్ చిన్నాదేవి తిరుమలదేవులతోపాటు మరో ఇద్దరు భార్యలని చెప్పాడు. కృష్ణరాయలు పెళ్ళి చేసుకున్న గజపతి కూతురెవరు? ఆమె పేరేమిటి? అనే ప్రశ్నలు చరిత్రలో నానుతూనే ఉన్నాయి. ఈ విషయంలో కూడా భూతపురివారు కల్పనకే ప్రాధాన్యమిచ్చారు. తిరుమలదేవి, చిన్నాదేవితో పాటు గజపతి కూతురుగా తుక్కాదేవిని చెప్పారు. అంతేగాక ఈమెకు భద్ర, జగన్మోహిని, అన్నపూర్ణ అనే పేర్లు **(6 ఆశ్వా - 93 వ)** కూడా ఉన్నట్లు వివాహ సమయంలో గజపతి తిమ్మరుసుకు చెప్పినట్లుగా హృద్యంగా మార్పు చేశారు.

శ్రీకృష్ణదేవరాయలు యుద్ధంలో మహమ్మదీయ పాలకుల్ని ఓడించినప్పటికీ వారి స్త్రీలను గౌరవించి పూజించేవాడు. గొబ్బూరు దగ్గర పట్టుబడిన మహమ్మదీయ స్త్రీలను పొరపాటున కృష్ణరాయల సైనికులు చెరబట్టగా, కృష్ణరాయలు వారిని గట్టిగా మందలించి ఆ స్త్రీలను చక్కగా గౌరవించాడని చరిత్ర చెబుతున్నది. అమ్మా! మీరు మహమ్మదీయ స్త్రీలైనప్పటికీ హిందూస్త్రీలలాగా పూజలందుకోరాదా? ఏమి. మీ బిడ్డను కాకపోయినప్పటికీ మిమ్మల్ని మాతృభావనతో గౌరవిస్తానంటూ ఆదరించిన తీరును కవిగారు ఇలా చిత్రించారు.

**'మీర లిస్లాము వంశంపు మెలతలైన**
**హైందవ స్త్రీలవలె బూజ లందరాదె**
**మీ స్వరూపముల్ నాయందు మృగ్యమైన**
**గనని తల్లులగా మిమ్ము గౌరవింతు'**

***(6 ఆశ్వా - 334 ప)***

మనిషి చేసే ప్రతి పనిలోనూ ఋణానుబంధం ఉంటుందనేది సంప్రదాయ విశ్వాసం. కావ్యం చివరలో కవిగారు కావ్యరచనకు పూనుకున్న కారణాన్ని తెలియజేస్తూ కృష్ణరాయా! ఇరవై సంవత్సరాలు కష్టపడి నీ చరిత్రను కావ్యంగా మలచి కృతార్థుడనయ్యాను. గతంలో నీ కొలువులోని అష్టదిగ్గజాల్లో నేను ఉన్నానో లేదో? కోరికతో నీతో సత్కారాలు పొందానో లేదో తెలియడం లేదని ఇలా మొదట సందేహించారు.

**'నీ కొల్వొప్పిన యష్టదిగ్గజములన్ నే నుంటినో లేదొ, కా**
**నీ! కాంక్షాగతి నీదు సత్కృతిచయం బే గొంటినో లేదొ, కా**
**నీ! కొండంతగ నిర్వదేడుల శ్రమన్ నిష్ఠించి నిర్మించితిన్**
**నీ కల్యాణకృతిన్, గృతార్థతను గంటిన్ గృష్ణ! విశ్వార్చితా!'**

***(8 ఆశ్వా -426 ప)***

ఆ తర్వాత ఆంధ్రభోజుడైన కృష్ణరాయలు పుట్టిన మాఘ బహుళ అష్టమినాడే తాను జన్మించడం ఈ రచనకు కారణమైందని ఇలా పేర్కొన్నారు.

**'నీ జన్మము నా జన్మము**
**భోజా! యష్టమి యగుటనెపో కృతిబంధం**
**బీ జగతిని నిర్వురకును**
**భ్రాజిల్లెను సర్వలోక పఠనీయంబై'**

***(8 ఆశ్వా -427 ప)***

జ్యోతిషం, సంగీతం, శిల్పం, నాట్యం వంటి పలు శాస్త్ర విషయాలను కూడా ఆయా సందర్భాలలో చక్కగా వివరిస్తూ డా॥ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ గారు శ్రీకృష్ణభారత మహాకావ్యాన్ని రసోదంచితంగా సంగ్రహ విజ్ఞాన సర్వస్వంలా తీర్చిదిద్దారు.

- డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి
పరిశోధక సహాయకులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం,
కడప, సెల్ - 9966624276.

## కమ్మతెమ్మెరలు

ఫిబ్రవరి 25, **మిసిమి** సంచికలో **మిసిమి** గ్రంథాలయంలో రచయితలు తమ గురించి, తమ రచనల గురించి చాలా విషయాలే చెప్పారు. నెల్సన్ మండేలా గురించి రాపోలు సీతారామ రాజు గారు నెల్సన్ తన భార్య వెన్నీని వదిలేయడానికి కారణం మన రామాయణంలో రాముడు పాటించిన రాజధర్మం ఉందని తనకనిపించిందని రాసారు. ఈ మాట అనడంలో సమంజసమేమిటో నాకు అవగతమవడం లేదు. రచయిత తన మనసులో మాట లేదా నెల్సన్ తన భార్యను వదిలివేయడానికి కారణాలను ఎత్తి చెప్పడంలో నిజాలను వదిలి, రాముడితో పోల్చి విషయాన్ని తప్పుదారి పట్టించినట్లు అనిపించింది. సీతారామరాజు గారు ఈ విషయంలో తొందరపడ్డారేమో అనిపిస్తుంది. నిజం కావాలి. వెన్నీమండేలా గురించి గతంలో నేను చదివిన విషయాలకు, రచయిత చెప్పిన విషయాలకు చాలా తేడా ఉంది. వెన్నీమండేలా అభిమానులు ఏమనుకుంటున్నారో కూడా మీకు తెలియచేయడం అవసరంగా భావిస్తున్నాను. నెల్సన్ భార్యతో విడిపోవడానికి కారణాలు చెప్పకుండా రాముడిమీద నెట్టివేయడం సమంజసం అనిపించడం లేదు. గమనించాలి.



- గుడిపూడి సుబ్బారావు, ఫోన్ : 8143204144

# స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వం మహిళా సాధికారికత

- డా. వై. సుభాషిణి

"స్త్రీ ప్రశ్నతోనేపుట్టి పెరిగి, మరణించేది మాత్రమే కాదు జవాబై, నిలబడినిలదీసే హెచ్చరిక'' (రజాహుస్సేన్చేవ్రాలు సాహిత్య వ్యాసాలు, పుట : 135). 1947లో మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక స్త్రీల సమస్యలను గుర్తించడం, పరిష్కారంకోసం ప్రయత్నాలు చేయటం సంస్కరణోద్యమాలతో ప్రారంభమైంది. బాల్యవివాహాలు, సతీసహగమనంలాంటి దురాచారాలను రూపుమాపి, సంస్కరణోద్యమం మహిళలను పీడిత జాతిగా గుర్తించింది. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయాపరిధులలో ఆలోచించింది. జాతీయ, కమ్యూనిస్టు ఉద్యమాలతో మహిళలు తమ స్థితిగతులలో రావాల్సిన మార్పులు, వివిధరంగాలలో తాము పొందవలసిన భాగస్వామ్యం గురించి ఆలోచనలు చేశారు. స్త్రీల అభివృద్ధికోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించారు. అప్పుడే దేశంకూడా సర్వతో ముఖంగా అభివృద్ధిని సాధిస్తుందని భావించి, రాజ్యాంగ నిర్మాణంలో మహిళల అభివృద్ధికోసం ప్రత్యేక చట్టాల రూపకల్పన చేశారు.

ఈ క్రమంలో స్త్రీలకు విద్య ద్వారా పొందిన సంస్కారం, ఉద్యోగాలు సామాజిక హోదాను పెంచినప్పటికీ కుటుంబ సంబంధాలలో ఒత్తిడి, ఘర్షణ పెరిగింది. సమాజ స్వభావాన్ని, కుటుంబంలోని పురుషాధికార లక్షణాన్ని వారికున్న స్థానాన్ని తెలుసుకోవడం మొదలు పెట్టారు. ఆంక్షల మధ్య నలిగిపోతున్నామనే వాస్తవాన్ని గుర్తించారు. ఆత్మాభిమానం, వ్యక్తిత్వంలేని మనుషులుగా బతకాల్సి ఉందని ఆందోళన చెందారు. దాంతో స్వాతంత్ర్యానంతరం నిర్మితమవుతుందనుకున్న సముజ్జ్వల మహిళల భవిష్యత్తు కలగానే మిగిలిపోతుందని గ్రహించారు.

అయితే 1950కి పూర్వం వచ్చిన కవిత్వంలో వీరేశలింగం, గురజాడలాంటి సంఘసంస్కర్తలు, చలం, కొడవటిగంటి వంటి రచయితల భావాలు స్త్రీలకు, పురుషుడితో సమానమైన సామాజిక స్థాయిని ఇవ్వాలనే ఆలోచనకు ప్రేరణ నిచ్చాయి. స్త్రీల సమస్యలకు ఒక పరిష్కారాన్ని వెదికే ప్రయత్నాన్ని ముమ్మరం చేశాయి. దాంతో స్త్రీలు తమని తాము గుర్తించటం, పురుషుడితో పాటుగా సమాన గౌరవాన్ని కోరుకున్నారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్త్రీల ఉద్యమాలు కొత్తరూపాన్ని సంతరించుకొన్నాయి. కొత్తసిద్ధాంతాలు, భావనలు, పద్ధతులు స్త్రీల సమస్యలను అవగాహన చేసుకోవడానికి వీలయ్యాయి. ఆడవాళ్ళకష్టాలను తొలగించే సాహిత్యాన్ని సృష్టించిన కందుకూరి, ఆడవాళ్ళకు ఇష్టాన్ని కల్గించిన గురజాడ, ఆడవాళ్ళు చదువుకొంటే ఆర్థికస్వాతంత్ర్యం వస్తుందని నమ్మిన కొడవటిగంటి, ఆడవాళ్ళకు లైంగిక స్వేచ్ఛ ఉండాలనుకున్న చలం, ఆర్థికస్వాతంత్ర్యం ఉండాలనీ అది ఇంక దేనితోనో ముడిపడి ఉండకూడదన్న గోపీచంద్, ఇలా స్త్రీల విషయంలో ఒక్కొక్కరు ఒక్కోపార్శ్వంలో ఆలోచించారు. అయితే అవి అక్కడక్కడ కనిపించే రచనలు. ఒక సిద్ధాంత దృష్టితో రచనలు రావటం 1980 తరువాత ఎక్కువైంది. 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరం గానూ, ఆ పిమ్మట 1975-85ని UNO అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటించి ఈ సాహిత్యం ఎక్కువగా వెలువడటానికి ప్రేరణయ్యింది.

ఓల్గా, విమల, కొండేపూడి నిర్మల, ఘంటశాల నిర్మల, జయప్రభ, మందరపు హైమవతి, మెహజబీన్, గీత, సావిత్రి, పాటిబండ్ల రజని, తుర్లపాటి రాజేశ్వరి వంటి కవయిత్రులు వచనకవిత్వంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. సమస్యలను వ్యక్తిగత దృష్టితో గాక, వ్యవస్థాగతమైన సమస్యలుగా ప్రదర్శించి నిరూపించే ప్రయత్నం చేశారు. నిర్భీతి, నిస్సంకోచత్వం, ఆత్మస్థైర్యం, అనుభూతి గాఢత్వం స్త్రీల కవిత్వాభివ్యక్తిలో వచ్చిన పరిణామాలుగా చాటారు. స్త్రీల అస్తిత్వం, మాతృత్వం, స్త్రీ పురుషుల సమానత్వం, ద్వంద్వనీతుల వంటివెన్నో

చర్చించడం మొదలుపెట్టారు. స్త్రీపురుషుల మధ్య వ్యత్యాసాలకు, స్త్రీల అధమస్థాయికి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాలతో పాటూ పితృస్వామ్యం కూడా ఒక బలమైన కారణంగా గుర్తించారు. పితృస్వామ్య అధికార రాజకీయాల వల్ల అన్నిరంగాల్లోనూ అన్నిస్థాయిల్లోనూ కనిపించని హింసకు గురవుతున్నామని గుర్తించారు స్త్రీలు. అయినా ఎప్పటికప్పుడు అస్తిత్వవేదనను అనుభవిస్తూనే, ఆ పెనుగులాటలోంచి తలెత్తి కవిత్వంలో తనదైన గొంతును వ్యక్తీకరిస్తూనే ఉన్నారు. మహిళాసాధికారికతను పెంపొందింపజేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. స్త్రీల హైన్యదైన్యస్థితిని, బాధాతప్తజీవన స్థితిని ప్రతిబింబించారు. స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత వచ్చిన స్త్రీల కవిత్వంలో వచ్చిన స్పష్టతకి అంటే స్త్రీలనుద్దేశించి స్త్రీలు రాస్తున్న కవిత్వంలో వ్యక్తమవుతున్న భావాల్లో తేడా స్పష్టంగా ఉంది. ఎవరో వచ్చి తమను ఉద్ధరిస్తారనే స్థాయి నుంచి తమని తాము ఉద్ధరించుకొనే స్థాయికి ఎదిగారు. చైతన్యవంతమయ్యారు. తమ వ్యక్తిత్వాన్ని స్థిరీకరించుకొంటూ ఇన్నాళ్ళుగా గొంతు విప్పని స్త్రీలు నేడు స్వేచ్ఛగా తమ మనోభావాలను వ్యక్తం చేయగలిగిన స్థితికి చేరుకొన్నారు. చిన్నతనంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు రక్షించాలని బలంగా నమ్మిన స్త్రీ, భర్త చనిపోతే అతనితోపాటూ పోతే మోక్షం వస్తుందని నమ్మిన వ్యక్తి, భర్తలేని మహిళ వికృత రూపంతో, కడుపునిండా తినకూడదంటే ఆచరించిన స్త్రీ నేడు ఎంతో చైతన్యవంతురాలైంది. అన్నిరంగాల్లోనూ పురుషులతో పాటు సమఉజ్జీగా నడవటానికి ప్రయత్నిస్తూ ఉంది.

**1. ఆర్థిక స్వావలంబన :** ఆర్థిక స్వావలంబన స్త్రీని అధీనం గాంచదు. అందువల్ల పురుషుడు పరాధీనగా ఉంచే ప్రయత్నం చేస్తాడు అంటే స్త్రీకి ఆస్తి లభించేచోట అనేక నియంత్రణలు పెడతాడు. ఇలాంటి చేదు వాస్తవాన్ని వ్యక్తంచేస్తూ మందరపు హైమవతి రాసిన కవిత 'సర్పపరిష్వంగం'. తమమధ్య మనస్పర్థలు ఉన్నా వివాహబంధంలో విషసర్పంలాంటి భర్తను, ఆ బంధాన్ని చచ్చేవరకూ భరించడం తప్పదనీ, ఇదంతా భారత స్త్రీనైనందుకే భరించవలసి వస్తుందని, అటువంటి జీవితాల్ని అనుభవిస్తున్న వారిని కవితా వస్తువుగా చేసుకొని చక్కగా చిత్రీకరించిన కవిత ఇది. 'కామంతోనైతేనేమి మోహంతోనైతేనేమి/ ఇరువురి తనువులొకటైనాక / ఈ లోకాన్నే మరచిపోయిన అమృత ఘడియలలో/ అక్షర తూణీరం నుంచి/ ఒకప్రశ్నబాణం సంధిస్తావు/ జీతమెప్పుడిస్తారు?' అని అడిగే భర్తబుద్ధికి కలతచెందిన భార్యబాధను వర్ణించిన కవిత ఇది. మనిషిని శాసిస్తున్న ఆర్థికపరిస్థితుల మీద ఒక వ్యంగ్య వ్యాఖ్య ఈ కవిత. స్త్రీకి ఆర్థికస్వావలంబన ఉన్నప్పటికీ అది అనుభవించలేని నిస్సహాయత. "స్త్రీ తనంత తాను స్వాతంత్ర్యాన్ని అవలంభిస్తే కాని తనను పిప్పి చేస్తున్న బానిసతనం నుండి విడుదల పొందలేద"ని చలంగారి ప్రబోధం. అది అక్షరాలా నిజమని ఈకవిత స్పష్టం చేస్తూ ఉంది.

ఓల్గా రాసిన మరోకవిత 'ఆకలేమిగిలింది'. ఈ కవితలో పురుషుడితోపాటు సమానంగా పనిచేస్తున్నా ఇచ్చే జీతంలో తేడాలు చూపించడం. "రెక్కలు ముక్కలు చేసుకొని/ పొద్దస్తమానం ఎద్దులాపనిచేసి/ ఈ భూమిని నా చెమటతో తడిపాను/ దూరంగా చెట్టుకింద ఉయ్యాలలో/ ఆకలికి ఏడుస్తున్న బిడ్డకోసం/ నా గుండెలో పొంగిన తల్లిపాలు/ ఈ భూమిలోనే ఇంకిపోయాయి/ చాకిరీచేయలేక/ సత్తువ బొత్తిగాలేక/ ఆకలిని చంపలేక పోతుంటే/ నా ఒంట్లో రక్తపుచుక్కలు/ ఒక్కొక్కటిగా ఈ భూమి పీల్చి వేసింది/ అన్నిసార్లూ/ ఈ భూమి బంగారమే పండింది/ బంగారమంతా కామందు పెట్టెలోకి వెళ్ళింది/ నాకు మాత్రం ఆకలే మిగిలింది" అంటున్న ఈ కవిత శ్రమకు తగిన ఫలితం దక్కని స్థితిని చూపిస్తోంది. ఆకలికి ఏడుస్తున్న పసిబిడ్డకు కాసిన్ని పాలు కూడా ఇవ్వలేని దైన్యస్థితిని చాటుతూ ఉంది. కష్టించి పనిచేసిన దానికి తగిన ఫలితాన్ని ఆ స్త్రీ కాకుండా కామందు అనుభవించటం. ఆమె కడుపునింపడానికి పట్టెడు మెతుకులు దొరకటం లేదనీ, చివరకు ఆకలే మిగిలిన స్థితిని కవితీకరించారు ఓల్గా.

కామందు స్త్రీ కష్టాన్ని మాత్రమే దోచుకుంటే మొక్కపాటి సుమతి రాసిన 'మిత్రవైరుధ్యమా' కవితలో సర్వస్వాన్ని దోచుకోవడం కనిపిస్తుంది. "ఎవడూ అన్నది/ ఇది మిత్రవైరుధ్యమని/ వర్గశత్రువునాశ్రమనే దోచుకుంటాడు/ ఈ దుష్టశత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు/ వాడు నాకు కలలై కనిపిస్తాడు/ వీడు నాకలలనీ చెరిపేస్తాడు" అంటూ దుష్టశత్రువు బతుకునే దోచుకొంటున్నాడనే ఆవేదన నిలువెల్లా వణికిస్తుంది. భార్యతో కలిసి కాపురం చేస్తున్న నెపంతో కలల్ని కూడా ప్రశ్నించటం అమానవీయతకు నిదర్శనం. భార్యాభర్తల సంబంధాలలోని బానిస- యజమాని స్వభావాన్ని చిత్రీకరిస్తూ వొడ్నాలసూర్య 'బానిస' కవితను రాశారు. ఈ కవితలో "నీవు నా పక్కనేవున్నా/ నీకూ నాకూ మధ్య/ దూరం అందుకోలేనంత/ నీ జీతమెంతో నాకుచెప్పవు

ఐనా నాజీవితమంతా/ నీకుజీతంలేని బానిసనే" అని ఆవేదన చెందుతున్న భార్యను చిత్రీకరించారు.

ఆర్థికస్థోమత లేక ఒకతల్లి అబార్షన్‌కు పూనుకొన్న తీరును వర్ణిస్తూ పాటిబండ్ల రజని 'అబార్షన్ స్టేట్మెంట్' రాశారు. గర్భధారణ నిర్ణయ హక్కు స్త్రీకే ఉండాలన్నది స్త్రీవాదుల అభిమతం. గర్భం ధరించాలా వద్దా అన్నది స్త్రీల అదుపులో ఉంటే సరియైన నిర్ణయాలు తీసుకోగలరు. శారీరక అనారోగ్యాలు, ఆర్థికలోపాలు, మానసిక భయాలు ఉంటే గర్భంధరించడం హర్షణీయం కాదు. అందుకే "నీకు పంచేందుకు రక్తం లేకేకదా/ నిన్నుపెంచేందుకు తీరికలేకే కదా/ నీ అక్కకు ఇంకా పాకడమైనా రాలేదనే కదా నిన్ను వద్దనుకొన్నది/ నా టెంపరరీ ఉద్యోగమూ ఆరోగ్యమూ నీకు/ మరణశిక్ష ఖాయంచేస్తే" అంటూ అబార్షన్‌కు పూనుకోవడానికి కారణమైన స్థితిగతులను స్పష్టపరిచింది కవయిత్రి. ఈ కవితలో ఒక కొత్తకోణం, అమ్మతనం ఆవిష్కరించబడ్డాయి. ఫ్యూడల్విశ్వాసాలు, ధనస్వామ్య ప్రభావం వల్ల స్త్రీలు నలిగిపోయినా, తమకంటూ ఒక వ్యక్తిత్వాన్ని స్థిరీకరించుకొన్నారు. ఆలోచనాపరిధి, మేధో వికాసం పెరిగి పరిస్థితులను ఎదుర్కొనే ఆర్థిక శారీరక మానసిక శక్తులను పెంపొందించుకో గలిగారు. వ్యక్తిత్వం వికసించిన కొలదీ బతుకు విలువ తెలుసుకొని తమ సమస్యలకు తామే పరిష్కారాలను వెదుక్కొనే ధైర్యాన్ని సంపాదించుకొన్నారనడానికి పై కవితలే నిదర్శనం.

**2. సాంస్కృతిక సమస్యలు :** తరతరాలుగా స్త్రీల జీవితాల్లో పాతుకుపోయి అవి సహజమని భావిస్తూ వచ్చిన కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు, నియమాలు వంటివన్నీ సహజమైనవి కావని తెలుసుకొన్నారు. ఒక క్రమపద్ధతిలో తమపట్ల జరిగిన అణచివేత పథకంలో అవి భాగాలైన విషయాన్ని స్త్రీలు గుర్తించారు. పవిత్రత, భద్రత అనేవి స్త్రీలను కట్టడిలో ఉంచడానికి పితృస్వామ్య వ్యవస్థ ఏర్పరచిన సూత్రాలేనని, అవి అణచివేత క్రమంలో భాగాలనీ అర్థంచేసుకొన్నారు. ఎస్. జయరాసిన 'సగం ప్రపంచం' కవిత ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది. "మా ఇంట్లో మూడుగదులు/ డ్రాయింగ్ రూమ్, పడగ్గది, కిచెన్/సగం ఇల్లునాదే/ డ్రాయింగ్ రూమ్ మావారికి/ కిచెన్ నాకు/ పడగ్గది ఇద్దరిదీ/బాధ్యతలు చెరిసగం/ పాపాయిని కనడం నావంతు/ వంశనామం ఇవ్వడం అతనివంతు" అని అంటుంది. అణచివేత ప్రధానంగా శారీరకంగా, మానసికంగా, కుటుంబ వ్యవస్థాగతంగా, సాంస్కృతికంగా బహురూపాలతో ఉంది. పితృస్వామ్య సమాజం విధించిన అనేక కట్టుబాట్లను ఛేదించుకొని ఇప్పుడిప్పుడే సాధికారికత దిశగా అడుగులు వేస్తున్న మహిళకు సమాజం చేయూత నివ్వవలసిన అవసరం ఉంది. అలాగైతేనే రాజ్యాంగం సూచించిన లింగసమానత్వం ఆచరణలో వీలవుతుందని గమనించాలి.

స్త్రీకి సమాజంలో ఎదురవుతున్న మరో సమస్య ఇంటి చాకిరి. శారీరక సమస్యలు ఒక ఎత్తు అయితే ఇంటిపని ఒకటీ ఒక ఎత్తు. శ్రమ సౌందర్యాన్ని కీర్తించిన వ్యవస్థకూడా ఇంటిపనిని అసలు పనిగానే గుర్తించడం లేదు. ఆర్థిక వ్యవస్థతో ప్రత్యక్ష సంబంధం లేకపోవడంతో అనుత్పాదక శ్రమగా మిగిలిపోయింది. "కేవలం డబ్బు ద్వారానే ఉత్పత్తి విలువని నిర్ణయించేచోట డబ్బుకి ఆవల ఉన్న శ్రమ విలువలేనిదవుతోందంటారు" మార్గరేట్బెన్స్టన్ (Political Economy of Women Liberation). దీనివల్ల శ్రమ మొత్తం డబ్బుతెచ్చేవాళ్ళదే కాని నిజంగా ఇంట్లో శ్రమపడే వాళ్ళకు భాగస్వామ్యం లేదు. దీనికి చలించి విమల రాసిన 'వంటిల్లు' కవిత డొమెస్టిక్లేబర్విశ్వ రూపాన్ని తెలుగులో కవిత్వీకరించిన తొలిప్రయత్నం. "ఈవంటిల్లొక వదలని మోహమై/ నా బాల్యాన్నంతా చుట్టేసుకొంది/ చివరకు నా కలల్లోనూ వంటిల్లే/ కళాత్మకమైన వంటింటి కలలు/ మల్లెపూవుల్లోనూ పోపువాసనలే/ మళ్ళీ మన పాపలు ఈ వంటరి/ వంటిళ్ళలోకి/ అడుగిడబోతున్నారు/మన పిల్లలకోసం/ వంటరి వంటగదులు కూల్చేందుకు రండి" అంటూ ఆడపిల్లలు వంటింటి సంస్కృతికి, ముచ్చట్లకు బానిసలై పోకుండా తిరగబడే కాలం ఆసన్నమైందని వ్యక్తం చేస్తున్న కవిత ఇది. ఒకప్పుడు మసిపొయ్యిల చుట్టూ పరిభ్రమించిన స్త్రీలు నేడు గ్యాసుపొయ్యిల చుట్టూ తిరుగుతున్నారని వంటిళ్ళపైన దాడిచేశారు. స్త్రీల కర్తవ్యాన్ని గరిట తిప్పడంగా చేసిన వంటగదుల్ని ధ్వంసం చేద్దామనే విమల పిలుపులో వ్యవస్థాగతమైన ద్వేషం ఉంది. పైగా అవి 'వంటరి వంటగదులు' కావడం, వేరువేరు స్వంతపొయ్యిలు అఖ్ఖర్లేదని వంటగదుల్ని సామాజీకరణ చేయాల్సిన అవసరాన్ని చాటింది. ఇప్పటికీ ఇంటిపని, పిల్లల పెంపకం బాధ్యత మహిళలదే అన్నట్లుగా చూస్తున్నారని, ఈ పరిస్థితి మారాలని ప్రముఖ తెలుగు రచయిత్రి కుప్పిలి పద్మ బీబీసీతో అన్నారు. సమాన పనికి సమాన వేతనం అమల్లోకి రావాలన్న (www.google.com) కుప్పిలి పద్మగారి మాటలలో చాలా వాస్తవం ఉంది.

మరో కవయిత్రి ఓల్గా "సూపర్ ఉమెన్ని కాలేను" కవితలో నాజూకు దనాన్ని కోరే పురుషుణ్ణి దుమ్మెత్తి

పోశారు."తెల్లారుతూనే దుమ్మూధూళీ వెతికే కళ్ళు/ ఏస్విచ్చి నొక్కినా ఎలక్ట్రిక్బల్బులా వెలగవు/ పిల్లల ముక్కుతుడిచీ మూతితుడిచీ/ నీచేతుల జిడ్డుతుడిచీ మసిగుడ్డయిన చీరె/ కొండచిలువలా చుట్టేసుకు కదలనివ్వదు/ సబ్బూసోడాల సమ్మేళనంలో మొద్దుబారి/ ఉదయపు వంట జాతరలో మాడిమాడి/వేడీవెచ్చా తెలియకుండా పోయిన చేతులు/ ఎంత ప్రేమగా తాకినా బొమ్మజెముళ్ళే ఔతాయి" అంటూ స్త్రీని ఒకవైపు చాకిరికి పరిమితం చేసి, చాకిరితో ఒళ్ళంతా గరుగుదేరిన స్త్రీలో నాజూకుదనం లేదనే పురుషుడితో 'సూపర్ ఉమెన్'ని కాలేనంటూ దెప్పిపొడుస్తూ ఉంది.

పురుష ప్రపంచాన్ని, సమాజాన్ని భయపెట్టిన కవిత జయప్రభ రాసిన 'పైటను తగలెయ్యాలి'. స్త్రీల శరీరంపైనా వస్త్రధారణపైనా ఉన్న నియమావళినీ, నిఘానీ వ్యతిరేకించిన కవిత ఇది. స్త్రీని శరీరం పేరుతో కట్టడి చేసిన తీరును చెప్పే కవిత ఇది. పైటకొంగును చూస్తే/నాకెందుకో/ పాతివ్రత్యం గుర్తొస్తుంది!/ భుజాల నించి కిందికి వేలాడే/ గుదిబండలా/ అదెప్పుడూ నా స్వేచ్ఛని హరిస్తూనే ఉంటుంది" అంటూ స్త్రీని అబలని చేసిన పితృస్వామ్యపు అదృశ్య హస్తంగా పైటను నిరసించారు. దానిని తగలెయ్యాలంటూ జయప్రభ చేసిన నినాదం పితృస్వామ్యపు వస్త్ర సంస్కృతిపై దాడిచేయడమే అవుతుంది. స్త్రీని ఒక వ్యక్తిగా పెరగకుండా సమాజం ఏర్పరచిన అదృశ్య నిర్బంధాలని చెబుతూ "నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే ముందుగా పైటని తగలెయ్యాలి" అంటారు జయప్రభ. నిర్బంధ సంప్రదాయం మీద ఒక ఆగ్రహ ప్రకటన ఇది. పురుషాధిక్య ప్రపంచం నిషిద్ధమని చెప్పిన దానిమీద తమ నిర్ణయాధికారాన్ని స్పష్టంగా వ్యక్తం చేసింది. దేహం పేరుతో స్త్రీని ఎప్పుడూ వంచించడమేనా అనే తిరుగుబాటు చేసింది. మరో కవయిత్రి 'నిర్మల' ఓణి గురించి రాస్తూ–"గాలాడక ఉక్కబోస్తున్న కొట్టు గదిలా ఉంటుంది/ మడిచీరతో మగ్గిపోయే చాదస్తపు హెచ్చరికలా ఉంటుందని విసుక్కొంది.

సమాజంలో స్త్రీలు ఎదుర్కోవలసి వస్తున్న అసభ్యపు చూపుల్ని తీవ్రంగా ఎదిరించిన స్థితి జయప్రభ 'చూపులు' కవితలో కన్పిస్తుంది. బయటికెళ్తే చాలు నిలువునా తడిమే విషపు చూపుల్ని అసహ్యించుకొంటూ–"రెండుకళ్ళ నుంచి చూపులు సూదులాపచ్చి/ మాంసపు ముద్దలపై/విచ్చల విడిగా తిరుగుతుంటాయి" అంటుంది. ఈ దేశంలోని ఆడదానికి వళ్ళంతా ముళ్ళుండే రోజు ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తుంది.

ఆచారాల పేరుతో స్త్రీని చుట్టుముట్టి, ముప్పిరిగొని నిర్బంధ జీవిగా మార్చిన వైనాన్ని పేర్కొంటూ రాజేశ్వరి దివాకర్ల 'స్త్రీ' అనే కవితను రాశారు. "పతిగా చితిమంట లలో చల్లారాలని/ పతివ్రతగా/ పాదపూజలు చేయాలని/ అర్థంకాని/ చిత్రంగా/ప్రదర్శనలో ప్రశంసలు పొందాలని కాదు/ తాను రూపుదిద్దుకొన్నది/ బిందువై మేఘగర్భాన ధరించి/ భవితవ్యానికి నదియై సాగరంలో జత కలవాలని" అంటూ సమానత్వ కాంక్షను ఈకవితలో కనబరచింది కవయిత్రి. అదేవిధంగా మరోకవితలో ఆచారాల పేరిట/ అరికాళ్ళ కింది మంటల్ని ఎగదోసినప్పుడు/ అంతులేని మూగవేదనననుభవించింది మేమే/ సంప్రదాయాల పేరిట/ బతికుండగానే చితుల కెక్కించినపుడు/ శవగీతాలు పాడింది మేమే" అంటూ కాలూచెయ్యీ ఆడనివ్వకుండా మెదడు పనిచెయ్యకుండా సంప్రదాయపు ఉచ్చులో బంధించిన తీరు, ఆచారాల పేరుతో స్త్రీ పడుతున్న హింస నుండి బయటపడడానికి ప్రయత్నిస్తున్న తపన ఈ కవితలో దృశ్యమానం చేశారు.

"మాతృత్వం కుటుంబాన్ని చారిత్రక అవసరంగా చేసింది. కుటుంబమే స్త్రీకి ప్రపంచమైంది. ఉత్పత్తిలోనూ, సామాజిక జీవితంలోనూ ఆమె భాగం కాకుండా పోయింది" (వసంతాకన్నాభిరాన్ – మాకు గోడలు లేవు ఫెమినిస్టుడీ సర్కిల్వారిది). అందువల్ల ఎవరో ఒకరి అండన బతకాల్సిన స్థితి స్త్రీకి ఏర్పడింది. ఈ దుస్థితి నుండి బయటపడి తమ వ్యక్తిత్వాన్ని తాము నిలుపుకొంటూ పదిమందికి ఆదర్శమవ్వాలని, నీడనివ్వాలని ఆశిస్తూ రాసిన ఒక కవిత–''వటవృక్షపు నీడలో/ సేదతీరే చిన్నారి గడ్డిమొక్కలా కాదు/ నేనే ఒకవటవృక్షాన్నై/ ఠీవిగా నడవాలని కోరుకుంటుంది". కుటుంబం, భర్తనీడలో గడ్డిమొక్కలా పెరిగిన స్త్రీ తానే ఒక మహావృక్షంగా విస్తరించాలన్న కాంక్షాపూరిత చైతన్యానికి ఈ కవిత నిదర్శనం. మరొకరి అధీనంలో కాకుండా తమంతట తామే తమస్థానాన్ని తిరిగి నెలకొల్పుకోవాలనే భావం వ్యక్తమవుతోంది.

పురుషస్వామ్యవ్యవస్థ మాతృత్వం స్త్రీ బలహీనతగా చేసి ఆమెను తొక్కిపెట్టే ప్రయత్నం చేయడంతో తన పిల్లల్ని తండ్రి లేకుండా పోషించలేమనే భయంతో స్త్రీలు చాలామంది బయట పడలేకపోతున్నారు. అయితే మొక్కపాటి సుమతి 'నూతనమ్మ' కవితలో–కొడుకుతో "నాన్న ఎత్తిన చవటచేతిని/ చచ్చుబారిన సత్యఛాయను" అంటూ పురుషాధిపత్యాన్ని నిరసిస్తోంది. నాన్న నీడన నువ్వు నడవకుండా నాన్న వాసన నీకు రాకుండా నిన్ను

పోషిస్తానంటూ తన కొడుకును "స్వేచ్ఛాసమానతల సమాజానికి సృష్టికర్త"ను చేస్తానంటున్న తల్లి ఈ కవితలో కనిపిస్తుంది. సమాజంలో నిరంతరం పోరాటం సలుపుతూనే తనకి ఏమి చేయాలనిపిస్తే అది చేయగలిగే స్థితికి నేడు చేరుకొంది స్త్రీ. పురుషుల చేత స్నేహగౌరవాలతో చూడబడే స్వాతంత్ర్యం స్త్రీ కోరుకొనేది. తమ ఆలోచనలను తాను నిర్ణయించుకొనే స్వాతంత్ర్యం. విధిలేకనో అలవాటు గానో కాక, హృదయంతో ప్రేమించగలిగే స్వాతంత్ర్యం. తమ అభిరుచులను తాము అభివృద్ధి పరచుకోగలిగే స్వాతంత్ర్యం. ఒకమాటలో చెప్పాలంటే మరొకరి నీడగా కాక తానొక వ్యక్తిగా నిలవగలిగే స్వాతంత్ర్యం (డా.టి. పద్మలోచనా దేవి: రంగనాయకమ్మ నవలల్లో స్త్రీపాత్రలు, పుట: 11). అది ఈ కవితలన్నింటిలో స్పష్టంగా కన్పిస్తుంది.

కవయిత్రులు తమ శరీరాల గురించీ, వేషభాషల గురించీ, శరీరధర్మాల గురించీ, వ్యభిచారం పేరుతో జరుగుతున్న వ్యాపారం గురించీ, ఇంట్లోనూ బయటా చాకిరీలతో సతమతమవుతున్న రెండురకాల దోపిడీలను గురించీ, పునరుత్పత్తి, స్వేచ్ఛల గురించీ, మాతృత్వం పేరిట జరిగే మోసంగురించీ, ఇష్టాయిష్టాలను గురించీ ఒకటేమిటి ఎన్నో విషయాలు వారి జీవితాల్లో జరిగే ఒక్కోరకమైన దోపిడీని బలంగా వ్యక్తీకరించారు. "స్త్రీజాతి వ్యక్తిత్వంతో నిలవగలిగినపుడే పురోగమిస్తుందంటారు" రంగనాయకమ్మ. అది నేటి స్త్రీలో స్పష్టంగా కనబడుతుంది.

స్త్రీలు మేల్కొంటున్న విషయాన్ని, నేటి సామాజిక వ్యవస్థలోని వైవాహిక జీవితాన్ని, అధికారాల మధ్య, పోరాటాలమధ్య నలిగిపోతున్న స్త్రీని శీలా సుభద్రాదేవి కవితలో చూడవచ్చు. ఒక స్త్రీగా స్త్రీ చైతన్యంతోటి స్పందించి రాసిన కవిత. నానాటికీ సంక్లిష్టమవుతున్న వైవాహిక సంబంధాలను లైంగిక వివక్షతో నీతి నియమాలను వేరువేరుగా అన్వయించే సమాజ ద్వంద్వనీతిని విమర్శిస్తూ రాసిన కవితః "మా గుండెలు మూగవే/ కానీ ఇప్పుడు కాదు/ ఎన్నోఏళ్ళుగా నిద్రించిన/ మావ్యక్తిత్వం తృళ్ళిపడి లేచింది/ స్వేచ్ఛకోసం పెనుగులాటలో/ సంప్రదాయపు తాళ్ళు తెగిపడ్డాయి" అంటూ మావ్యక్తిత్వం మాకుందని, దాన్ని కాపాడుకోవడం కోసం ప్రయత్నిస్తామంటోంది కవయిత్రి. స్త్రీని స్వేచ్ఛగా ఆలోచించనివ్వకుండా ఆధిపత్యాన్ని నెరపిన సంప్రదాయం, తెగిపోగలదన్న నమ్మకం కూడా వ్యక్తం చేసింది. మా గుండెలు మూగవే కాని ఇప్పుడు కాదంటూ గతంలో తమ భావాలు చెప్పుకోలేని సాంప్రదాయ నిర్బంధస్థితిని ఈమె ధిక్కరిస్తున్నారు. "స్త్రీ భావాలను, అనుభూతులను స్త్రీలే వ్యక్తీకరించుకోవాలి. స్త్రీల సమస్యలకు పరిష్కారాలు స్త్రీలే ఆలోచించాలి" అన్న జయప్రభ మాటలకు అక్షరసాక్ష్యంగా నిలుస్తుంది పైకవిత.

"స్త్రీలే తమ స్వాతంత్ర్యం కోసం పోరాడి దాన్ని సాధించాలి. ఈ ప్రయత్నంలో తమను తాము బలి చేసుకోవలసి వచ్చినా వ్యక్తిత్వాన్ని మాత్రం నిలుపుకోవాలి. ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలంటారు" రంగనాయకమ్మ. అదే ఆత్మాభిమానంతో 'సూర్యుడు ఉదయిస్తాడు' కవితలో జయప్రభ- "నిశ్శబ్దపు అంచున/ కాంతిపుంజపు వెల్లువనై/ అవనిని ఆక్రమిస్తున్న/ తొలి వేకువనౌతాను/ మట్టిని చీల్చి వస్తున్న మొలకను/మరో చైతన్య స్రవంతికి ప్రతీకను" అంటుంది. ఇంతకాలంగా బాధల్నీ, అవమానాన్ని, అసమానత్వాన్ని, అధికారాల్నీ నిశ్శబ్దంగా మోసిన స్త్రీ, నేడు చైతన్యవంతమై తొలివేకువనౌతాను అంటున్నది. మట్టిని చీల్చుకొని వస్తున్న మొలకననడం, చైతన్యస్రవంతికి ఆ మొలక ప్రతీకగా చెప్తూ, తనను తాను వ్యక్తీకరించుకుంది. ఇప్పటివరకూ ఉన్న స్థితిని వదిలి మరోచైతన్య స్థితికి ప్రవేశిస్తున్నానని పేర్కొంది.

తమ మనసు మీద, ఆలోచనల మీద, శరీరం మీద తమకే అధికారముండాలనే స్త్రీలధోరణి, సాంప్రదాయకు లందరికీ పిడివాదంగా కనిపించినా, వాస్తవ పరిస్థితులను, సమాజంలో నేటి స్త్రీ స్థితిని గమనించినప్పుడు, ఇన్నాళ్ళ అణచివేత ఫలితం విప్లవంగా పరిణమించకమానదు. స్త్రీల ఆలోచనాధోరణిలో వచ్చిన మార్పు జీవనక్రమాన్నే మార్చివేసింది. "స్త్రీ ఒకవ్యక్తి కాదు ఒకశక్తి. స్త్రీ మాతృమూర్తియే కాదు మానవతామూర్తి కూడా" (డా.వి. సిమ్మన్న-సాహిత్యంలో స్త్రీ-దర్శిని, వ్యాససంపుటి -12). ఆధ్యాత్మికంగా, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా స్త్రీలను బలోపేతం చేయడం మహిళాసాధికారికత అవుతుంది. స్వశక్తిపై విశ్వాసాన్ని అభివృద్ధిపరచడం కూడా సాధికారికతలో భాగమే. కనుక మహిళలు సర్వతోముఖాభివృద్ధి సాధించినపుడే సమాజమూ అభివృద్ధి చెందుతుంది.

డా. వై. సుభాషిణి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుఅధ్యయనశాఖ,
శ్రీపద్మావతిమహిళావిశ్వవిద్యాలయం, తిరుపతి

# పేరిణి నృత్యరీతి

- డా. రమేష్ కృష్ణ



పేరిణి నృత్యకళాకారుడు రాజ్‌కుమార్

**భా**రతదేశంలోఉన్న అన్ని శాస్త్రీయ కళలలో అత్యున్నతమైన స్థానం పేరిణి నాట్యానికి ఉన్నది అనడంలో సందేహపడాల్సిన అవసరం లేదు, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కూచిపూడి, ఒడిసి, కథాకళి, మణిపురి ఇలా ఎన్నెన్నో నాట్యాలు శాస్త్రీయనృత్యాలుగా ప్రచారాల్లో ఉన్నప్పటికీ ఏ ఒక్కనృత్య కళయొక్క పేరు మన నాట్యశాస్త్రాలలో కనిపించకపోవడం గమనించదగ్గ విషయం. మరీముఖ్యంగా నాట్యశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని భరతనాట్యం ఏర్పడింది అని చెప్పుకునే వారికి అసలు భరతనాట్యం అన్న పేరు ఏ శాస్త్రీయ గ్రంథాలలో లేదని, కేవలం కొన్ని దశాబ్దాల కిందట మాత్రమే ఆపేరు ఇవ్వబడింది అన్న విషయం తెలియదు. కానీ పేరిణి అలాంటిది కాదు.

నేటికాలంలో ప్రచారంలో ఉన్న అన్ని శాస్త్రీయ నృత్యకళలలో కేవలం ఒక్క పేరిణి నృత్యకళ పేరు మాత్రమే అన్ని శాస్త్రీయ నృత్య గ్రంథాలలో పేర్కొనబడి ఉన్నది. పేరిణి వాస్తవిక రూపం ఏమిటి అనేది మనలో ఎవరికీ తెలియదు. పూజ్యగురువులు పద్మశ్రీ డాక్టర్ నటరాజరామ కృష్ణగారు పేరిణియొక్క తాండవ రూపాన్ని మనకు పరిచయం చేయడానికి ఎన్నో దశాబ్దాలపాటు అవిశ్రాంతమైన కృషిచేశారు. దాని ఫలితంగా పేరిణి శివతాండవ రూపం ప్రచారంలోనికి వచ్చింది. కానీ ఇక్కడ దురదృష్టం ఏమిటి అంటే అక్కడికి ఈ కళ ఆగిపోవడం. పేరిణి అంటే కేవలం రామప్ప దేవాలయం కాదు, పేరిణి అంటే జాయపసేనాని కాదు, పేరిణి అంటే నృత్తరత్నావళి మాత్రమే కాదు, పేరిణి అంటే కాకతీయ సామ్రాజ్యమే కాదు. పేరిణిని తమ ప్రాంతానికి చెందిన ఒక నృత్యకళగా వీరందరూ ఆరాధించడం అభినందనీయమైన విషయం. మన ప్రాంతంలో ఉన్న ఈకళను పైకి తీసుకురావటం మనందరికీ గర్వకారణం. ఇందులో ఎటువంటి సందేహములేదు. మరి వచ్చిన తంటా ఎక్కడ అంటే పేరిణి కేవలం ఇంతవరకే అని అనుకోవడంలోనే.

పేరిణి యొక్క చారిత్రిక ముఖచిత్రాన్ని ఒకసారి అవలోకనం చేస్తే భారతదేశంలోని ఎన్నెన్ని రాష్ట్రాలలో పేరిణి వ్యాపించి ఉన్నదో మనకు స్పష్టం అవుతుంది. కాలానుగుణంగా చూస్తే ఔమాపతము అనే శైవాగు గ్రంథం నుండి మొదలుకొని భరతుని నాట్యశాస్త్రాధుల నుండి ఎన్నెన్నో ప్రాచీన గ్రంథాలలో పేరిణి గురించి పేర్కొనబడి ఉన్నది. తెలుగువాడని మనం చెప్పుకుంటున్న నందికేశ్వరుని నందిభరతంలో, అలాగనే ఆయనచే రచించబడిన భరతార్ణవంలో, ఆరవ శతాబ్దంలో నారదునిచే రచింపబడిన సంగీత మకరందంలో, 11వ శతాబ్దంలోని హేమచంద్రుని కావ్యానుశాసనంలో, మహారాజు సోమశేఖరుని మానసోల్లాసంలో, సారంగదేవుని సంగీత రత్నాకరంలో, ఇలా ఎన్నో ప్రాచీనమైన గ్రంథాలలో పేరిణి ప్రస్తావన మనకు కనబడుతూ ఉన్నది.

ఇక ప్రాంతీయ భేదాలను దృష్టి పెట్టుకొని చూస్తే రాజస్థాన్ ప్రాంతాన్ని పరిపాలన చేసిన మహారాణా కుంభుడు తన సంగీత రాజాలో పేరిణిని గురించి ప్రస్తావించటం జరిగింది. గుజరాత్ ప్రాంతానికి చెందిన వాడిగా భావింపబడుతున్న పార్శ్వదేవుడు తన సంగీత సారంలో పేరిణిని మూడురకాలుగా విభజించి చెప్పటం జరిగింది. విజయనగర సామ్రాజ్యంలో ఆస్థాన విద్వాంసుడిగా ఉన్న దేవనాచార్యుడు తన సంగీతముక్తావళిలో పేరిణి

గురించి ప్రస్తావన తీసుకురావడం జరిగింది. ఆంధ్ర ప్రాంతంలోని గుంటూరుకు చెందినవారు, విజయనగర రాజైన తిరుమలరాయిని ఆస్థానంలో ఉండిన చతుర దామోదరుడు సంగీత దర్పణంలో పేరిణి గురించి ప్రస్తావించడం జరిగింది. శుభంకరుడు రచించిన సంగీత దామోదరం, శ్రీకంఠని రసకౌముది, నరహరిచక్రవర్తి సంగీత సారసంగ్రహం, ఒరిస్సావాసి అయిన నీలకంఠుని నాట్యమనోరమ, గజపతి శ్రీనారాయణచే రచించిన సంగీత నారాయణ, కృష్ణానంద వ్యాసదేవుడి రాగ కల్పద్రుమ, వెంకటగిరి సంస్థానాధీసులైన సర్వజ్ఞ కుమారయాచేంద్రుల వారి సభారంజని వరకు ఎన్నో గ్రంథాలలో పేరిణి ప్రస్తావన మనకు కనపడుతుంది. కన్నడ ప్రాంత వాసి అయిన చంద్రశేఖరుడు భరతసార సంగ్రహంలో, అలానే ఉమ్మడి చిక్కభూపాలుడి అభినవ భరతసార సంగ్రహంలో కూడా పేరిణి ప్రస్తావన స్పష్టంగా కనబడుతుంది. ఇవికాక భరతకల్పలత మంజరి, అప్పలాచార్య వారి సంగీత సంగ్రహ చింతామణి, నారాయణ శివయోగి నాట్యసర్వస్వ దీపిక, హరిపాల దేవుని సంగీతసుధాకర, శ్రీవిద్యాచక్రవర్తి భరతసంగ్రహం, చెరుకూరి లక్ష్మీధరుని భరతశాస్త్ర గ్రంథం, పుండరీక విఠలుని నర్తన నిర్ణయం ఇలా చెప్పుకుంటూ పోతే దేశం నలుమూలలలో ఎంతోమంది నాట్యకళావేత్తలు పేరిణి గురించి ప్రస్తావించడం జరిగింది.

రాజస్థాన్, గుజరాత్, వారణాసి, బెంగాల్, ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రవంటి ఎన్నో విభిన్న ప్రాంతాలకు చెందిన నృత్యశాస్త్రవేత్తలు తమతమ గ్రంథాలలో పేరిణి గురించి ఎంతో ఉన్నతంగా చెప్పి ఉన్నారు. దీనినిబట్టి పేరిణి భారతదేశమంతటా వ్యాప్తిలో ఉన్నట్లుగా తెలుస్తున్నది. అంటే దేశం మొత్తం కూడా భాషా, ప్రాంత హద్దులు లేకుండా వ్యాపించిన, పరిఢవిల్లిన నృత్యకళ ఏదన్నా ఉంది అంటే అది పేరిణి అని తెలుసుకోవలసిన అవసరం ఉన్నది. కనుక పేరిణిని కేవలం ఒక ప్రాంతానికి లేదా కొన్నిజాతుల వారికి మాత్రమే సంబంధించిన నృత్యకళగా భావింపరాదు. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో బసవపురాణంలో కళ్యాణఘట్టం జరుగుతున్న సందర్భంలో' తదుపరి గుజరాత్ ప్రాంతము నుండి విచ్చేసిన పేరిణి బృందనృత్యం ఉంటుందని' ప్రకటించడం కూడా గమనార్హం.

ఇంతగా ప్రసిద్ధి చెందిన పేరిణి నృత్యకళ కాల క్రమంలో పూర్తిగా కనుమరుగై పోయింది. దానికి కారణాలు ఏమైనప్పటికీ నేటికాలంలో ఈ కళను గురించి తెలిసిన వారు దాదాపు శూన్యమే అయిపోయారు. ఆఖరికి నృత్య కళావేత్తలకు కూడా పేరిణి సంప్రదాయాన్ని గురించిన జ్ఞానం మాట అటుంచితే కనీసము దానిపేరు కూడా వారికి తెలియకుండా పోయింది. ఎంతగా అంటే ఒక ప్రసిద్ధి చెందిన నృత్య కళాకారుడు పేరిణి గురించి అది ఒకవిధమైన భూతంనృత్యం అని, నడిరోడ్డులో చిందులు వేసుకుంటూ చేసే నాట్యమని ఇలా చాలా నీచంగా తన పుస్తకంలో ప్రస్తావించటం కూడా జరిగింది. దీనికి వారు ఎవరినో తప్పుపట్టటం మాట అటుంచితే వారు అంతగా ఈ విషయాన్ని తెలుసుకోలేకపోవటానికి ప్రధానమైన కారణం ఏంటో మనం గ్రహించవలసిన అవసరం కూడా ఉన్నది. ఒక కళారూపం దినదినాభివృద్ధి అయిననాడే సమాజానికి అనుగుణంగా తన రూపాన్ని మార్చుకున్ననాడే ఆ కళ నిలబడుతుంది. అది లేనినాడు కాలక్రమంలో మరల ఆ కళ కనుమరుగైపోతుంది. అటువంటి దుర్భర పరిస్థితిని చవిచూచిన నృత్యకళ పేరిణి. కానీ పద్మశ్రీ నటరాజ రామకృష్ణ గారి వంటి మహానుభావులు ఈ కళను గురించి లోతుగా పరిశోధన చేసి దానికి సంబంధించిన తాండవ నృత్య విధానాన్ని వివిధ మార్గాల ద్వారా సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకొని వచ్చి ఆ కళావైభవాన్ని ప్రపంచమంతా చాటి చెప్పారు. దీనికి వారికి ఆధారభూతమైన శిల్పాలు, గ్రంథాలు అన్నీకూడా తెలంగాణ ప్రాంతంలోనే లభ్యమవడం చేత ఈ కళ కేవలం తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన కళగా భావించుకోవడం జరుగుతున్నది. వాస్తవానికి పేరిణి కేవలం ఒక చిన్నప్రాంతానికి సంబంధించిన కళ మాత్రమే కాదు అని పైన వుటంకించిన గ్రంథాల ద్వారా మనందరం తెలుసుకుంటున్న విషయం.

ఈనాడు శాస్త్రీయనృత్య కళలుగా ప్రచారాన్ని, ప్రసిద్ధిని పొందిన ఏ కళనైనా చూడండి. ఒకప్పటి ఆ కళారూపం, వారి ఆహార్యం, వారి గాన రీతులు అన్నిట్లో ఎంతో మార్పు కనపడుతున్నది. అంత ఎందుకు మన ప్రాంతానికి సంబంధించిన కూచిపూడి నృత్యం ఒక యాభై అరవై సంవత్సరాల ముందు ఎలా ఉన్నది? ప్రస్తుతం ఎలా ఉన్నది? ఒక్కసారి గమనించండి. చండాలికా వంటి నృత్య నాటికలు కూచిపూడి సాంప్రదాయంలో ఎంత ప్రసిద్ధి చెందాయో మనకు తెలుసు. మరి ఆ కథాంశానికి కూచిపూడి నృత్యానికి సంబంధం ఎక్కడ ఉన్నది? చెప్పండి. అలాగనే భరతనాట్యంలో ఎంతోమంది కళాకారులు వివిధ అంశాలను జొప్పించి తమ నాట్యకళా పరిధిని విశ్వవ్యాప్తం చేస్తూ ఉన్నారు. వీరు ఎవరూ కూడా తమతమ సాంప్రదాయక

నృత్యాలను వదిలినవారు కాదు. ఆయా నృత్యాలలో సాధన చేస్తూనే నూతన అంశాలను ప్రవేశపెట్టడం ద్వారా తమ కళకు నవనవోన్మేషమైన క్రొత్తదనాన్ని, కొత్తదనపు సొబగులను అద్దుతున్నారు. కళాకారులుగా మనందరం చేయదగిన పని అదే. ఇలా ఎన్నో శాస్త్రీయ నృత్యకళలు తమ రూపాన్ని మార్చుకుంటూ ముందుకు వెళుతున్నాయి. కానీ మౌలికమైన రూపం ఏనాటికి అదేవిధంగా ఉంటుంది, ఉండాలి కూడా. పేరిణి నృత్యకళని కూడా విస్తృత పరచవలసిన అవసరం ఎంతో ఉన్నది. పేరిణి తాండవమా లాస్యమా అన్నవిషయం పక్కన పెడితే పేరిణి ద్వారా ఎన్ని నూతన అంశాలను మనం వెలుగులోనికి తేవచ్చు అని ఆలోచించవలసిన అవసరం ఉంది.

పేరిణి నృత్యరీతి కేవలం తెలుగు వారికే కాక యావత్భారత దేశానికి గర్వకారణమైన నృత్యప్రక్రియ. కడు క్రూరమైన కాలంనాటి సంస్కృతిని హరించివేసిందో లేక మన సాంస్కృతిక వైభవాన్ని కాపాడుకోలేని మన చేతకాని తనం పేరిణిని మన నుండి దూరం చేసిందో మొత్తానికి పేరిణి మన నుండి దూరమైపోయింది. కేవలం నామ మాత్రావశిష్టంగా ఉండిపోయిన పేరిణి తన ఒకనాటి వైభవాన్ని తలచుకొని కుమిలిపోతున్నది. పేరిణి దురవస్థను చూసిన స్వచ్ఛమైన కళాహృదయాలు కృంగిపోక తప్పదు.

పేరిణి నృత్యానికి సంబంధించి విషయ సేకరణ చేయటం కూడా ప్రస్తుతం చాలా క్లిష్టమైపోయింది. వందలాదిగా ఉన్న సంగీత నాట్య గంథాలలో పేరిణి ప్రస్తావన ఎక్కడ లభ్యం అవుతుందో తెలుసుకోవడమే ఒక గొప్పపని. దాని గురించి విశ్లేషణ చేయడం ఆ తర్వాత అంశం. కానీ ఇవి అన్నీసక్రమంగా చేయగలిగిననాడే మనం పేరిణి గురించి ఎన్నో విషయాలను ప్రపంచానికి అందజేయగలుగుతాం. నాట్యశాస్త్రాల రచనా కాలానికి ప్రచారంలో ఉన్న నృత్యకళలు భిన్నమైనవి. నేడు శాస్త్రీయ నృత్యకళలుగా పిలువబడుతున్న కళాకృతులు నాటి నాట్యశాస్త్ర గ్రంథాలలో ఎక్కడ పేర్కొనబడి లేవు. కాలక్రమంలో ఆ నృత్యరీతులు వికసించి ఉండవచ్చు. కానీ నాట్యశాస్త్ర గ్రంథాల రచనాకాలం నాటికి అవి ప్రచారంలో లేవు అన్న విషయం ఒప్పుకోవాల్సిన సత్యం. దరిదాపు మూడు నాలుగు శతాబ్దాల నుండి మొదలుపెట్టి 20వ శతాబ్దం వరకు పేరిణి ప్రయాణం ఏదో ఒక రూపంలో మనకు ప్రత్యక్షమవుతూనే ఉన్నది. విశేష ఖ్యాతిని పొందిన పేరిణి నృత్య పయనం ఒకరోజుది, ఒకప్రాంతంది, ఒకతరానిది కాదు. ఎన్నో వందల సంవత్సరాల నుండి తన రూపురేఖలను మార్చుకుంటూ అభివృద్ధి చెందిన కళ పేరిణి.


మైసూర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ తులసిరామచంద్ర గారు పేరిణి నృత్యప్రదర్శనలో స్త్రీలచేత పురుష వేషధారణ చేయించి పేరిణి ప్రదర్శింప చేస్తున్నారు. స్వర్ణమాల్యాగణేష్ గారు స్త్రీగానే పేరిణిని ప్రదర్శిస్తూ ఉన్నారు. మన ప్రాంతాల్లో డాక్టర్ శ్రీకళాకృష్ణగారు పేరిణి లాస్యాన్ని రూపకల్పన చేసి ప్రదర్శించడం జరుగుతుంది. ఇవి అన్నీ పేరిణి కళకు విస్తృత రూపాన్ని ఒసగే ప్రయత్నాలే. తెలంగాణ ప్రాంతంలో పేరిణి నృత్యరీతికి ప్రభుత్వ అండదండలు లభించడం ఎంతో ఆనందకరమైన విషయం. ఏ కళకైనా ప్రభుత్వ సహకారం చాలాచాలా అవసరం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పేరిణి నృత్యంకు కొత్త సొబగులు అద్దవలసిన బాధ్యత యువ కళాకారులదే. ఈ సందర్భంలో కళాసేవ, కళారాధన గురించి ఒకమాట నిర్మొహమాటంగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. కళారాధన అంటే కేవలం కళను ప్రదర్శించటమేనా? ఈ కళా ప్రదర్శన ఎందుకు చేస్తున్నారు? తద్వారా జీవనోపాధి పొందటం, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం మాత్రమే కళారాధన అవుతుందా? వాస్తవానికి కళారాధకులుగా భావింప బడుతున్న వారు ఆ కళను ఆధారంగా చేసుకుని తాము జీవితాన్ని గడుపుతున్నారు. వాస్తవానికి ఆ కళలు వారికి బ్రతుకుతెరువు చూపిస్తున్నాయి. కానీ ఆ కళను వీరు బ్రతికించడం లేదు. ఒకకళ ఎప్పుడు బతుకుతుంది అంటే ఆ కళకు మనం శాశ్వతత్వాన్ని, నూతనత్వాన్ని సమయాను కూలంగా సంపాదించిపెట్టినప్పుడు మాత్రమే కళ కొత్త రూపురేఖలతో సొబగులు అద్దుకుంటుంది. దీనికి కావలసింది నిత్యపరిశోధన, సృజనాత్మకత, కళమీద పట్టుసంపాదించడం. దురదృష్టవశాత్తు నేడు ఎక్కువ శాతం కళాకారులు కేవలం తాము నేర్చుకున్న కళను ప్రదర్శించటం మీద మాత్రమే దృష్టిపెడుతున్నారు కానీ దానిని అభివృద్ధి పరచటం మీద దృష్టి సారించలేకున్నారు. అటువంట కళాసేవకులు మరింతగా ముందుకు రావాలని, వారి ఆధ్వర్యంలో పేరిణికళ మరింతగా ముందుకు సాగాలని, సాగుతుందని, దానికి తెలంగాణ ప్రభుత్వం వారి సహాయ సహకారాలు పరిపూర్ణంగా అందుతాయని ఆకాంక్షిస్తున్నాము.

# బౌద్ధ ఆదర్శాల ఆధునిక దర్పణం : యశోబుద్ధ

**– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి**

**బు**ద్ధుడు చారిత్రక వ్యక్తి. బౌద్ధ ధర్మ స్థాపకుడు. ఒక మతంగా కాక జీవిత విధానంగా ఇది నిలిచింది. బుద్ధుడు మానవుడిని పరివేదనల నుంచి విముక్తి చేయడానికి పరితపించి జ్ఞానోదయాన్ని పొంది బౌద్ధ ధర్మాన్ని బోధించాడు. నాలుగు సత్యాలు అష్టాంగ మార్గాలు ఈ ధర్మసూక్ష్మాలు. బుద్ధుడు బోధించినది అహింస సమానత్వం దుఃఖం నుంచి విముక్తి, దానికై కోరికలు లేని స్థితి. దానికై అష్టాంగ మార్గాన్ని సూచించాడు.

ఆధునిక సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం ఒక బలమైన పాయగా నిలిచి చైతన్య పరిచింది. స్త్రీవాద సాహిత్యంలో స్త్రీవాద సిద్ధాంతాలను బలంగా వ్యక్తపరచిన సాహిత్యం ఓల్గా రచనలు. తాను నమ్మిన స్త్రీవాద సిద్ధాంతాలను సమకాలీన వస్తువులలోనూ పౌరాణిక వస్తువులకు పాత్రలకు చారిత్రక వ్యక్తులకు ముడిపెట్టి రాయటం ఓల్గా ప్రత్యేకత. పౌరాణిక పాత్రలను పునర్ నిర్వచించడం స్త్రీవాద సిద్ధాంతాల నేపథ్యం నుంచి సమర్థవంతంగా చేశారు. చారిత్రక పాత్రని పునర్ లిఖించారు. దీని వెనుక ఉన్న కారణం, ఆయా పౌరాణిక చారిత్రక పాత్రలను దీనంగా జాలిగా సమాజం చూసింది. ఆ దృష్టిని మారుస్తూ ఆయా సందర్భాలలో అయా పాత్రలు ఎంత ఉన్నతంగా ఎంత స్థిమితంగా ప్రవర్తించాయో చెప్పటానికి తన కల్పనని జోడించి ఆయా పాత్రలను ఉదాత్తంగా ఓల్గా మలిచారు. ఈ క్రమంలో సిద్ధార్థుడి భార్య అయిన యశోధరను ప్రపంచపు జాలి చూపుల నుంచి దూరం చేసి మహోన్నతత్వం కలిగిన వ్యక్తిత్వపుధీరగా నిలిపారు. చరిత్రలో బేలగా నిలిచిపోయిన యశోధర పాత్రను మహోన్నత హృదయ సంస్కారం గల పాత్రగా చిత్రిస్తూ రచించిన నవల 'యశోబుద్ధ'.



1. బుద్ధుడిది సున్నిత హృదయం. భూత దయ కలిగిన వ్యక్తి. హింసను అంగీకరించ లేనివాడు. దెబ్బతిన్న హంసకు కట్టుకడుతుంటే అతడికి ఒక విషయం అర్థమైంది. నొప్పిని భరించడం కంటే భయం అనుమానం వీటిని భరించడం కష్టమని, ఇవి లేకపోతే లభించేది ప్రేమేనని సిద్ధార్థుడు అర్థం చేసుకొన్నాడు. ఇదే తనలోని భావాలను తాత్త్విక బోధనకు అనుకూల సిద్ధాంత రూపంగా ఏర్పరచుకోవటానికి కారణం అయ్యింది. అహింసకు పట్టం కట్టింది.

2. సిద్ధార్థుడు యశోధర ఒకరి పట్ల ఒకరు ఆకర్షితులైనా, సిద్ధార్థుడి చేతులలో పువ్వులను ఉంచి తన వివరాలను తెలిపి వెళ్లటంలో తన మనసుని పరోక్షంగా అతడికి వ్యక్తం చేయటమే కాదు తన జీవిత సహచరుడి ఎంపిక తానే చేసుకోవటం గమనించదగ్గ విషయం. యశోధర పాత్రను చిత్రించటంలో స్త్రీవాద సిద్ధాంతాల మూలాలను ఓల్గా విస్మరించలేదు. సిద్ధార్థుడు చరిత్రలో స్త్రీలకు బౌద్ధంలోకి ప్రవేశాన్ని కల్పించాడు. ఇది విప్లవాత్మకం చారిత్రకం. ఆ చారిత్రక సత్యాన్ని ఓల్గా యశోధర సిద్ధార్థుల వివాహ ప్రస్తావన సందర్భంలో విస్తారంగా చర్చించారు. ఇది కల్పన పోటీలో ఆమెను గెలుచుకోవడానికి ఆమె రాజ్యమో, భూమో, నదీజలమో, వస్తువో కాదు. వివాహం పరస్పర అంగీకారంతో ప్రవేశించవలసిన బంధం (పుట 36).

సిద్ధార్థుడు యుద్ధం ఆపినట్లు తండ్రి తలపెట్టిన యజ్ఞాన్ని తానూ ఆపాలని ప్రయత్నించి యశోధర విఫలమయ్యింది. తండ్రి తల్లీ తనను పిచ్చిదానిగా భావించినప్పుడు యశోధర సిద్ధార్థుడొక్కడే 'తన మాటలకు సాటి జ్ఞాని మాటలుగా విలువ ఇస్తున్నాడు'(పుట 83), స్త్రీలు జ్ఞానులని ఎవరు ఈ సమాజానికి చెప్పరు. అతడిలో జ్ఞానార్తిని ప్రజ్వలింపచేయాలి. మానవ వివేచన గురించిన అతడి తపనను ప్రవహింపనియ్యాలి. మార్గదర్శి మార్గాన్ని నిరాటంకము సుగమము చేయాలి అని నిర్ణయించుకొంది.

యశోధర పట్ల ఉన్న ప్రేమతో సిద్ధార్థుడికి కొత్త కొత్త ఆలోచనలు తలెత్తాయి చూసే దృష్టి మారింది. సిద్ధార్థుడికి

తత్పూర్వం మానవుల గురించి ఆలోచించేటప్పుడు కనబడే మానవ సమూహంలో పురుషులే ఉండేవారు స్త్రీలు కూడా అందులో ఉన్నారనే స్పృహ ఆమె పట్ల ప్రేమే కలిగించింది అని ఓల్గా కల్పించారు. సిద్ధార్థుడి ఆదర్శం బౌద్ధంలోని ఆదర్శం స్త్రీ పురుష సమానత్వం. అది విప్లవాత్మకం ఆ భావాలకు బీజం యశోధర వల్ల కలిగింది అని నవలలో చిత్రించారు రచయిత్రి.

3. సిద్ధార్థుడికి వివాహం చేయతలపెట్టి యశోధరని అడగడానికి శుద్ధోధనుడు తమ ఇంటికి వచ్చినప్పుడు బింబానసుడు క్షత్రియ పోటీలో అందరినీ ఓడించి ఆమెను సిద్ధార్థుడు స్వీకరించాలి అని పేర్కొన్నాడు. అది సిద్ధార్థుడికి నచ్చలేదు. క్షత్రియోచిత పోటీలో సిద్ధార్థుడు యశోధరను పొందాలి అని నిర్ణయించినప్పుడు సిద్ధార్థ యశోధరల నడుమ జరిగిన సంభాషణ ద్వారా విషయం తెలుసుకొన్న యశోధర తండ్రితో ఆ విషయాన్ని తానే మాట్లాడటానికి నిర్ణయించుకుంది. 'నేను గెలుచుకోవలసిన బహుమతి కాదని నిరూపించుకోవలసింది నేనే అంటూ' తానే మాట్లాడతానని అనింది. ఆమె ఈ మాటలు ఆత్మగౌరవ ప్రదర్శికాలు అని రచయిత్రి అన్నది. ఈ ఆత్మగౌరవ ప్రదర్శన సిద్ధార్థుడికి 'కొత్త కన్నునిచ్చింది దానితో చూడటం అవసరమనే ఆలోచననూ ఇచ్చింది' (పుట 38) అంటారు ఓల్గా.

సిద్ధార్థుడి చైతన్యం యశోధర ఆలోచనల ఫలితంగా కలిగింది అని కల్పించింది రచయిత్రి. పరీక్షలో తనను గెలవాలనే విషయాన్ని తండ్రితో యశోధర ధైర్యంగా చెప్పింది. తండ్రి దాని అర్థం చేసుకోలేదు పైగా ఆమెది ఉన్మాద చేష్టగా భావించాడు. అయితే ఆమె కోరినట్టు పరీక్ష జరగలేదు ఒక రకంగా ఇది ఆమె విజయమే. సిద్ధార్థుడి ఆలోచనను ఆమె అమలు పరిచేలా చేసింది. సిద్ధార్థుడి తపనను ఓల్గా విశేషంగా వివరించారు. 'లోకరీతికి భిన్నంగా తాను చేసే ఆలోచనలతో మాత్రమే ఆగిపోవడం కాదు, సంఘం గురించి దాని హితాన్ని ఆలోచించడం, ఈ శరీరము మనసు తాకగల అనుభవాల తీరాల అంచుల వరకు వెళ్ళదలుచుకొన్నాను' (పుట46) అంటూ, గృహస్థాశ్రమంలోనికి ప్రవేశించటమూ అందుకే అన్నాడు. జ్ఞానాన్వేషణలో తాను ఇల్లు వదిలివెళ్తే, అది యశోధరకి దుఃఖ కారణం అవుతుంది అంటూ ఆమెను వివాహానికి ముందే సంసిద్ధం చేశాడు. యశోధరా అందుకు సిద్ధంగా ఉన్నట్టూ, తమ సాన్నిహిత్యం బాంధవ్యం సాగినన్ని రోజులూ తాను కొత్త కొత్త జ్ఞానం పొందుతానని అంది. ఇరువురిలో అనోన్యతనూ సంసిద్ధతనూ చూపుతూ ఓ కొత్త కోణాన్ని కల్పించారు ఓల్గా. 'సృష్టిలో రెండు అద్భుతాలు ఉండొచ్చు కానీ, ఆ రెండూ కలవటమనేది సామాన్యంగా జరగదు. సిద్ధార్థ యశోధరల కలయిక అసామాన్యం' (పుట 51) అని గౌతమి భావించింది. సిద్ధార్థుడు మహోన్నతుడు. అతడి ఉద్వేగాదర్శాలను అర్థం చేసుకొని తనను తాను తీర్చిదిద్దుకొంటూ అతడికి బాసటగా నిలిచినట్లు కల్పించి యశోధరనూ అసామాన్యంగా నిల్పారు ఓల్గా.



ఓల్గా

4. సిద్ధార్థుడి అంతరంగాన్ని ఓల్గా ఆవిష్కరించారు. 'మనము ఇతరులు అనే భావనలో ఇంత ఆవేశకావేశాలు చెలరేగటం, ఇతరులను సహించలేకపోవడం చంపాలను కోవటం ఇది వీరత్వమనే భావన కల్పించుకొని దానిలో ఒక వికృత ఆనందాన్ని మానవులు పొందటం ఎప్పుడు మొదలైందో గాని దానిని ఆపాలనే ఆలోచన ఇంతవరకూ ఎవరికీ కలగటం లేదు' (పుట 69) అని వ్యధ చెందాడు. అతడి ఈ వ్యధే అతడి తాపత్రయమే యశోధరలో ఇష్టానికి, ప్రేరణకి కారణం అయ్యింది. యశోధరది స్వయం నిర్ణయంతో నడిచిన జీవితం. సిద్ధార్థుడిని వివాహం చేసుకోవటంలో ఇష్టం ఉంది. సిద్ధార్థుడి మహాభినిష్క్రమణలో ఆమె నిర్ణయం ఉంది. సిద్ధార్థుడి జ్ఞానాన్వేషణ సత్యాన్వేషణ అంతర్లోక దృష్టి దుఃఖ రహిత సమాజ ఆవిష్కరణలకై తపనను గుర్తించింది అర్థం చేసుకొంది. అతను బంధనాలకు దూరంగా వెళ్లడానికి మార్గాన్ని సుగమం చేసింది, అతని అభీష్టానికి సాధనకు దారి చూపింది.

5. ఓల్గా తను చేసిన ఆలోచనలను యశోధర పాత్ర ద్వారా వ్యక్తం చేసింది. స్త్రీ ఆత్మవిశ్వాసంతో ఉండాలనే కోరిక ఓల్గాది. యశోధరను, యశోధర తండ్రి తలపెట్టిన యజ్ఞం ఆపాలని కోరి ప్రయత్నించి విఫలమవ్వటమే కాదు ఉన్మాదురాలుగా గుర్తింపబడింది. ఆయన అలా

భావించడమే కాదు ఇలాంటి విషయాలు స్త్రీల పరిమితికి మించినవని భావించాడు, అదే అన్నాడు. ఇది యశోధరను మథనకు గురిచేసింది. ఆలోచనాపరులుగా సత్యాన్వేషకులుగా స్త్రీలను ఈ సమాజం ఆమోదించదు అనే గ్రహింపు నిచ్చింది. స్త్రీలకు జ్ఞానమార్గాన్ని నిషేధించకుండా చూస్తేనే తప్ప తాను తన ఆలోచనలను బహిరంగం చేయనని నిర్ణయం తీసుకొంది. అదే భర్తకు తెలిపింది. సిద్ధార్థుడు కనుగొన్న మార్గంలో స్త్రీలకు ప్రవేశం కల్పించాలి అని కోరింది. ఇది అభ్యర్థనగా కాక ఆదేశంగానే యశోధర చెప్పింది. బౌద్ధం స్త్రీలకు ప్రాధాన్యత నివ్వడం స్పష్టం. దీనికి కారణభూతురాలిగా యశోధరని కల్పించి నిలిపారు ఓల్గా. స్త్రీ పురుషుడికి మార్గ నిర్దేశం చెయ్యగలదు అని ఈ చారిత్రక పాత్ర ద్వారా ఓల్గా వ్యక్తం చేశారు. నాటి సామాజిక స్థితికి తలవంచుతూ తనదైన జీవిత ప్రస్థానాన్ని యశోధర చేసింది, ఆపై భిక్షుకిగా మారింది. నిజానికి గౌతమి ప్రజాపతి అంటే బుద్ధుడి మాతృమూర్తి బౌద్ధ మతంలో చేరిన తొలి మహిళగా చరిత్ర పేర్కొంటూ ఉంది. అమ్రపాలి అనే వేశ్యా స్త్రీ కూడా బౌద్ధాన్ని స్వీకరించడం చరిత్ర పేర్కొంటూ ఉంది. స్త్రీలకు ఎలాంటి వివక్షా లేకుండా బౌద్ధంలో సమాన స్థానం ఉంది. అది నాటి విప్లవాత్మకత. బుద్ధుడి మార్గంలో ఎందరో భిక్షుకిలు ఉన్నారు. ఆ మార్పు యశోధర పాత్ర బలమైన కాంక్షగా ఓల్గా కల్పించారు.

6. ఎన్నో చర్చలు తాత్త్విక దృష్టితో ఈ నవలలో నిల్పారు ఓల్గా. శుద్ధోధనుడికి సిద్ధార్థుడి గురించి బాధపడుతున్న సందర్భంలో గౌతమి 'బాధ, ప్రేమ, విరహం, వియోగం, నిరాశ దుఃఖం వీటిని చూసి కన్నీరు కార్చకుండా నిర్లిప్తతంగా జీవిత సత్యాల్లా స్వీకరించే దిట్టవు గల వ్యక్తిగా తయారవ్వాలి ఆలోచించనివ్వండి నలిగిపోనివ్వండి అప్పుడు కదా నవనీతం చేతికందేది'(పుట33) అన్నప్పుడు స్త్రీల గురించి సిద్ధార్థుడికి కాలమునితో జరిగిన సంభాషణలు, కాలముని భావాలను విభేదిస్తూ మనుషులను '.. జ్ఞానాన్ని నిర్దేశించిన పరిధులలో బంధిస్తున్నారని దానివల్ల తమ ఆధిపత్యాన్ని నిలబెట్టు కుంటున్నారని' సిద్ధార్థుడు తన అభిప్రాయాన్ని ఖరాఖండిగా వ్యక్తం చేసిన తీరులోనూ; స్త్రీలు ఇళ్లలో ఉంటూ బుద్ధి వికసించటం లేదు. కానీ గౌతమి సిద్ధార్థున్ని అతను ఎలా ఉన్నాడో అలాగే ఉండనిచ్చింది. 'దానికి ఎంత తెలివి జ్ఞానం కావాలో .... అలాంటి వాళ్ళు చాలామంది ఉంటారు కానీ బయటపడరు ఎవరికి ఆదర్శంగా నిలబడరు తమని ప్రత్యేకంగా గమనించాలని కూడా అనుకోరు (పుట.58)' అని పేర్కొనే చోట; సిద్ధార్థుడు యశోధరల వీరి సంభాషణ లలో సమర్థవంతమైన సుదీర్ఘమైన వాదనలు, చర్చలు ఓల్గా చేర్చారు.

సిద్ధార్థుడు సమృద్ధిని కాంక్షించాడు. అంటే సమ వృద్ధి అని చర్చించే చోట, పక్క దేశంతో యుద్ధం సంభవించే అవకాశం ఉన్న సందర్భంలో యుద్ధ నివారణ గురించి జరిగిన చర్చలో బుద్ధుడి ఆలోచన ఎంత సంయమన భరితమో రచయిత్రి చాటారు. యుద్ధం నీటి కోసం జరుగుతూ ఉంది. మీరు యుద్ధంలో మరణించి గాయపడినందు వల్ల రాదు.... మరి మరణానికీ గాయాలకు నొప్పికి దుఃఖానికి మీరు ఎందుకు సిద్ధపడ్డారో చెప్పండి. నీటిని వృథా కానివ్వకుండా నిలువ చేసుకునేందుకు మీ ఆయుధాలు ఉపయోగపడతాయేమో ఆలోచించండి. నీరు జీవితాన్ని ఇస్తుంది.... ఉన్న నీటిని పంచుకోవడం చేతకాక మరణిస్తే నది దుఃఖంతో మరింత కృశిస్తుందేమో' అంటూ యుద్ధాన్ని ఆపి బ్రతకటం ఎలాగో నిర్ణయించు కోమనే సందేశాన్నిచ్చాడు. ఈ సందర్భంలోనే యుద్ధాలను ఆపడం మరీ అంత కష్టం కాదు కానీ మానవుల అంతరంగం నిరంతరం యుద్ధక్షేత్రంలా రక్తపిపాస వంటి, లేదా అంతకంటే ప్రమాదకరమైన అనేక పిపాసలతో నిండి ఉందని నాకు తోస్తున్నది. దానిని నివారించే మార్గాన్ని కనుగొనాలి (పుట 73) అంటూ పరితపించే సందర్భంలో; జబ్బు పడిన అస్పృశ్య జాతి వాడిని ఆదుకొన్నాడు, సపర్యలు చేశాడని నిరసిస్తూ దళితుడిని ఆదరించడం వలన సిద్ధార్థుడి పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ, గౌతమి మాతను స్త్రీలందరూ కలిసి ప్రశ్నిస్తుంటే, యశోధర అత్తగారికి బాసటగా నిలిచింది. ఆ సంఘటనతో సంబంధంలేని ఆమెను ప్రశ్నించడం వ్యర్థం అన్నది. ప్రాణం తీయటం సిద్ధార్థుడికి ఇష్టం లేదు. ప్రాణం పోయాలని వారి నొప్పిని బాధను తగ్గించాలని ఆయన ప్రయత్నిస్తున్నాడు. అది తప్పని మీరెవ్వరూ నిరూపించలేరు' (పుట 98) అని సిద్ధార్థుడు ప్రాధాన్యమిచ్చే విలువలను నొక్కి చెప్పిన సందర్భంలోనూ; స్నేహం కరుణ దయ ప్రేమ భావాల అనుభూతులను గూర్చి పేర్కొన్న దగ్గర, ప్రజలను వారి అమాయకత్వంలో మూఢాచారాలను పెంపొందిస్తున్న వైఖరి

పట్ల, హింస కఠినత్వం పోయి మనుషులు దయ అలవర్చుకోవాలి అన్న చర్చలోనూ; సిద్ధార్థుడి ఆదర్శాలతో మమేకమవుతూ ఉన్న యశోధరనే అతడిలో మార్పుకు బాధ్యురాలిని చేయటానికి గౌతమి చెప్పిన మాటలలోనూ; దు:ఖం మరణం చర్చలోనూ; సుదీర్ఘ వాదనను ఆలోచనను వ్యక్తం చేశారు. బుద్ధుడి అన్వేషణ ఎన్ని మార్గాలలో ఉండటానికి అవకాశం ఉందో వాటన్నిటిని ఓల్గా సంభాషణాంతర్గతంగా భిన్న సందర్భాలలో నిల్పారు. ఇవి ఉదాత్తమైన ఆదర్శాలతో సునిశితమైన ఆలోచనలతో సున్నితమైన భావాలతో నిండి ఉన్నాయి. ఆయా సందర్భాలలో ఆయా పాత్రలలో ఇవి కనిపిస్తాయి.

7. కొన్ని సందర్భాలలో రచయిత్రి భావాలు లోతైన తాత్విక చింతనను వ్యక్తం చేస్తూ పాఠకులను ఆ ధ్యాసలో నిమగ్నం చేస్తున్నాయి. 'వాదించవలసిన అవసరం వచ్చినప్పుడు వాదించాలి. లేకుంటే అది తగువు అవుతుంది' (పుట37) అనే బుద్ధుడి వివేక మాటలు 'ఇతరులతో సమయం గడుపుతున్నప్పుడు కూడా మా ఇద్దరి మధ్య ఒక నిరంతర సంభాషణ జరుగుతుంటుంది' (పుట67) 'ఏకాంతంలో మౌనంలో సామూహికంగా సంభాషణ జరుపుతాం. సమూహంలో ఏకాంత మౌనాల విలువను గ్రహిద్దాం అనుభవిద్దాం' (పుట117) అనే యశోధర మాటలలో రచయిత్రి భావ నైశిత్యం వ్యక్తం అవుతూ ఉంది.

**ముగింపు**: మార్క్సిజం ప్రభావము స్త్రీవాద చైతన్యము కలిగిన రచయిత్రి ఆయా ప్రభావాలతో పదునెక్కి మనిషి పట్ల తీవ్రంగా పరితపించి, సంఘర్షించి, పరిపక్వమై స్థిమితపడి తేట తేరిన మానసిక స్థితిని ఆలోచన తీరుని ఈ నవలలో చూశారు, బృహత్ యవనికపై మానవ సమూహాన్ని దర్శించారు. అందరినీ సమంగా కుల ఆర్థిక వ్యత్యాసాలు అధిగమించి, కష్టాలు దాటిన స్థితిని చేరుకోవాలనే కాంక్ష నుంచి హృదయ ఆర్తితో బుద్ధుడి బోధనతో మమేకమవుతూ యశోధర పక్షాన నిలుస్తూ వెలువడింది ఈ నవల.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం,
కుప్పం, తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** సంచికలో శిష్ట్లా వారి గురించి మంచి రచన చదివాను.

వచన పద్యం రాయడంలో శ్రీశ్రీని మార్గదర్శనం చేసినారు. ప్రతిభావంతుడైనా రావలసిన కీర్తి రాలేదు. శిష్ట్లా పేరు చెప్పగానే నాకు శ్రీరంగం నారాయణ బాబు గుర్తు వచ్చారు. గొప్ప వచన కవిత్వం రాశారు. అదృష్టం కలిసి రాలేదనిపిస్తుంది. శ్రీశ్రీ వీరిద్దరి స్ఫూర్తితో గొప్ప కవిత్వం రాశారు. తెలుగు సాహిత్యాన్ని నడిపించిన యుగకర్త.లలిత సంగీతం యొక్క వైశిష్ట్యాన్ని అద్భుతంగ రాస్తున్నారు శ్రీ పురుషోత్తమాచార్యులువారు. కొనకళ్ళ వెంకట రత్నం బంగారి మామ పాటల గురించి రసరమ్యమైన వ్యాఖ్యానం చేసారు.



వెంకట రత్నం రాసిన చూపులో......అంటూ పాడితే చలంగారు ముగ్ధులైపోయారు. మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో. ఆ రోజుల్లో వింజమూరి సోదరీమణులు పాడితే – తెలుగుజాతి మురిసిపోయింది. శ్రీమతి మధుజ్యోతిగారు గరిమెళ్ళ సత్యనారాయణ గురించి – కుసుమ ధర్మన్న గురించి ముచ్చటైన వ్యాసం రాసారు. ఇద్దరూ దేశభక్తులే – ఒకరు గాంధేయవాది. మరొకరు అంబేద్కరు వాది. గరిమెళ్ళవారు దేశంకోసం గొప్ప త్యాగం చేసారు. చివరి రోజుల్లో ఆ దేశభక్తుడు ఎంత బాధలో జీవించాడో పాలగుమ్మి విశ్వనాథం గారు తన జీవిత కథలో రాశారు. మాకొద్దీ తెల్లదొరతనము – మాకొద్దీ నల్లదొరతనమూ ఈ రెండూ ప్రజా హృదయ కేదారాలలో చైతన్యవంతుల్ని చేసాయి. జ్ఞానపీఠం అవార్డు అందుకున్న రావూరి భరద్వాజ గురించీ మా తెలుగు తల్లికి మల్లెపూదండ రాసిన శంకరంబాడి గురించి చదువుతూంటే ఆ మహనీయులకు భక్తితో నమస్కరిస్తున్నాను.

కొనకళ్ళ వెంకట రత్నం గారు పోలీసు డిపార్టుమెంటులో పనిచేసారు. వృత్తిరీత్యా పోలీసు శాఖలో పనిచేసినా లలిత లలితంగా జానపదశైలిలో అద్భుతమైన రచనలు చేసారు. **మిసిమి** నావంటి వారికి జీవరసామృతం. స్వాతి బలరాం గారితో యింటర్వ్యూ బాగున్నది. ఆ బలరాం ఆనంద వికటన్ నడిపిన నేటికీ నడిపిస్తున్న జెమినీ వాసన్‌లాంటి వారు కార్యదీక్ష–వ్యాపారదక్షతా వారికి లక్ష్మీ సరస్వతీ కటాక్షం లభించింది.

*- చెరుకువాడ వెంకట రామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184*

## డా.రమేష్ ప్రసాద్ రావెళ్ల–ఓ అమెరికన్ స్కాలర్ తెనుగు గుండె చిగుళ్ళ' "ప్రవాససాహిత్యం" బుక్ లాంచ్

విశ్వాసమై రావా 'శ్రీవిశ్వావసు' తెలుగు ఉగాదిని ఆరుగంటలు ముందుగనే–శ్రీ సి.యస్.రాంబాబు ప్రవాసంలో దాగిన తెలుగును–లోకకవి అందెశ్రీతో "రార" వాకులమ్మ నను జేర! యనిపిలుపిస్తూ రవీంద్ర భారతిలో (29.3.2024) "ప్రవాస సాహిత్యం' డా.రమేష్ ప్రసాద్ రావెళ్ల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం **మిసిమి** తరుపున అందరని ఎడిటర్ అశ్వనికుమార్ నాయకత్వాన ఒకో గోపిచంద్ పంపిన శాలువాల సన్మానంతో ఆహ్వానించారు.



సభాధ్యక్షులుగా డా.కె.శ్రీనివాస్ (సీనియర్ పాత్రికేయులు) ముందరగా రచయిత డా రమేష్ ప్రసాద్ రావెళ్ల గారిని తమ ప్రవాస సాహిత్యం' బుక్‌ని క్లుప్తంగా పరిచయం గాంచమని కోరినారు. రచయిత తను గత అయిదు దశాబ్దాలుగా–ఒక కంప్యూటర్ సైంటిస్టుగా అమెరికాలో 'బూమర్'గా గ్లామర్‌తో వెలుగుతున్నకాలంలో, ఎలా **మిసిమి** గాలంలో తన తెలుగుమది తగులుకొన్నదో, అలాగే ఈప్రవాస సాహిత్యపు రకరకాల వ్యాసాల చేపలను పట్టుకొన్నదో వివరించారు.

డా.కె.శ్రీనివాస్ ప్రవాస సాహిత్యం పుస్తక నామంలో మరో భారతీయత హెూమం దాగుందని తనదైన ప్రాతికేయ శైలిలో ధూపపు వాసన పీల్చేటట్లుగా ప్రయత్నిచ్చారు. అది మన భారత ప్రవాసులు–తమతమ 'సందుగ' ఒకోమట్టి పుట్టి–గట్టిపెట్టెలలో పదిలంగా దాచుకొంటూ ప్రసవిస్తారో 'నార్లగారి' నారునీరు+కన్నఊరు పదాలుగా ప్రస్తావించారు.

చిత్ర బెనర్జీ దివాకరుణి–రచన The palace of illusions (అదేనండీ మన ఎన్టీవోడు మయసభ లేదా మాయా సభా! కాదుకదా!) ద్రౌపది పాత్రాచిత్రణ–అలాగే రామాయణంలో 'సీతరాత' స్త్రీ వేధనలలో మరో వేదం ఘోషింప చేశారన్నారు. అన్నట్లు అరసపు, విరసపు&దిగంబర కవులలో–మహిళామునులు ఎందుకు లేరని రచయిత ప్రశ్నించారు. ఎంత యాదృచ్ఛికం! ఆడంబరంలేని ఆ దిగంబరపురి గురి 'నగ్నముని' గారితోనే తన ప్రవాస సాహిత్యం పుస్తకం ఆవిష్కరింపజేసి వనితలందరికి కవితా సమాన ఆస్తిహక్కు చేసుకొనేలా ఈ రోజు చూపించారు కదా!

నగ్నముని పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ "ప్రవాస సాహిత్యం తెలుగులో **మిసిమి** ద్వారా రప్పించడం స్కాలర్‌లకు ఎంత ఉపయోగమో–తన కేస్ స్టడీగా "తనకు తెలియని అమెరికన్ కవి (బహుశా "హల్" ఏదో "పదపుపొల్లు" గా?) లో ఎలా తన కొయ్యగుర్రం మెక్కాడో 1980లలో శ్రీ చేకూరి రామారావు తనకు చెప్పే వరకు తెలియదు. ఇలా డా.రమేష్ గారు తెలుగు ప్రసాదంగా ఇవ్వడం–తదుపరి తరాలకు తులం బంగారం కోసం ప్రయత్నిస్తే 'మెక్కెన్ గోల్డ్' గనులంత రచనసంపద దొరుకుతుందని" అన్నారు.

ఆత్మీయ అతిధిగా అయ్య బాబోయ్ నేనెందుకు ఒక విశ్వవిద్యాలయపు విద్యార్థిని కాకపోతిని– ఈ ప్రొ.వై.పార్థసారధి గారికి! విశ్వవిద్యాలయంగా ఉస్మానియా–నిజంగా బోధించే అంత బుద్ధగయా!


సాహిత్య వారధి భారతీ ముఖర్జీ నుండి బాపిరాజు అడివి చీకట్లలో ఆంధ్రాంగ్లీకరణభరణ నారాయణ రావు వెల్చేరు–అమెరికాలో పప్పు చారు కాచే వరకు విశ్లేషించారు. డా.రమేష్ గారి **మిసిమి** ఇంటర్వ్యూలో మన సంస్కృతపు వ్యాకరణ కర్త– పాణిని/ అష్టాధ్యాయి కంప్యూటర్ భాషకు ఎంత ఉపయోగపు పని చేసినదో ఇంకా పనిచేస్తున్నదో–

**మిసిమి** ఇంటర్వ్యూ గ్రూపు సంభాషణలో సి.యస్.రాంబాబు తన బ్రాండ్ కాపీయపు (Kaapi Tamil means Emotions) ఫిల్టర్ కాఫీ అచ్చుల హళ్ళులలో పొల్లుపోకుండా పంచుకో గలరు.

ఒక పేజీ రాయాలంటే, వందపేజీలు చదవాలని, సాహిత్య విమర్శ అయితే ఒకపేజీకి వేయి పేజీలు చదవక తప్పదని సాహిత్య పెద్దలన్నట్లుగా రచయిత డా. రమేష్ అన్నారు. ప్రొ.పార్థసారధి గారు ఉదాహరణగా A quote from Woodrow Wilson (28th US president) “If I am to speak ten minutes, I need a week for preparation; if fifteen minutes, three days; if half an hour, two days; if an hour, I am ready now.” తర్కంగా ఉపన్యసిస్తూ-అరుంధతీరాయ్‌లో తెలియని అరుంధతీ నక్షత్రపు కాంతి, అప్పుడు కమ్యూనిస్టులు ఇందిరమ్మను అపరదుర్గగా భ్రమించినట్లు ఇప్పుడు మిసిమిస్టుల సాహితీ ఫీస్టులో భాగమవుతుందని భాషించారు.

విశిష్ఠ అతిధిగా డా.శిష్ట్లా రామకృష్ణ (CSIR-IICT) సైటింట్స్‌గా ఓ సైటింట్స్ డా. రమేష్ రచన అంశాలను పరిశీలిస్తూ-అవి అన్నీ Collaborative Evidencesతో ఈ కాలపు తెలుగుతరానికి పొందిగతో సీనియర్ ప్రాతికేయులు డా.శ్రీనివాసు కనుల సందులో దాగిన ‘సందుగ పదం’లో ఒదిగిందని విశ్వసించారు.

కనుక ‘నామోజు బాలాచారి’ గారు (తెలంగాణా సాహిత్య అకాడమి సెక్రటరీ) శ్రద్ధగా వక్తల ప్రవాస సాహిత్యం’ బుక్ పై వాఖ్యలు వింటూ తనూ పరిశీలించినవి కొన్ని వివరించారు. బహుశా ఈ పుస్తకం తెలుగు విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపు పుస్తకంగా అనేక అంశాలతో ఉపయోగ పడుతుందని అభిప్రాయపడ్డారు.




“ప్రవాస సాహిత్యం’ డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురించి వ్రాస్తే మరో పుస్తకంగా మారుతుందనే భయంగా ఉన్నది. కనుక చదువరులు ఆ బుక్‌ని తమతమ కనులతో చదివి ఆస్వాదించగలరు.

ఈ వ్యాసం టైటిల్ పై వివరణ : రచయిత డా. రమేష్ గారు **మిసిమి** గ్రూప్ డిస్కెషన్స్‌లో తన బాల్యం మరియు ఆంధ్రావిశ్వవిద్యాలయపు విద్యార్థి జీవితం కొంత పంచుకొన్నారు.

ఒకసారి తనకు ఇష్టమైన హైస్కూల్ మాస్టారు శ్రీ పాటిబండ్ల వారు వీధిలో వెళ్ళుతూ తను కాలేజి విద్యార్థిగా ఉన్న కాలంలో తమ ఇంటికి వచ్చి పలకరించారట. “ఏ హాస్టల్ బిల్డింగ్ నీది? నేను నాటిన విద్యావికాసపు ముందు చెట్టు- అదేనయ్యా ఓ కుంకుడు చెట్టు-ఇంకా వాసన ఇస్తుందా!” యని ఆర్తిగా అడిగారట. సర్ సి.ఆర్.రెడ్డి కులపతిగా ఉన్నప్పుడు విశ్వవిద్యాలయపు బిల్డింగ్స్ ముందు ఒకో విద్యార్థితో ఒకో మొక్కను నాటించేవారట. ఈ మాస్టారు అప్పుడు నాటిన కుంకుడు మొక్క చెట్టుగా ఇంకా ఉన్నదా యని ఆశపడ్డారట. ఇప్పటి ‘రావెళ్ల’ కళ్లలో ఆ తల అంటిన విద్యావికాసపు కుంకుడిరసపు కన్నీళ్లుగా మా ముందు తుడుచుకొన్నారు. అదే ఆ ‘కట్టమంచి పెంచి అందించిన తెలుగు తెల్లని పంచె రెపరెపలు-ఈ ప్రవాస సాహిత్యం పుస్తకంలో దాగిన కుంకుడిరస తలస్నానపు అంశాలు’.


‘ది అమెరికన్ స్కాలర్’- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ సుదీర్ఘ ఉపన్యాసం ‘Harvard’ లో ప్రతి అమెరికన్ తరాలుగా బందీగా ఉన్న ఐరోపా భావదాస్యపు విముక్తికై ఇప్పుడు కొనసాగే జాతిరీతికి The way Forward గా అంకురార్పణ గావించాడు. మన ప్రవాస భారతీయులు ఎన్నటికి రామాయణ భారత ఇతిహాసపు దాసోహపు స్కాలర్స్.“విభిన్నంగా మన మునకే ఏకైక గంగగా” తమతమ మాతృభాషలలో గంగాగోదారి జరమంజీర కావేరి-మరో వరదపొంగులలో ఇలా డా. రమేష్‌లా రచించడం-ఇలా ఈ రవీంద్ర భారతిలో పంజాబు సింధు గుజరాత మరాత ద్రావిడ ఉత్కళ వంగల కొంగుల బంగారమే కదా! ఏ దేశ మేగిన వదలని మనగన్నతల్లిమల్లె, ఆవేశమైన అది వాట్ విట్స్ మ్యాన్-అమెరికన్ పల్లె (Walt Whitman’ American leavesof grass’ smell)

*- ఐ.వి. రామరాజు, 9912644386. **మిసిమి** తరుపున.*

# చదవండి...

**- మిసిమి**

**మీది తెనాలి - మాది తెనాలి, కొసమెరుపు:కామెడీ కథలు - కృష్ణస్వామి రాజు :** రచయిత కొంటెతనం ప్రతీ కథలో తొంగిచూస్తూ ఉంటుంది. కథకి ముఖ్య గుణం చదివించటం. ఈ ఇరవై కథలు కూడా విసుగనిపించ కుండా మంచి ముగింపుతో, కొద్దిగా సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ, తేలిగ్గా నవ్విస్తూ మంచి మాండలిక పదాలు అక్కడక్కడ చిలుకుతూ, 'దోస తీగ చిన్నది, దోసకాయ పెద్దది' 'అడిగినోడు నక్సలైట్, అడగనోడు ఆల్‌రైట్' ఇలాంటి వాక్యాలు మీకు చాలా దొరుకుతాయి. కొని చదవండి.





పేజీలు : 160, వెల : 140, ప్రతులకు : ఆర్.సి. కృష్ణస్వామి రాజు, ఫోన్ : 9393662821

**శ్రీమతి డైరీ - గొలుసు శ్రీవాణి :** శ్రీవాణిగారి వాక్యాలన్నీ సెటైర్లే. ఈ సెటైర్ అమలాపురం నుంచి అమెరికా వరకూ, ఆవకాయ పచ్చడి నుంచి అణుబాంబుదాకా నడుస్తూ ఉంటాయి. ఏదో పిల్లిమీదో, ఎలుకమీదో వంకపెట్టి ఎంతమాటైనా అనేస్తారు. పొగుడుత్నారో, తెగుడుతున్నారో తెలిసేలోపు వాక్యం అయిపోతుంది. తాను సెటైరిస్ట్‌గా ముద్ర వేసుకుని శెలవిచ్చినట్లు తానే భుజాలు తడుముకుంటారు. ఎలాగంటే 'ఎంత బాగా రాసావోయ్.... వేసుకో వీరతాడు' అన్నట్లు. మరోవిషయం సెటైర్ పేరుతో సూటిగా చెప్పవలసిన విషయం డొంకతిరుగుడుగా తిరిగొస్తుంది. మరొకసారి ఊకదబ్బుడు అవుతుంది. ఎక్కడినుంచో ఎక్కడికో వెళ్లిపోతూనే రౌండ్ అబౌట్ టర్న్ అవుతూనే ఉంటుంది. ఇవన్నీ తెలియాలంటే మీరు సూక్ష్మగ్రాహులై ఉండాలి. బహుపరాక్.





పేజీలు : 145, వెల : 200, ప్రతులకు : సీతా పబ్లికేషన్స్, ఫోన్ : 9885459193.

**నుడి ముడి - డాక్టర్ పి. నాగమల్లీశ్వర రావు :** నుడిముడికి మున్నుడి రాస్తూ 'తెలుగులో శబ్దార్థ దాంపత్యంతో జనించిన శిశువుగా నుడిముడిని సంభావించటం సముచితం' అంటారు రచయిత. నుడిముడి అనేది కేవలం ఒక భాషకే పరిమితం కాదు. ఒక యాసకే పరిమితం కాదు. దేశభాషల ప్రభావంతో అన్ని భాషల లోనూ అది దర్శనమిస్తుంది. ఈ పుస్తకం ఈ నుడిముడి తెలుగులో ఏవిధంగా ముడిపడిందో మనకి ముడిసరుకవుతుంది.





పేజీలు : 150, వెల : 220, ప్రతులకు : డా. పి. నాగమల్లేశ్వర రావు, ఫోన్ : 9949971261

**వాడూ నేనూ :(ఒక్కడే) - వివిన మూర్తి:** ఈ ప్రలాపన అంతా వ్యక్తిలోని అవ్యక్త సంఘర్షణే. ఏమి కావాలో తెలియక, ఏమి చేయాలో తెలియక, తికమక ఈ సంభాషణంతా. ఏదీ స్పష్టంగా ఉండదు. మిమ్మల్ని ఎవరో అణగ దొక్కుతున్నారు. అందుకే మీరు ఎదగలేకపోతున్నారు. ఇలా అనుకోవటంలో కంఫర్ట్ ఉంటుంది. నేను చేయలేకపోతున్నాను అని అనుకోవటం కంటే నన్ను ఎవరో చెయ్యనివ్వట్లేదు అని అనుకుంటే రాత్రికి హాయిగా నిద్రపోవచ్చు.




పేజీలు : 190, వెల : 180, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఫోన్ : 0866'2430302

**తెలుగు దివ్వెలు - సంపాదకుడు - వి.యస్. రాఘవాచారి :** సంపాదకులు మనకు ఈ తెలుగు దివ్వెలు తెచ్చి ఎంతో మేలు చేసారు. ఇందులో నటులు, నటీమణులు, రచయితలు, చిత్రకారులు, దర్శకులు, వాగ్గేయకారులు, నాట్యాచార్యులు మొదలైన ఎందరో మహానుభావుల పరిచయాలని మనముందు పరిచారు. ఇది పరిశోధక విద్యార్థులకు, పత్రికా సంపాదకులకు ఎంతో ఉపయోగ కరమైన సంకలనం.




పేజీలు : 136, వెల : 125, ప్రతులకు : కళాదీపిక, తిరుపతి, ఫోన్ : 9908837451

# మిసిమి

మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి    బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ–మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi  A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు




ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**